సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 224

శనివారం 5-11-2022

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | DELHI | BANGALORE | CHENNAI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదు. పేదింట్లో పుట్టిన ప్రతి ప్రతిభావంతుడు ఉన్నత చదువులు చదవాలి.'



సెమీఫైనల్లో న్యూజిలాండ్

టీ20 ప్రపంచకప్‌లో ఐర్లాండ్‌పై 35 పరుగుల తేడాతో విజయం - 15లో



సూచీలకు స్వల్ప లాభాలు

సెన్సెక్స్ లాభం 114 పాయింట్లు 18,100 స్థాయిపైకి నిఫ్టీ - 15లో



ఢిల్లీలో స్కూళ్లు బంద్..

ఢిల్లీలో వాయు కాలుష్యం తీవ్రరూపం దాల్చడంతో మళ్లీ సరి, బేసి విధానానికి వెళ్లాలని ఢిల్లీ ప్రభుత్వం యోచిస్తోంది.

వివరాలు 6లో



పెన్షన్ (సవరణ) పథకం సబబే

పెన్షన్ నిధిలో చేరాలంటే నెలవారీ కనీస వేతనం రూ.15,000 పరిమితిని సుప్రీం కోర్టు కొట్టిపారేసింది.

వివరాలు 6లో



ఆప్ సీఎం అభ్యర్థిగా ఇసుధాన్

ఆప్ గుజరాత్ ముఖ్యమంత్రి అభ్యర్థిగా యాంకర్ ఇసుధాన్ గాఢ్వీను పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ప్రకటించారు.

వివరాలు 6లో



ఇజ్రాయెల్ ప్రధానిగా నెతన్యాహు

పార్లమెంట్‌లో 120 స్థానాలకు గాను 64 స్థానాలను సాధించి నెతన్యాహు ఇజ్రాయెల్ ప్రధానిగా ఎన్నికయ్యారు.

వివరాలు 6లో

ఈ పరిశ్రమలే రుజువు

ఈజ్ ఆఫ్ డూయింగ్‌కు ఇంతకంటే నిదర్శనం ఏం కావాలి?

గుమ్మళ్లదొడ్డిలో రూ.270 కోట్లతో అస్సాగో ఇథనాల్ ప్లాంట్

- భూమి పూజ కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- ఆరు నెలల్లోనే అన్ని అనుమతులు మంజూరు చేశాం
- పరిశ్రమల ఏర్పాటుకు అనుకూల వాతావరణం కల్పిస్తున్నాం
- అందుకే దిగ్గజ పారిశ్రామికవేత్తల చూపు ఆంధ్రప్రదేశ్ వైపు
- ఏ సమస్య వచ్చినా ఒక్క ఫోన్ కాల్‌తో పరిష్కరిస్తాం
- వ్యవసాయాధార జిల్లాలకు ఇథనాల్ పరిశ్రమతో మేలు
- ముక్కిన బియ్యం, నూకలకు మంచి రేటు వస్తుంది

గుమ్మళ్లదొడ్డి నుంచి సాక్షి ప్రతినిధి: ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు పూర్తిగా అనుకూల వాతావరణం ఉందని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. పారిశ్రామికవేత్తలకు మన ప్రభుత్వం సింగిల్ విండోలోనే అనుమతులు ఇస్తున్నందున ఎంతో మంది ప్రముఖ పారిశ్రామికవేత్తలు మన రాష్ట్రంపై అత్యంత ఆసక్తి కనబరుస్తున్నారని చెప్పారు. ఇందులో భాగంగానే పారిశ్రామిక దిగ్గజం అస్సాగో భారీ పెట్టుబడితో ఇక్కడ ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటుకు ముందుకు వచ్చిందన్నారు. తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం గుమ్మళ్లదొడ్డిలో రూ.270 కోట్లతో అస్సాగో ఇండస్ట్రియల్ ప్రైవేట్ లిమిటెడ్ (ఇథనాల్) పరిశ్రమకు శుక్రవారం ఆయన కంపెనీ సీఎండీ, సీఈఓ ఆశీష్ గుర్నానీ.. తండ్రి, టెక్ మహీంద్ర ఎండీ, సీఈఓ సీపీ గుర్నానీలతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆశీష్ గుర్నాని, సీపీ గుర్నానీలను దావోస్‌లో కలిసి మాట్లాడి.. ఆరు నెలలు తిరక్కుండానే గుమ్మళ్లదొడ్డిలో ఇథనాల్ పరిశ్రమకు భూమి పూజ

మిగతా 2వ పేజీలో ▶



అస్సాగో ఇండస్ట్రియల్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమకు భూమి పూజ చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆశీష్ గుర్నానీ తదితరులు

> ఆరు నెలల క్రితం మే నెలలో దావోస్ వెళ్లినప్పుడు నన్ను గుర్నానీ కలిశారు. ఆయన నాతో మాట్లాడుతూ.. 'టెక్నాలజీ వైపు వేస్తున్న అడుగులకు ఎలాగూ ఊతమందిస్తున్నాం. మరోవైపు నా కుమారుడు ఇథనాల్ ప్లాంట్ పెట్టాలనుకుంటున్నారు. ఈ ప్లాంట్ ఎక్కడ పెట్టాలా.. అని ఆలోచిస్తూ దేశంలోని పలు రాష్ట్రాల వైపు చూసి ఆలోచిస్తున్నారు. మన (ఏపీ) రాష్ట్రంలో పరిస్థితి ఎలా ఉంది' అని నన్ను అడిగారు. రాష్ట్రంలో ఏ రకంగా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తూ అడుగులు ముందుకు వేస్తున్నామో చెప్పాం. మన రాష్ట్రానికి రావాలని ఆహ్వానం పలికాం. అప్పటి నుంచి ఇప్పటికి కేవలం ఆరే ఆరు నెలలు. అంతలోనే పరిశ్రమకు భూములివ్వడం దగ్గర నుంచి.. కావాల్సిన అనుమతులన్నీ మంజూరు చేసి, ఈ రోజు భూమిపూజ చేసుకుంటున్నాం. ఇదీ మన రాష్ట్రంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు నిదర్శనం.

> రాష్ట్రంలో ఉన్న సానుకూల వాతావరణంతో దిగ్గజ పారిశ్రామికవేత్తలు పరిశ్రమల ఏర్పాటుకు ఇటు వైపు అడుగులు వేస్తున్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేయాలనే ఆలోచనతో ఉన్న ఎంఎన్‌సీలు కూడా పలు రాష్ట్రాలను పరిశీలించినప్పుడు వాటికి తొలుత మన రాష్ట్రమే కనిపిస్తోంది. అందువల్లే ఏపీపై ఆసక్తి కనబరుస్తున్నాయి.

\- ముఖ్యమంత్రి వైఎస్ జగన్

ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి శరవేగంగా భూసేకరణ

తొలి, రెండో దశ పనులు ప్రారంభించడానికి ప్రభుత్వం కసరత్తు

- పనుల్లో అధిక శాతం డిజైన్లకు ఇప్పటికే సీడీవో ఆమోదం.. పెదపూడి రిజర్వాయర్, ప్రధాన కాలువ పనులకు ప్రాధాన్యం
- ఆ తర్వాత దశల వారీగా బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల నిర్మాణం
- ఈ ప్రాజెక్టుతో 8 లక్షల ఎకరాలకు సాగునీరు, 30 లక్షల మందికి తాగునీరు
- రూ.17,411.40 కోట్లు ఖర్చు పెడుతున్న ప్రభుత్వం

సాక్షి, అమరావతి: ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకం పనులు చేపట్టడానికి అవసరమైన భూమిని శరవేగంగా సేకరించడంలో అధికారులు నిమగ్నమయ్యారు. పెదపూడి రిజర్వాయర్‌తో పాటు ప్రధాన కాలువ, ఎత్తిపోతలకు సంబంధించి అధిక శాతం డిజైన్లను సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్(సీడీవో) ఆమోదించింది. ఈ నేపథ్యంలో భూసేకరణకు సమాంతరంగా తొలి, రెండో దశ పనులు ప్రారంభించడానికి జల వనరుల శాఖ అధికారులు

మిగతా 11వ పేజీలో ▶

న్యూస్‌రీల్

అప్పన్న భూములకు 'రక్షణ'



విశాఖలోని సింహాచలం దేవస్థానం కొండపై ఆక్రమణలకు అడ్డుకట్ట వేసేందుకుగాను ప్రహరీ నిర్మాణానికి విశాఖ శ్రీశారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, ఎంపీ విజయసాయిరెడ్డి, ప్రజాప్రతినిధులు భూమిపూజ చేశారు. అప్పన్న భూముల సంరక్షణలో భాగంగా 15 కిలోమీటర్లకుపైగా రక్షణగోడను ప్రభుత్వం నిర్మించనుంది. ప్రస్తుతం ఎంపీ నిధులు రూ.8 కోట్లతో 4.2 కిలోమీటర్ల పొడవున గోడ నిర్మించనున్నారు.

వివరాలు 12లో ▸

బస్సును ఢీకొట్టిన ఎస్‌యూవీ



ఆగి ఉన్న బస్సును ఎస్‌యూవీ ఢీకొన్న ఘటనలో 11 మంది మృతి చెందారు. ఈ ఘటన మధ్యప్రదేశ్‌లోని బెతుల్ జిల్లా ఝల్లార్‌లో శుక్రవారం అర్ధరాత్రి దాటాక జరిగింది.

వివరాలు 6లో ▸

9న అల్పపీడనం

సాక్షి, విశాఖపట్నం: నైరుతి బంగాళాఖాతంలో శ్రీలంక తీరానికి చేరువగా ఈనెల 9న అల్పపీడనం ఏర్పడనుంది. అనంతరం 48 గంటల్లో అది బలపడే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) శుక్రవారం తెలిపింది. ఈశాన్య రుతుపవనాల ప్రవేశం తర్వాత బంగాళాఖాతంలో ఏర్పడనున్న తొలి అల్పపీడనం ఇదే. దీని ప్రభావం ఎక్కువగా తమిళనాడుపై ఉంటుందని, దక్షిణ కోస్తాంధ్రతో పాటు రాయలసీమపైనా కొద్ది ప్రభావం చూపే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రం మీదుగా దిగువ నుంచి తూర్పుగాలులు వీస్తున్నాయి. రానున్న 2 రోజులు కోస్తాంధ్ర, రాయలసీమల్లో వర్షాలు కురుస్తాయని ఐఎండీ తెలిపింది.



భోగాపురం ఎయిర్‌పోర్టుకు త్వరలో శంకుస్థాపన

కోర్టు అడ్డంకులు తొలగిపోవడంతో నిర్మాణ పనులకు ప్రణాళిక

- 12న ప్రధాని మోదీ చేతుల మీదుగా చేయించేందుకు కసరత్తు
- 2,203 ఎకరాల్లో విమానాశ్రయ నిర్మాణానికి జీఎంఆర్‌తో సర్కారు ఒప్పందం
- తొలిదశలో ఏడాదికి 60 లక్షల మంది ప్రయాణికుల సామర్థ్యంతో అభివృద్ధి
- నిర్దేశిత మూడేళ్ల కంటే ముందే పూర్తిచేస్తామంటున్న జీఎంఆర్



సాక్షి, అమరావతి/సాక్షి ప్రతినిధి, విజయనగరం: భోగాపురం విమానాశ్రయానికి సంబంధించిన కేసులను హైకోర్టు కొట్టేయడంతో త్వరలో శంకుస్థాపన చేసి పనులు మొదలుపెట్టడానికి ఏపీ ఏవియేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఏడీసీఎల్) ప్రణాళికలు సిద్ధంచేసింది. ఈనెల 12న విశాఖ రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనులతో పాటు వివిధ అభివృద్ధి పనుల ప్రారంభానికి ప్రధాని మోదీ విశాఖ వస్తున్న తరుణంలో భోగాపురం ఎయిర్‌పోర్టు పనులకు కూడా

మిగతా 2వ పేజీలో ▶

'భోగాపురం' వ్యాజ్యాల కొట్టివేత

- వాటిలో జోక్యం చేసుకోవడానికి వాటిలో ఎలాంటి న్యాయపరమైన అంశాల్లేవు
- ప్రభుత్వం తీసుకు వచ్చిన సవరణ చట్టం సరైనదేనన్న కోర్టు

2లో



ఉద్రిక్తతలు మరింత తీవ్రం

- దక్షిణ కొరియా, ఉత్తర కొరియాల మధ్య కొనసాగుతోన్న ఉద్రిక్తతలు మరింత తీవ్రమయ్యాయి. ఉత్తరకొరియా శనివారం సరిహద్దు ప్రాంతాల్లోకి 180 యుద్ధ విమానాలను తరలించింది. దీటుగా దక్షిణ కొరియా తన అత్యాధునిక ఎఫ్–35 ఫైటర్ జెట్లు సహా 80 మిలటరీ ఎయిర్ క్రాఫ్టులను మోహరించింది. అణ్వస్త్ర దేశంగా గుర్తింపు పొందడంతో పాటు ఆంక్షలను ఎత్తివేసేలా అమెరికాపై ఒత్తిడి పెంచేందుకే ఉత్తరకొరియా ఇటువంటి తెగింపు చర్యలకు పాల్పడుతున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

- వివరాలు 6లో

మేజిస్ట్రేట్ ఉత్తర్వులు రద్దు చేయండి

- అయ్యన్నకు రిమాండ్ తిరస్కరించడంపై హైకోర్టును ఆశ్రయించిన సీఐడీ
- ప్రముఖుల కేసుల్లో మేజిస్ట్రేట్ల తీరు విస్మయకరంగా ఉందన్న ఏఏజీ
- రిమాండ్ సమయంలోనే చిన్నపాటి ట్రయల్ నిర్వహిస్తున్నారు
- ఫలానా సెక్షన్ వర్తించదని తేల్చేయడం అలవాటుగా మారింది
- తెలంగాణలోనూ ఇటీవల ఇలా జరిగితే హైకోర్టు జోక్యం చేసుకుంది
- ప్రస్తుత కేసులో అయ్యన్న, రాజేష్‌లకు సెక్షన్ 467 వర్తించదన్నారు
- కానీ ఆ సెక్షన్ వర్తిస్తుందని హైకోర్టు ప్రాథమికంగా అభిప్రాయపడింది
- మేజిస్ట్రేట్‌ల ధోరణిని మార్చాల్సిన అవసరం ఉందని నివేదన
- అయ్యన్నపాత్రుడు, చింతకాయల రాజేష్‌లకు నోటీసులు జారీ చేసిన హైకోర్టు.. తదుపరి విచారణ 10వ తేదీకి వాయిదా

11లో

అయ్యన్న పిటిషన్‌పై ముగిసిన వాదనలు

- బుధవారం తీర్పు వెలువరించేందుకు ప్రయత్నిస్తానన్న హైకోర్టు న్యాయమూర్తి.. మరో కేసులో విజయ్‌పై చర్యలొద్దని ఆదేశాలివ్వాలన్న అయ్యన్న న్యాయవాది

11లో



'వ్యర్థాల' విక్రయంతో రూ.364 కోట్ల ఆదాయం

- దేశవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ కార్యాలయాల్లోని వ్యర్థాల విక్రయంతో కేంద్రానికి రూ.364 కోట్ల ఆదాయం లభించింది. స్పెషల్ క్లీన్‌నెస్ క్యాంపైన్ 2.0 పేరుతో అక్టోబర్ 2 నుంచి 31 వరకు కొనసాగిన ఈ కార్యక్రమం ఫలితంగా 88 లక్షల చదరపు అడుగుల స్థలం ఖాళీ అయినట్లు కేంద్రం వెల్లడించింది. ఇప్పటి వరకు విజయవంతంగా చేపట్టిన స్వచ్ఛతా కార్యక్రమాల్లో ఇదే అతిపెద్దదని తెలిపింది.

\- సాక్షి, న్యూఢిల్లీ

కాలర్ ఎవరో తెలియాల్సిందే!

- అది ఫోన్ వినియోగదారుని హక్కు
- టెలికాం కంపెనీలు తప్పనిసరిగా కేవైసీ చేయాలి
- ఫేక్ ఐడీ కార్డుతో కనెక్షన్ తీసుకుంటే ఏడాది జైలు
- రూ.50వేలు జరిమానా కూడా...
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే టెలికాం సంస్థలపైనా చర్యలు
- సైబర్ నేరాల అడ్డుకట్టకు కేంద్ర ప్రభుత్వ నిర్ణయం
- నూతన టెలికాం పాలసీ డ్రాఫ్ట్ సిద్ధం

11లో



క్లుప్తంగా

పెద్ద మనసు చాటుకున్న సీఎం జగన్

చిన్నారి వైద్యానికి రూ.22 లక్షల సాయం మంజూరు



యశ్వంత్ పరిస్థితిని సీఎం జగన్‌కు వివరిస్తున్న వెంకటేశ్వరబాబు

అమలాపురం రూరల్: తలసేమియా వ్యాధితో బాధపడుతోన్న బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం నారాయణపేటకు చెందిన బాలుడు దంగేటి యశ్వంత్(7) చికిత్సకు సీఎం వైఎస్ జగన్ సహాయం అందించారు. బాలుడు హైదరాబాద్‌లో ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్యానికి రూ.22 లక్షల ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. శుక్రవారం గోకవరం మండలం గుమ్మళ్లదొడ్డిలో ఇథనాల్ ప్రాజెక్ట్ శంకుస్థాపనకు వచ్చిన సీఎంను గోదావరి సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి వెంకటేశ్వరబాబు కలిశారు. బాలుడు తండ్రి ఆర్థిక పరిస్థితిని విన్నవించారు. దీనిపై చలించిన సీఎం వెంటనే స్పందించారు. సీఎం సహాయ నిధి నుంచి రూ. 22 లక్షలు మంజూరు చేస్తున్నట్లు సంతకం చేసి కార్యదర్శి జవహర్‌రెడ్డికి అందజేశారు.

ఏపీ నిట్‌లో విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన



సర్టిఫికెట్ల పరిశీలనలో నిట్ విద్యార్థులు

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెంలోని ఏపీ నిట్‌లో సీట్లు పొందిన బీటెక్ విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన శుక్రవారం జరిగింది. రిపోర్టింగ్, ఫీజుల చెల్లింపుల వంటి ప్రక్రియలను విద్యార్థులు పూర్తి చేసుకున్నారు. తొలి ప్రవేశం పొందిన బి.అభిషేక్‌కు ప్రవేశ పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా అకడమిక్ డీన్ టి.కురుమయ్య, డీన్ అకడమిక్ స్టూడెంట్సు అండ్ వెల్ఫేర్ డాక్టర్ జి.వి.వీరేష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన వసతులు, నాణ్యమైన విద్యను ఏపీ నిట్‌లో అందిస్తున్నామన్నారు. అడ్మిషన్ల అధికారి డాక్టర్ తపస్ పర్మాని మాట్లాడుతూ సీటు పొందిన విద్యార్థులు ఈ నెల తొమ్మిదో తేదీలోగా తప్పనిసరిగా రిపోర్టింగ్ చేయాలన్నారు.

ఎయిమ్స్‌లో నర్సింగ్ కోర్సులు ప్రారంభం



నర్సింగ్ కోర్సు ప్రారంభోత్సవంలో ప్రెసిడెంట్ డాక్టర్ రవికుమార్, డైరెక్టర్ డాక్టర్ ముఖేష్ త్రిపాఠి తదితరులు

మంగళగిరి: గుంటూరు జిల్లా మంగళగిరిలోని అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్)ఆవరణలోని నర్సింగ్ కళాశాలలో తొలి బ్యాచ్ విద్యార్థులతో నర్సింగ్ కోర్సులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఎయిమ్స్ ప్రెసిడెంట్ డాక్టర్ టి.ఎస్.రవికుమార్ మాట్లాడుతూ ఎయిమ్స్ ఆస్పత్రిలో నర్సింగ్ కోర్సు ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డీన్ డాక్టర్ జాయ్ ఎ.గోషల్, డీన్ రీసెర్చ్ డాక్టర్ దీప్తి వేపకొమ్మ, డీన్ ఎగ్జామినేషన్ డాక్టర్ శ్రీమంత్ కుమార్ దాస్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ వినీత్ థామస్ అబ్రహామ్, నర్సింగ్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ ధనసు ఆర్ పాల్గొన్నారు.

భోగాపురం ఎయిర్‌పోర్టుతో ఉత్తరాంధ్ర అభివృద్ధి

ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర



సాక్షి, అమరావతి : భోగాపురం ఎయిర్‌పోర్టుతో ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. హైకోర్టు తాజా తీర్పుతో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అడ్డంకులు తొలగినట్లయిందని శుక్రవారం ఆయన 'సాక్షి'కి చెప్పారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం కోసం ఉత్తరాంధ్ర ప్రజలు ఎన్నో ఏళ్ల నుంచి కలలు కంటున్నారని.. ఎయిర్‌పోర్టు నిర్మాణానికి లైన్‌క్లియర్ కావడం ఉత్తరాంధ్ర ప్రజలకు చాలా శుభసూచకమన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో దీనికోసం అనేక చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. గతంలో చంద్రబాబు భోగాపురం ఎయిర్‌పోర్టు, ఇతర పనులకు ఉత్తుత్తి శంకుస్థాపనలు చేసి గాలికి వదిలేశారని రాజన్నదొర విమర్శించారు. కానీ, ముఖ్యమంత్రి అలా కాకుండా ఉత్తరాంధ్రను అన్ని రంగాల్లోను అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తున్నారని ఆయన కొనియాడారు.

భోగాపురం వ్యాజ్యాల కొట్టివేత

- ఈ వ్యాజ్యాల్లో జోక్యం చేసుకోవడానికి వాటిలో ఎలాంటి న్యాయపరమైన అంశాల్లేవు
- కేవలం 37 ఎకరాలవల్ల విమానాశ్రయ నిర్మాణ పనులు ఆగిపోయాయి
- అందువల్ల ఆ భూమిని అలా వదిలేయడానికి వీల్లేదు
- ప్రభుత్వం ఇప్పటికే 1,937 మందికి రూ.678 కోట్ల పరిహారం చెల్లించింది
- ప్రభుత్వం తీసుకొచ్చిన సవరణ చట్టం సరైనదే
- హైకోర్టు ధర్మాసనం తీర్పు



సాక్షి, అమరావతి: భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయ నిర్మాణానికి న్యాయపరమైన అడ్డంకులు ఎట్టకేలకు తొలగిపోయాయి. విమానాశ్రయం నిర్మాణం కోసం చేపట్టిన భూసేకరణను సవాలు చేస్తూ విజయనగరం జిల్లా, భోగాపురం మండలం, కంచేరు గ్రామానికి చెందిన 32 మంది రైతులు దాఖలుచేసిన పిటిషన్లను హైకోర్టు కొట్టేసింది. గతంలో విధించిన స్టే ఉత్తర్వులనూ ఎత్తివేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు ధర్మాసనం శుక్రవారం 74 పేజీల తీర్పు వెలువరించింది.

'విమానాశ్రయం నిర్మాణం కోసం మొత్తం 2,700 ఎకరాలను సేకరించేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసింది. 2,200 ఎకరాల్లో విమానాశ్రయాన్ని అభివృద్ధిచేస్తారు. మిగిలిన 500 ఎకరాలను ఇతర అవసరాల కోసం వినియోగిస్తారు. ఈ 2,200 ఎకరాల్లో 37.15 ఎకరాల మినహా 2,064 ఎకరాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ఇందుకుగాను ఆ భూముల యజమానులకు రూ.678 కోట్ల మేర పరిహారం చెల్లించింది. ఈ భూసేకరణవల్ల 1,959 మంది భూ యజమానులు ప్రభావితం అవుతున్నారు. ఇందులో 1,937 మంది పరిహారం తీసుకునేందుకు అంగీకరించారు. హైకోర్టులో చాలామంది పిటిషన్లు వేసినప్పటికీ ప్రభుత్వం ఇవ్వజూపిన పరిహారం తీసుకునేందుకు అంగీకరించారు. అంతిమంగా విమానాశ్రయం మధ్యలో ఓ చిన్న భాగం భూమి మాత్రం ఈ కేసులవల్ల అలా మిగిలిపోయింది. దాన్ని అలా వదిలేయడానికి ఎంతమాత్రం వీల్లేదు. ఈ నేపథ్యంలో ప్రజాప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని త్వరలో మొదలుకానున్న విమానాశ్రయ నిర్మాణానికి అనుమతినివ్వడమే సబబు. వాస్తవానికి ప్రజాప్రయోజనాల కన్నా ఈ కేసుల్లో జోక్యం చేసుకునేందుకు న్యాయపరమైన కారణాలేవీ కనిపించడంలేదు'.. అని ధర్మాసనం తన తీర్పులో పేర్కొంది. విమానాశ్రయ నిర్మాణం కోసం ప్రభుత్వం జారీచేసిన భూసేకరణ నోటిఫికేషన్ చట్ట విరుద్ధం కాదన్న అడ్వొకేట్ జనరల్ శ్రీరామ్ వాదనను ధర్మాసనం సమర్థించింది. ఆ నోటిఫికేషన్ చట్టబద్ధమైనదేనని స్పష్టంచేసింది.

2015లో పిటిషన్లు దాఖలు

భోగాపురం విమానాశ్రయ నిర్మాణం నిమిత్తం ప్రభుత్వం జారీచేసిన భూ సేకరణ నోటిఫికేషన్‌ను సవాలుచేస్తూ పలువురు రైతులు 2015లో హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపై విచారణ జరిపిన హైకోర్టు, కొత్త విస్తీర్ణం భూమిని సేకరించే విషయంలో స్టే ఇచ్చింది. ఇటీవల ఈ వ్యాజ్యాలపై సీజే ధర్మాసనం తుది విచారణ జరిపి తీర్పును రిజర్వ్ చేసింది. ఈ వ్యాజ్యాలన్నింటినీ కొట్టేస్తూ ధర్మాసనం శుక్రవారం తీర్పు వెలువరించింది. కాల పరిమితి ముగిసిన ఆర్డినెన్స్ ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సవరణ చెల్లదన్న పిటిషనర్ల వాదనను ధర్మాసనం తోసిపుచ్చింది. రాష్ట్రపతి అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకునే రాష్ట్ర ప్రభుత్వ సవరణ చట్టానికి ఆమోద ముద్రవేశారని ధర్మాసనం తన తీర్పులో పేర్కొంది. ఆ సవరణ చట్టం ఎంత మాత్రం రాజ్యాంగ విరుద్ధం కాదని తేల్చిచెప్పింది.

ప్రేమించొద్దని చెప్పినా వినలేదని..

- కూతురును కడతేర్చిన తండ్రి
- హత్య చేసిన అనంతరం సోషల్ మీడియాలో సెల్ఫీ వీడియో
- విశాఖ నగరంలో కలకలం



లిఖితశ్రీ (ఫైల్)



తండ్రి వరప్రసాద్ (ఫైల్)

అల్లిపురం (విశాఖ దక్షిణ) : ప్రేమ వ్యవహారం వద్దని నచ్చజెప్పినా వినలేదని కన్న కూతురిని తండ్రి హత్యచేసిన ఘటన తీవ్ర కలకలం రేపింది. ఆమెను హత్యచేసిన అనంతరం తన కూతుర్ని ఎందుకు చంపాల్సి వచ్చిందో వివరిస్తూ సెల్ఫీ వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో నిందితుడు పోస్టుచేశాడు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి రెల్లి వీధిలో శుక్రవారం సాయంత్రం ఈ ఘోరం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..

విశాఖ కేజీహెచ్ డౌన్‌లోని రెల్లివీధిలో నివాసం ఉంటున్న వడ్డాది వరప్రసాద్ కేజీహెచ్ మహాప్రస్థానం వ్యాను డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి ఇద్దరు కుమార్తెలు. అతని భార్య వీరిని వదిలేసి వెళ్లిపోయింది. కూతుళ్లను వరప్రసాదే పెంచి పెద్దచేశాడు. పెద్ద కుమార్తె ప్రేమించిన వ్యక్తితో వెళ్లిపోయింది. రెండో కుమార్తె లిఖితశ్రీ (16) టెన్త్ చదువుతోంది. ఆమెను బాగా చదివించాలని తండ్రి ఆశపడ్డాడు. ఆమెకు కరాటే నేర్పించాడు. కానీ, ఈమె కూడా ఓ యువకుడితో ప్రేమలో పడిందని వరప్రసాద్ తెలుసుకున్నాడు. అతనితో తిరగొద్దని ఆమెను వారించాడు. ఆమె వినకపోవడంతో ఆగ్రహించిన తండ్రి శుక్రవారం ఆమెను కొట్టి, పీక నులిమి చంపేశాడు. వరప్రసాద్ తల్లి వర్ధంతి రోజునే ఈ ఘటన జరగడం గమనార్హం. ఈ విషయాన్ని అతను ఫేస్‌బుక్‌లో పోస్టుచేసిన వీడియోలో తెలిపాడు. కూతురిని చంపిన తర్వాత వరప్రసాద్ నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయినట్లు తెలిసింది. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి.. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కానీ, వారు మాత్రం నిందితుడు పరారీలో ఉన్నాడని, గాలిస్తున్నామని చెప్పారు.

సీఎం జగన్‌కు గీత కార్మికుల క్షీరాభిషేకం



గీత కార్మికులు ప్రమాదవశాత్తు మరణిస్తే ఇస్తున్న ఎక్స్‌గ్రేషియాను రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచడంతో పాటు, వారి అభ్యున్నతికి చర్యలు తీసుకుంటున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి విజయవాడ గొల్లపూడిలో గీత కార్మికులు శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఏపీ గౌడ కార్పొరేషన్ చైర్మన్ శివరామకృష్ణ పాల్గొన్నారు.
– భవానీపురం(విజయవాడ పశ్చిమ)

భోగాపురం ఎయిర్‌పోర్టుకు త్వరలో శంకుస్థాపన

▶ మొదటి పేజీ తరువాయి

శంకుస్థాపన చేయించాలని ఏపీఏడీసీఎల్ యోచిస్తోంది. ప్రధాని యాత్రకు సంబంధించి కార్యక్రమాల షెడ్యూల్ ఇంకా ఖరారు కానందున.. భోగాపురం విమానాశ్రయం శంకుస్థాపన కార్యక్రమాన్ని కూడా షెడ్యూల్‌లో చేర్చాల్సిందిగా ప్రధానమంత్రి కార్యాలయాన్ని కోరనున్నట్లు ఏపీఏడీసీఎల్ ఎండీ భరత్‌రెడ్డి 'సాక్షి'కి వివరించారు.

రూ.2,300 కోట్లతో నిర్మాణం

విశాఖకు సమీపంలో విజయనగరం జిల్లా భోగాపురం వద్ద 2,203 ఎకరాల్లో అంతర్జాతీయ విమానాశ్రయాన్ని అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలను సిద్ధంచేసింది. సుమారు రూ.2,300 కోట్లతో ఎయిర్‌పోర్టు నిర్మాణ కాంట్రాక్టును జీఎంఆర్ సంస్థ చేజిక్కించుకుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కూడా కుదిరింది. పనులు ప్రారంభించడానికి ఇంతకాలం కోర్టు కేసులు అడ్డంకిగా మారాయి. కానీ, ఈ విషయంలో ప్రభుత్వం గట్టిగా వాదించడం ద్వారా అనుకూలమైన తీర్పు రావడంతో నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు జీఎంఆర్ అధికారులు తెలిపారు. అలాగే, మూడేళ్లలో పనులు పూర్తిచేయాల్సి ఉన్నప్పటికీ రెండున్నర ఏళ్లలోనే పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వారు తెలిపారు.

అప్పట్లో టీడీపీ తీరుతో రోడ్డెక్కిన రైతులు

గత టీడీపీ ప్రభుత్వంలో తొలుత 15 వేల ఎకరాలు అవసరమని ఆ పార్టీ నేతలు నాయకులు ప్రకటనలు చేయడంతో భోగాపురం మండల రైతులు తీవ్ర ఆందోళనలకు దిగారు. దీంతో ఐదువేల ఎకరాలతో సరిపెట్టాలని నాటి ప్రభుత్వం నిర్ణయించింది. పరిహారం ఎకరాకు రూ.12.50 లక్షల చొప్పున ప్రకటించింది. దీన్ని వ్యతిరేకిస్తూ 2015 ఆగస్టులో రైతులు రోడ్డెక్కారు. నిబంధనలేవీ పాటించకుండా నోటిఫికేషన్ విడుదల చేయడాన్ని సవాలు చేస్తూ కొంతమంది హైకోర్టులో పిటిషన్లు వేశారు. న్యాయస్థానంలో విచారణ పెండింగ్‌లో ఉండగానే 2019 సాధారణ ఎన్నికలు సమీపించాయి. మరోవైపు.. నిర్వాసితులకు పరిహారం, పునరావాసం ఏమీ పూర్తిచేయలేదు. కానీ, ఎన్నికలకు రెండునెలల ముందు ఫిబ్రవరి 14న ఎలాంటి అనుమతులు లేకుండానే హడావుడిగా శంకుస్థాపన చేశారు.

ఇప్పుడు రెట్టింపు పైగా పరిహారం

ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన సీఎం వైఎస్ జగన్ విమానాశ్రయానికి అవసరమైన అనుమతుల కోసం ఢిల్లీ స్థాయిలో ప్రయత్నాలు చేస్తూ అదే సమయంలో రైతుల సమస్యలను పరిష్కరించేందుకు చొరవ తీసుకున్నారు. భూమి పరిస్థితిని బట్టి పరిహారాన్ని ఎకరాకు రూ.28 లక్షల నుంచి రూ.36 లక్షల వరకు ప్రకటించారు. అంతకుముందు డి.పట్టా భూములకు టీడీపీ ప్రభుత్వం ప్రకటించిన పరిహారం రూ.12.50 లక్షలు మాత్రమే. అలాకాకుండా వారికీ జిరాయితీ భూమితో సమానంగా పరిహారం మంజూరు చేశారు. దీంతో చాలామంది హైకోర్టులో పిటిషన్లను ఉపసంహరించుకున్నారు. మిగతా వాటినీ శుక్రవారం హైకోర్టు పరిష్కరించింది. సంబంధిత రైతులకు పరిహారం ప్రకటిస్తూ తీర్పు ఇచ్చింది. ఆ మేరకు ఆ మొత్తాన్ని చెల్లించడానికి జిల్లా కలెక్టరు ఎ. సూర్యకుమారి తదితర అధికార యంత్రాంగం ఏర్పాట్లుచేస్తోంది. మరోవైపు.. విమానాశ్రయ నిర్వహణకు, ఇతర అనుబంధ కార్యకలాపాలకు 2,750.78 ఎకరాలు సరిపోతాయని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు అవసరమైన భూ సేకరణ ప్రక్రియను అధికార యంత్రాంగం పూర్తిచేసింది. అలాగే, విమానాశ్రయ పరిధిలోనే గత టీడీపీ ప్రభుత్వం అక్కడక్కడా వదిలేసిన దాదాపు 117 ఎకరాల సేకరణ పూర్తయ్యింది. జాతీయ రహదారి నుంచి అనుసంధాన రోడ్డు, ట్రంపెట్ ఆకారంలో వంతెన నిర్మాణానికి అవసరమైన 119 ఎకరాల సేకరణ రెండో దశ నోటిఫికేషన్‌తో కొలిక్కి వచ్చింది.

నిర్వాసితులకు టౌన్‌షిప్‌లను తలదన్నే కాలనీలు

ఇక ఇళ్లు కోల్పోయిన 376 కుటుంబాల కోసం రూ.80 కోట్ల వ్యయంతో టౌన్‌షిప్‌లను తలదన్నేలా రెండు కాలనీలను ప్రభుత్వం నిర్మిస్తోంది. అంతేకాక.. ఒక్కో కుటుంబానికి పునరావాస పరిహారంగా ఐదు సెంట్ల స్థలం, రూ.8.70 లక్షల చొప్పున పునరావాస పరిహారాన్ని ప్రస్తుత ప్రభుత్వం మంజూరు చేసింది.

ఏటా 60 లక్షల మంది ప్రయాణం

ఇక భోగాపురం తొలిదశలో ఏటా 60 లక్షల మంది ప్రయాణీకులు ప్రయాణించేలా ఎయిర్‌పోర్టును అభివృద్ధి చేస్తున్నారు. ప్రస్తుతం విశాఖపట్నం ఎయిర్‌పోర్టు నుంచి ఏటా సగటున 28 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. వాస్తవంగా విశాఖ నుంచి ఇంకా ఎక్కువ మంది ప్రయాణించే అవకాశం ఉన్నప్పటికీ ప్రస్తుత ఎయిర్‌పోర్టు భారత నావికాదళానికి సంబంధించినది కావడంతో విమాన రాకపోకలపై అనేక ఆంక్షలున్నాయి. అదే భోగాపురంలో విమానాశ్రయం వస్తే 24 గంటలూ సర్వీసులు నడిపే అవకాశముంటుంది. ఇక విశాఖ ఎయిర్‌పోర్టు నుంచి ప్రస్తుతం ఏటా 4,400 టన్నుల సరుకు రవాణా జరుగుతుండగా కొత్త విమానాశ్రయం వస్తే ఇది భారీగా పెరిగే అవకాశం ఉంది. మరోవైపు.. భోగాపురం విమానాశ్రయం అందుబాటులోకి వస్తే విశాఖలోని విమానాశ్రయం మూసివేయడానికి ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) ఇప్పటికే నిరభ్యంతర సర్టిఫికెట్‌ను కూడా ఇచ్చింది.

అమరావతి పిటిషన్లపై విచారణ 14కు వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: అమరావతిపై దాఖలైన వేర్వేరు పిటిషన్లపై విచారణను సుప్రీంకోర్టు నవంబర్ 14కు వాయిదా వేసింది. ఆయా పిటిషన్లను శుక్రవారం జస్టిస్ కేఎం జోసెఫ్, జస్టిస్ హృషికేశ్‌రాయ్‌లతో కూడిన ధర్మాసనం ముందుకొచ్చాయి. జాబితాలోని మిగతా కేసుల విచారణతో కోర్టు సమయం ముగుస్తున్న సమయంలో రైతుల తరఫు సీనియర్ న్యాయవాది వికాస్‌సింగ్ ఈ పిటిషన్ల ప్రస్తావన తీసుకొచ్చారు. ఆయా పిటిషన్లు గురువారం సాయంత్రమే తమ వద్దకు వచ్చాయని, పరిశీలించే అవకాశం రాలేదని ధర్మాసనం పేర్కొంది. కేసు సోమవారానికి వాయిదా వేయాలని, వివరాలతో కూడిన నోట్ అందజేస్తామని రైతుల తరఫు మరో సీనియర్ న్యాయవాది ఫాలీ నారీమన్ తెలిపారు. కేసులో చాలా పిటిషన్లు ఉన్నాయని.. తొలిసారి ఈ ధర్మాసనం ముందుకొచ్చాయని జస్టిస్ జోసెఫ్ గుర్తుచేశారు. సోమవారానికి వాయిదా వేస్తే అభ్యంతరం లేదని, హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ పిటిషన్ దాఖలు చేశామని ఏపీ ప్రభుత్వ న్యాయవాది నిరంజన్‌రెడ్డి తెలిపారు. హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు ఏమిటని ధర్మాసనం ఆరా తీసింది. ఏపీ అసెంబ్లీ ఆమోదించిన వికేంద్రీకరణ చట్టం, సీఆర్‌డీఏ రద్దు చట్టాన్ని సవాల్ చేస్తూ పలువురు హైకోర్టును ఆశ్రయించారని నిరంజన్‌రెడ్డి తెలిపారు. రాజధానిని ఖరారు చేస్తూ చట్టం చేసే అధికారం రాష్ట్ర అసెంబ్లీకి ఉందా.. లేదా... అనేది తేలుస్తామని హైకోర్టు పేర్కొందని తెలిపారు.

ఈ పరిశ్రమలే రుజువు

▶ మొదటి పేజీ తరువాయి

చేసుకుంటున్నామని చెప్పారు. రాష్ట్రంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఏ స్థాయిలో ఉందో చెప్పడానికి ఇంతకన్నా వేరే నిదర్శనం ఏముంటుందని అన్నారు.

మన పిల్లలకే ఉద్యోగాలు

- ఈ ప్లాంట్‌ను ఇక్కడికి తీసుకొచ్చేందుకు అడుగులు ముందుకు వేసిన అస్సాగో ఇండస్ట్రీస్ ఎండీ, సీఈవో ఆశీష్ గుర్నానీ, ఆయనకు అన్ని విధాలా మార్గదర్శకత్వం వహిస్తున్న తండ్రి, టెక్ మహీంద్రా ఎండీ, సీఈవో సీపీ గుర్నానీ, ఇక్కడికి విచ్చేసిన ప్రతి అక్క, చెల్లెమ్మ, ప్రతి సోదరుడు, స్నేహితుడు.. అందరికీ హృదయ పూర్వక అభినందనలు.
- టెక్ మహీంద్రా.. పెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీ అనే విషయం మనందరికీ తెలుసు. ఈ పారిశ్రామిక దిగ్గజ కంపెనీ సీఈవో సీపీ గుర్నానీ కుమారుడు ఆశీష్ గుర్నానీ ఆధ్వర్యంలో ఇక్కడ 2 లక్షల లీటర్ల సామర్థ్యంతో ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటవుతున్నందుకు చాలా సంతోషంగా ఉంది.
- ఈ ప్లాంట్‌తో 300 నుంచి 400 మందికి ఉద్యోగాలు రానున్నాయి. వాటిలో స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు ఇవ్వాలని మనం చట్టం తీసుకురావడంతో చదువుకున్న మన పిల్లలకు మంచి జరుగుతుంది. తూర్పు గోదావరి జిల్లా రైతులకు, వ్యవసాయాధారమైన ఈ ప్రాంతానికి చాలా మేలు చేస్తుంది.
- తుపాన్లు, వరదలు వచ్చినప్పుడు ధాన్యం రంగు మారిపోవడమే కాకుండా ముక్కిపోవడం, బియ్యం విరిగిపోయే పరిస్థితులు ప్రతి సంవత్సరం రాష్ట్రంలో చూస్తూనే ఉన్నాం. ఇటువంటి సమస్యలకు ఈ ప్లాంట్ పరిష్కారం చూపిస్తుంది.
- బ్రోకెన్ రైస్‌తో పాటు నూకలు, మొక్కజొన్న.. ఈ రెండింటి ఆధారంగా ఈ ఇథనాల్ ప్లాంట్ పని చేస్తుంది. దానివల్ల మన రైతులకు మేలు జరుగుతుంది. రంగు మారిన, విరిగి పోయిన ధాన్యానికి కూడా మంచి రేటు ఇప్పించగలిగే గొప్ప అవకాశం ఉంటుంది. ఈ ప్లాంట్‌ను జీరో లిక్విడ్ డిశ్చార్జ్ పద్ధతిలో నిర్మిస్తుండటంతో కాలుష్యానికి అవకాశాలు చాలా తక్కువ. ఈ ప్లాంటుతో పాటు బై ప్రొడక్ట్ కింద హైక్వాలిటీ ప్రొటీన్ పశువుల దాణా, చేపల మేత, కోళ్ల దాణా వంటి ఫీడ్ అందుబాటులోకి వస్తుంది.

మరిన్ని పరిశ్రమలకు రాచబాట

- త్వరితగతిన ఇక్కడ ఈ పరిశ్రమ ఏర్పాటు ద్వారా పారిశ్రామిక వేత్తల వద్ద, రకరకాల ఫోరమ్‌ల వద్ద మన రాష్ట్రంలో జరుగుతున్న ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ గురించి ప్రస్తావించే అవకాశం, పరిస్థితులు వస్తాయి. దానివల్ల ఇంకా ఎక్కువ పరిశ్రమలు గుర్నానీ ద్వారా మన రాష్ట్రానికి వచ్చే అవకాశం ఉంటుంది.
- ప్రతి అంశంలో మేం మీకు తోడుగా ఉంటామని గుర్నానీకి మాట ఇస్తున్నాను. మీకు ఏ రకమైన ఇబ్బంది వచ్చినా కేవలం ఒక్క ఫోన్ కాల్ దూరంలోనే ఉంటామనే విషయాన్ని మనసులో పెట్టుకోండి. ఆంధ్రప్రదేశ్‌కు మరిన్ని పరిశ్రమలు తీసుకురావడం ద్వారా మా పిల్లలకు మరిన్ని ఉద్యోగాలు వచ్చేలా చేయడానికి మీరు అంబాసిడర్‌లా ఉండండి.
- ఏలేరు కుడి కాలువ నిర్మాణం గురించి జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ఇందాకే అడిగారు. దానికి దాదాపు రూ.50 కోట్లు అవుతుంది. ఈ పనులకు ఈ వేదికపై నుంచే అనుమతి మంజూరు చేస్తున్నా. ఈ పనుల ద్వారా 15 వేల ఎకరాల ఆయకట్టుకు నీళ్లందుతాయి. రైతులు, ప్రజలకు మంచి జరుగుతుంది.
- అస్సాగో ఇండస్ట్రియల్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆశీష్ గుర్నానీ ఈ సందర్భంగా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు తానేటి వనిత, దాడిశెట్టి రాజా, చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ, ఎంపీలు మార్గాని భరత్, వంగా గీత, చింతా అనురాధ, తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ డాక్టర్ మాధవీలత, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.



శంకుస్థాపన ఫలకాన్ని ఆవిష్కరించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్. చిత్రంలో సీపీ గుర్నానీ, ఆశీష్ గుర్నానీ, ఏపీ మంత్రులు, ఎంపీలు తదితరులు

రాష్ట్రంలో అభివృద్ధిని ఆపలేరు

రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతి కళ్లెదుటే కనిపిస్తోంది. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు పన్నినా, రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధికి అడ్డుకట్ట పడే పరిస్థితి లేదు. రాష్ట్రంలో పరిశ్రమలు పెట్టడం లేదు.. అభివృద్ధి జరగడం లేదు.. పరిశ్రమలు తరలిపోతున్నాయని ఒక మాజీ మంత్రి సీఎంకు లేఖ రాశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో బల్క్ డ్రగ్ పార్క్‌కు అనుమతి వస్తే, ఇది మా ప్రాంతానికి వద్దు.. మాకు అవసరం లేదని లేఖలు రాశారు. ఇదీ వాళ్ల దుర్బుద్ధి. జరుగుతున్న అభివృద్ధి, తరలి వస్తున్న పారిశ్రామికవేత్తలను చూసి ఓర్వలేక రాష్ట్రం బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీసేలా వారు అడుగులు వేస్తున్నారు. లక్షన్నర కోట్ల రూపాయల పెట్టుబడుల కార్యాచరణతో రెండు లక్షల మందికి ఉపాధి కల్పించేలా ముఖ్యమంత్రి అడుగులు ముందుకు వేస్తున్నారు.
– గుడివాడ అమర్‌నాథ్, ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి

30 సెకన్లలో సీఎం అంటే ఏమిటో తెలిసింది..

సీఎం జగన్.. వైఎస్సార్ అడుగుజాడల్లో నడుస్తూ పీపుల్ ఓరియంటెడ్, సోషల్ ఇంజనీరింగ్ ఓరియంటెడ్ విధానంలో అన్ని అవకాశాలను అందిపుచ్చుకుని రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందు వరుసలో ఉంచారు. పరిశ్రమకు త్వరితగతిన అనుమతులు ఇవ్వడంతో నా కుమారుడు ఆశీష్ ఇక్కడ పరిశ్రమ ఏర్పాటు చేస్తున్నారు. దీంతో స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయనడంలో సందేహమే లేదు. దావోస్ పర్యటనలో సీఎం జగన్‌తో కేవలం 30 సెకన్లు మాత్రమే మాట్లాడాము. రాష్ట్రంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఏ రకంగా అమలు చేస్తారని, యువత ఉపాధికి ఏ రకంగా వినియోగిస్తారని అడిగాను. ఆ సమయంలోనే రాష్ట్ర అభివృద్ధి పట్ల సీఎం అంకితభావం తెలిసింది. ఈ ప్రాంతంలో యువత, పారిశ్రామిక అభివృద్ధిపై ఉన్న లక్ష్యం.. సంకల్పం తెలియజేశారు. దావోస్‌లో చెప్పిన మాట ప్రకారం కేవలం ఆరు నెలలల్లోనే అన్ని అనుమతులిచ్చారు. తొలిసారి ఒక పరిశ్రమ స్థాపనకు ఆసక్తి చూపిన నా కుమారుడు కూడా సీఎం జగన్ అడుగుజాడల్లో నడవాలని కోరుకుంటున్నా. ఇందుకు సరైన వేదిక ఏపీ అని భావించి ఇక్కడ పరిశ్రమ ఏర్పాటు చేస్తున్నాం.
– సీపీ గుర్నానీ, టెక్ మహీంద్రా ఎండీ, సీఈవో



వేదికపై సీఎం వైఎస్ జగన్, అస్సాగో ఇండస్ట్రియల్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆశీష్ గుర్నానీ, సీపీ గుర్నానీ



సభకు హాజరైన జన సందోహంలోని ఓ భాగం

Reliance
Growth is Life

వచ్చేసింది, ఇండియా యొక్క కొత్త పొదుపుల బజార్

అత్యధిక పొదుపులు, ప్రతి రోజూ, ప్రతి సారి



SMART BAZAAR

కనీసం 6% తప్పని ఎమ్ఆర్‌పి పై + ప్రతిరోజు అదనపు డిస్కౌంట్
*కిరాణా సరుకులన్నిటిపై

చక్కెర 1 kg ₹9* ప్రతిరోజు
*₹1499 మరియు అంతకంటే మించిన షాపింగ్‌పై

SMART BAZAAR
గుంటూరు : శివ సిటీ సెంటర్, 7 వ లేన్, రింగ్ రోడ్, చంద్రమౌళి నగర్, ● కర్నూలు: రిలయన్స్ పెట్రోల్ స్టేషన్ పక్కన, నంద్యాల రోడ్, ● నెల్లూరు: MGB ఫెలిసిటీ మాల్, GNT రోడ్, ● రాజమండ్రి: శ్యామలాంబ ఆలయ వీధి, ● తిరుపతి: BNR SV మాల్, STV నగర్, ఎయిర్ బై-పాస్ రోడ్.

ఇక్కడ షాపింగ్ చేయండి JioMart.com

- ఫార్చ్యూన్ ఎవిరిడే బాస్మతి రైస్ 5 kg + ఫార్చ్యూన్ రిఫైన్డ్ రైస్ బ్రాన్ హెల్త్ ఆయిల్ 5 l + ప్యారిస్ వైట్ లేబుల్ షుగర్ 5 kg — కంబైన్డ్ ఎమ్ఆర్‌పి ₹2060, ఆదా చేసుకోండి ₹681, మా ధర ₹1379
- ఆధార్ రిఫైన్డ్ సన్ ఫ్లవర్ ఆయిల్ 1 l — ఎమ్ఆర్‌పి ₹198, ఆదా చేసుకోండి ₹46, మా ధర ₹152
- డెయిలీ రైస్ 25 kg — ఎమ్ఆర్‌పి ₹1200, ఆదా చేసుకోండి ₹41, మా ధర ₹1159 (₹46.36 /kg)
- ఆశీర్వాద్ సుపీరియర్ ఎంపీ వీట్ ఆటా 5 kg — ఎమ్ఆర్‌పి ₹308, ఆదా చేసుకోండి ₹53, మా ధర ₹255
- తూర్ / అర్హార్ దాల్ (కందిపప్పు) 2 kg — ఎమ్ఆర్‌పి ₹300, ఆదా చేసుకోండి ₹58, మా ధర ₹242 (₹121 /kg)
- గుడ్ లైఫ్ W320 జీడిపప్పు / బాదం 500 g — ఎమ్ఆర్‌పి ₹499/₹549, ఆదా చేసుకోండి ₹100/₹200, మా ధర ₹399/₹349
- ఈస్టర్న్ స్పైసెస్ రేంజ్ — *ఎంఆర్‌పి పైన BUY ANY2 GET ANY1 FREE*
- ప్యారిస్ వైట్ లేబుల్ షుగర్ 5 kg — ఎమ్ఆర్‌పి ₹275, ఆదా చేసుకోండి ₹70, మా ధర ₹205 (₹41 /kg)
- హెరిటేజ్ అగ్‌మార్క్ ఘీ గ్రేడ్ స్పెషల్ 1 l — ఎమ్ఆర్‌పి ₹630, ఆదా చేసుకోండి ₹105, మా ధర ₹525
- పార్లే ప్రీమియమ్ రస్క్ ఇలాయిచీ 1 kg — ప్రతి దానికి ఎమ్ఆర్‌పి ₹180 మొదలుకుని BUY2 GET1 FREE
- బిస్కెట్స్ పెద్ద ప్యాక్ 300 g మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్) — ఎమ్ఆర్‌పి ₹140 మొదలుకుని 50% తగ్గింపు
- చక్రా గోల్డ్ డస్ట్ టీ 500 g — ఎమ్ఆర్‌పి ₹380, మా ధర ₹340 మొదలుకుని, ఆదా చేసుకోండి ₹40
- యిప్పీ! / టాప్ రామెన్ / చింగ్స్ సీక్రెట్ నూడుల్స్ 240 g మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్) — ప్రతి దానికి ఎమ్ఆర్‌పి ₹53 మొదలుకుని BUY2 GET1 FREE
- బూస్ట్ 1 kg — ఎమ్ఆర్‌పి ₹575 మొదలుకుని, మా ధర ₹490 మొదలుకుని, ఆదా చేసుకోండి ₹85
- డెల్ మోంటే టొమాటో కెచప్ 500 g — ఎమ్ఆర్‌పి ₹95 మొదలుకుని BUY1 GET1 FREE
- కెల్లాగ్స్ కార్న్‌ఫ్లేక్స్ 1.2 kg — ఎమ్ఆర్‌పి ₹460 మొదలుకుని, మా ధర ₹349 మొదలుకుని, ఆదా చేసుకోండి ₹111
- వ్యాస్లీన్ / పాండ్స్ / నివియా బాడీ లోషన్ 300 ml మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్) — ఎమ్ఆర్‌పి ₹330 మొదలుకుని, మా ధర ₹180 మొదలుకుని, ఆదా చేసుకోండి ₹150
- డవ్ / హెడ్ అండ్ షోల్డర్ / లోరియల్ షాంపు 340 ml మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్) — ఎమ్ఆర్‌పి ₹345 మొదలుకుని, మా ధర ₹230 మొదలుకుని, ఆదా చేసుకోండి ₹115 మొదలుకుని
- పియర్స్ / డవ్ సోప్ 125 g x 3 / లక్స్ 150 g x 3 సోప్ (సెలెక్ట్ వేరియంట్స్) — ఎమ్ఆర్‌పి ₹198 మొదలుకుని, మా ధర ₹148 మొదలుకుని, ఆదా చేసుకోండి ₹50
- కోల్గేట్ స్ట్రాంగ్ టీత్ టూత్‌పేస్ట్ 500 g — ఎమ్ఆర్‌పి ₹253 మొదలుకుని, మా ధర ₹178 మొదలుకుని, ఆదా చేసుకోండి ₹75
- విస్పర్ అల్ట్రా XL 44s / స్టేఫ్రీ సానిటరీ ప్యాడ్స్ XL 42s (సెలెక్ట్ వేరియంట్స్) — ఎమ్ఆర్‌పి ₹500 మొదలుకుని, మా ధర ₹335 మొదలుకుని, ఆదా చేసుకోండి ₹165 మొదలుకుని
- సర్ఫ్ ఎక్సెల్ ఈజీ వాష్ పౌడర్ 1.5 kg — ఎమ్ఆర్‌పి ₹225 మొదలుకుని, మా ధర ₹180 మొదలుకుని, ఆదా చేసుకోండి ₹45
- పోలీసెట్ స్టార్ కంటెనర్ (3 పీసెస్ గల సెట్) 5, 7, 10 l / అసోర్టెడ్ — ఎమ్ఆర్‌పి ₹499, ఆదా చేసుకోండి ₹250, మా ధర ₹249
- హ్యాపీ లివింగ్ / డ్రీమ్‌లైన్ / హోమ్ వన్ అండ్ రేమండ్ బెడ్‌షీట్స్ — ఎమ్ఆర్‌పి ₹499 మొదలుకుని BUY1 GET1 FREE
- సింగర్ 1000 W వాట్ బ్రియో డ్రై ఐరన్ వైట్ — ఎమ్ఆర్‌పి ₹990, ఆదా చేసుకోండి ₹591, మా ధర ₹399
- సింగర్ 500 W మిక్సర్ గ్రైండర్ డ్యూరో ప్లస్ 3 జార్ — ఎమ్ఆర్‌పి ₹4090, ఆదా చేసుకోండి ₹2591, మా ధర ₹1499
- హార్డ్ / సాఫ్ట్ ట్రాలీ (ఎంపిక శ్రేణి) (కెమిలియంట్ / సఫారీ / అరిస్టోక్రాట్) — ఎమ్ఆర్‌పి ₹7500 మొదలుకుని, మా ధర ₹2250 మొదలుకుని, 70% తగ్గింపు
- పిజన్ అల్ఫా ఇండక్షన్ బేస్ నాన్-స్టిక్ కుక్‌వేర్ (3 గల సెట్) — ఎమ్ఆర్‌పి ₹3195, ఆదా చేసుకోండి ₹1596, మా ధర ₹1599

మహిళలు, పిల్లల మరియు పురుషుల దుస్తులు ఉత్తమ ధరలలో
మహిళల దుస్తులు ప్రారంభ ధర ₹199 మొదలుకుని | పిల్లల దుస్తులు ప్రారంభ ధర ₹129 మొదలుకుని | పురుషుల దుస్తులు ప్రారంభ ధర ₹199 మొదలుకుని



ఇక్కడ కూడా లభ్యం
SMART SUPERSTORE | SMART POINT

Pay with MobiKwik — GET FLAT ₹40* CASHBACK
*T&C Apply : Min Transaction of ₹750 | Valid Once Per User
Valid from 1st to 30th Nov 2022

మీకు సమీపంలో ఉన్న స్టోర్ లొకేట్ చేయడానికి స్కాన్ చేయండి

నియమ నిబంధనలు వర్తిస్తాయి. స్మార్ట్ సూపర్ స్టోర్, స్మార్ట్ పాయింట్ మరియు రిలయన్స్ ఫ్రెష్ లో మాత్రమే బ్యాంకింగ్ మరియు వాలెట్ ఆఫర్లు వర్తిస్తాయి. స్టాక్ ఉన్నంత వరకు ఆఫర్లు చెల్లుతాయి. ఆఫర్లన్నీ నోటీసు ఇవ్వకుండానే మార్పులకు లోబడి ఉంటాయి. ఉత్పాదనల యొక్క బొమ్మలు/చిత్రాలు కేవలం ప్రదర్శన ఉద్దేశం కోసం మాత్రమే. ఉత్పాదనలన్నిటి ఎమ్ఆర్‌పీలో పన్నులు కలుపబడి ఉన్నాయి. పైనా ఆఫర్లన్నీ 6 నవంబరు 2022 వరకు చెల్లుతాయి. పైనా ఆఫర్లన్నీ కేవలం ముంబయిలోని కోర్టుల ప్రత్యేక అధికార పరిధికి లోబడి ఉంటాయి.

> నువ్వు ఏది నమ్ముతావో అదే నువ్వు.
> నువ్వు ఏది కాగలనని నమ్ముతావో అదే అవుతావు.
> – హైందవ ధర్మం

సాక్షి

శనివారం, నవంబర్, 5

ఇజ్రాయెల్ పయనం ఎటు?

సర్వేల జోస్యాన్ని నిజం చేస్తూ ఇజ్రాయెల్ ఎన్నికల్లో లికుడ్ పార్టీ నేతృత్వంలోని అతి మితవాద, మత, ఛాందసవాద పార్టీల కూటమి ఘనవిజయం సాధించింది. ఆ కూటమి 120 స్థానాలున్న పార్లమెంటులో 64 గెల్చుకుని సుస్థిర ప్రభుత్వ ఏర్పాటుకు కసరత్తు మొదలెట్టింది. ఈ నెల 1న జరిగిన ఈ ఎన్నికలు మితవాద పక్షాలకు దేశ చరిత్రలో తొలిసారి సుస్థిర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశమిచ్చాయి. అవినీతి ఆరోపణల్లో విచారణ నెదుర్కొంటూ రాజకీయంగా మసకబారుతున్న విపక్ష లికుడ్ పార్టీ అధినేత, మాజీ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూను ఈ ఫలితాలు తిరుగులేని నేతగా స్థిరపరిచాయి. నాలుగేళ్లకోసారి జరగాల్సిన పార్లమెంటు ఎన్నికలు అస్థిర రాజకీయాల కారణంగా మూడున్నరేళ్లలో అయిదోసారి వచ్చిపడటంతో దేశ పౌరులు విసుగుచెందారనీ, పరస్పరం పొసగని పక్షాలున్న కూటమిని నమ్ముకోవటం కంటే పక్కా మితవాదంవైపు పోవటమే సరైందన్న నిర్ణయానికొచ్చారనీ ఫలితాలు వెల్లడిస్తున్నాయి. ఇప్పుడు గద్దె దిగబోతున్న మధ్యేవాద కుడి, ఎడమ పక్షాలు, అరబ్‌ల పార్టీల కూటమి ప్రభుత్వం దేశంలో సామరస్యత నెలకొల్పడం మాట అటుంచి మెరుగైన ఆర్థికాభివృద్ధికి దోహదపడే చర్యలు తీసుకోలేకపోయింది. ద్రవ్యోల్బణాన్ని, నిరుద్యోగాన్ని అరికట్టలేకపోయింది. అందుకే ఆ కూటమి 51 సీట్లకు పరిమితమైంది. ఏడాదిన్నర క్రితం జరిగిన ఎన్నికల్లో పదవీభ్రష్టుడైన నెతన్యాహూ ఆ కూటమి వైఫల్యాలను పూర్తిగా తనకనుకూలంగా మార్చుకోగలిగారు. జియోనిస్టు పార్టీ, మరో రెండు తీవ్ర ఛాందసవాద పక్షాలనూ కలుపుకొని కూటమి కట్టారు. మూడు దశాబ్దాలుగా పార్లమెంటులో చెప్పుకోదగ్గ స్థానాలతో వెలిగిన వామపక్షం మెరెట్జ్ ఈసారి కొన్ని వేల ఓట్లకే పరిమితమై చట్టసభకు వెలుపలే ఉండిపోయింది.

సమస్యల మాటెలా ఉన్నా మితవాద కూటమి అధికారం మెట్లెక్కడంలో మీడియా ప్రధాన పాత్ర పోషించింది. జియోనిస్టు పార్టీ నేత బెన్ గవీర్‌కు అపరిమితమైన ప్రచారమిచ్చి ఆయన పార్టీ దూసుకుపోయేందుకు దోహదపడింది. ఈ ప్రచారం ఏ స్థాయిలో సాగిందంటే ఆయనతో కూటమి కట్టి లాభపడిన నెతన్యాహూ సైతం అది మోతాదు మించిందని అంగీకరించాల్సి వచ్చింది. ఇదిగాక వాట్సాప్, టెలిగ్రాం యాప్‌లలో వందకుపైగా గ్రూపులు ఏర్పాటుచేసి బెన్ గవీర్ స్వీయ ప్రచారంతో హోరెత్తించారు. ఎప్పటికైనా ప్రజా భద్రతా మంత్రినవుతానని బెన్ గవీర్ నిరుడు జోస్యం చెప్పినప్పుడు ఆ పదవికి ఆయన పనికిరాడని నెతన్యాహూ అభిప్రాయపడ్డారు. తీరా రాజకీయ అవసరాల రీత్యా అదే పార్టీతో కూటమి కట్టక తప్పలేదు. ఇప్పుడాయనను మంత్రిని చేసి, ప్రజా భద్రత శాఖ అప్పగించినా ఆశ్చర్యం లేదు. స్వదేశంలోనే యూదులకు రక్షణ కరువైందనీ, ఉగ్రవాదులు ఏ నిబంధనలకూ లోబడకుండా దాడులు చేస్తుంటే వారిపై పోరాడే సైనికులకు నిబంధనలు సంకెళ్లుగా మారుతున్నాయనీ బెన్ గవీర్ తరచు వాపోయేవారు. ఈ మాదిరి ఉపన్యాసాలు యూదుల్ని బాగా ఆకట్టుకున్నాయి. పైగా 1994లో ఒక మసీదులో తలదాచుకున్న 29 మంది పాలస్తీనా పౌరులను ఊచకోత కోసిన బరూక్ గోల్డ్‌స్టీన్‌ను ఆయన తన ఆరాధ్యదైవంగా చెప్పుకుంటారు. సంక్షోభం ఆవరించిన సమాజంలో ఉద్రేకపూరిత ఉపన్యాసాలు జనాన్ని ప్రభావితం చేస్తాయి. బెన్ గవీర్ ఆ పని సమర్థవంతంగా చేయగలిగారు. మధ్యేవాద మితవాద పక్షం యామినా పార్టీ అరబ్‌పార్టీలున్న కూటమికి నేతృత్వం వహించటం యూదులకు ఆగ్రహం తెప్పించింది. దాంతో మెజారిటీ యూదులు అతి మితవాద పక్షమైన లికుడ్ పార్టీకి, ఛాందసవాద జియోనిస్టు పార్టీకి వలస పోయారు. విభేదాలున్నా కలిసి పనిచేద్దామని, దేశం ఎదుర్కొంటున్న సమస్యలకు మెరుగైన పరిష్కారం చూపుదామని జతకట్టిన ఎనిమిది పక్షాల కూటమి ప్రభుత్వం నడపటంలో, ఆర్థిక సమస్యలను అరికట్టడంలో వైఫల్యాలే చవిచూసింది. అంతర్గత పోరుతో సతమతమైంది.

ఇప్పుడు గద్దెనెక్కబోతున్న కూటమిలోని జియోనిస్టు పార్టీ ప్రతిపాదనలు సామాన్యమైనవి కాదు. న్యాయవ్యవస్థను సమూల ప్రక్షాళన చేయాలన్నది దాని ప్రధాన డిమాండ్. పార్లమెంటు చేస్తున్న చట్టాలను సుప్రీంకోర్టు ఇష్టానుసారం కొట్టివేస్తున్నదనీ, ఇది దేశ భద్రతకు చేటు తెస్తున్నదనీ ఆ పార్టీ చాన్నాళ్లుగా ఆరోపిస్తోంది. దీన్ని నిజంగా అమలు చేయటం మొదలుపెడితే న్యాయవ్యవస్థ బలహీనపడుతుందనీ, న్యాయమూర్తుల నియామకంలో రాజకీయ పక్షాలదే పైచేయి అవుతుందనీ చాలామంది కలవరపడుతున్నారు. ఇప్పటికే మూడు అవినీతి ఆరోపణల్లో విచారణను ఎదుర్కోబోతున్న నెతన్యాహూకు ఇది తోడ్పడుతుందని వారి భావన. అన్ని స్థాయిల్లోనూ ఎక్కడికక్కడ వ్యవస్థాగతమైన నిఘా ఉన్నప్పుడే, దిద్దుబాటు చర్యలు తీసుకున్నప్పుడే వ్యవస్థ సక్రమంగా కొనసాగుతుంది. తిరుగులేని అధికారం చలాయించే నేతకు అది సాగిలపడితే సర్వం అస్తవ్యస్తమవుతుంది. పరోక్షంగా తనకు లాభదాయకమైన ప్రతిపాదన చేస్తున్నారన్న ఉబలాటంతో బెన్ గవీర్‌ను రాజకీయంగా అదుపు చేయటంలో నెతన్యాహూ విఫలమైతే... పాలస్తీనాపై తొందరపాటు నిర్ణయాలు తీసుకుంటే దీర్ఘకాలంగా అండదండలందిస్తున్న అమెరికా సైతం వర్తమాన అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో ఇరకాటంలో పడుతుంది. దాన్నుంచి ఆశించిన రీతిలో సహాయ సహకారాలు లభించవు. అంతిమంగా ఏ దేశ పౌరులైనా సామరస్యతనూ, ప్రశాంతతనూ, ఆర్థిక సుస్థిరతనూ కోరుకుంటారు. ఇవన్నీ సుసాధ్యం చేసినప్పుడే నెతన్యాహూకు యూదుల నిజమైన ఆదరణ దొరుకుతుంది.

వాణిజ్య బంధాన్ని పెనవేయగలరా?!

విశ్లేషణ



సుష్మా రామచంద్రన్

భారతదేశంతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడం బ్రిటన్‌కు కూడా ప్రయోజనకరమే. అందుకే బ్రిటన్ కొత్త ప్రధాని రిషీ సునాక్ తన ప్రసంగంలో రెండు దేశాల మధ్య సంబంధాలను రెండు వైపుల నుంచి మరింతగా బలపరచవలసిన ఆవశ్యకత గురించి మాట్లాడారు. అయినప్పటికీ భారత్–యు.కె. వాణిజ్య సంబంధాలకు కీలకమైన ఎఫ్.టి.ఎ.పై శ్రద్ధ వహించడానికి ఆయనకు పరిస్థితులు అనుకూలిస్తాయా అన్నది సందేహమే. ఒకటి మాత్రం వాస్తవం. ద్వైపాక్షిక ఆర్థిక సంబంధాల అంశానికి అధిక ప్రాధాన్యతనిస్తూ భారత్ సునాక్‌పై ఎన్నో ఆశలు పెట్టుకుంది. ఆ ఆశలు నెరవేరతాయా లేదా అనేది... క్షీణిస్తున్న బ్రిటిష్ ఆర్థిక వ్యవస్థను సునాక్ దృక్పథం ఏ మేరకు మెరుగుపరుస్తుందన్న దానిపైనే ఆధారపడి ఉంటుంది.

భారతదేశంతో బ్రిటన్ ఆర్థిక సంబంధాలు గొప్ప ముందడుగుకు సిద్ధంగా ఉన్న తరుణంలో ఆ దేశంలోని రాజకీయ గందరగోళం బ్రిటన్ ప్రధానిగా భారత సంతతికి చెందిన రిషీ సునాక్ రాకకు దారి తీయడం భారత్‌కు అనేక విధాలైన వాణిజ్య అనుకూలతల్ని తెచ్చిపెట్టే పరిణామమే. ఇరుదేశాల మధ్య ప్రతిపాదిత 'స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం' (ఎఫ్.టి.ఎ.) ఈ ఏడాది జనవరి నుంచీ చర్చల స్థాయిలోనే ఉంది. చర్చలు ఫలవంతమై, ఒప్పందం అమల్లోకి రావడం కోసం రెండు దేశాలు కూడా ఎంతో ఉత్సుకతతో నిరీక్షిస్తూ ఉన్నాయన్నది నిజం.

బోరిస్ జాన్సన్ స్థానంలో లిజ్ ట్రస్ కొత్త ప్రధానిగా వచ్చినప్పటికీ ఎఫ్.టి.ఎ.పై చర్చలు అంతరాయం లేకుండా కొనసాగాయి. ట్రస్ ప్రభుత్వం స్వల్పకాల వ్యవధిలోనే అయినా శీఘ్రంగా అనుసరించిన వినాశకర విధానాల కారణంగా యు.కె. మరింతగా ఆర్థిక సంక్షోభంలో చిక్కుకోవడంతో, యు.కె.ను గట్టెక్కించే మార్గాలను అన్వేషించడం సునాక్ ప్రథమ కర్తవ్యం అయింది. ప్రధానిగా సునాక్ తన ప్రసంగంలో రెండు దేశాల మధ్య సంబంధాలను రెండు వైపుల నుంచి మరింతగా బలపరచవలసిన ఆవశ్యకత గురించి మాట్లాడినప్పటికీ, భారత్–యు.కె. వాణిజ్య సంబంధాలకు కీలకమైన ఎఫ్.టి.ఎ.పై శ్రద్ధ వహించడానికి ఆయనకు పరిస్థితులు అనుకూలిస్తాయా అన్నది సందేహమే. 2023 వరకైనా ఈ ప్రతిపాదిత ఒప్పందం అప్రస్తుత అంశంగా మూలన పడే అవకాశముంది.

ఎఫ్.టి.ఎ. సంభవమయ్యేందుకు ఉన్న అవకాశాలు ప్రధానిగా ట్రస్ నిష్క్రమించడానికి ముందే సన్నగిల్లాయి. వీసాల గడువు ముగిసిపోయినా కూడా దేశంలోనే ఉండిపోయే అలవాటున్న భారతీయుల వలసలను ఈ ఒప్పందం సులభతరం చేస్తుందని ఆ దేశ విదేశాంగ మంత్రి సుయెల్లా బ్రేవెర్‌మాన్ అనడంతోనే చర్చల్లో ప్రతిష్టంభన నెలకొంది. ఆమె చేసిన ఈ వ్యాఖ్యలు చర్చల వాతావరణాన్ని దెబ్బ తీశాయి. అయినప్పటికీ, గతవారం బ్రిటన్ రాజకీయ పరిస్థితులు నాటకీయంగా మారే వరకు కూడా ఎఫ్.టి.ఎ.ని ఖరారు పరచుకోవాలన్న దృఢ సంకల్పం ఇరువైపులా కనిపించింది. అసలు ఎందుకు ఈ ఒప్పందం విషయమై భారత్–బ్రిటన్ గట్టి పట్టుతో ఉన్నాయన్న ప్రశ్నకు తగిన సమాధానమే ఉంది. మొదట బ్రిటన్ వైపు నుంచి చూద్దాం.

ఐరోపా సమాఖ్య నుంచి ఆ దేశం బయటికి వచ్చేయడంతో సమాఖ్యలోని తక్కిన దేశాలతో ఉన్న అనుసంధాన వారధులను బ్రిటన్ తనకై తను కూల్చుకున్నట్లయింది. పర్యవసానమే... ఒక ప్రధాన ఆర్థిక వ్యవస్థతో బ్రిటన్ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోక తప్పని పరిస్థితి రావడం. ఆ సమయంలో భారత్ కంటే ముందుగా అమెరికా తన వాణిజ్య భాగస్వామిగా బ్రిటన్‌తో చేతులు కలుపుతుందనే అంతా భావించారు. అయితే అందుకు విరుద్ధంగా ఎఫ్.టి.ఎ.పై చర్చలు జరపడానికి ప్రస్తుతం తనకు ఆసక్తి లేదని అమెరికా స్పష్టం చేసింది.



భారతదేశంతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడం బ్రిటన్‌కు అనేక విధాలుగా ప్రయోజనకరంగా ఉంటుంది. ఒకటి, భారత్ ఇప్పుడు ప్రపంచంలోనే ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. మొన్నటి వరకు యు.కె. ఉన్న ఐదవ స్థానంతో సమానమైన స్థాయి ఇది. కనుక బ్రిటిష్ పరిశ్రమలకు భారత్ భారీ మార్కెట్‌ను చూపిస్తుంది. రెండవది... విస్కీ, స్పిరిట్స్ వంటి బ్రిటన్‌కు మాత్రమే పరిమితమైన మేలిమి ఉత్పత్తులపై ఉండే భారీ దిగుమతి సుంకాలు తగ్గించడం ద్వారా వాటి మార్కెట్‌ను మెరుగుపరుస్తుంది. ప్రతిఫలంగా భారత్ వృత్తిపరమైన నైపుణ్యం కలిగిన కార్మికులకు సులభంగా వీసాలు వచ్చేలా బ్రిటన్‌కు డిమాండ్‌లు పెట్టవచ్చు. అలాంటి సౌలభ్యం వీసాల జారీ విధి విధానాల్లో లేనప్పటికీ, వాణిజ్య వ్యాపారాలకు అవసరమైన చలనశీలత ఆ మేరకు వెసులుబాట్లను కల్పించే అవకాశం ఉంటుందని అనుకోవచ్చు. ఐరోపా సమాఖ్య నుంచి బ్రిటన్ వైదొలగనంత వరకు కూడా పొరుగున ఉన్న ఐరోపా దేశాలతో వీసా అడ్డంకుల సమస్య ఉండేది కాదు కనుక ఆ దేశాల నుంచి ప్రవాహంలా వచ్చే వారి వల్ల బ్రిటన్‌కు నైపుణ్యం కలిగిన కార్మికుల అవసరం తీరేది. ఇప్పుడీ ఎఫ్.టి.ఎ. కుదిరితే వృత్తిపరమైన కార్మికుల డిమాండ్‌లో కొంత భాగం భారతదేశం నుండి తీరవచ్చు. సరిగ్గా ఈ అంశం దగ్గరే వలసల సమస్యలపై సునాక్ మంత్రివర్గంలోని బ్రేవర్‌మాన్ చేసిన వ్యాఖ్యలు చర్చలు నిలిచిపోవడానికి కారణం అయ్యాయి.

కీలక మార్కెట్లలో తక్కువ సుంకాల పరంగా ఎగుమతిదారులకు మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఉన్నందున, ఎఫ్.టి.ఎ.ను ఖాయం చేసుకునేందుకు భారతదేశం కూడా సమానమైన ఆత్రుతతో ఉంది. అదే సమయంలో చైనా నుండి తృతీయ దేశాల ద్వారా ప్రవేశించే చౌక దిగుమతులను నివారించే ప్రయత్నంలో అతిపెద్ద బహుపాక్షిక సమూహమైన 'ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్యం' (ఆర్.సి.ఇ.పి.) నుండి దూరంగా ఉండి, సభ్య దేశాలకు అందుబాటులో ఉన్న ప్రాధాన్యతా సుంకాలను భారత్ కోల్పోయింది. ఈ వైకల్యాన్ని అధిగమించడానికి, ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలను కుదుర్చుకోవడం కోసం భారత్ ప్రయత్నిస్తోంది. అందువల్లే బ్రిటన్‌తో వాణిజ్య ఒప్పందం అన్నది అత్యంత సంభావ్యత కలిగిన ఒక ముందడుగుగా పరిగణన పొందుతోంది.

ఇరుపక్షాలకు కూడా ప్రతిష్ఠాత్మకమైనదిగా ప్రాముఖ్యతను సంతరించుకున్నందునే ఈ భారత్–యు.కె. వాణిజ్య ఒప్పందం నిలిచిపోవడం నిరుత్సాహానికి కారణం అయింది. అంతేకాకుండా, రెండు దేశాల మధ్య వలసవాద యుగం నాటి నుండి ప్రత్యేకమైన సంబంధాలు ఉన్నాయనే వాస్తవం విస్మరించలేనిది. స్వాతంత్య్రం వచ్చే నాటికి భారతదేశాన్ని బ్రిటన్ కడు పేదరికంలో వదిలి వెళ్లిందనే వాస్తవం ఆగ్రహం తెప్పించేదే అయినప్పటికీ, ఏళ్ల క్రమంలో సంభవించిన రెండు దేశాల సంబంధాలలోని పరిణతి ఒకదానితో ఒకటి సమస్థాయికి చేరేందుకు దోహదపడింది. అందుకు ఒక కారణం ఏమిటంటే, ఆ దేశంలో ప్రవాస భారతీయుల అత్యంత ప్రభావవంతమైన పాత్ర. ఇప్పుడికైతే భారతీయ సంతతికి చెందిన వ్యక్తి ప్రధాన మంత్రి కావడం రెండు దేశాల అభివృద్ధిలో ఒక స్పష్టమైన మైలురాయి. అంతేకాకుండా, యు.కె.లో ప్రస్తుతం భారత్ రెండవ అతిపెద్ద విదేశీ పెట్టుబడిదారుగా ఉన్నదన్న వాస్తవం రెండు దేశాల మధ్య ఆర్థిక సంబంధాలు దృఢతరం చేయగలిగినంత శక్తి గలది. బ్రిటన్‌లో 850 భారతీయ కంపెనీలు పనిచేస్తుండగా, భారత్‌లో 600 బ్రిటిష్ కంపెనీలు ఉండటం ఇందుకొక నిదర్శనం. భారతదేశంలో బయటి నుంచి పెట్టుబడులు పెట్టే ఆరవ అతిపెద్ద మదుపుదారు బ్రిటన్.

భారత్–యు.కె. ఆర్థిక సంబంధాల భవిష్యత్తు పూర్తిగా కొత్త ప్రధానమంత్రి అనుసరించే దిశపైనే ఆధారపడి ఉంది. ఇరుదేశాల సంబంధాలను మరింత గాఢపరిచేందుకు సునాక్ స్పష్టమైన ఆసక్తి చూపుతున్నప్పటికీ, వీసా సమస్యలను సడలించడం అంటే, వలసలను ప్రోత్సహించడంతో సమానమని భావించే బ్రేవర్‌మాన్ వంటివారు ఆయన ప్రయత్నాలకు అవరోధం కావొచ్చు. ఈ నేపథ్యంలో.. ఆయన సుంకాలను తగ్గించడం, వీసా నియంత్రణలను సడలించడం వంటి చర్యల ద్వారా యు.కె.కి ఒనగూడే ఆర్థిక ప్రయోజనాల గురించి గట్టిగా చెప్పగలరా అన్నది రాబోయే కొద్ది నెలల్లో తేలిపోవచ్చు. ఈ క్లిష్ట స్థితి నుంచి ఇండియా నేర్చుకోవలసిన పెద్ద పాఠం ఏమిటంటే.. మరిన్ని ప్రాంతీయ, ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలను ఖరారు చేసుకోడానికి తన ప్రయత్నాలను వేగవంతం చేయడం. ద్వైపాక్షిక ఆర్థిక సంబంధాలను మరింతగా బలోపేతం చేసుకునే అంశానికి అధిక ప్రాధాన్యతనిస్తూ భారత్ కొత్త యు.కె. ప్రధానిపై ఆశలు పెట్టుకుందనడంలో సందేహం లేదు. అయితే ఆ ఆశలు నెర వేరతాయా లేదా అనేది మాత్రం.. క్షీణిస్తున్న బ్రిటిష్ ఆర్థిక వ్యవస్థను రిషి సునాక్ దృక్పథం ఏ మేరకు మెరుగుపరుస్తుందన్న దానిపైనే ఆధారపడి ఉంటుంది.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్
('ది ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

స్నేహితుడికి శుభాకాంక్షలు



నా స్నేహితుడు బెంజమిన్ నెతన్యహూ ఎన్నికల్లో విజయం సాధించినందుకు 'మాజెల్ టఫ్' (హీబ్రూలో శుభాకాంక్షలు)! ఇండియా– ఇజ్రాయిల్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింతగా బలోపేతం చేసేలా మన ఉమ్మడి ప్రయత్నాలను కొనసాగిద్దాం.

– నరేంద్ర మోదీ, ప్రధానమంత్రి

అసలు విషయం



మీడియాకు సూచన: దయచేసి 40 ఏళ్ల అత్యధికానికి (అమెరికా) ద్రవ్యోల్బణం చేరుకుందని చెప్పొద్దు. కార్పొరేట్ లాభాలు 70 ఏళ్ల అత్యధికానికి చేరుకున్నాయని పేర్కొనని పక్షంలో. జనానికి పూర్తి చిత్రాన్ని ఇవ్వగలరు.

– రాబర్ట్ రీచ్, ప్రొఫెసర్

ఉమ్మడిగా ఆలోచిద్దాం



కేవలం ఢిల్లీ, పంజాబ్‌లో మాత్రమే కాదు, యావత్ ఉత్తర భారతం తీవ్రమైన కాలుష్యంతో ఇబ్బంది పడుతోంది. అందుకే నిందించుకునే ఆటలు ఆపేద్దాం. ఒక దేశంగా దీనికి పరిష్కారం కనుక్కుందాం.

– అరవింద్ కేజ్రీవాల్, ఢిల్లీ సీఎం

అదా బాధ?



ఉన్నత వర్గీయులు ట్విట్టర్‌కు నెలకు 8 డాలర్లు చెల్లించాలన్న దానికోసం బాధపడటం లేదు. ఎవరైనా ఆ 8 డాలర్లు చెల్లించగలరు అన్నదానికి బాధపడుతున్నారు.

– డేవిడ్ సాక్స్, ఆంట్రప్రెన్యూర్

పెద్ద అడుగే



పాకిస్తాన్‌లో ప్రవక్త తర్వాతి స్థానంలో పాక్ సైన్యం ఉంటుంది. అలాంటిది పాకిస్తాన్ సైన్యానికి వ్యతిరేకంగా పెద్ద నిరసన ప్రదర్శన జరిగింది. ఇమ్రాన్ ఖాన్ ఎవరూ ఆలోచించలేనిది చేశారు.

– అశోక్ స్వైన్, ప్రొఫెసర్

ఓటమి నేర్పిన పాఠాలు

సందర్భం



మరూఫ్ రజా

సరైన ఆయుధాలు, దుర్భేద్యమైన సైనిక దుస్తులు లేకుండా ఈశాన్య సరిహద్దు ప్రాంతం (నార్త్ ఈస్ట్ ఫ్రాంటియర్ ఏజెన్సీ – ఎన్.ఇ.ఎఫ్.ఎ.)లో గస్తీ కాస్తున్న భారత దళాలు ఒక హఠాత్పరిణామంగా 1962 అక్టోబర్ రాత్రి 19–20 తేదీల మధ్య చైనా జరిపిన చొరబాటు దాడులతో అనేక ప్రాధాన్య స్థావరాలను కోల్పోయాయి. చైనా వెన్నుపోటు పొడిచిందని నెహ్రూ, ఆయన అనుచరులు వాదించారు కానీ, మావో నేతృత్వంలోని కమ్యూనిస్టు నాయకత్వం ఏం చేయనుందో 1950ల చివరి నుంచీ చాలినన్ని హెచ్చరికలు కనిపిస్తూనే ఉన్నాయి.

టిబెట్ స్వాతంత్య్రానికి మద్దతు ఇవ్వడం మానేస్తామని భారత్ ఇచ్చిన హామీపై 1954లో 'పంచశీల' ఒప్పందానికి చైనా అంగీకారం తెలిపింది. అయినప్పటికీ అక్సాయ్ చిన్‌లోగానీ, తవాంగ్‌లో మక్‌మహన్ నియంత్రణ రేఖను మీరిన భాగాన్ని కూడా తనదేనన్న వాదననుగానీ చైనా వదులుకోలేదు. మావో, కృశ్చేవ్‌ల మధ్య కుదిరిన ఒప్పందాన్ని అనుసరించి సోవియట్ వైమానిక, భూ ఉపరితల సేనల సహకారంతో టిబెట్ భూభాగంపై చైనా తన సైనిక బలగాలను స్థిరంగా పెంచుకుంటూ పోయింది. ఆ పరిణామాన్ని భారత్ పట్టించుకోలేదు. 1959లో అమెరికా సాయంతో టిబెట్ నుంచి భారత్‌కు తప్పించుకున్న దలైలామా భారత్‌లో ఆశ్రయం పొందడం చైనాకు ఆగ్రహం తెప్పించింది. నిజానికి ముందుగా అనుకున్నది వారు అమెరికా వెళ్తారని. అన్నిటినీ మించి చైనా కోపానికి కారణమైన అంశం... అమెరికా కార్యకలాపాలకు భారత్ ప్రధాన కేంద్రం అవడం. ఇక స్వదేశంలో ఒత్తిళ్లకు లోనైన నెహ్రూ భారత భూభాగాలలోంచి చైనీయులను విసిరి బయట పడేయమని భారత సైన్యాన్ని ఆదేశించారు. ఆ దూకుడులో ఆయన చైనా ప్రధాని చౌ ఎన్–లై 1960లో ఇండియా పర్యటించినప్పుడు చేసిన ప్రతిపాదనలను విస్మరించారు. అక్సాయ్ చిన్ ప్రాంతాన్ని చైనాకు ఉంచి, మక్‌మహన్ రేఖకు దక్షిణ వైపున ఉన్న ప్రాంతాన్ని భారత్ తీసుకోవడం ద్వారా సరిహద్దు వివాదాన్ని పరిష్కరించుకోవాలన్నదే ఆ ప్రతిపాదన.

నిజానికి 1962 భారత్–చైనా యుద్ధంలో మన సేనలు మెరుగైన ప్రతిఘటననే ఇచ్చాయి. సరిహద్దు వెంబడి ప్రాధాన్య స్థావరాలపై తమ పట్టును కోల్పోకుండా ఉండేందుకు వీరోచితంగా పోరాడాయి. మన సేనాపతులు తమ సైనికులపై ఎన్ని నెపాలు మోపినా గానీ, ఆ సైనికుల అసమాన శౌర్య పరాక్రమాలకు ఎన్నో నిదర్శనాలు కనిపిస్తాయి. అలాగైతే ఎందుకు ఓడిపోయాం? ఇంటెలిజెన్స్ చీఫ్ బి.ఎన్. మాలిక్ సలహాపై భారత



1962 చైనా యుద్ధానికి 60 ఏళ్లు

వైమానిక దళాలను రంగంలోకి దింపేందుకు నెహ్రూ అనుమతించలేదు. అలా చేస్తే చైనాను మరింతగా రెచ్చగొట్టినట్లు అవుతుందని నెహ్రూ భావించారు! అదొక పెద్ద తప్పిదంగా చరిత్రలో నిలిచిపోయింది.

భారత్–చైనా యుద్ధం జరిగి 60 ఏళ్లయింది. అసలు ప్రశ్న ఏమిటంటే 1962 నాటి ఆ యుద్ధం నుంచి మనం ఏవైనా పాఠాలు నేర్చుకున్నామా అని! నేర్చుకున్నామని చెప్పడమే న్యాయంగా ఉంటుంది. 1967లోనే చైనా నాథు లా పాస్, చో లా పాస్ మార్గాలు వెళ్లే హిమాలయ సరిహద్దు ప్రాంతాల్లో భారత్‌కు వ్యతిరేకంగా కండలు తిప్పడం మొదలు పెట్టి పెట్టగానే అక్కడి జనరల్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్ మేజర్ జనరల్ సగత్ సింగ్ తన అధీనంలోని కంచె లోపలి భాగంలోకి ఎలాంటి విదేశీ చొరబాట్లను అనుమతించబోనని తన పై అధికారులకు ముందస్తు సమాచారం పంపించారు. అంటే తనిక ఎలాంటి ఆదేశాల కోసమూ ఎదురు చూడబోయేది లేదని. 20 ఏళ్ల పాటు నిశ్శబ్దంగా ఉండిపోయిన చైనా 1986–87లో అరుణాచల్ ప్రదేశ్‌లోని సోమ్‌డోరోంగ్ లోయలోకి చొరబడింది. ఆర్మీ చీఫ్ జనరల్ సుందర్జీ మెరుపు వేగంతో ప్రతిస్పందించి భారత సేనల్ని గగన తలం గుండా సోమ్‌డోరోంగ్‌పై దింపారు. ప్రత్యర్థి మూకలు మారు మాట్లాడకుండా వెనకడుగు వేశాయి. 2020లో గల్వాన్ లోయలో చైనా చొరబాట్లకు కూడా భారత్ మునుపటంత వేగంగానే స్పందించింది.

అక్సాయ్ చిన్‌పై చైనా తన నియంత్రణను వదులుకునేలా చేయడానికి దౌత్యపరమైన సంభాషణలు జరపడం వల్ల ప్రయోజనం లేదు. అక్సాయ్ చిన్ వ్యూహాత్మకంగా చైనాకు ఎంతో ప్రాముఖ్యమైనది. ముఖ్య నదులు, యురేనియం నిక్షేపాలు ఉన్న ప్రాంతం అది. అక్కడి నుంచే జి 219 హైవే వెళుతుంది. చైనాలోని రెండు కీలక ప్రాంతాలైన షిన్‌జాంగ్, టిబెట్‌లను ఆ దారి కలుపుతుంది. మరైతే పరిష్కారం ఏమిటి?

1959–60 ప్రతిపాదనల ప్రకారం ఇచ్చిపుచ్చుకునే ధోరణి. అప్పుడిక అక్సాయ్ చిన్ చైనాకు, అరుణాచల్ ప్రదేశ్ భౌగోళిక ప్రాంతాలు భారత్‌కు వస్తాయి. అంటే సరిహద్దు రేఖల్ని ఉన్నవి ఉన్నట్లుగా ఇరు దేశాలు అంగీకరించడం. ప్రస్తుతం రెండు దేశాలకు శక్తిమంతమైన నాయకులే ఉన్నారు కనుక సరిహద్దు వివాదాలను పరిష్కరించుకుని, రాజకీయంగా సరళమైన మనుగడ సాగించవచ్చు. వారు దానికి సిద్ధంగా ఉన్నారా అన్నదే ప్రశ్న.

వ్యూహాత్మక వ్యవహారాల విశ్లేషకులు
('ది ట్రిబ్యూన్' సౌజన్యంతో)

నీళ్లల్ల నిండ ముంచుతరు

నారదుడు నెత్తి మీది కెల్లి తానం జేసిండు. కొప్పేసుకుండు. తంబూర తీస్కున్నడు. చిర్తలు గొట్టుకుంట, నారాయన నారాయన అన్కుంట గాయిన మొగులు మీదికెల్లి ఎల్లిండు. తెలంగాన దిక్కు రాబట్టిండు. నద్మల నర్కం దిక్కు బోతున్న యముని దున్నపోతు గాయినకు ఎదురైంది.

''యాడికెల్లి వొస్తున్నవు?'' అని నారదుడు దున్నపోతు నడిగిండు.

''తెలంగానకెల్లి'' అని దున్నపోతు జెప్పింది.

''గాడికెందుకు బోయినవ్?''

''సదర్ పండ్గకు మా దున్నపోతులు రమ్మంటి బోయొస్తున్న''

''పండ్గ మంచిగైందా?''

''మునుగోడు ఎలచ్చన్లట. టీఆర్‌ఎస్ దున్న పోతులనుకుంట మాదాంట్ల కొన్నిటిని మోటర్ మీద గూసుండ బెట్టింద్రు. కొన్నిటి మెడల తామర పూల దండేసి బీజేపీ దున్నపోతులన్నరు. ఇగ కొన్నిటిని కాంగ్రెస్ దున్నపోతులనుకుంట గవ్విటితోని పాదయాత్ర జేపిచ్చింద్రు.''

''సదర్ పండ్గ అయినంక గుడ్క తెలంగాన లెందుకున్నవ్? ''పండ్గలన్నిట్ల పెద్ద పండ్గ ఓట్ల పండ్గ. గా పండ్గను మునుగోడుల ధూమ్‌దామ్గ జేస్కుంద్రు. గా బై ఎలచ్చన్ల ఓట్ల పండ్గ అయ్యేదాంక తెలంగానల ఉంటె బాగుంటదనుకున్న. అనుకోని ఇయ్యాల్టిదాంక మునుగోడులనే ఉన్న''

''ఓట్ల పండ్గ ఎట్లైంది''

''శాన మంచిగైంది. శాన్దార్గ అయ్యింది. నెలన్నర గాకుంట యాడాదంత గీ ఓట్ల పండ్గ ఉంటె బాగుండుననిపిచ్చింది''

''గంత గనం బాగుందా?''

''అవ్. ఇదువరదాంక ఏ బై ఎలచ్చన్ల ముఖ్యమంత్రి ప్రచారం జెయ్యలేదు. గని మునుగోడు బై ఎలచ్చన్ల రొండు పార్లు ప్రచారం జేసిండు. చండూరుల మాట్లాడుకుంట వడ్ల కొనుడు శాతగానోల్లు వంద కోట్లు సంచులల్ల బెట్టుకోని మా ఎమ్మెల్యేలను కొనెతందుక్కొ వొచ్చింద్రు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ఇంతకుముందే మేము గొన్నం. మేము గొన్న ఎమ్మెల్యేలను బీజేపోల్లు కొనెతందుక్కొ వొచ్చుడేమన్న బాగుందా? పడ్తల్ బడక మా ఎమ్మెల్యేలు గోడదుంకలేదు. జెనం కోసమే నేను గాలి మోటార్ గొన్న. జెనం కోసమే యాద్గిరి నర్సిమ్మ సామికి కిలన్నర బంగారమిచ్చిన. సలికాలం తడి బట్టలతోని ఒట్టు తినెతందుక్కు బండి సంజయ్ లెక్క నేనేమన్న అవులగాన్నా? అని కేసీఆర్ అన్నడు''

''ముక్యమంత్రి నర్సిమ్మ సామికి కిలన్నర బంగారమిచ్చిండు. గంతేగాకుంట బంగారి గద్ద మీద్కెల్లి స్పీచ్ గొట్టిండు. తలా తులం బంగార మేమన్న ఇస్తడా?''

''మాంసం దినెటోల్లు యాడనన్న బొక్కలు మెడలేసుకుంటరా?''


''బై ఎలచ్చన్లు జెయ్య బట్కె మాయబజార్ లెక్క మునుగోడు బదల్ గయా! తొవ్వలు లేని



ఊర్లకు తొవ్వలు ఏసింద్రు. సర్కార్ జీతగాల్లకు పదో తారీకున గాకుంట పహిలీ తారీక్కే జీతాలు బడ్డయి. అంబటాల్ల బువ్వకు 40 లక్షల రూపాయలు మంజూరైనయి. షాదీ ముబారక్, కల్యాన లచ్మిలకు టోల్ రూపాయలు ఇచ్చింద్రు.

డిండి ఎత్తిపోతలు జెయ్య బట్కె ఎవుసం బూములు పోడగొట్టుకొన్న రైతులకు 116 కోట్లు మంజూరు జేసింద్రు. ముక్యమంత్రి, మంత్రులు ఎమ్మెల్యేలందరు మునుగోడు జెనం సుట్టూత చక్కర్లు గొట్టింద్రు. నేను రాజినామ జేసి బీజేపీల దుంకబట్కె గిదంత అయిందని రాజగోపాల్ రెడ్డి అన్నడు. బీజేపీ ఏ ఎమ్మెల్యేను కొనలేదనుకుంట యాద్గిరి గుట్టల దేవుని ముంగట తడి బట్టల్తోని బండి సంజయ్ ఒట్టు దిన్నడు. గడీల కాడ కావలి గాసేటి కూసు కుంట్ల గావాల్నా? కేసీఆర్ గల్ల బట్టె రాజగోపాల్ రెడ్డి గావాల్నా? అని గాయిన అడిగిండు.''

అట్లుంటది



తెలిదేవర భానుమూర్తి

''కాంగ్రెస్ సంగతేంది?''

''కాంగ్రెస్ దిక్కుకెల్లి పాల్వాయి గోవర్ధన్ రెడ్డి బిడ్డ పాల్వాయి స్రవంతి నిలవడ్డది. ఆడోల్ల ఓట్లన్ని గామెకే బడ్తయని కాంగ్రెస్ లీడర్లు అనుకున్నరు. టీపీసీసీ ప్రెసిడెంట్ రేవంత్ రెడ్డి కొంపెల్లిల మాట్లాడుకుంట అందర్కి దండం బెట్టి అడ్గుతున్న ఆడిబిడ్డకు ఒక్క మోక ఇయ్యుంద్రి. మీ చేతులల్ల బెడ్తున్న గీ బిడ్డను సంపుకుంటరో, సాదుకుంటరో మీ ఇస్టం. ఎన్కకెల్లి కాంగ్రెస్‌ను బొడ్సి రాజగోపాల్ రెడ్డి కోట్ల రూపాయల కాంట్రాక్ట్ కోసం బీజేపీల దుంకిండు అన్నాడు. మీరు టీడీపీని ఎన్కకెల్లి బొడ్సి కాంగ్రెస్లకు దుంకిన తీర్గనా?'' అని ఎవడో లాసిగ అడిగిండు.

''కేటీఆర్ ఎట్ల ప్రచారం జేసిండు?''

''గా గట్టున మాయల మరాటి మోదీ. గీ గట్టున తెలంగాన. గీ గట్టున మోటర్ గుర్తు కూసుకుంట్ల. గా గట్టున బీజేపీ, కాంగ్రెస్ బేకార్ గాల్లు. గీ గట్టున దలిత బందు. గా గట్టున పీక్క తినేటి రాబందు. గీ గట్టున అంబేద్కరసువంటి కేసీఆర్. గా గట్టున మత పిచ్చి మోదీ. గా గట్టున ఉంటరా? గీ గట్టున పంటరా? అని సవాల్లు అడ్గుకుంట కేటీఆర్ ప్రచారం జేసిండు.''

''గాయిన గా గట్టున ఉన్నా గీయిన గీ గట్టున ఉన్నా ఇద్దరు గల్సి జెనంను నీల్లల్ల నిండ ముంచుతరు'' అని నారదుడన్నడు.

''మల్ల గలుస్త'' అనుకుంట యముని దున్నపోతు నర్కం దిక్కు బోయింది. నారదుడు పీచేముడ్ అన్కుంట వైకుంటం బోయిండు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్ । 99591 50491

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం, **తిథి:** శు.ద్వాదశి సా.5.30 వరకు, తదుపరి త్రయోదశి, **నక్షత్రం:** ఉత్తరాభాద్ర రా.1.07 వరకు, తదుపరి రేవతి, **వర్జ్యం:** ఉ.11.06 నుండి 12.41 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.6.05 నుండి 7.33 వరకు, **అమృతఘడియలు:** ఆ.9.50 నుండి 11.34 వరకు, క్షీరాబ్ధి ద్వాదశి: **రాహుకాలం :** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం :** ప.1.30 నుండి 3.00 వరకు: **సూర్యోదయం** 6.04 : **సూర్యాస్తమయం** 5.25.

భవానీ మండల దీక్షలు ప్రారంభం

- ఇంద్రకీలాద్రిపైకి దీక్షల స్వీకరణకు తరలివచ్చిన భక్తజనం


దీక్ష తీసుకుంటున్న వారికి మాలధారణ చేస్తున్న అర్చకులు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో శుక్రవారం నుంచి భవానీ మండల దీక్షలు ప్రారంభమయ్యాయి. శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై శుక్రవారం ఉదయం 6.30 గంటలకు అంతరాలయంలో అమ్మవారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి మూలవిరాట్‌కు పగడాల దండను అలంకరించి పల్లకిపై ఊరేగిస్తూ మహా మండపం ఆరో అంతస్తుకు తీసుకొచ్చారు. అమ్మవారి ఉత్సవ మూర్తికి ఆలయ స్థానాచార్య విష్ణుభట్ల శివప్రసాద్‌శర్మ, వైదిక కమిటీ సభ్యులు లింగంభొట్ల దుర్గాప్రసాద్, రంగావజ్ఝల శ్రీనివాసశాస్త్రి పూజలు నిర్వహించి అఖండ జ్యోతిని వెలిగించారు. అనంతరం భక్తులకు మాలధారణ చేశారు. అమ్మవారి సన్నిధిలో మాలధారణ చేసేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఆలయ ఈవో భ్రమరాంబ పాల్గొన్నారు. అలాగే దుర్గగుడి ఘాట్‌రోడ్డులోని కామధేను అమ్మవారి విగ్రహం వద్ద తెల్లవారుజాము నుంచే పెద్ద ఎత్తున భక్తులు భవానీ దీక్షను స్వీకరించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

స్పెషల్ కలెక్టరు(భూసేకరణ) వారి కార్యాలయం, ఒంగోలు

ది ప్రకాశం జిల్లా భూసేకరణ ప్రకటన

లేఖ నెం. ఆర్.సి.బి/95/2020 తేది.30-03-2020

ఫారం నెం. VII

(2013వ సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలలో న్యాయపరమైన నష్టపరిహారము పొందే పారదర్శకత చట్టంలో సెక్షన్ 19(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 25, సబ్ రూల్ (1) ననుసరించి)

రూఢీ ప్రకటన

ఈ దిగువ నుదహరించిన షెడ్యూలు దాఖలా భూములను ప్రజాహిత ఉపయోగార్థం అనగా పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్ట్ క్రింద ఈస్టర్న్ ప్రధాన కాలువలో ఇఓ బ్లాక్‌లో 14యల్ మేజర్‌లో 22బి ఇ మైనర్‌లో 4యల్ సబ్ మైనర్‌లో 2యల్ సబ్ సబ్‌మైనర్ కాలువ నిర్మాణంలోని భాగముగా తర్లుపాడు మండలము గోరుగుంటలపాడు గ్రామములోని కాలువ పోవుచున్నందున శ్రీయుత స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ), పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్ట్, ఒంగోలు వారు భావించినందున, 2013 సంవత్సరం 30వ చట్టంలోని 15వ విభాగంననుసరించి సంబంధిత వ్యక్తుల నుండి వచ్చిన అభ్యంతరములపై విచారణ జరిపిన పిమ్మట శ్రీయుత స్పెషల్ కలెక్టరు (భూసేకరణ), పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు, ఒంగోలు వారు సంతృప్తి చెంది ఈ దిగువ షెడ్యూలు దాఖలా భూములను ప్రజా ప్రయోజనముల నిమిత్తం భూసేకరణ గావించుటకు నిర్ణయించినారు. ఈ క్రింది రూఢీ ప్రకటన 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగంననుసరించి చేయబడినది.

రూఢీ ప్రకటన

శ్రీయుత స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ) ఆర్ అండ్ ఆర్ యూనిట్, మార్కాపురం వారు 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగంననుసరించిన ఈ దిగువనుదహరించిన షెడ్యూలు దాఖలా భూములు మరియు సుమారుగా వాటి విస్తీర్ణంలను ప్రజా ప్రయోజనముసకై అనగా పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు క్రింద 14యల్ మేజర్ లో 22బిఇ మైనర్‌లో 14యల్ సబ్ మైనర్ కాలువ నిర్మాణము కొరకు భూమి అవసరమైనవని ఇందుమూలంగా ప్రకటన చేసియున్నారు.

షెడ్యూలు

జిల్లా : ప్రకాశం మండలము : తర్లుపాడు గ్రామము : గోరుగుంటలపాడు

క్రమ సంఖ్య	సర్వే నెం	పూర్తి విస్తీర్ణ ము. య.సెం	తరగతి / భూస్థితి	భూసేకర ణక్రింద విస్తీర్ణము	సంబంధిత ఆసామీ పేరు (పట్టాదారు) మరియు చిరునామా	సంబంధిత ఆసామీ పేరు (అనుభవదారు) మరియు చిరునామా	సరిహద్దులు తూ	ప	ఉ	ద	చెట్లు మరియు కట్టడముల వివరాలు
1	2	3	4	5	6	7	8	9	10	11	12
1	110/1	6.30	సర్కారు పుంజ	0.10	స్వర్గ చిన్న వెంకటేశ్వర్లు తండ్రి మూగిరామయ్య	స్వర్గ చిన్న వెంకటేశ్వర్లు తండ్రి మూగిరామయ్య	129/ 1	111	122, 128	110/ 2	శనగ
			సర్కారు పుంజ	0.12	స్వర్గ వెంకటేశ్వర్లు తండ్రి మూగిరామయ్య	స్వరణ వెంకటేశ్వర్లు తండ్రి మూగిరామయ్య					శనగ
2	129/1	0.74	సర్కారు పుంజ	0.06	రెప్పల రంగయ్య తండ్రి హనుమంతు	రెప్పల రంగయ్య తండ్రి హనుమంతు	129/ 2	110/ 1	128	110/ 1	మిర్చి
3	129/2	0.93	సర్కారు పుంజ	0.06	రెప్పల రంగయ్య తండ్రి హనుమంతు	రెప్పల రంగయ్య తండ్రి హనుమంతు	129/ 3	129/ 1	128	111	జొన్న
4	129/3	1.10	సర్కారు పుంజ	0.07	స్వర్గ రమణయ్య తండ్రి రమణయ్య	స్వర్గ రమణయ్య తండ్రి రమణయ్య	129/ 4	129/ 2	128	110	మిను ములు
5	129/4	0.90	సర్కారు పుంజ	0.07	వడ్లమూడి వెంకటసుబ్బయ్య తండ్రి ఫకీరయ్య	వడ్లమూడి వెంకటసుబ్బయ్య తండ్రి ఫకీరయ్య	129/ 5	129/ 4	128	110	మిను ములు
6	129/5	0.86	సర్కారు పుంజ	0.05	స్వర్గ తిరుపాలమ్మ భర్త గాలెయ్య	స్వర్గ తిరుపాలమ్మ భర్త గాలెయ్య	129/ 8, 6	129/ 4	131	110	శనగ
7	129/6	1.90	సర్కారు పుంజ	0.32	ఇతరులు	ఇతరులు	129/ 7	129/ 5	129/ 5, 8	110	శనగ
8	129/8	1.50	సర్కారు పుంజ	0.13	పత్తి రామయ్య తండ్రి సుబ్బయ్య	పత్తి రామయ్య తండ్రి సుబ్బయ్య	129/ 9	129/ 5	131	129/ 9, 7	శనగ
9	129/9	0.83	సర్కారు పుంజ	0.10	కందిమళ్ళ రామలక్ష్మీ భర్త వెంకట క్రిష్ణయ్య	కందిమళ్ళ రామలక్ష్మీ భర్త వెంకట క్రిష్ణయ్య	130/ 1, 2	129/ 8	131	129/ 10	శనగ
10	130/2	0.68	సర్కారు పుంజ	0.09	స్వర్గ చలమయ్య తండ్రి రంగయ్య	స్వర్గ చలమయ్య తండ్రి రంగయ్య	130/ 3	129/ 9,10	130/ 1	Sure palli	శనగ
11	130/3	0.84	సర్కారు పుంజ	0.10	స్వర్గ సుబ్బులక్షమ్మ భర్త గాలెయ్య	స్వర్గ సుబ్బులక్షమ్మ భర్త గాలెయ్య	130/ 4	130/ 2	130/ 1	Sure palli	శనగ
12	130/4	0.76	సర్కారు పుంజ	0.08	బోయపాటి సావిత్రి భర్త చెన్న కృష్ణయ్య	బోయపాటి సావిత్రి భర్త చెన్న కృష్ణయ్య	130/ 8	130/ 3	130/ 5	Sure palli	శనగ
13	130/5	0.80	సర్కారు పుంజ	0.04	స్వర్గ రామ లక్ష్మమ్మ భర్త పెద్ద రంగయ్య	స్వర్గ రామ లక్ష్మమ్మ భర్త పెద్ద రంగయ్య	130/ 6	130/ 1	131	130/ 4	శనగ
14	130/6	0.82	సర్కారు పుంజ	0.07	తాంటికొండ రవణయ్య తండ్రి వెంకటయ్య	తాంటికొండ రవణయ్య తండ్రి వెంకటయ్య	130/ 7	130/ 5	131	130/ 8	శనగ
15	130/7	0.90	సర్కారు పుంజ	0.07	తాటికొండ మల్లమ్మ భర్త చిన్నవెంకటసుబ్బయ్య	తాటికొండ మల్లమ్మ భర్త చిన్నవెంకటసుబ్బయ్య	Sure palli	130/ 6	131	Sure palli	శనగ
16	130/8	0.80	సర్కారు పుంజ	0.07	బొగినేనిచిన్నయోగయ్య తండ్రి పెద్ద లింగయ్య	బొగినేనిచిన్నయోగయ్య తండ్రి పెద్ద లింగయ్య	Sure palli	130/ 4	130/ 6	Sure palli	శనగ
17	148/ 1A	3.80	సర్కారు పుంజ	0.22	మొగలి గురివిశెట్టి తండ్రి చిన్న చెంచయ్య	మొగలి గురివిశెట్టి తండ్రి చిన్న చెంచయ్య	148/ 1B	141	148/ 1C	148/ 2A	దుక్కి
18	148/ 2A	2.89	సర్కారు పుంజ	0.10	పోట్ల సాలమ్మ భర్త వెంకటయ్య	పోట్ల సాలమ్మ భర్త వెంకటయ్య	148/ 2B	141	148/ 1C	Sure palli	జొన్న
			సర్కారు పుంజ	0.04	పోట్ల రమాదేవి భర్త రమణయ్య	పోట్ల రమాదేవి భర్త రమణయ్య					జొన్న
			సర్కారు పుంజ	0.05	పోట్ల జయలక్ష్మీ భర్త వెంకటనారాయణ	పోట్ల జయలక్ష్మీ భర్త వెంకటనారాయణ					జొన్న
	మొత్తం విస్తీర్ణము			2.01							

ఈ ప్రతిపాదిత భూసేకరణలో ఆర్ అండ్ ఆర్ సర్వే, సంబంధిత గ్రామములో ఇంటింటికి వెళ్ళి సర్వే చేయడం జరిగినది. నూతన భూసేకరణ మరియు పునరావాస పునః స్థాపన, న్యాయమైన పారదర్శక నష్టపరిహారము పొందే హక్కు చట్టము - 2013 ప్రకారము అర్హులైన నిర్వాసిత కుటుంబములు గాని ప్రభావిత కుటుంబములు కానీ లేవు.

ఈ భూముల ప్లాను శ్రీయుత స్పెషల్ డిప్యూటి కలెక్టరు యల్.ఎ.ఆర్. అండ్ ఆర్. యూనిట్, మార్కాపురం వారి కార్యాలయంలో ఉంచడమైనది దానిని ఈ కార్యాలయపు పనివేళలలో ఏ సమయంలోనైనా తనిఖీ చేసుకోవచ్చును. ఈ భూసేకరణ వలన నిర్వాసితులయినవారు ఎవ్వరును లేరు.

సం//- ఎస్. సరళా వందనం, IAS
ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ),
పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు, ఒంగోలు.

ప్రత్యేక ఉప కలెక్టరు (భూసేకరణ)
ఆర్ అండ్ ఆర్ యూనిట్, మార్కాపురం

ఎంఎస్‌ఎంఈలలో డిప్లొమా విద్యార్థులకు ఇంటర్న్‌షిప్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కాలేజీల్లో చదువుతున్న డిప్లొమా విద్యార్థులు ఇక నుంచి మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్‌ఎంఈ) అసోసియేషన్ పరిధిలోని పరిశ్రమల్లో ఆరు నెలలు ఇంటర్న్‌షిప్ చేయనున్నారు. డిప్లొమా కోర్సుల్లో మూడో సంవత్సరం చివరి ఆరు నెలలు ఈ ఇంటర్న్‌షిప్ ఉంటుంది. ఈ మేరకు ఎంఎస్‌ఎంఈ అసోసియేషన్‌తో శుక్రవారం రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ ఒప్పందం కుదుర్చుకుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్ష మేరకు విద్యార్థులను పరిశ్రమలకు అనుసంధానం చేయడం ద్వారా వారికి ఉపాధి అవకాశాలను మెరుగుపరచాలనే లక్ష్యంతో సాంకేతిక విద్యాశాఖ ఈ ఒప్పందం చేసుకుంది. మొత్తం 14 రకాల పరిశ్రమలలో విద్యార్థులకు పారిశ్రామిక శిక్షణను అందించడానికి అసోసియేషన్ ముందుకు వచ్చింది. ఈ మేరకు వారి సమ్మతి లేఖలను ఎంఎస్‌ఎంఈ అసోసియేషన్ ప్రతినిధులు టి.పార్థసారథి, ఎంఎస్ రామచంద్రరావు, వి.రమేష్‌బాబు నుంచి రాష్ట్ర సాంకేతిక విద్య సంచాలకురాలు నాగరాణి అందుకున్నారు. ఈ సందర్భంగా నాగరాణి మాట్లాడుతూ పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తరగతి గది అభ్యాసంతోపాటు ప్రత్యేక శిక్షణను అందించేందుకు సాంకేతిక విద్యాశాఖ కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తోందని తెలిపారు. ఇందులో భాగంగా డిప్లొమా విద్యార్థులను చివరి ఆరు నెలలు పరిశ్రమల్లో ఇంటర్న్‌షిప్‌నకు పంపించడం వల్ల మంచి ఫలితాలు వస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులకు నాణ్యమైన పారిశ్రామిక శిక్షణను అందించడానికి సాంకేతిక విద్యా శాఖ అన్ని ప్రయత్నాలు చేస్తోందని వివరించారు. కొంత కాలంగా వివిధ పరిశ్రమల సంఘాలతో వరుసగా సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

కళా పోటీలకు దరఖాస్తులు ఆహ్వానం

ఈ నెల 10 వరకు దరఖాస్తులకు తుది గడువు

సాక్షి, అమరావతి : రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి కళా పోటీలు నిర్వహిస్తున్నట్టు సాంస్కృతిక శాఖ సీఈవో మల్లికార్జున రావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాకారులకు సంప్రదాయ కూచిపూడి, ఆంధ్ర నాట్యం, భరత నాట్యం, గాత్ర, జానపద కళారూపాలైన డప్పులు, గరగలు, తప్పెటగుళ్ల, కోలాటం, చెక్క భజన, పులి వేషాలు, బుట్టబొమ్మలు, కాళికా వేషాలు, ఉరుములు, గిరిజన కళారూపాలైన ధింసా, కొమ్ముకోయ, సవర, లంబాడీ విభాగాల్లో పోటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జోనల్ స్థాయి పోటీలు నవంబర్ 19, 20, 21 తేదీల్లో తిరుపతి, 24, 25, 26 తేదీల్లో గుంటూరు, 29, 30, డిసెంబర్ 1 తేదీల్లో రాజమహేంద్రవరం, డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో విశాఖపట్నంలోని ఉడా చిల్డ్రన్స్ థియేటర్లో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. డిసెంబర్ 19, 20న విజయవాడలో రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. కళాకారులు 10వ తేదీలోగా విజయవాడలోని రాష్ట్ర కార్యాలయంలో, విజయనగరం, రాజమండ్రి, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, కర్నూలులోని ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలు/పాఠశాలల్లో దరఖాస్తులను సమర్పించవచ్చన్నారు. http://culture.ap.gov.in/ వెబ్‌సైట్‌లోనూ దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. జోనల్ స్థాయిలో సోలో, బృంద విభాగంలో ప్రథమ విజేతలకు రూ.10,000, రూ.25,000, రాష్ట్ర స్థాయిలో సోలో విజేతలకు రూ.50 వేలు, బృంద విజేతలకు రూ.లక్ష బహుమతిగా అందజేస్తామన్నారు.

శ్రీశైలానికి 28,275 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

సాగర్ 2 గేట్లు ఎత్తి నీటివిడుదల

శ్రీశైలం ప్రాజెక్ట్/విజయపురిసౌత్: శ్రీశైలం జలాశయానికి శుక్రవారం సాయంత్రానికి జూరాల, సుంకేసుల నుంచి 28,275 క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. రెండు జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పాదన అనంతరం 54,600 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేశారు. బ్యాక్ వాటర్ నుంచి హంద్రీ-నీవా సుజల స్రవంతికి 1,688 క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 1,600 క్యూసెక్కులు, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా 4,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం జలాశయంలో 881.70 అడుగుల మట్టంలో 197.4617 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నాగార్జునసాగర్ జలాశయానికి 67,036 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. దీంతో రెండు గేట్లను ఐదడుగులు ఎత్తి 16,200 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. కుడి, ఎడమ, ఎస్‌ఎల్‌బీసీ, వరద కాలువలు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 50,836 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

క్లుప్తంగా...

జీఎం ఆవాల విడుదలపై సుప్రీం స్టే

న్యూఢిల్లీ: జన్యుమార్పిడి(జీఎం) ఆవాల విడుదలపై స్టే విధిస్తూ సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చింది. జీఎం ఆవాల విడుదలను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై ఈనెల 10వ తేదీన విచారణ చేపట్టేందుకు అంగీకరించింది. హక్కుల కార్యకర్త అరుణా రోడ్రిగ్స్ వేసిన పిటిషన్‌పై ఈ మేరకు గురువారం జస్టిస్ దినేశ్ మహేశ్వరి, జస్టిస్ సుధాన్షు ధులియాల ధర్మాసనం ఆదేశాలిచ్చింది. ఈలోగా ఎలాంటి ముందస్తు చర్య తీసుకోరాదని అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటికి తెలిపింది. దేశంలోని ఐదు రాష్ట్రాల్లో వాణిజ్య స్థాయిలో సాగుకు వీలుగా జీఎం ఆవాలను విడుదల చేయాలన్న కేంద్రం నిర్ణయాన్ని అరుణా రోడ్రిగ్స్ తన పిటిషన్‌లో సవాల్ చేశారు.

మోర్బీ మునిసిపల్ అధికారిపై సస్పెన్షన్ వేటు

మోర్బీ: మోర్బీ జిల్లా కేంద్రం సమీపంలోని తీగల వంతెన తెగి 135 మంది మృత్యువాతపడిన ఘటనపై గుజరాత్ ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. మోర్బి మునిసిపల్ చీఫ్ ఆఫీసర్ సందీప్‌సిన్హ్ జాలాను సస్పెండ్ చేస్తూ శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు చీఫ్ ఆఫీసర్‌గా రెసిడెంట్ అడిషనల్ కలెక్టర్ విధులు నిర్వహిస్తారని జిల్లా కలెక్టర్ జీటీ పాండ్యా చెప్పారు. ఒరెవా గ్రూప్‌నకు 15 ఏళ్లకు వంతెన మరమ్మతులు, నిర్వహణ బాధ్యతలను మోర్బీ మునిసిపాలిటీయే అప్పగించిందన్నారు. ఆదివారం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి పోలీసులు 9 మందిని అరెస్ట్ చేశారు.

జార్ఖండ్ కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఇళ్లలో... ఐటీ శాఖ సోదాలు

రాంచీ/న్యూఢిల్లీ: జార్ఖండ్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు కుమార్ జైమంగళ్, ప్రదీప్ యాదవ్‌ల నివాసాలు, కార్యాలయాల్లో ఆదాయపు పన్ను(ఐటీ) శాఖ అధికారులు శుక్రవారం సోదాలు నిర్వహించారు. పన్ను ఎగవేసినట్లు ఇద్దరు ఎమ్మెల్యేలపై ఆరోపణలు ఉన్నాయని, దర్యాప్తులో భాగంగానే రాంచీ, బెర్మో, పట్నాలో ఈ సోదాలు జరిగాయని అధికారులు వెల్లడించారు. చైబాసాలో ముడి ఇనుప ఖనిజ వ్యాపారితోపాటు మరికొందరి ఇళ్లల్లోనూ సోదాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఐటీ సోదాలపై ఎమ్మెల్యే జైమంగళ్ అలియాస్ అనూప్ సింగ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. కేంద్రంలోని అధికార బీజేపీ ఒత్తిళ్లతోనే ఈ సోదాలు నిర్వహించారని ఆరోపించారు. బీజేపీని వ్యతిరేకిస్తే వేధిస్తారా? అని ప్రశ్నించారు. తనను ఎవరూ భయపెట్టలేరని అన్నారు. బీజేపీయేతర పార్టీల పాలనలో ఉన్న రాష్ట్రాల్లో ప్రభుత్వాలను పడగొట్టే కుట్రల్లో భాగంగానే తమ ఎమ్మెల్యేల నివాసాల్లో ఐటీ సోదాలు జరిగాయని జార్ఖండ్ కాంగ్రెస్ అధికార ప్రతినిధి రాజీవ్ రంజన్ విమర్శించారు. అయితే, ఐటీ శాఖ ఆపరేషన్స్‌తో తమ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని బీజేపీ శాసనసభాపక్షనేత బాబూలాల్ మరాండీ తేల్చిచెప్పారు. పన్నుల ఎగవేత నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఐటీ శాఖపై బురద చల్లుతున్నారని జార్ఖండ్ బీజేపీ నేత ప్రతుల్ షాదియో దుయ్యబట్టారు. జార్ఖండ్‌లో అధికార జేఎంఎం నేతృత్వంలోని కూటమిలో కాంగ్రెస్ సైతం భాగస్వామిగా కొనసాగుతున్న సంగతి తెలిసిందే.

బస్సును ఢీకొట్టిన ఎస్‌యూవీ.. 11 మంది దుర్మరణం

బెతుల్: మితిమీరిన వేగంతో వెళ్తున్న స్పోర్ట్స్ యుటిలిటీ వెహికిల్ (ఎస్‌యూవీ) ఆగి ఉన్న బస్సును ఢీకొన్న ఘటనలో ఎస్‌యూవీలోని మొత్తం 11 మంది అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. మధ్యప్రదేశ్‌లోని బేతూల్ జిల్లాలో శుక్రవారం అర్ధరాత్రి దాటాక ఈ ఘోరం చోటుచేసుకుంది. బాధితులంతా కూలీలే. మహారాష్ట్రలోని అమరావతి నుంచి సొంతూరుకు వెళ్తూ మృత్యువాత పడ్డారని పోలీసులు తెలిపారు. డ్రైవర్ నిద్రమత్తులో ఉండటమే ప్రమాదానికి కారణమన్నారు. మృతుల్లో ముగ్గురు మహిళలు, ఐదేళ్లలోపు ఇద్దరు చిన్నారులు ఉన్నారు. ఎస్‌యూవీ నుజ్జవడంతో ఇరుక్కున్న మృతదేహాలను బయటకు తీసేందుకు గ్యాస్ కట్టర్‌లను వాడాల్సి వచ్చింది. దీనిపై ప్రధాని మోదీ, సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు కేంద్రం రూ.2 లక్షలు ప్రకటించింది.

ఉభయ కొరియాల మధ్య... ఉద్రిక్తతలు మరింత తీవ్రం

సియోల్: ఉభయకొరియాల మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రమయ్యాయి. ఉత్తరకొరియా శనివారం సరిహద్దు ప్రాంతాల్లోకి 180 యుద్ధ విమానాలను తరలించింది. దక్షిణ కొరియా కూడా దీటుగా అత్యాధునిక ఎఫ్–35 ఫైటర్ జెట్లు సహా 80 మిలటరీ ఎయిర్ క్రాఫ్టులను మోహరించింది. ఉత్తర కొరియా బుధవారం రికార్డు స్థాయిలో 20కిపైగా క్షిపణులను ప్రయోగించడం, వాటిలో ఒకటి దక్షిణకొరియా సరిహద్దుల్లో పడటం తెలిసిందే. ప్రతిగా దక్షిణ కొరియా కూడా మూడు గైడెడ్ మిస్సైళ్లను ప్రయోగించింది. గురువారం కూడా ఉత్తరకొరియా ఆరు క్షిపణులు ప్రయోగించడంతో జపాన్ అప్రమత్తమైంది. అమెరికా, దక్షిణ కొరియా 240 యుద్ధ విమానాలతో చేస్తున్న సంయుక్త విన్యాసాలు శుక్రవారంతో ముగియాల్సి ఉంది. తాజా పరిణామాలతో వాటిని శనివారమూ కొనసాగించనున్నారు. దీనికి ప్రతీకారం తీర్చుకుంటామని ఉత్తరకొరియా ప్రకటించింది. ఈ తప్పిదానికి పశ్చాత్తాప పడతాయంటూ బెదిరించింది. కానీ, ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వెల్లడించలేదు. అణ్వస్త్ర దేశంగా గుర్తింపు పొందడంతోపాటు ఆంక్షలను ఎత్తివేసేలా అమెరికాపై ఒత్తిడి పెంచేందుకే ఉత్తరకొరియా ఇటువంటి తెగింపు చర్యలకు పాల్పడుతున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.



రిషి, ద వెండర్!

మెడలో ట్రే వేలాడదీసుకుని పాపీస్ అమ్ముతున్నదెవరో గుర్తు పట్టారు కదూ! అవును. బ్రిటన్ ప్రధాని రిషియే. గురువారం ఉదయం పూట మంచి రష్ అవర్లో వెస్ట్‌మినిస్టర్ మెట్రో స్టేషన్లో ఇలా దర్శనమిచ్చి ప్రయాణికులను సర్‌ప్రైజ్ చేశారాయన. రాయల్ బ్రిటిష్ లెజియన్‌కు నిధుల సేకరణ కోసం సైనికులతో కలిసి ఇలా వెండర్ అవతారమెత్తారు. పేపర్‌తో చేసిన ఒక్కో పాపీని ఐదు పౌండ్లకు అమ్మారు! చాలామంది ఆయన నుంచి వాటిని కొనుగోలు చేస్తూ కన్పించారు. పలువురు రిషితో సెల్ఫీలు తీసుకుంటూ గడిపారు. రిషి చర్యను మెచ్చుకుంటూ, ఆయన వద్ద తాము పాపీస్ కొన్నామని పేర్కొంటూ చాలామంది సోషల్ మీడియాలో పోస్టులు కూడా పెట్టారు.

ఇజ్రాయెల్ ప్రధానిగా నెతన్యాహూ



జెరూసలేం: ఇజ్రాయెల్‌లో రాజకీయ ప్రతిష్టంభనకు తెరపడింది. సార్వత్రిక ఎన్నికల్లో మాజీ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ (73)కు చెందిన లికుడ్ పార్టీ ఆధ్వర్యంలోని సంకీర్ణ కూటమి విజయం సాధించింది. దాంతో, రికార్డు స్థాయిలో 15 ఏళ్లకుగా పైగా ప్రధానిగా చేసిన ఆయన మరోసారి పగ్గాలు చేపట్టనున్నారు. 120 స్థానాలున్న పార్లమెంటులో 64 స్థానాలతో లికుడ్ కూటమి స్పష్టమైన మెజార్టీ సాధించింది. ఫలితాలను నవంబర్ 9న ధ్రువీకరిస్తారు. ప్రధాని లపిడ్ ఓటమి అంగీకరించారు. నెతన్యాహూకు ఫోన్ చేసి అభినందించారు.

ఇజ్రాయెల్, పాలస్తీనా రాకెట్ దాడులు

ఎన్నికల ఫలితాల వేళ పాలస్తీనాలోని గాజా నుంచి ఇజ్రాయెల్‌పైకి నాలుగు రాకెట్లను ప్రయోగించారు. మూడు లక్ష్యం చేరలేదు. ఒకదాన్ని ఇజ్రాయెల్ గాల్లోనే పేల్చేసింది. అంతేగాక ప్రతిదాడులతో గట్టిగా బదులిచ్చింది. ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు గాజాలో హమాస్ గ్రూప్ రహస్యంగా నిర్వహిస్తున్న రాకెట్ ఫ్యాక్టరీని ధ్వంసం చేశాయి.

నన్ను చంపజూసింది ప్రధానే

షెహబాజ్‌పై ఇమ్రాన్ ఆరోపణలు
- కాలిలో 4 బుల్లెట్లు దిగాయన్న ఖాన్
- పీటీఐ నిరసనలు..కాల్పులపై దర్యాప్తు



ఇస్లామాబాద్/లాహోర్: ప్రధాని షెహబాజ్ షరీఫ్ తనను చంపేందుకు కుట్ర పన్నారని పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ఆరోపించారు. ''అంతరంగిక శాఖ మంత్రి సనావుల్లా, ఐఎస్ఐ డైరెక్టర్ జనరల్ ఫైసల్ నసీర్‌తో పాటు మరొకరికి కూడా ఈ కుట్రలో భాగస్వామ్యముంది. వీరి పేర్లతో కూడిన వీడియోను ఇప్పటికే విదేశాలకు పంపించేశాను. నాకు జరగరానిది జరిగితే ఆ వీడియో బయటకు వస్తుంది' అన్నారు. దుండగుడి కాల్పుల్లో తన కుడి కాలిలోకి నాలుగు బుల్లెట్లు దిగాయని చెప్పారు. చికిత్స పొందుతున్న తన సొంత షౌకత్ ఖానుమ్ ఆస్పత్రి నుంచి శుక్రవారం ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడారు. 2011లో పంజాబ్ గవర్నర్‌ను చంపినట్లుగానే వజీరాబాద్‌లో తనను చంపేందుకు కుట్ర జరుగుతున్న విషయం ముందే తెలుసన్నారు. ''నాపై కాల్పులకు పాల్పడిన వ్యక్తి ఉగ్రవాది కాడు. నాపై దైవదూషణ నేరం మోపారు. అధికార పీఎంఎల్ఎన్ దాన్ని ప్రచారం చేసింది. అంతా పథకం ప్రకారం జరుగుతోంది. దీని వెనుక కుట్రను ఛేదిస్తాం'' అన్నారు. గాయం నుంచి కోలుకున్నాక పోరాటం కొనసాగిస్తానన్నారు. దేశంలోని అతిపెద్ద రాజకీయ పార్టీ నేతకు కూడా న్యాయం జరగడం లేదని పాక్ ప్రధాన న్యాయమూర్తి ఉమర్ బందియాల్‌నుద్దేశించి అన్నారు. ఇమ్రాన్ కుడి కాలి ఎముక విరిగిందని వైద్యులు చెప్పారు. ఇమ్రాన్‌పై కాల్పులను నిరసిస్తూ పాకిస్తాన్ తెహ్రీక్–ఇ–ఇన్సాఫ్(పీటీఐ) శ్రేణులు దేశవ్యాప్తంగా నిరసనలు తెలిపారు. శుక్రవారం ప్రార్థనల అనంతరం పీటీఐ కార్యకర్తలు రావల్పిండి, ఫైజాబాద్‌ల్లో భారీగా రోడ్లపై బైఠాయించారు. పోలీసులతో ఘర్షణలకు దిగారు. లాహోర్‌లో గవర్నర్ హౌస్‌లోకి చొచ్చుకు వెళ్లేందుకు యత్నించారు. ఈ ఘటనపై పోలీసులు, నిఘా అధికారులతో సంయుక్త విచారణ బృందాన్ని ఏర్పాటు చేయాలని పాక్ ప్రభుత్వం పంజాబ్‌ను కోరింది. ఇమ్రాన్ మాత్రమే చంపేందుకు కాల్పులు జరిపినట్లు నిందితుడు చెబుతున్నట్లుగా ఉన్న వీడియో లీక్‌కు కారకులైన పలువురు పోలీసులను అధికారులు సస్పెండ్ చేశారు. వారి సెల్‌ఫోన్లను సీజ్ చేసి ఫోరెన్సిక్ పరీక్షకు పంపారు. వజీరాబాద్ పట్టణంలో గురువారం పాకిస్తాన్ తెహ్రీక్–ఇ–ఇన్సాఫ్(పీటీఐ) పార్టీ ర్యాలీలో దుండగుల తుపాకీ కాల్పుల్లో ఒకరు చనిపోగా ఇమ్రాన్ సహా పలువురు గాయపడిన విషయం తెలిసిందే.

కొలీజియంలో పారదర్శకత లేదు

తెలిసినోళ్లనే సిఫార్సు చేస్తారు
- కేంద్ర న్యాయ మంత్రి రిజిజు
- న్యాయవ్యవస్థలో రాజకీయాలు
- కార్యనిర్వాహక పాత్ర పోషించొద్దు
- న్యాయ వ్యవహారాలకే పరిమితమవాలి
- మౌనంగా ఉంటామనుకోవద్దని వ్యాఖ్య



ముంబై: సుప్రీంకోర్టు కొలీజియం వ్యవస్థలో పారదర్శకత లేదని కేంద్ర న్యాయ మంత్రి కిరెన్ రిజిజు అభిప్రాయపడ్డారు. పూర్తి అర్హతలున్న వారిని మాత్రమే న్యాయమూర్తులుగా నియమించాలే తప్ప కొలీజియంకు తెలిసిన వారినెవరినో కాదంటూ పదునైన వ్యాఖ్యలు చేశారు. ''పైగా ఈ పద్ధతి న్యాయవ్యవస్థలోనూ రాజకీయాలకు తావిస్తోంది. న్యాయమూర్తులు బయటికి చెప్పకపోవచ్చు. కానీ అక్కడ లోతైన రాజకీయాలే ఉన్నాయి'' అంటూ సునిశిత విమర్శలు కూడా చేశారు. బుధవారం ఇండియాటుడే కాంక్లేవ్‌లో న్యాయ వ్యవస్థను సంస్కరించే అంశంపై మంత్రి మాట్లాడారు. ''నేను న్యాయవ్యవస్థను గానీ, న్యాయమూర్తులను గానీ విమర్శించడం లేదు. కానీ ప్రస్తుత కొలీజియం వ్యవస్థ పట్ల మాత్రం నాకు చాలా అసంతృప్తి ఉంది. కొలీజియంలోని న్యాయమూర్తులు తమకు తెలిసిన సహచరుల పేర్లనే సిఫార్సు చేస్తున్నారు. ఇవి కేవలం నా అభిప్రాయాలు మాత్రమే కాదు. లాయర్లతో పాటు కొందరు న్యాయమూర్తుల్లో కూడా ఉన్న అభిప్రాయాలనే చెబుతున్నాను. ఏ వ్యవస్థా పరిపూర్ణం కాదు. నిత్యం మెరుగు పరుచుకుంటూ పోవాలి. ప్రతి వ్యవస్థలోనూ జవాబుదారీతనం, పారదర్శకత ఉండాలి. అలా లేనప్పుడు దాన్ని వ్యతిరేకిస్తూ సంబంధిత మంత్రి కాక ఇంకెవరు మాట్లాడతారు?'' అని ప్రశ్నించారు. న్యాయవ్యవస్థ కార్యనిర్వాహక పాత్ర పోషించరాదని కుండబద్దలు కొట్టారు. ''నియామక ప్రక్రియలో కేంద్రం కూడా పాలుపంచుకుంటే ఎలా ఉంటుంది? ఎందుకంటే న్యాయమూర్తుల కొలీజియం సిఫార్సు చేసే పేర్లను ఆమోదించేముందు వాళ్లను గురించి అన్ని రకాల సమాచారం సేకరించే స్వతంత్ర యంత్రాంగం ప్రభుత్వం సొంతం. న్యాయవ్యవస్థకు, న్యాయమూర్తులకు ఈ వెసులుబాటు లేదు. పైగా, వాళ్ల దృష్టి పెట్టాల్సింది న్యాయమూర్తుల నియామకాల వంటి పాలనపరమైన పనుల పైనా, లేక ప్రజలకు న్యాయం అందించడం మీదా?'' అంటూ ప్రశ్నలు సంధించారు.

జడ్జిలూ... వ్యాఖ్యలెందుకు?

నేషనల్ జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్స్ కమిషన్ ఏర్పాటును సుప్రీంకోర్టు కొట్టేయడాన్ని రిజిజు ప్రస్తావించారు. ఈ చర్యపై కేంద్రం తన వైఖరిని ఇంకా స్పష్టం చేయలేదని గుర్తు చేశారు. ''నిజానికి వాళ్లలా కొట్టేసినప్పుడు కేంద్రం కావాలనుకుంటే ఏదో ఒకటి చేసేది. కానీ న్యాయవ్యవస్థ పట్ల గౌరవమున్న కారణంగా ఆ పని చేయలేదు. ఎందుకంటే న్యాయవ్యవస్థ స్వతంత్రంగా ఉండాలన్నది మోదీ సర్కారు అభిప్రాయం'' అన్నారు. అంతమాత్రాన తామెప్పుడూ మౌనంగానే ఉంటామని అనుకోవద్దంటూ నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు. విచారణ సందర్భంగా న్యాయమూర్తులు చేసే వ్యాఖ్యలను కూడా రిజిజు తప్పుబట్టారు. ''ఏం చెప్పినా తీర్పుల ద్వారానే చెప్పాలి తప్ప అనవసర వ్యాఖ్యలు చేసి విమర్శలు కొనితెచ్చుకోవద్దు'' అని సూచించారు.

హైకోర్టులు అలాంటి ఆదేశాలివ్వొద్దు

ఆన్సర్ షీట్ల పునర్మూల్యాంకనంపై సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: ఆన్సర్ షీట్లను సమర్పించాల్సిందిగా, పునర్మూల్యాంకనం చేయాల్సిందిగా హైకోర్టులు జారీ చేసే ఆదేశాలను అనుమతించలేమని సుప్రీంకోర్టు శుక్రవారం స్పష్టం చేసింది. సంబంధిత చట్టాల్లో ఆ మేరకు నిబంధనలుంటే తప్ప అలాంటి ఆదేశాలు ఇవ్వొద్దని పేర్కొంది. విచక్షణాధికారంతో నిర్దిష్ట ఆదేశాలిచ్చేందుకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 226 హైకోర్టులకు కల్పించిన అధికారాలను ఈ విషయంలో ఉపయోగించరాదని న్యాయమూర్తులు జస్టిస్ ఎంఆర్‌షా, ఎంఎం సుందరేశ్‌లతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. కొందరు పీజీ డిప్లొమా విద్యార్థుల ఆన్సర్ షీట్ల పునర్మూల్యాంకనానికి ఆదేశిస్తూ 2019లో ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును కొట్టేసింది. ఈ విషయంలో సుప్రీంకోర్టు గత తీర్పులను మార్గదర్శకంగా తీసుకోవాలని సూచించింది.



పెన్షన్ (సవరణ) పథకం సబబే

న్యూఢిల్లీ: ఉద్యోగుల పెన్షన్ (సవరణ) పథకం –2014 చెల్లుబాటును సుప్రీంకోర్టు సమర్థించింది. అయితే, పెన్షన్ నిధిలో చేరేందుకు రూ.15,000 నెలవారీ కనీస వేతనం పరిమితిని కొట్టేసింది. 2014 నాటి సవరణ ప్రకారం ఉద్యోగులు పెన్షన్ పొందడానికి గరిష్ట వేతనం (బేసిక్ పే ప్లస్ డియర్‌నెస్ అలవెన్స్) నెలకు రూ.15,000 ఉండాలి. సవరణకు ముందు ఇది రూ.6,500గా ఉండేది. ఈ పథకాన్ని కేరళ, రాజస్తాన్, ఢిల్లీ హైకోర్టులు గతంలోనే కొట్టేశాయి. వీటిని సవాలు చేస్తూ ఈపీఎఫ్ఓ, కేంద్రం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశాయి. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ యు.యు.లలిత్, న్యాయమూర్తులు జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ సుధాంశూ ధూలియాతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. పెన్షన్ పథకంలో చేరలేకపోయిన ఉద్యోగులు 6 నెలల్లోగా చేరొచ్చంది. రూ.15,000 వేతనం దాటినవారు 1.16 శాతాన్ని పెన్షన్ పథకంలో జమ చేయాలన్న నిబంధన చెల్లదని స్పష్టం చేసింది.






క్లాసు రూముల్లోకి స్మార్ట్‌ఫోన్లతో ఫోన్లు తేవొద్దన్నా వినేవారు ఎవరున్నారు? అమెరికాలోని వాషింగ్టన్ జూనియర్ హైస్కూల్ దీనికో పరిష్కారం కనిపెట్టింది. విద్యార్థులు మొబైల్‌ను చిన్న పౌచ్‌లో పెట్టాలి. పౌచ్‌ను ఇలా మెషీన్ దగ్గర పెడితే లాకైపోతుంది. దాన్నిక తెరవలేం. క్లాసులు పూర్తయ్యాక బయటకు వెళ్లేటప్పుడు సంచిని యంత్రంతో అన్‌లాక్ చేసి ఫోన్ తీసుకొని వెళ్లిపోవచ్చు.

గుజరాత్‌లో ఆప్ సీఎం అభ్యర్థి గాఢ్వీ

అహ్మదాబాద్: గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) ముఖ్యమంత్రి అభ్యర్థిగా మాజీ టీవీ యాంకర్, పాత్రికేయుడు ఇసుదాన్ గాఢ్వీ(40) పేరు ఖరారయ్యింది. పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ గాఢ్వీ అభ్యర్థిత్వాన్ని స్వయంగా ప్రకటించారు. ఆయన శుక్రవారం పంజాబ్ సీఎం భగవంత్ మాన్, గాఢ్వీతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. తమ సీఎం అభ్యర్థి ఎన్నిక కోసం నిర్వహించిన ఓటింగ్‌లో 16 లక్షల మందికిపైగా ప్రజలు పాల్గొన్నారని, 73 శాతం మంది గాఢ్వీ వైపే మొగ్గు చూపారని తెలిపారు. గుజరాత్‌లో ఆప్ ఓడిపోవడం ఖాయమంటూ సర్వేల్లో వస్తున్న ఫలితాలను కేజ్రీవాల్ కొట్టిపారేశారు. కొత్త పార్టీ జయాపజయాలను సర్వేల ద్వారా తేల్చలేరని అన్నారు. గాఢ్వీ ద్వారకా జిల్లా పిపాలియా గ్రామంలో వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. ఆమ్ ఆద్మీ పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. పార్టీ నేషనల్ జాయింట్ జనరల్ సెక్రెటరీగా ఉన్నారు. గతంలో దూరదర్శన్‌లో ప్రజాదరణ పొందిన 'యోజన' కార్యక్రమం నిర్వహించారు. 2007 నుంచి 2011 దాకా ఈటీవీ–గుజరాతీ చానల్‌లో ఫీల్డ్ జర్నలిస్టుగా పనిచేశారు. గుజరాత్‌లో రూ.150 కోట్ల విలువైన అటవీ భూముల కుంభకోణాన్ని బయటపెట్టారు. గాఢ్వీ ఓబీసీ సామాజిక వర్గానికి చెందినవారు. రాష్ట్ర జనాభాలో 48 శాతానికిపైగా ఓబీసీలు ఉన్నారు. గుజరాత్ ఎన్నికల్లో 10 మంది అభ్యర్థులతో కూడిన తొమ్మిదో జాబితాను ఆమ్ ఆద్మీ పార్టీ తాజాగా విడుదల చేసింది. దీంతో ఇప్పటిదాకా 118 మంది పేర్లను ప్రకటించినట్లయ్యింది. 182 స్థానాలున్న గుజరాత్‌లో ఎన్నికలు డిసెంబర్ 1, 5వ తేదీల్లో జరుగునున్నాయి.



తల్లితో గాఢ్వీ భావోద్వేగం

కేజ్రీవాల్ స్ఫూర్తితోనే: గాఢ్వీ

ప్రభుత్వ ఉద్యోగం వదిలేసి రాజకీయాల్లోకి వచ్చిన కేజ్రీవాల్ స్ఫూర్తితో తానూ ఉద్యోగానికి రాజీనామా చేసి వచ్చానని గాఢ్వీ చెప్పారు. ''గుజరాత్ ప్రజల బాధలు, కన్నీళ్లు నాకు తెలుసు. రైతులు, నిరుద్యోగ యువత, మహిళలు, కార్మికులు, దుకాణదారుల సమస్యలను జర్నలిస్టుగా వెలుగులోకి తెచ్చాను'' అన్నారు. ప్రజలకు సాయం చేసే గుణం తన కుమారునిలో ఉందని గాఢ్వీ తల్లి మణిబెన్ అన్నారు.

పాత్రికేయం నుంచి ప్రస్థానం

ఇన్నాళ్లూ పాత్రికేయుడిగా పనిచేసిన గాఢ్వీ ఇప్పుడు తానే వార్తల్లోకెక్కారు. పార్టీలో చేరిన ఏడాది కాలంలోనే సీఎం అభ్యర్థిగా మారారు. ఆయన 1982 జనవరి 10న జన్మించారు. అహ్మదాబాద్‌లోని గుజరాత్ విద్యాపీఠ్‌లో జర్నలిజంలో డిగ్రీ చేశారు. 17 ఏళ్ల క్రితం స్థానిక ఛానల్‌లో జర్నలిస్టుగా ప్రస్థానం ఆరంభించారు. పలు చానళ్లలో పనిచేశారు. పాత్రికేయుడిగా మంచి పేరు సంపాదించారు. 'వీటీవీ–గుజరాతీ' చానల్‌లో మహామంథన్ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల ప్రజలకు చేరువయ్యారు. పరిపాలనా వ్యవస్థ, ప్రభుత్వ పనితీరును ఎండగడుతూ ఆయన నిర్వహించిన చర్చా కార్యక్రమాలు ప్రశంసలందుకున్నాయి. ఇసుదాన్ గాఢ్వీ 2021 జూన్‌లో అరవింద్ కేజ్రీవాల్ సమక్షంలో ఆమ్ ఆద్మీ పార్టీలో చేరారు. గుజరాత్‌లో కలుషితమైన రాజకీయాలను శుద్ధి చేయడానికి ఉద్యోగం వదులుకొని గాఢ్వీ తమ పార్టీలో చేరారని అప్పట్లో కేజ్రీవాల్ అభినందించారు.

ఢిల్లీలో స్కూళ్లు బంద్

ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్
- బెంబేలెత్తిస్తున్న కాలుష్యమే కారణం
- మళ్లీ సరి, బేసి విధానానికి కసరత్తు

న్యూఢిల్లీ: దేశ రాజధాని న్యూఢిల్లీలో కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరుకోవడంతో అరవింద్ కేజ్రీవాల్ ప్రభుత్వం పలు కీలక చర్యలు చేపట్టింది. శనివారం నుంచి ప్రాథమిక పాఠశాలలను మూసివేస్తున్నట్టుగా ప్రకటించింది. ప్రభుత్వ ఉద్యోగుల్లో 50శాతం మందికి సోమవారం నుంచి వర్క్ ఫ్రమ్ హోమ్ విధానాన్ని అమల్లోకి తీసుకువస్తున్నట్టుగా వెల్లడించింది. ప్రైవేటు కార్యాలయాలు కూడా ఇదే విధానాన్ని కొనసాగించాలని సూచించింది. సీనియర్ విద్యార్థులెవరూ ఔట్ డోర్ కార్యకలాపాలు నిర్వహించకూడదని ఆదేశాలు జారీ చేసినట్టుగా ఢిల్లీ పర్యావరణ శాఖ మంత్రి గోపాల్ రాయ్ శుక్రవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. రవాణా సాధనాలకు సంబంధించి డీజిల్‌తో నడిచే వాహనాలపై నిషేధం విధించింది. సీఎన్‌జీతో నడిచే పర్యావరణం బస్సు సర్వీసులను మొదలు పెట్టనుంది. మార్కెట్లు, కార్యాలయాల సమయాలను కుదిరించడానికి కసరత్తు చేస్తోంది. అవసరమైతే సరి, బేసి విధానాలతో వాహనాలను బయటకు తీసే పద్ధతి ప్రవేశపెట్టాలని ప్రభుత్వం యోచిస్తోంది. గాలి నాణ్యత నిర్వహణ కమిషన్ సిఫారసుల మేరకు కాలుష్యం కట్టడికి ఈ చర్యలు తీసుకుంటున్నట్టు రాయ్ వెల్లడించారు

పంజాబ్ పంట వ్యర్థాల దహనాల బాధ్యత మాదే : కేజ్రీవాల్

అంతకు ముందు పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మన్‌తో కలిసి ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ విలేకరులతో మాట్లాడారు. ఢిల్లీ కాలుష్యం అంశంలో ఒకరిపై మరొకరు నిందారోపణలు వేసుకోవద్దని అన్నారు. పంజాబ్‌లో కూడా ఆప్ ప్రభుత్వమే అధికారంలో ఉండడంతో అక్కడ పంట వ్యర్థాల దహనాలకు తమదే బాధ్యతని పేర్కొన్నారు. ఉత్తర భారతం యావత్తూ కాలుష్యంతో నిండిపోయిందని అందుకే కేంద్రం కూడా బాధ్యత తీసుకొని కాలుష్య నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. మరోవైపు పంజాబ్ సీఎం భగవంత్ మన్ ఈ ఏడాది రికార్డు స్థాయిలో వరి పండడంతో పంట వ్యర్థాల దహనం ఎక్కువగా జరుగుతోందని అంగీకరించారు.

ప్రమాదకరంగా కాలుష్యం

ఢిల్లీలో గత కొద్ది రోజులుగా కాలుష్యం తీవ్ర స్థాయికి చేరుకుంది. గాలి నాణ్యత సూచి (ఏక్యూఐ) 500కి చేరువులో నమోదవుతోంది. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకి 445కి చేరింది. రాజధానిలో ఉన్న దాదాపుగా అన్ని గాలి నాణ్యత పర్యవేక్షణా స్టేషన్లు కాలుష్యం ప్రమాదకంగా మారిందని తేటతెల్లం చేస్తున్నాయి. 13 స్టేషన్లలో గాలి కాలుష్యం 450కంటే ఎక్కువగా నమోదు కావడం ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. కాలుష్యం 400 దాటిందంటే అత్యంత తీవ్రమైనదిగా భావించాల్సి ఉంటుంది. దీని వల్ల వ్యాధులు మరింత విజృంభించే అవకాశాలుండడంతో ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.



నాలుగు రాష్ట్రాలకు ఎన్‌హెచ్‌ఆర్‌సీ నోటీసులు

ఢిల్లీ దాని చుట్టుపక్కల ఉన్న పంజాబ్, ఉత్తరప్రదేశ్, హరియాణాలో వాయు కాలుష్యం తీవ్ర స్థాయికి చేరుకోవడంతో జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) ఆందోళన వ్యక్తం చేసింది. ఈ అంశంపై మాట్లాడానికి ఈ నెల 10న తమ ఎదుట హాజరుకావాలంటూ నాలుగు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు నోటీసులు పంపింది. కాలుష్య నివారణకు ఢిల్లీ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై తమకు సంతృప్తి లేదని ఎన్‌హెచ్‌ఆర్‌సీ స్పష్టం చేసింది. గాలి నాణ్యత సూచి 400కి పైన ఉంటే ఆరోగ్యవంతులు కూడా వ్యాధుల బారిన పడతారని ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఆందోళన వ్యక్తం చేసింది.



శుక్రవారం చండీగఢ్‌లో భారత పరిశ్రమల సమాఖ్య(సీఐఐ) ఆగ్రో టెక్ ఇండియా–2022 ప్రారంభం సందర్భంగా ట్రాక్టర్ నడుపుతున్న ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, పక్కన ఆయన సతీమణి సుదేశ్ ధన్‌ఖడ్



వెండి తొడుగు బహూకరణ

మొవ్వ: కూచిపూడిలోని రామలింగేశ్వర స్వామి దేవాలయంలోని విఘ్నేశ్వరునికి పెదపూడికి చెందిన జి. రామచంద్రరావు, ప్రసూనారాణి దంపతులు 3.50 కేజీల వెండి తొడుగులను బహూకరించారు.



భవానీ మండల దీక్షలు ప్రారంభం

ఇంద్రకీలాద్రి: దుర్గమ్మ సన్నిధిలో శుక్రవారం నుంచి భవానీ మండల దీక్షలు ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు, గురు భవానీల చేతుల మీదుగా భక్తులు దీక్షలను స్వీకరించారు.



ఉచిత గుండె శస్త్రచికిత్సలు

పుట్టుకతోనే క్లిష్టతరమైన గుండె జబ్బులున్న 26 మంది చిన్నారులకు యూకే వైద్యుల బృందం ఉచితంగా సర్జరీలు నిర్వహించింది. విజయవాడ ఆంధ్రా హాస్పిటల్‌లో ఈ సర్జరీలు జరిగాయి. -8లో▸

న్యూస్‌రీల్

ఆర్జిత సేవలకు డిమాండ్



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): కార్తిక మాసం, ఏకాదశి, శుక్రవారం నేపథ్యంలో ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు నిర్వహించిన ఆర్జిత సేవలకు డిమాండ్ ఏర్పడింది. తెల్లవారుజామున అమ్మవారికి నిర్వహించిన ఖడ్గమాలార్చన, శ్రీ చక్రనవార్చన, లక్ష కుంకుమార్చన, చండీహోమం, శాంతి కల్యాణాలను జరిపించుకునేందుకు భక్తులు తరలి వచ్చారు. చండీహోమానికి 56 టికెట్లు విక్రయించగా, లక్ష కుంకుమార్చనకు 25 టికెట్లు, శ్రీ చక్ర నవార్చనకు 15 టికెట్లను విక్రయించారు. ఆర్జిత సేవలలో పాల్గొన్న ఉభయదాతలకు రూ. 300 టికెట్ క్యూలైన్‌లో అమ్మవారి దర్శనానికి అనుమతించారు. ఇక మల్లేశ్వర స్వామి వారికి బాలాలయంలో విశేష అభిషేకాలు నిర్వహించగా, సహస్ర లింగార్చనలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సాయంత్రం పంచహారతుల సేవ, సహస్ర దీపాలంకరణ సేవలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

కృష్ణా జిల్లాలో 25 సీజనల్ హాస్టళ్లు

మచిలీపట్నం: కృష్ణా జిల్లాలో వలస వెళ్లిన తల్లిదండ్రుల పిల్లల కోసం 25 సీజనల్ హాస్టల్స్ ఏర్పాటుకు ఉన్నతాధికారులు అనుమతి ఇచ్చినట్లు సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ అమర్లపూడి శేఖర్ తెలిపారు. హాస్టల్ నిర్వహణ బాధ్యతలను ఎస్సీ, బీసీ, వెల్ఫేర్ స్వయం సహాయక సంఘాలు, గుర్తింపు పొందిన స్వచ్ఛంద సంస్థలకు అప్పగించనున్నట్లు తెలిపారు. వీటి కోసమని సంబంధిత సంస్థలు ఈనెల 8 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం మచిలీపట్నంలోని సమగ్ర శిక్ష జిల్లా కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

నేటి నుంచి ఆంధ్రా, హరియాణా క్రికెట్ పోరు

విజయవాడ స్పోర్ట్స్: బీసీసీఐ అండర్–19 పురుషుల కూచ్‌బెహార్ మల్టీడే(గ్రూప్–సీ) క్రికెట్ పోటీలు ఈ నెల 5 నుంచి 8వ తేదీ వరకు ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం మూలపాడులోని ఏసీఏ క్రికెట్ మైదానాల్లో నిర్వహిస్తున్నట్లు గ్రౌండ్ ఇన్‌చార్జ్ రమేష్ తెలిపారు. ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్, హరియాణా రాష్ట్రాల జట్లు తలపడతాయన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటుకున్న క్రీడాకారులు జాతీయ జట్టుకు ఎంపికవుతారన్నారు.

అందాల అనుభవం

ఆధ్యాత్మిక విహారం

కృష్ణా నదిపై టెంపుల్ టూరిజానికి ప్రణాళిక



నదీ విహారం అంటేనే అదో ప్రత్యేకమైన అనుభూతి.. చుట్టూ కొండలు, కనుచూపు మేర ఎటు చూసినా పచ్చందాల మధ్య లాహిరి.. లాహిరి.. లాహిరిలో అంటూ కుటుంబ సమేతంగా ప్రయాణం చేయడాన్ని ఆస్వాదించాలే తప్ప.. వర్ణించలేం. ఇప్పటి వరకూ మనకు విజయవాడ నుంచి భవానీ ఐల్యాండ్‌కు మాత్రమే బోట్ జర్నీ అందుబాటులో ఉంది. ఇప్పుడు ప్రభుత్వం దీనిని మరింత విస్తరిస్తోంది. గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల్లోని కృష్ణా నదీ తీరంలోని ప్రముఖ పర్యాటక ప్రదేశాలు, ఆధ్యాత్మిక క్షేత్రాలను కలుపుతూ ఓ ప్రాజెక్ట్‌కు రూపకల్పన చేసింది.

- ప్రముఖ ఆలయాలు, పర్యాటక ప్రదేశాలను కలుపుతూ రూట్ మ్యాప్
- ఎన్టీఆర్, గుంటూరు జిల్లాలో ప్రత్యేకంగా ఏడు ప్రదేశాలు గుర్తింపు
- రెండు చోట్ల జెట్టీల నిర్మాణానికి సన్నాహాలు
- పర్యాటకులకు జెట్టీలోనే అన్ని వసతులు ఉండేలా ఏర్పాట్లు
- ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ ఆధ్వర్యంలో ప్రతిపాదనలు

గుర్తించిన ప్రాంతాలివే..


జిల్లా	ప్రదేశం	ప్రాముఖ్యత
ఎన్టీఆర్	బెరం పార్కు (దుర్గా ఘాట్)	శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం
ఎన్టీఆర్	భవానీ ఐల్యాండ్	ప్రముఖ పర్యాటక ప్రదేశం
ఎన్టీఆర్	పవిత్ర సంగమం	కృష్ణా, గోదావరి నదులు కలిసే చోటు
గుంటూరు	వైకుంఠపురం	వేంకటేశ్వర స్వామి దేవస్థానం
గుంటూరు	అమరావతి	అమరలింగేశ్వర స్వామి ఆలయం
ఎన్టీఆర్	వేదాద్రి	శ్రీయోగానంద లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం
ఎన్టీఆర్	ముక్త్యాల	శ్రీ భవానీ ముక్తేశ్వరస్వామి వారి ఆలయం(శివాలయం)

పర్యాటకులకు వింతైన అనుభూతి..

దేశ, విదేశాల్లోని పర్యాటకులను ఆకర్షించే విధంగా అన్ని హంగులతో టూరిజాన్ని అభివృద్ధి చేస్తున్నాం. ప్రత్యేకంగా కృష్ణా నదిలో విహారం చేస్తూ ప్రముఖ ఆలయాలు, పర్యాటక ప్రాంతాలను సందర్శించే అవకాశం పర్యాటకులకు కలుగనుంది. దీనికి సంబంధించిన ప్రతిపాదనలు ఇప్పటికే ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్‌కు పంపాం.

– కె.కన్నబాబు, ఏపీటీడీసీ, మేనేజింగ్ డైరెక్టర్





సాక్షి ప్రతినిధి, విజయవాడ: కృష్ణా నదిలో జల విహారానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. నదీ తీరంలోని ఆలయాలు, పర్యాటక ప్రదేశాలను కలుపుతూ టెంపుల్ టూరిజంకు రూప కల్పన చేస్తోంది. ఇందుకోసం ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్ ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అనే సంస్థను ఏర్పాటు చేసింది. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ టూరిజం కార్పొరేషన్ నుంచి ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్‌కు టెంపుల్ టూరిజానికి సంబంధించిన ప్రతిపాదనలు పంపింది. ప్రస్తుతం ఈ సంస్థ కృష్ణా నదిపై జెట్టీల నిర్మాణంతో పాటు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో..

ఎన్టీఆర్, గుంటూరు జిల్లాలోని ఏడు ప్రాంతాల్లో పర్యాటక ప్రాంతాలు, ఆలయాలను కలిపే విధంగా ఈ ప్రాజెక్ట్‌కు రూపకల్పన చేశారు. కృష్ణా నదిలో జలవిహారం చేస్తూ, ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ, ఒక్క రోజులోనే 80 కిలోమీటర్ల ప్రయాణం చేయటం ద్వారా ఏడు ప్రాంతాలను కవర్ చేసే విధంగా డీపీఆర్‌ను సిద్ధం చేశారు. జెట్టీలలోనే భోజనం, అన్ని వసతులు ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. పర్యాటక ప్రాంతాల్లో పిల్లలకు ఆట వస్తువులు, ఎమ్యూజ్‌మెంట్ పార్కులు, ఓపెన్‌గేమ్స్, ఎడ్వంచర్ గేమ్స్ ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

జల విహారం ఇలా..

- విజయవాడ కనకదుర్గ అమ్మవారి దర్శనం అనంతరం ఉదయం దుర్గాఘాట్ నుంచి జెట్టీ భవానీ ద్వీపానికి వెళ్తుంది. అక్కడ ఒక గంట సేపు భవానీ ద్వీపం అందాలను ఆస్వాదించేందుకు సమయం ఇస్తారు.
- ఆ తర్వాత అక్కడ నుంచి జెట్టీ బయలు దేరి పవిత్ర సంగమానికి చేరుకుంటుంది. అక్కడ కొద్దిసేపు ఆగుతుంది.
- అక్కడ నుంచి బయలు దేరి గుంటూరు జిల్లా వైకుంఠపురం చేరుకుంటుంది. అక్కడ ఉన్న వేంకటేశ్వస్వామిని దర్శించుకునేందుకు అవకాశం కల్పిస్తారు.
- ఆ తర్వాత అమరావతి అమరలింగేశ్వరస్వామి ఆలయానికి తీసుకెళ్తారు.
- అక్కడ నుంచి బయలు దేరి జగ్గయ్యపేట వద్దనున్న వేదాద్రికి చేరుకొని లక్ష్మీ నరసింహ దర్శనానికి అవకాశం ఇస్తారు.
- సాయంత్రానికి ముక్త్యాల భవానీ ముక్తేశ్వర స్వామి ఆలయానికి చేరుకోవడంతో జల విహారం ముగుస్తుంది.
- అక్కడ స్వామివారి దర్శనం పూర్తయిన తర్వాత.. బస్సులో రోడ్డు మార్గం ద్వారా విజయవాడకు చేరుస్తారు.

జల విహారానికి ప్రతిపాదనలు..

కృష్ణా నదిలో జలవిహారం చేసేందుకు వీలుగా ప్రణాళిక చేస్తున్నాం. పర్యాటకులను ఆకర్షించే విధంగా టెంపుల్ టూరిజం ఏర్పాటుకు అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఒక్క రోజులోనే కృష్ణా నదిలో 80 కిలోమీటర్ల మేర జలవిహారం చేస్తూ, ఏడు ప్రదేశాలను సందర్శించే విధంగా ప్రణాళిక చేస్తున్నాం.

– ఎస్‌వీకే రెడ్డి, సీఈఓ, ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్, ఏపీ



మౌలిక వసతులకు ప్రతిపాదనలు..

ప్రస్తుతం ఆయా ప్రదేశాల్లో జెట్టీ నిర్మాణాలు, దేవస్థానాలకు వెళ్లేందుకు రోడ్డు మార్గాలు, వెయిటింగ్ లాంజ్‌లు, టికెట్ కౌంటర్ల నిర్మాణాలు చేపట్టేందుకు వీలుగా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. విజయవాడ నుంచి ఓ జెట్టీ, ముక్త్యాల నుంచి మరో జెట్టీ ప్రతి రోజు ఉదయం బయలు దేరే విధంగా ప్రణాళిక సిద్ధం చేశారు.

7న ఇంద్రకీలాద్రిపై కోటి దీపోత్సవం

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో 7వ తేదీన కోటి దీపోత్సవాన్ని నిర్వహించనున్నారు. అమ్మవారి ఆలయం, రాజగోపురం, మహా మండపం ప్రాంగణం, మహామండపం దిగువన, కనకదుర్గనగర్, దేవస్థాన ఘాట్‌రోడ్డులలో రంగవల్లులతో తీర్చిదిద్ది, దీపాలతో ప్రత్యేకంగా అలంకరిస్తారు. కార్యక్రమం అనంతరం శివాలయం వద్ద, నటరాజ స్వామి వారి కళావేదిక వద్ద జ్వాలాతోరణాన్ని వెలిగిస్తారు.

ప్రచార రథంతో గిరి ప్రదక్షిణ..

కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని 7వ తేదీన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన ప్రచార రథంతో గిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్నామని ఆలయ వైదిక కమిటీ పేర్కొంది. 7వ తేదీ సాయంత్రం 7 గంటలకు మహా మండపం నుంచి ప్రచార రథంతో ఊరేగింపు ప్రారంభం అవుతుంది. దుర్గగుడి ఘాట్‌రోడ్డు, కుమ్మరిపాలెం, నాలుగు స్తంభాలు, విద్యాధరపురం, సితారా, కబేళా, పాలప్రాజెక్టు, కలరా హాస్పిటల్, చిట్టినగర్, నెహ్రూ బొమ్మ సెంటర్, బ్రాహ్మణ వీధి మీదుగా కనకదుర్గనగర్ చేరుతుంది.

రేపు మాస్టర్ అథ్లెటిక్స్ జిల్లా జట్ల ఎంపిక

విజయవాడ స్పోర్ట్స్: మాస్టర్ అథ్లెటిక్స్ రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించే ఉమ్మడి కృష్ణా జిల్లా జట్లను ఈ నెల ఆరో తేదీన విజయవాడలోని ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో ఎంపిక చేస్తున్నట్లు కృష్ణా జిల్లా మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి జి.వి.ప్రసాదరావు తెలిపారు. ట్రాక్, ఫీల్డ్‌పై క్రీడాకారుల ఎంపిక జరుగుతుందన్నారు. 30 నుంచి 90 ఏళ్ల లోపు వయసున్న క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఆ రోజు ఉదయం 8 గంటలకు ఆధార్ కార్డు, రెండు ఫొటోలతో ఎంపిక ప్రాంగణంలో సంప్రదించాలని కోరారు. మరిన్ని వివరాలకు 94934 86495ను సంప్రదించాలని సూచించారు.

రేపు సెపక్‌తక్రా జిల్లా జట్ల ఎంపిక

సెపక్‌తక్రా జూనియర్ బాలబాలికల ఉమ్మడి కృష్ణాజిల్లా స్థాయి పోటీలను ఆగిరిపల్లి మండలం తోటపల్లిలోని హీల్ ప్యారడైజ్ స్కూల్ నందు ఈ నెల ఆరో తేదీన నిర్వహిస్తున్నట్లు కృష్ణాజిల్లా సెపక్‌తక్రా అసోసియేషన్ కార్యదర్శి ఎం.పవన్‌కుమార్ తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఆధార్, జనన ధ్రువీకరణ పత్రంతో ఆ రోజు ఉదయం ఏడు గంటలకు పోటీల ప్రాంగణంలో రిపోర్ట్ చేయాలన్నారు. మరిన్ని వివరాలకు 9398882963ని సంప్రదించాలని సూచించారు.

సంక్షేమ రథం.. అభివృద్ధి పథం



జెడ్పీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, చిత్రంలో గృహనిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్, కలెక్టర్లు రంజిత్‌బాషా, ఢిల్లీరావు, జేసీ మహేష్‌కుమార్ తదితరులు



సమావేశానికి హాజరైన శాసనసభ్యులు పేర్ని నాని, మొండితోక జగన్‌మోహనరావు, మేకా వెంకట ప్రతాప్, పార్థసారథి, సింహాద్రి రమేష్ బాబు, జెడ్పీటీసీ సభ్యులు, అధికారులు

పథకాల అమలులో నూతన అధ్యాయం

- జెడ్పీ సర్వసభ్య సమావేశంలో కొనియాడిన ప్రజాప్రతినిధులు
- అధ్యక్షత వహించిన జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక
- హాజరైన మంత్రి జోగి రమేష్, రెండు జిల్లాల కలెక్టర్లు
- ఆరోగ్యశ్రీ అమలు తీరుపై పలువురి ఎమ్మెల్యేల ఆగ్రహం
- ఆర్అండ్‌బీ అధికారులు నిర్లక్ష్యం వీడాలని సూచన

చిలకలపూడి(మచిలీపట్నం): సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని జెడ్పీ చైర్ పర్సన్ ఉప్పాల హారిక, రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం చైర్ పర్సన్ హారిక అధ్యక్షతన స్థానిక జెడ్పీ కన్వెన్షన్ హాలులో శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాకు చెందిన అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

సంక్షేమాంధ్ర..

ఈ సందర్భంగా మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో పథకాలు అమలవుతున్నాయన్నారు. బటన్ నొక్కిన వెంటనే లబ్ధిదారుల ఖాతాల్లోకి నేరుగా నగదు జమ అవ్వటంతో సంతోషంగా ఉన్నారన్నారు. అధికారంలో ఉండి కూడా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, సేవలు అందుతున్న విధానాన్ని తెలుసుకునేందుకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి పనిచేసి ప్రజలకు పథకాలు మరింత చేరువయ్యేలా చూడాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని స్థానిక ప్రజాప్రతినిధుల సమన్వయంతో నిర్వహించాలని సూచించారు. జెడ్పీ చైర్ పర్సన్ ఉప్పాల హారిక మాట్లాడుతూ మహిళలు, పిల్లలు సంతోషంగా ఉండాలని అనేక సంక్షేమ పథకాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెడుతున్నారన్నారు.

- వ్యవసాయశాఖకు సంబంధించి పలువురు జెడ్పీటీసీ సభ్యులు ధాన్యం కొనుగోలులో ఇంకా రైతులను ఇబ్బంది పెట్టే విధానాలు ఉన్నాయని, వాటి వల్ల రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని, ఆ విధానాలు మార్చి, రైతులకు న్యాయం చేయాలని కోరారు.
- వైద్య, ఆరోగ్యశాఖకు సంబంధించిన చర్చలో పలు మండలాల్లోని ఆస్పత్రుల్లో డెలివరీలు చేసేందుకు వైద్యులు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారని, సదరం సర్టిఫికెట్లు జారీలో లోపాలు జరుగుతున్నాయని వివరించారు. అలాగే ఆరోగ్యశ్రీ పథకాన్ని అన్ని ఆస్పత్రుల్లో అమలు చేయాలని సూచించారు. ఆస్పత్రికి వెళితే రోగి క్లిష్టమైన పరిస్థితుల్లో కూడా వైద్య సహాయం అందించకుండా జాప్యం చేస్తున్నారని.. పలు కారణాలతో ఏదో రకంగా డబ్బులు చెల్లించమంటున్నారని పలువురు ఎమ్మెల్యేలు వివరించారు.
- 108 సేవల గురించి జెడ్పీటీసీ సభ్యులు సభ దృష్టికి తీసుకురావటంతో దీనిపై సమాధానం చెప్పాలని బందరు శాసనసభ్యుడు పేర్ని వెంకట్రామయ్య(నాని) వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. దీనికి సమాధానం ఇచ్చేందుకు కో–ఆర్డినేటర్ అందుబాటులో లేకపోవటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ సమావేశంలో కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల కలెక్టర్లు రంజిత్‌బాషా, ఢిల్లీరావు, కృష్ణా జేసీ మహేష్‌కుమార్ రావిరాల, జెడ్పీ ఇన్‌చార్జ్ సీఈవో జి. శ్రీనివాసరావు, శాసనసభ్యులు మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, కొలుసు పార్థసారథి, కైలే అనిల్‌కుమార్, మొండితోక జగన్‌మోహన్‌రావు, సింహాద్రి రమేష్ బాబు, కేడీసీసీబీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, పలు కార్పొరేషన్ల చైర్మన్లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు పాల్గొన్నారు.

తీర్మానాలు ఇవి..

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక సర్వసభ్య సమావేశంలో మూడు తీర్మానాలు ప్రవేశపెట్టారు.

- పదో తరగతి చదువుతున్న విద్యార్థుల ఉత్తీర్ణత పెంచేందుకు జిల్లా పరిషత్ కంటిన్‌జెన్సీ నిధుల నుంచి 30 వేల మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ సరఫరాకు సమావేశం తీర్మానించింది.
- ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం రోజున జెడ్పీటీసీ సభ్యులు ఉన్నత పాఠశాలల్లో జెండా ఎగురవేసేందుకు ఆహ్వానించేలా విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేయాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించారు.
- జెడ్పీ చైర్‌పర్సన్ జిల్లా ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా, జెడ్పీటీసీలు మండల స్థాయిలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీలో సభ్యులుగా చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానం చేశారు.

అధికారులు నిర్లక్ష్యం వీడాలి..



ఆర్అండ్‌బీ అధికారులు రహదారులు మరమ్మతులు చేయటం, ఛిద్రంగా ఉన్న రహదారులకు నిధులు మంజూరు చేసి పునర్ నిర్మించడంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారు? దీని వల్ల రహదారులు త్వరగా మరమ్మతులకు గురవుతున్నాయి. కంకిపాడులో 30 బెడ్ల ఆస్పత్రి నిర్మాణం కోసం అక్కినేని గోపాలకృష్ణమూర్తి రూ. 4 కోట్ల విలువైన భూమిని విరాళంగా ఇచ్చి ఏడాది కావస్తున్నా.. నిర్మాణం ఎందుకు చేపట్టలేదు? పనుల నిర్వహణలో నిర్లక్ష్యం తగదు.

– కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యే పెనమలూరు

ఆరోగ్యమిత్రలు అందుబాటులో ఉండాలి..



ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ ద్వారా అందే సేవలను తెలియజేసేందుకు ఆరోగ్య మిత్రలను అందుబాటులో ఉంచాలి. తమకు ఏ వైద్యానికి ఆరోగ్యశ్రీ వర్తిస్తుందో తెలియక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నగదు ఖర్చు చేసి, వైద్యసహాయం పొందాల్సి వస్తోంది. ఆరోగ్య మిత్రలను ప్రతి ఆస్పత్రిలో ఉంచి పేదలకు వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలి.

– మొండితోక జగన్మోహనరావు, ఎమ్మెల్యే, నందిగామ

క్రేజీగా కేక్ మిక్సింగ్

రానున్న క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని విజయవాడలోని నోవోటెల్ హోటల్‌లో శుక్రవారం కేక్ మిక్సింగ్ కార్యక్రమం జరిగింది. నోరూరించే డ్రై ఫ్రూట్స్, వైన్, నట్స్‌తో పాటు వివిధ రకాల రుచులను కలగలుపుతూ కేక్ తయారు చేశారు. ఈ సందర్భంగా హోటల్ ఎగ్జిక్యూటివ్ చీఫ్ మేనేజర్ సూరజ్ కుమార్ సాహో మాట్లాడుతూ నగరంలో తొలిసారిగా క్రిస్మస్ కేక్ మిక్సింగ్ చేయటం ఆనందదాయకమన్నారు. నగరంలోని యాపిల్ స్వచ్ఛంద సేవా సంస్థకు చెందిన సభ్యులతో ఈ కేక్ మిక్సింగ్ నిర్వహించామన్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



కోచ్ పోస్టులకు దరఖాస్తులు

పటమట(విజయవాడ తూర్పు): నగరపాలక సంస్థ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో ఉన్న స్విమ్మింగ్‌పూల్స్, జిమ్‌లలో కోచ్‌ల నియామకానికి వీఎంసీ దరఖాస్తులను ఆహ్వానిస్తోందని కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్విమ్మింగ్‌పూల్ కోచ్‌లకు ఇంటర్మీడియెట్, జిమ్ కోచ్‌లకు పదో తరగతి విద్యార్హతగా నిర్ణయించామని తెలిపారు. 40 ఏళ్లలోపు, ఏదైనా గుర్తింపు పొందిన సంస్థ నుంచి ఫిట్‌నెస్ కోర్సు పూర్తి చేసి, మూడేళ్ల అనుభవం ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు తమ పూర్తి వివరాలతో ఈ నెల 7న నగరంలోని దండమూడి రాజగోపాలచారి ఇండోర్ స్టేడియంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు.

98.68 శాతం పెన్షన్లు పంపిణీ

చిలకలపూడి(మచిలీపట్నం): వైఎస్సార్ పెన్షన్ కానుక ద్వారా లబ్ధిదారులకు నాల్గో రోజైన శుక్రవారం పెన్షన్లు పంపిణీ చేశారు. జిల్లా వ్యాప్తంగా 2,31,801 మందికి పెన్షన్లు పంపిణీచేయాల్సి ఉండగా.. 2,29,729 మందికి నగదు అందించి 98.68 శాతం సాధించారు. శనివారం నాటికి నూరుశాతం పెన్షన్ల పంపిణీ చేస్తామని డీఆర్డీఏ పీడీ పీఎస్ఆర్ ప్రసాద్ తెలిపారు.

నృసింహుని గ్రామోత్సవం

మంగళగిరి: సానిక లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానంలో చిల్కు ఏకాదశిని పురస్కరించుకుని శుక్రవారం స్వామి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. బంగారు గరుడ వాహనంపై స్వామివార్ల ఉత్సవ మూర్తులను అధిష్టింపజేసి పూల మాలలతో శోభాయమానంగా అలంకరించారు.

చిన్నారులకు ఉచిత గుండె శస్త్రచికిత్సలు

- ఆరోగ్యశ్రీ , హీలింగ్ లిటిల్ హార్ట్స్, యూకే చారిటీ సహకారంతో నిర్వహణ
- విజయవాడ ఆంధ్రా ఆస్పత్రిలో 26 మంది చిన్నారులకు ఆపరేషన్లు



కోలుకున్న చిన్నారులు, వారి తల్లులతో డాక్టర్ల బృందం

లబ్బీపేట (విజయవాడ తూర్పు): పుట్టుకతోనే అత్యంత క్లిష్టతరమైన గుండె జబ్బులతో బాధపడుతున్న చిన్నారులకు యూకే నుంచి వచ్చిన వైద్యుల బృందం ఉచితంగా ఆపరేషన్లు చేసింది. విజయవాడ ఆంధ్రా హార్ట్ అండ్ బ్రెయిన్ ఇనిస్టిట్యూట్ (ఆస్పత్రి)లో ఐదు రోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరంలో 26 మంది చిన్నారులకు ఉచితంగా గుండె ఆపరేషన్లు చేశారు. కొందరికి ఆరోగ్యశ్రీ పథకం కింద, మిగిలిన వారికి ఆంధ్రా హాస్పిటల్స్ ట్రస్టు, హీలింగ్ లిటిల్ హార్ట్స్, యూకే చారిటీ సౌజన్యంతో శస్త్ర చికిత్సలు చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆస్పత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పిడియాట్రిక్ చీఫ్ డాక్టర్ పాతూరి వెంకట రామారావు మాట్లాడుతూ.. తమ ఆస్పత్రిలో యూకేకు చెందిన వైద్యుల బృందం 2015 నుంచి ఇప్పటి వరకూ 24 ప్రత్యేక శిబిరాలు నిర్వహించిందని తెలిపారు. ఆయా శిబిరాల్లో పుట్టుకతోనే అత్యంత క్లిష్టమైన గుండె జబ్బులు ట్రాన్స్‌పొజిషన్ ఆఫ్ గ్రేట్ ఆర్టెరీస్, టెట్రాలజీ ఆఫ్ ఫాలో, కోయార్క్‌టేషన్ ఆఫ్ అయోర్టా, టోటల్ ఎనామలస్ పల్మనరీ వీనస్ డ్రైనేజ్ వంటి సమస్యలున్న వారికి శస్త్ర చికిత్సలు నిర్వహించినట్లు తెలిపారు. ఇప్పటి వరకూ తమ ఆస్పత్రిలో 2,800 మందికి ఉచితంగా గుండె సర్జరీలు చేశామని వివరించారు. ఈ సమావేశంలో ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ నుంచి వచ్చిన డాక్టర్ ప్రేమ్ వేణుగోపాల్, డాక్టర్ సరఫరాజ్ రహీమాన్, డాక్టర్ మహమూద్, డెబొరాహ్, సౌమ్య రాజేంద్రన్, ఆక్టేవియాతో పాటు ఆంధ్రా హాస్పిటల్‌కు చెందిన డాక్టర్ ఆర్.దిలీప్, డాక్టర్ కె.విక్రమ్, డాక్టర్ జె.శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

డయల్ యువర్ పోలీస్ కమిషనర్‌కు 12 ఫిర్యాదులు

విజయవాడ స్పోర్ట్స్: ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో శుక్రవారం నిర్వహించిన డయల్‌యువర్ పోలీస్ కమిషనర్ కార్యక్రమాన్ని 12 మంది బాధితులు ఆశ్రయించారని ఏడీసీపీ పి.వెంకటరత్నం తెలిపారు. పోలీస్ కమిషనర్ టి.కె.రాణా ఆదేశాల మేరకు ఈ కార్యక్రమంలో పాల్గొని బాధితులతో ఫోన్‌లో మాట్లాడానని పేర్కొన్నారు. ట్రాఫిక్, అసాంఘిక శక్తుల ఆగడాలు, కుటుంబ కలహాలు, ఆర్థిక నేరాలు, స్థల వివాదాలు వంటి సమస్యలను బాధితులు ప్రస్తావించారని చెప్పారు. ఈ సమస్యలపై విచారణ చేపట్టి నిర్దీత కాల వ్యవధిలో పరిష్కరించాలని ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులను ఆదేశించామని తెలిపారు.

ఒడి నిండిపోతున్న బియ్యం

- పేరుకుపోతున్న ఒడిబియ్యం నిల్వలు
- వృథాగా మారిన ఇరుముడి బియ్యం
- దుర్గగుడి అధికారుల తీరుతో డంపింగ్ యార్డుకు తరలింపు



రాజగోపురం పక్కన కుప్పగా పడేసి ఉన్న బియ్యం మూటలు

దసరా ఉత్సవాల్లో వర్షంలో తడిసిన బియ్యం మూటలు →



ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): కోరిన కోర్కెలు తీర్చే దుర్గమ్మకు భక్తులు ధన, వస్తు రూపంలో నిత్యం మొక్కులు తీర్చుకుంటారు. ఇంట్లో వివాహం జరిగిన సమయంలో దుర్గమ్మకు ఒడిబియ్యం సమర్పిస్తారు. మరో వైపు దసరా, భవానీ దీక్ష విరమణల సమయంలో భవానీ మాలధారులు ఇరుముడి బియ్యం సమర్పిస్తారు. ఇలా అమ్మవారికి భక్తులు సమర్పించిన ఇరుముడి బియ్యం, ఒడి బియ్యాన్ని భద్రపరచడంలో దేవస్థానం నిర్లక్ష్యం వహిస్తోంది. ఫలితంగా దుర్గగుడి ఆదాయానికి గండి పడుతోంది.

డంపింగ్ యార్డులకు ఇరుముడి బియ్యం

ఇటీవల దసరా ఉత్సవాలలో భవానీలు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఉత్సవాల అనంతరం ఐదు రోజుల పాటు భవానీల రద్దీ కనపించింది. ఈ ఐదు రోజుల్లో సుమారు మూడు లక్షల మంది భవానీలు ఇరుముడులు సమర్పించారు. అయితే ఈ ఏడాది ఇరుముడులను సమర్పించేందుకు దేవస్థానం ఎటువంటి సదుపాయాలూ కల్పించలేదు. దీంతో భవానీలు ఆలయ ప్రాంగణంలో ఎక్కడపడితే అక్కడ ఇరుముడులను విప్పుకుని బియ్యాన్ని అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. ఇలా భవానీలు వదిలేసిన బియ్యాన్ని సేకరించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేయలేదు. భవానీలు వదిలి వెళ్లిన తర్వాత కూడా బియ్యాన్ని సేకరించకపోవడంపై గురు భవానీల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. మాలధారులు వదిలేసిన ఇరుముడి బియ్యం వర్షానికి తడిచి దుర్వాసన రావడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో పారిశుద్ధ్య సిబ్బంది ఆ బియ్యాన్ని ప్లాస్టిక్ సంచుల్లోకి ఎత్తి ఆలయ ప్రాంగణంలోనే నిల్వ చేశారు. కార్తికమాసం ప్రారంభం కావడంతో స్వామి వారి సహస్ర లింగార్చన చేసేందుకు ప్రదేశం లేక పోవడంతో సంచులకు ఎత్తిన బియ్యాన్ని డంపింగ్ యార్డుకు తరలించారు. ఉత్సవాల్లో కనీసం రెండు టన్నుల పైగానే ఇరుముడి బియ్యం వచ్చేదని ఆలయ అధికారులు పేర్కొంటున్నారు. ఇరుముడి బియ్యం డంపింగ్ యార్డుకు తరలడంతో ఒక్క రూపాయి ఆదాయం రాలేదు.

భారీగా ఒడిబియ్యం నిల్వలు

అమ్మవారికి భక్తులు సమర్పించిన ఒడి బియ్యాన్ని విక్రయించడంలో దేవస్థానం విఫలమైందన్న ఆరోపణలు ఉన్నాయి. గతంలో ఒడి బియ్యాన్ని బహిరంగ వేలం ద్వారా విక్రయించారు. ఒడి బియ్యాన్ని పోగు చేసుకునేందుకు మూడు నెలల కిందట బహిరంగ వేలం ద్వారా టెండర్ ఖరారు చేశారు. అయితే ఈ బియ్యాన్ని తీసుకెళ్లడంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా ఉన్నారు. బియ్యం నిల్వలు ఎక్కువైన తర్వాతే తీసుకెళ్తానని దేవస్థానం అధికారులకు స్పష్టంచేశారు. కాంట్రాక్టర్ తీసుకెళ్లకపోడంతో ఒడి బియ్యం నిల్వలు పేరుకు పోయాయి. రాజగోపురం వద్ద, మహా మండపం ఆరో అంతస్తులో ఒడి బియాన్ని మూటలుగా కట్టి పడేశారు. ఇటీవల డంపింగ్ యార్డుకు తరలించిన ఇరుముడి బియాన్ని విక్రయిస్తే రూ.లక్షల్లో ఆదాయం సమకూరేదని ఆలయ సిబ్బంది బహిరంగంగానే పేర్కొంటున్నారు. మరో వైపు దేవస్థానం వద్ద ఎంత బియ్యం నిల్వలు ఉన్నాయనే దానిపై కనీసం రికార్డులు లేకపోవడంతో కొంత మంది ఈ బియ్యాన్ని గుట్టు చప్పుడు కాకుండా తరలించేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

వారంలో తీసుకెళ్లాలి

బియ్యం నిల్వలపై దుర్గగుడి ఏఈఓ వెంకటరెడ్డిని వివరణ కోరగా.. దేవస్థానంలో ఉన్న ఒడిబియ్యాన్ని వారంలో తీసుకెళ్లాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించామని తెలిపారు. దేవస్థానంలో వరస ఉత్సవాలు, భక్తుల రద్దీ నేపథ్యంలో బియ్యం తరలించడం కుదరడం లేదన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



కంచికచర్ల (నందిగామ): రోడ్డు మార్జిన్‌లో ఆగివున్న గుర్తుతెలియని వాహనాన్ని బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఈ ప్రమాదం గురువారం రాత్రి జరగ్గా శుక్రవారం కేసు నమోదైంది. ఎస్‌ఐ పి.వి.ఎస్.సుబ్రహ్మణ్యం కథనం మేరకు.. జగ్గయ్యపేట మండలం చిల్లకల్లు గ్రామానికి చెందిన బి.నరేంద్ర (39) విజయవాడ నుంచి స్వగ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. కంచికచర్ల సమీపంలోని పేరకలపాడు క్రాస్ రోడ్డు సమీపంలో జాతీయ రహదారి పక్కన ఆగివున్న గుర్తు తెలియని వాహనాన్ని నరేంద్ర ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ఘటనాస్థలాన్ని సందర్శించి, నరేంద్ర మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నందిగామ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి



మైలవరం: ప్రమాదవశాత్తూ బావిలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మైలవరంలో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మైలవరం దళిత కాలనీకి చెందిన దేవరకొండ చినకోటయ్య(58) స్థానిక రామకృష్ణ కాలనీలో పలగాని శివనాగేశ్వరరావుకు చెందిన ఇంటి స్థలంలోని బావిలో వరలు తీసి, బావిని పూడ్చే పనిని మరి కొందరితో కలిసి ఒప్పుకున్నాడు. బావిలో దిగుతున్న సమయంలో చినకోటయ్య ప్రమాదవశాత్తు జారి నీటిలోకి తల కిందులుగా పడిపోయాడు. నీటిలో కూరుకుపోయి ఊపిరాడక మృతి చెందాడు. ఈ సమాచారం అందుకున్న ఎస్‌ఐ రాంబాబు సిబ్బందితో పాటు ఘటనా స్థలానికి చేరుకున్నాడు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది కలిసి మోటార్ల సహాయంతో బావిలోని నీటిని తోడి, మృతదేహాన్ని బయటికి తీశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హెడ్‌కానిస్టేబుల్, కానిస్టేబుల్‌పై కేసు

కృష్ణలంక (విజయవాడ తూర్పు): కృష్ణలంక పోలీస్ స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ సురేష్, కానిస్టేబుల్ సుబ్బారెడ్డిపై అదే పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం జీరో ఎఫ్ఐఆర్ కేసు నమోదైంది. కానిస్టేబుల్, హెడ్‌కానిస్టేబుల్ తమకు హోంగార్డు ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి తమ నుంచి రూ.19.90 లక్షలను వసూలు చేశారంటూ జక్కంపూడి, నంబూరు, రాణిగారితోట ప్రాంతాలకు చెందిన శరత్‌చంద్ర, జయరాజు, ఖాదర్‌వలి ఈ నెల మూడో తేదీన డెప్యూటీ పోలీస్ కమిషనర్ విశాల్‌గున్నీకి ఫిర్యాదు చేశారు. డీసీపీ ఆదేశాలతో కృష్ణలంక పోలీసులు వెంటనే విచారణ చేపట్టారు. విజయవాడ వన్‌టౌన్‌లోని పోలీస్ క్వార్టర్స్‌లో కానిస్టేబుల్, హెడ్‌కానిస్టేబుల్‌కు డబ్బులు ఇచ్చామని బాధితులు పోలీసులకు చెప్పారు. దీంతో హెడ్‌కానిస్టేబుల్ సురేష్, కానిస్టేబుల్ సుబ్బారెడ్డిపై జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసును సంబంధిత వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేసినట్లు కృష్ణలంక సీఐ ఎం.వి.దుర్గారావు తెలిపారు.

ఆరుతడి పంటలకు రైతులు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్. చిత్రంలో నాగిరెడ్డి, ఎమ్మెల్యే సింహాద్రి రమేష్, కలెక్టర్ రంజిత్‌బాషా

- నీటి లభ్యత లేనందున దాళ్వాకు సాగునీరు కష్టం
- నీటి పారుదల సలహామండలి సమావేశంలో మంత్రి జోగి రమేష్

చిలకలపూడి (మచిలీపట్నం): రిజర్వాయర్లలో నీటి లభ్యత సరిపడా లేనందున దాళ్వా (రబీ)కు సాగునీరు ఇవ్వటం కష్టమవుతుందని గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో శుక్రవారం సాయంత్రం జిల్లా 37వ నీటిపారుదల సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గత రెండు సంవత్సరాలుగా నీటి నిల్వలు, రబీకి సాగునీటి విడుదలపై చర్చించారు. అనంతరం మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ.. రైతులు నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకుని ఆరుతడి పంటలకు సిద్ధం కావాలని సూచించారు. ఈ సంవత్సరం ఇప్పటి వరకు జిల్లాలో 10.35 లక్షల ఎకరాల్లో వరి, 0.23 లక్షల ఎకరాల్లో చెరకు, 1.81 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతోందన్నారు. ఇప్పటి వరకు 118.70 టీఎంసీలను సాగు, తాగు నీటిగా ఉపయోగించామని వివరించారు. ప్రస్తుతం పులిచింతల ప్రాజెక్టులో 41.15 టీఎంసీల నిల్వే ఉందని తెలిపారు. అందులో 36.20 టీఎంసీలను ప్రస్తుతం ఖరీఫ్‌కు ఇవ్వాల్సి ఉందని పేర్కొన్నారు. మిగిలిన నీటి లభ్యత దాళ్వా సాగుకు చాలదని వివరించారు. దాళ్వాకు కనీసం 51 టీఎంసీలు అవసరమని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని రైతులు ఆరుతడి పంటలకు సిద్ధం కావాలని మంత్రి కోరారు. రైతు సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిత్యం కృషి చేస్తున్నారని, గతేడాది మినహా మిగిలిన రెండు సంవత్సరాలు రబీ పంటలకు సాగునీరు ఇచ్చారని గుర్తుచేశారు.

రెండు బ్యారేజీల నిర్మాణానికి ఆమోదం

శివారు భూములకు సైతం నీటి సమస్య లేకుండా చేయాలనే ఉద్దేశంతో ప్రకాశం బ్యారేజీ దిగువన రెండు కొత్త బ్యారేజీల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఆమోదం తెలిపిందని మంత్రి జోగి రమేష్ పేర్కొన్నారు. మొదటి బ్యారేజీ నిర్మాణానికి రూ.2,235.42 కోట్లు, రెండో బ్యారేజీకి రూ.2526.39 కోట్ల పరిపాలనా అనుమతి కోసం ప్రభుత్వానికి నివేదించామని వివరించారు. కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా మాట్లాడుతూ.. రబీ పంటకు సాగునీరు లేనందున కాలువల మరమ్మతులు, పూడికతీత, గుర్రపుడెక్క, తూడు తొలగింపు పనులు ముందుగానే చేపట్టాలని జల వనరుల శాఖ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ ఎం.వి.ఎస్.నాగిరెడ్డి, అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్, జాయింట్ కలెక్టర్ మహేష్‌కుమార్ రావిరాల, నీటిపారుదల శాఖ ఎస్ఈ తిరుమలరావు, పులిచింతల ప్రాజెక్టు ఎస్ఈ ఆర్.శ్రీరామకృష్ణ, జిల్లావ్యవసాయశాఖ అధికారి మనోహరరావు, బందరు ఆర్డీఓ ఐ.కిషోర్, సీపీఓ వై.శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

వెలుగు చూసిన ఘరానా మోసం

- అప్పులు చేసి కుటుంబంతో మెడికల్ షాపు ఓనర్ పరారీ
- సూర్యారావుపేట పోలీసులను ఆశ్రయించిన బాధితులు



కార్తిక్‌కుమార్ మెడికల్‌షాపు వద్ద బాధితులు

విజయవాడ స్పోర్ట్స్: విజయవాడలో మరో ఘరానా మోసం వెలుగులోకి వచ్చింది. దుర్గాపురానికి చెందిన జి.కార్తిక్‌కుమార్ అదే ప్రాంతంలో మెడికల్ షాప్ నిర్వహిస్తున్నాడు. పలువురి వద్ద అప్పులుచేసి, బంధువులు, తెలిసిన వారి పేరుతో బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని తిరిగి చెల్లించకుండా కుటుంబ సభ్యులతో పరారయ్యాడు. బాధితులు శుక్రవారం సూర్యారావుపేట పోలీసులను ఆశ్రయించారు. ఏసీపీ డాక్టర్ రవికిరణ్ కథనం మేరకు.. కార్తిక్‌కుమార్ దుర్గాపురంలో శ్రీధనలక్ష్మి మెడికల్ అండ్ ఫ్యాన్సీ పేరిట 2018లో వ్యాపారం ప్రారంభించాడు. స్థానికులు, బంధువులతో స్నేహంగా మెలుగుతూ ఉండేవాడు. పలు ప్రముఖ బ్యాంకుల అధికారులతో తత్సంబంధాలు ఏర్పరచుకునేవాడు. పలువురికి బ్యాంకుల్లో రుణాలు ఇప్పిస్తానంటూ నమ్మించాడు. 'మీ పేరున రుణం తీసుకుంటా. తిరిగి నేనే చెల్లిస్తా. బ్యాంకు ఇచ్చిన రుణంలో మీకు 20 శాతం నగదును ఉచితంగా ఇస్తా' అంటూ బంధువులు, స్నేహితులు కొందరిని కార్తిక్‌కుమార్ నమ్మించాడు. తెలిసిన వ్యక్తి కావడం, మెడికల్ షాపు కూడా నిర్వహిస్తుండటంతో చాలా మంది అతని వలలో పడ్డారు. వారి పేరిట కార్తిక్‌కుమార్ రుణాలు తీసుకున్నాడు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి వేళ ఇంట్లో, మెడికల్ షాపులో సామగ్రిని తీసుకుని కుటుంబ సభ్యులతో కలిసి పరారయ్యాడు. దీంతో అతని చేతిలో మోసపోయిన వారు లబోదిబోమన్నారు. బాధితుల్లో ఒకరైన రాజేంద్రప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతని పేరున ఒక బ్యాంకులో రూ.7 లక్షలు, మరో బ్యాంక్‌లో రూ.3 లక్షల చొప్పున కార్తిక్‌కుమార్ రుణాలు తీసుకున్నాడు. కార్తిక్‌కుమార్ బాధితులు 20 మంది ఉంటారని, రూ.కోటికి పైగా మోసం చేశాడని అంచనా. నిందితుడిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

8న హెచ్‌ఐవీపై క్విజ్ పోటీలు



పోటీల వివరాలను ప్రిన్సిపాల్ డాక్టర్ భాగ్యలక్ష్మికి తెలియజేస్తున్న డీపీఎం కిరణ్ తదితరులు

మధురానగర్ (విజయవాడ సెంట్రల్): ఏపీ శాక్స్ ప్రాజెక్టు డైరెక్టర్ జి.ఎస్.నవీన్‌కుమార్ ఆదేశాల మేరకు హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల ఎనిమిదో తేదీన విద్యార్థులకు జిల్లా స్థాయిలో క్విజ్ పోటీలు నిర్వహించనున్నారు. తమ కళాశాలలో ఈ పోటీలు జరుగుతాయని మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు. కళాశాలలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ విభాగం, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఉమ్మడి కృష్ణా జిల్లా డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఈ క్విజ్ పోటీలు నిర్వహించాలని నిర్ణయించారు. విజేతలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికచేయడంతోపాటు, ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి వరుసగా రూ.8 వేలు, రూ.5 వేలు, రూ.3 వేల నగదు బహుమతి, సర్టిఫికెట్లు ప్రదానం చేయాలని తీర్మానించారు. డిగ్రీ కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్‌లను మరింత సమర్థం తీర్చిదిద్దాలని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రోగ్రామ్ మేనేజర్ కిరణ్ పందిటి కోరారు.

క్లుప్తంగా

ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న జడ్జి రాజారామ్

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన ఉండాలని నాల్గవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి పి.రాజారామ్ అన్నారు. సిద్ధార్థ కళాశాల ఆవరణలోని సెమినార్ హాలులో శుక్రవారం మండల న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. రాజారామ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని, ర్యాగింగ్‌కు పాల్పడరాదన్నారు. ఎవరికైనా అన్యాయం జరిగితే మండల న్యాయ సేవాధికార కమిటీని ఆశ్రయించాలన్నారు. న్యాయవాదులు జయకుమార్, అనిల్ హాజరై చట్టాల గురించి వివరించారు. సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్‌తో పాటుగా అధ్యాపకులు, డిగ్రీ విద్యార్థులు పాల్గొన్నారు.

7న త్రిశక్తి పీఠంలో చండీహోమం

కృష్ణలంక(విజయవాడ తూర్పు): బస్టాండ్ సమీపంలోని శ్రీ కాళీమాత అమ్మవారి దేవస్థానం(త్రిశక్తి పీఠం)లో కార్తిక పౌర్ణమి సందర్భంగా ఈ నెల 7వ తేదీ ఉదయం 7 గంటలకు చండీహోమం నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ కార్యదర్శి కె.జగదీష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8న చంద్రగ్రహణం సందర్భంగా ఆలయాన్ని మూసివేస్తామన్నారు. ఈనెల 9వ తేదీ ఉదయం 6 గంటలకు అమ్మవారికి అభిషేకం, నిత్యాలంకరణ, పూజాకార్యక్రమాలు నిర్వహించి, అనంతరం నివేదన సమర్పించి ఉదయం 7.30 నుంచి అమ్మవారి దర్శనానికి భక్తులకు అనుమతిస్తామని తెలిపారు. ఈ నెల10న అమ్మవారికి భక్తులు సమర్పించిన హుండీ కానుకలు లెక్కిస్తామని చెప్పారు.

ఉన్నత విద్యపై అవగాహన అవసరం


ప్రసంగిస్తున్న జోనాథన్ ఓరే

పెనమలూరు: అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులు పూర్తి అవగాహనతో ఉండాలని అమెరికా కాన్సులేట్ డిప్లమసీ అధికారి జోనాథన్ ఓరే అన్నారు. కానూరు పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో శుక్రవారం చాట్ విత్ డిప్లమోట్ అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జోనాథన్‌ఓరే మాట్లాడుతూ అమెరికాలో ఉన్నత విద్య విద్యార్థులకు మేలు చేస్తుందన్నారు. అయితే వీసాకు దరఖాస్తు చేసే సమయంలో విధివిధానాలు పూర్తిగా తెలుసుకోవాలని సూచించారు. విద్యార్థులు అడిగిన సందేహాలను ఆయన నివృత్తి చేశారు. డాక్టర్ జోయిక్రిష్టోఫర్, కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు, డాక్టర్ ఎంఎస్ఆర్.నిరంజన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తల్లి చెంతకు తప్పిపోయిన బాలుడు

పాయకాపురం(విజయవాడరూరల్): తప్పిపోయిన నాలుగేళ్ల బాలుడు గంటల వ్యవధిలోనే తల్లి చెంతకు చేరిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఎల్‌బీఎస్ నగర్‌కు చెందిన వేముల శ్రీనివాసమ్మ కుమారుడు దానియేలు ఇంటి వద్ద ఆడుకుంటూ రోడ్డు మీదకు వచ్చి తప్పిపోయాడు. ఆ బాలుడు నడుచుకుంటూ వస్తుండగా స్థానికులు గమనించి నున్న పోలీసులకు అప్పగించారు. పోలీసులు విచారించి బాలుడి అడ్రస్ గుర్తించారు. ఎల్‌బీఎస్ నగర్‌లోని దివ్యాంగుల హాస్టల్ వెనుక నివసించే బాలుడి తల్లి శ్రీనివాసమ్మకు సమాచారం అందించారు. దీంతో ఆమె హుటాహుటిన పోలీసుస్టేషన్‌కు వచ్చి బాలుడిని గుర్తించింది. పోలీసులు బాలుడిని తల్లికి అప్పగించారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడ పశ్చిమ):యువతి అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాజీవ్‌శర్మనగర్‌కు చెందిన షేక్. నజీర్ ఉన్నీసకు ఇద్దరు ఆడపిల్లలు. భర్త జానీ చనిపోవడంతో బ్యాంక్‌లో అటెండర్‌గా పని చేస్తుంది. రెండో కుమార్తె షబానా ఇంటర్ వరకు చదివి ఇంట్లోనే ఉంటుంది. శుక్రవారం మధ్యాహ్నం డ్యూటీకి వెళ్లిన తల్లి తన కుమార్తె షబానాకు ఫోన్ చేసింది. కానీ ఆమె లిఫ్ట్ చేయలేదు. దీంతో అదే ప్రాంతంలో నివాసం ఉంటున్న మొదటి కుమార్తెకు ఫోన్ చేసి షబానా ఇంట్లో ఉంటే ఫోన్ చేయించమని చెప్పింది. అయితే గత కొంత కాలంగా షబానా అవినాష్ అనే యువకుడితో ఫోన్‌లో మాట్లాడుతుండటంతో తల్లి మందలించింది. దీంతో షబానా కనిపించకుండా పోవడానికి ఆ యువకుడే కారణమని భావించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

రేపు బ్రాహ్మణ సంఘ కార్తిక వన సమారాధన

కంకిపాడు: బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 6వ తేదీన కార్తిక వన సమారాధన మహోత్సవం నిర్వహించనున్నట్లు సంఘం ఉపాధ్యక్షుడు ఉపద్రష్ట గంగాధరరావు, ప్రధాన కార్యదర్శి కానూరు భాస్కర్‌రావు శుక్రవారం తెలిపారు.పట్టణంలోని పావన్ గాయత్రీ ధ్యాన మందిర్‌లో వన సమారాధన నిర్వహిస్తున్నామన్నారు.

పారదర్శకంగా ప్రభుత్వ పాలన


రెండవ డివిజన్ పడవలరేవు సమీపంలో ప్రజలకు పథకాలను వివరిస్తూ, సమస్యలు అడిగి తెలుసుకుంటున్న వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్

గుణదల (విజయవాడ తూర్పు): ప్రజలకు కావలసిన మౌలిక సౌకర్యాల కల్పనలో ప్రభుత్వం పారదర్శకంగా ముందుకు సాగుతోందని వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్చార్జ్ దేవినేని అవినాష్ అన్నారు. రెండవ డివిజన్ పరిధిలోని శాంతి నగర్, రెవెన్యూ కాలనీలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను అందించడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. సంక్షేమ పథకాల అమలు ప్రక్రియ పారదర్శకంగా సాగుతోందని తెలిపారు. రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపించేందుకు సీఎం జగన్ కృషి చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో నూతనంగా పలు పరిశ్రమలు కూడా ఏర్పాటవుతున్నాయని, తద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని చెప్పారు. రానున్న రోజుల్లో ఆంధ్రప్రదేశ్ ఆర్థికంగా పురోగమిస్తుందని అభిప్రాయపడ్డారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా తాము స్థానికులను కలుసుకుంటున్నపుడు గత ప్రభుత్వ హయాంలో టీడీపీ నేతలు చేసిన దురాగతాలను ఎండగడుతూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. టీడీపీ హయాంలో కనీస మౌలిక వసతులు, సంక్షేమ పథకాలు అమలు చేయలేదని ప్రజలు చెబుతున్నారన్నారు. కేవలం ఎన్నికల సమయంలోనే టీడీపీ నేతలు ప్రత్యక్షమయ్యేవారని తెలిపారన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ భూస్థాపితం కావడం ఖాయమని స్పష్టం చేశారు.అనంతరం స్థానికులను కలుసుకుంటూ కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో రెండవ డివిజన్ కార్పొరేటర్ అంబడిపూడి నిర్మలాకుమారి, స్థానిక నాయకులు డేవిడ్ రాజు, చందా కిరణ్ తేజ, అలంకార్ బాబు, శ్రీమన్నారాయణ, జాస్తి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పట్టాల మంజూరుకు ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తాం

- జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు
- భ్రమరాంబపురంలో ఆక్రమణల పరిశీలన


రుద్రభూమిలో పర్యటిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

కృష్ణలంక(విజయవాడ తూర్పు): కృష్ణలంక 22వ డివిజన్‌లోని భ్రమరాంబపురంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని నివాసం ఉంటున్న వారికి పట్టాలను మంజూరు చేసేందుకు ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. భ్రమరాంబపురంలో ఆక్రమణలను శుక్రవారం ఆయన రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కృష్ణానదీ తీరాన పద్మావతి ఘాట్ అనుకుని ఉన్న భ్రమరాంబపురంలో గతంలో 21 సర్వే నంబర్లకు చెందిన 23.16 ఎకరాల భూమిని రుద్రభూమికి కేటాయించారన్నారు. దీనిలో విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిరక్షణలో 14.21 ఎకరాల భూమిలో ప్రస్తుతం ఉన్న గ్యాస్, విద్యుత్, ఫైర్‌వుడ్ ఆధారిత శ్మశానవాటికలను నిర్వహిస్తున్నారని తెలిపారు. మిగిలిన భూమిలో సుమారు 1180 కుటుంబాలు పూర్వకాలం నుంచి ఇళ్లను నిర్మించుకుని నివాసం ఉంటున్నారన్నారు. నివాసితులు తమ నివాస గృహాలకు శాచ్యురేషన్ పద్ధతిలో పట్టాలు మంజూరు చేయాలని ప్రజా ప్రతినిధులు అధికారులను కోరారన్నారు. ఈ నేపథ్యంలో భ్రమరాంబపురం ప్రాంతాన్ని రెవెన్యూ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించామన్నారు. ఈ విషయంపై మరింత అధ్యయనం చేసి ప్రభుత్వానికి సమగ్ర నివేదికను సమర్పిస్తామన్నారు. ఈ పర్యటనలో కలెక్టర్‌తో పాటు తహసీల్దార్ వెన్నెల శ్రీనివాస్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నాగమల్లేశ్వరరావు, వీఆర్వోలు వి.లలిత, ఎం.వీరమ్మ, డి.సుధాకర్, కార్పొరేషన్ సర్వేయర్ ఉన్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నగరాభివృద్ధి

తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్


సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న దేవినేని అవినాష్

ఆటోనగర్(విజయవాడతూర్పు): వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నగరం అభివృద్ధి బాటలో పయనిస్తోందని విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. స్థానిక 15వ డివిజన్ ఈనాడు కాలనీ పట్టాభి రోడ్డుతో పాటు రుద్రభూమి ఎస్‌టీ ప్లాంట్ చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మాణానికి గాను రూ.37 లక్షల పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ గత నగరపాలక సంస్థ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు అన్ని పనులను పూర్తి చేస్తున్నట్లు చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాటలతో సరిపెట్టకుండా ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకునే ప్రభుత్వం అని అన్నారు. 15వ డివిజన్‌లో ఇప్పటివరకు రూ.4 కోట్లతో వివిధ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. గతంలో తెలుగుదేశం హయాంలో ఈ డివిజన్‌ను ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ దత్తత తీసుకొని ఒక్క పైసా నిధులు కూడా కేటాయించలేదని దుయ్యబట్టారు. బూటకపు మాటలతో ప్రజలను నట్టేట ముంచారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దివంగత మాజీ మంత్రి దేవినేని నెహ్రూ హయాంలో వేసిన రోడ్లు మినహా గద్దె సొంతంగా చేసింది ఏమీ లేదని విమర్శించారు.

మాట నిలబెట్టుకున్నాం

గత కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం దశలవారీగా అభివృద్ధి పనులను చేస్తున్నట్టు డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ అన్నారు. రాబోయే రోజుల్లో ఈ డివిజన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఆళ్ల చెల్లారావు, పట్టాభి, డాక్టర్ ఎంఎం రాజు, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణికులకు లక్కీ డిప్ బహుమతులు

బస్టాండ్ (విజయవాడ పశ్చిమ): ప్రజా రవాణా సంస్థ విజయవాడ గవర్నర్ పేట -1 డిపో పరిధిలో నడుపుతున్న 47/20, 121 రూట్లలో ప్రయాణికుల కోసం ప్రవేశపెట్టిన లక్కీ డిప్ విజేతలకు డిపో మేనేజర్ కె. బసవయ్య శుక్రవారం బహుమతులు అందించారు. రూట్ నంబర్:121 లో మొదటి బహుమతి లావణ్య, ద్వితీయ బహుమతి నాగలక్ష్మి, రూట్ నంబర్: 47/ 20 లో మొదటి బహుమతి నవ్య, ద్వితీయ శేషమ్మకు లభించినట్లు తెలిపారు. డిపో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


విజేతకు బహుమతి అందజేస్తున్న ఆర్టీసీ అధికారులు

స్వచ్ఛ సర్వేక్షణ్-2023లో మొదటి ర్యాంకు సాధించాలి

వీఎంసీ అదనపు కమిషనర్(జనరల్) శ్యామల


సమావేశంలో మాట్లాడుతున్న వీఎంసీ అదనపు కమిషనర(జనరల్) శ్యామల

పటమట(విజయవాడ తూర్పు): స్వచ్ఛ సర్వేక్షణ్ 2023లో ప్రథమ ర్యాంకు సాధించేందుకు అందరూ కృషి చేయాలని వీఎంసీ అదనపు కమిషనర్(జనరల్) శ్యామల అన్నారు. నగరంలోని మూడు సర్కిళ్లలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో శుక్రవారం ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యూజర్ ఫీజు కలెక్షన్ వారానికి రూ.8లక్షల టార్గెట్‌గా డివిజన్ల వారీగా వసూలు చేయాలని, డీఅండ్‌వో ట్రేడ్ లైసెన్స్ కలెక్షన్లు, క్లాప్ (క్లీన్ ఆంధ్రప్రదేశ్) చెత్తను సక్రమంగా వినియోగిస్తుందీ లేనిది, మొదటి ట్రిప్‌కు 750 కిలోలు, రెండో ట్రిప్‌కు 500 కిలోలు ఉండేలా శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పరిశీలించాలన్నారు. ప్లాస్టిక్ నిషేధం సక్రమంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని, స్వచ్ఛ సర్వేక్షణ్ ముఖ్యాంశాలైన పబ్లిక్ టాయిలెట్లు, కమ్యూనిటీ టాయిలెట్లు, మరమ్మతులను నిర్వహించటం, మెరుగైన పద్ధతుల్లో నిర్వహణ విధానం ఉండాలని, నివాస ప్రాంతాలు, వాణిజ్య ప్రాంతాల్లో సర్వేక్షణ్ నియమాలు అమలవుతున్నాయా, లేదా అని ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. చెత్త విభజన కచ్చితంగా జరగాలని, చెత్త కుప్పలు కన్పించకుండా చర్యలు తీసుకోవాలని, రోడ్ల వెంబడి, వీధుల్లో భవన నిర్మాణ వ్యర్థాలు లేకుండా నిరంతర పర్యవేక్షణ జరగాలని, డివిజన్లలో యూజీడీ పొంగిపొర్లకుండా ఉండేందుకు అనుసరించాల్సిన విధానాలను అమలు చేయాలని, చెత్త, వ్యర్థాలు డ్రైనేజీల్లో వేయకుండా ఎప్పటికప్పుడు ప్రజల్లో అవగాహన పెంచాలని, వాణిజ్య ప్రాంతాల్లో, బస్‌స్టాప్‌లలో ట్విన్ బిన్స్ దశలవారీగా ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. నగరంలో త్రీఆర్(రెడ్యూస్, రీ యూజ్, రీసైకిల్) అమలు చేయాలని, కాలనీల్లో, ఇతర గృహ సముదాయాల్లో హోం కంపోస్టులు ప్రోత్సహించాలని సూచించారు. సమావేశంలో జోనల్ కమిషనర్-1 కె.టి.సుధాకర్, జోనల్ కమిషనర్-3 డాక్టర్ ఎ.రవిచంద్, హెల్త్ అధికారులు డాక్టర్ సురేష్‌బాబు, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ ఇక్బాల్ హుస్సేన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ మేస్త్రీలు, శానిటరీ సెక్రటరీలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వీఎంసీ ఆధ్వర్యంలో ఓపెన్ ఫోరం


భవన నిర్మాణ యజమానులకు సందేహాలను నివృత్తి చేస్తున్న డిప్యూటీ సిటీ ప్లానర్ జుబెన్ రాయ్

పటమట(విజయవాడ తూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో పట్టణ ప్రణాళిక విభాగంకు సంబంధించి ప్రజలకు ఉన్న సందేహాలను నివృత్తి చేయటం, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న ఓపెన్ ఫోరం శుక్రవారం వీఎంసీ మూడు సర్కిల్ కార్యాలయాల్లో జరిగాయి. చిట్టినగర్‌లోని సర్కిల్-1లో జరిగిన కార్యక్రమంలో ఒక దరఖాస్తు, సత్యనారాయణపురంలోని సర్కిల్-2లో ఒక దరఖాస్తు రాగా పటమటలోని సర్కిల్ 3లో జరిగిన ఓపెన్‌ఫోరానికి ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. కార్యక్రమంలో పలువురికి భవన నిర్మాణ అనుమతుల వ్యవహారంలో ఉన్న సందేహాలను నివృత్తి చేశామని వీఎంసీ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్ తెలిపారు.

ఆదాయాన్ని పెంచేందుకు కృషి చేయండి


డిపాజిట్ డబ్బుల విషయమై పాలకవర్గాన్ని నిలదీస్తున్న సభ్యులు

ఆటోనగర్(విజయవాడ తూర్పు): ఆటోమొబైల్ టెక్నీషియన్ అసోసియేషన్‌కు వచ్చే ఆదాయాన్ని పెంచే విధంగా పాలక వర్గం కృషి చేయాలని పలువురు కోరారు. జవహర్ ఆటోనగర్‌లోని ఏటీఏ హాలులో శుక్రవారం రాత్రి ఆటోమొబైల్ టెక్నీషియన్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం అసోసియేషన్ అధ్యక్షుడు రాజనాల వెంకట రమణారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అసోసియేషన్ డబ్బులు వాడకం విషయంలో అవసరాన్ని బట్టి పొదుపుగా ఖర్చు చేయాలన్నారు. గత ఏడాది రూ.30 లక్షలు ఉందని, ఈ ఏడాదికి కేవలం రూ.7 లక్షలు మాత్రమే ఉందన్నారు. డబ్బులు వృథా చేయకుండా పాలకవర్గం చర్యలు తీసుకోవాలని సూచించారు. దీనిపై ఏటీఏ అధ్యక్షుడు వెంకట రమణారావు ఏటీఏ డబ్బులు విషయంలో సరైన రీతిలోనే ఖర్చు చేస్తున్నామన్నారు. కొత్త ఆటోనగర్‌కు చెందిన రూ.1.68 కోట్లు 2021 మార్చి వరకు డిపాజిట్ ఉందని, ఈ ఏడాదికి సంబంధించి డబ్బులు ఎంత ఉన్నాయని కాళిక్, నాగేశ్వరరావు పాలకవర్గాన్ని నిలదీశారు. ఈ విషయమై కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. దీనికి సంబంధించిన లెక్కలన్నీ తన వద్ద ఉన్నాయని అధ్యక్షుడు వివరణ ఇచ్చారు. కార్యక్రమంలో ఏటీఏ సభ్యులు పాల్గొన్నారు.


కేక్ మిక్సింగ్ చేస్తున్న దృశ్యం


సందడిగా ఫొటో సెషన్

ఉత్సాహంగా కేక్ మిక్సింగ్

వచ్చే నెలలో క్రిస్మస్ పర్వదినం వస్తుండటంతో నగరంలో అప్పుడే సందడి మొదలైంది. నోవోటెల్ హోటల్లో శుక్రవారం కేక్ మిక్సింగ్ కార్యక్రమం నిర్వహించారు. జీడిపప్పు, బాదంపప్పు, పిస్తా, ఖర్జూరం, కిస్మిస్ తదితర డ్రై ఫ్రూట్స్‌తో పాటు వైన్ పోసి మిక్సింగ్ చేశారు. -గుణదల (విజయవాడ తూర్పు)

దీవెన ఫౌండేషన్ ద్వారా ఆర్థిక సాయం


యువతికి ఆర్థిక సాయం అందజేస్తున్న దీవెన ఫౌండేషన్ విజయవాడ సిటీ పోలీసులు

చిట్టినగర్(విజయవాడ పశ్చిమ):రక్త సంబంధిత వ్యాధితో బాధపడుతున్న యువతికి దీవెన ఫౌండేషన్ శుక్రవారం ఆర్థిక సాయం అందచేసింది. లంబాడీపేటకు చెందిన దారావత్తు వర్షిని రక్త సంబంధిత వ్యాధితో చికిత్స పొందుతుంది. తండ్రి ఆటో నడుపుకుని జీవనం సాగిస్తుండటంతో వచ్చిన ఆదాయం కుటుంబ ఖర్చులకే సరిపోతుంది. ఈ విషయం తెలుసుకున్న దీవెన ఫౌండేషన్ విజయవాడ సిటీ పోలీస్ వారు రూ.10 వేల ఆర్థిక సాయాన్ని శుక్రవారం వర్షినికి అందచేశారు. ఫౌండేషన్ సభ్యులు హెడ్ కానిస్టేబుల్ సూరిబాబు, హోంగార్డు బాషా పాల్గొన్నారు.

యువతను ఆకట్టుకునే ప్రేమదేశం


చిత్ర హీరో త్రిగుణ్, హీరోయిన్ మేఘా ఆకాష్‌తో దర్శకుడు శ్రీకాంత్

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రేమకథా చిత్రమైన ప్రేమదేశం యువతను ఎంతగానో ఆకట్టుకుంటుందని ఆ సినిమా హీరో త్రిగుణ్ అన్నారు. ఈ నెల 18న విడుదల కానున్న ప్రేమదేశం చిత్రం ప్రమోషన్‌లో భాగంగా యూనిట్ సభ్యులు శుక్రవారం నగరానికి విచ్చేశారు. టిక్కిల్‌రోడ్డులోని ఓ హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో హీరో త్రిగుణ్ మాట్లాడుతూ కనకదుర్గమ్మ ఆశీస్సులతో ప్రేమదేశం చిత్రం ప్రమోషన్ కార్యక్రమం విజయవాడ నుంచి ప్రారంభించినట్లు తెలిపారు. తాను నటించిన అన్ని సినిమాలు ఇక్కడి నుంచే ప్రమోషన్ ప్రారంభించానన్నారు. ఆ చిత్రాలన్నీ విజయవంతం అయ్యాయని తెలిపారు. ఒక స్వచ్ఛమైన ప్రేమ కథే ప్రేమదేశం అని అన్నారు. ఈ సినిమాలో సీనియర్ నటి మధుబాల నటించారని, అనేక మంది సీనియర్ నటులు ఈ చిత్రంలో ఉన్నట్లు తెలిపారు. ప్రేమికుల మధ్య జరిగే సన్నివేశాలు తప్పకుండా నచ్చుతాయన్నారు. సంగీత దర్శకుడు మణిశర్మ అందించిన బాణీలు ఈ చిత్రానికి హైలైట్‌గా నిలుస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటికే పాటలకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన వచ్చిందన్నారు. చిత్ర హీరోయిన్ మేఘా ఆకాష్ మాట్లాడుతూ త్రిగుణ్‌తో కలిసి డియర్ మేఘా చిత్రంలో నటించానని, అది విజయవంతమైందన్నారు. ఇప్పుడు ప్రేమదేశం కూడా విజయవంతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దర్శకుడు శ్రీకాంత్ మాట్లాడుతూ గతంలో రిలీజ్ అయిన ప్రేమదేశంకు ఈ చిత్రానికి ఏ విధమైన సంబంధం లేదన్నారు. సమావేశంలో నటులు శివ, బిగ్‌బాస్ ఫేమ్ అజయ్ తదితరులు పాల్గొన్నారు.

సామూహికంగా లలితా పారాయణం


రాజగోపురం ఎదుట పారాయణం చేస్తున్న భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ):కార్తిక మాసం ఏకాదశి శుక్రవారాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గా మల్లేశ్వరస్వామి వారి ఆలయంలోని రాజగోపురం వద్ద భక్తులు కార్తిక దీపారాధన నిర్వహించారు. రాజగోపురం ప్రాంగణానికి చేరుకున్న విజయవాడకు చెందిన శ్రీకనకదుర్గా లలితా పారాయణ బృందం సభ్యులు దీపారాధన నిర్వహించి లలితా పారాయణం చేశారు. వందలాది మంది మహిళా భక్తులు ముక్తకంఠంతో లలితా పారాయణంతో ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది.

అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులు సైతం పారాయణ బృందంతో కలిసి లలితా పారాయణం చేశారు. అనంతరం భక్తులందరూ అమ్మవారిని దర్శించుకున్నారు.

శివపార్వతుల ఉత్సవమూర్తుల ఊరేగింపు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): కార్తిక మాసం సందర్భంగా మొగల్రాజపురంలోని వాగ్దేవి జ్యోతిర్లింగ క్షేత్రం (శివగిరి)పైన ఉన్న శివపార్వతుల ఉత్సవమూర్తుల విగ్రహాలను శుక్రవారం సాయంత్రం కరెన్సీనగర్‌లోని ప్రధాన, అంతర్గత రహదారులపై ఊరేగించారు. మాచవరం పోలీస్‌స్టేషన్ సీఐ ప్రభాకర్, గుణదల స్టేషన్ సీఐ కృష్ణమోహన్ ఉత్సవమూర్తులను సందర్శించి పూజలు చేశారు. శివగిరి వ్యవస్థాపకుడు మల్లికార్జునశర్మ పర్యవేక్షణలో ఊరేగింపు జరిగింది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): రింగ్‌రోడ్డు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా నేడు శనివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని ఏపీసీపీడీసీఎల్ గుణదల డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు పి.హరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టిక్కిల్‌రోడ్డు, శ్యామ్‌నగర్‌లో విద్యుత్ సరఫరా ఉండదని, ఈ విషయాన్ని ఆయా ప్రాంతాల్లోని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

- గుణదల (విజయవాడ తూర్పు): విద్యుత్ మరమ్మతుల కారణంగా గుణదలలోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం సరఫరా నిలిచి పోతుందని ఈఈ పి.హరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యుత్ లైన్లను మరమ్మతులు చేస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ కారణంగా గుణదలలోని ఊర్మిళానగర్, గాంధీజీ కాలనీ, హనుమాన్ నగర్, లెనిన్ నగర్, షిర్డి సాయి నగర్, ప్రశాంత్ కాలనీ, ఎస్ఎల్‌వీ కైలాష్ అపార్ట్‌మెంట్స్ తదితర ప్రాంతాలలో ఉదయం 7 నుంచి 10 గంటల వరకు సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాల్సిందిగా కోరారు.

తదుపరి విచారణ వరకు తొందరపాటు చర్యలొద్దు

అక్రమ నిర్మాణల కూల్చివేతపై అధికారులకు హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఇప్పటం గ్రామంలో అక్రమ నిర్మాణాల కూల్చివేతకు జారీచేసిన నోటీసుల విషయంలో తదుపరి విచారణ వరకు ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని హైకోర్టు శుక్రవారం పురపాలక శాఖ అధికారులను ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 15కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరీ మధ్యంతర ఉత్తర్వులు జారీచేశారు.

ఇప్పటంలో కక్ష సాధింపే

పవన్‌కళ్యాణ్

సాక్షి, అమరావతి: గుంటూరు జిల్లా ఇప్పటం గ్రామంలో రోడ్డు విస్తరణ పేరుతో ఇళ్ల తొలగింపు కేవలం కక్షసాధింపు చర్య అని జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ ఒక ప్రకటనలో విమర్శించారు. మంగళగిరి నియోజకవర్గంలోని ఇప్పటం గ్రామవాసులు జనసేన మద్దతుదారులు కావడమే వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధుల ఆగ్రహానికి కారణమని పేర్కొన్నారు. మార్చి 14న జనసేన ఆవిర్భావసభకు గ్రామస్తులు చోటిచ్చారని, తరువాత ఏప్రిల్ నెలలో రోడ్డు విస్తరణ అంటూ నోటీసులు ఇచ్చారని తెలిపారు. ఇప్పటికే ఊళ్లో 70 అడుగుల రోడ్డు ఉందని, దీన్ని 120 అడుగులకు విస్తరించాలన్న స్థానిక ప్రజాప్రతినిధి ఉత్సాహానికి కక్షసాధింపే కారణమని ఆయన ఆరోపించారు.

ప్రహరీలు తొలగిస్తే ఇళ్లు కూల్చినట్టా?

- నోటీసులిచ్చి ఆక్రమణలు తొలగిస్తున్నా... జనసేన రాజకీయాలు
- రెండేళ్ల కిందటే మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్‌లో విస్తరణ పనులు ప్రారంభం
- గత జనవరి– ఫిబ్రవరిలో 'ఇప్పటం'లో ఆక్రమణల్ని మార్కింగ్ చేసిన అధికారులు
- ఏప్రిల్, మే నెలల్లో రెండుసార్లు గ్రామంలో 54 మందికి నోటీసులు
- ఇప్పుడు తొలగిస్తున్నది వారి ప్రహరీలనే.. సహకరిస్తున్న యజమానులు
- దీన్లో భాగంగా వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు, కార్యకర్తల ప్రహరీలూ తొలగింపు
- చివరి నాలుగిళ్ల వద్ద జనసేన యాగి...
- మార్చిలో పవన్ ప్రకటించిన రూ.50 లక్షలు అడిగినందుకే వంకర రాజకీయం

సాక్షి, అమరావతి: ఆక్రమణలు పెరిగి రోడ్లు ఇరుకై పోవటంతో మంగళగిరి– తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని రోడ్ల వెంట ఉన్న ఆక్రమణలను తొలగించే పని రెండేళ్ల కిందటే మొదలుపెట్టారు. గత జనవరికల్లా పూర్తి చేశారు. తరువాత రూరల్ ప్రాంతంలోని ఆర్ అండ్ బీ రోడ్ల ఆక్రమణలపై చర్యలకు దిగారు. దాన్లో భాగంగానే ఇప్పటం గ్రామ పరిధిలో 75– 80 అడుగుల మేర ఉండాల్సిన ఆర్ అండ్ బీ రోడ్డును ఇరువైపులా 10 అడుగుల మేర ఆక్రమించి ప్రహరీలను నిర్మించుకున్నట్లు గుర్తించారు. ఇలా 54 మంది రోడ్డు ఆక్రమించినట్టు గుర్తించి జనవరిలో మార్కింగ్ చేశారు. ఏప్రిల్, మే నెలల్లో రెండుసార్లు నోటీసులిచ్చారు. అనంతరం ఆక్రమణల తొలగింపును ఆరంభించారు. ఆత్మకూరు– పెద వడ్లపూడిలో తొలగింపు పూర్తయ్యింది కూడా. ఇదీ.. వాస్తవం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సుమారు రూ.3 కోట్లతో ఇప్పటం గ్రామంలో అభివృద్ధి పనులు చేయటంతో పాటు గత నెలలో మరో రూ.6 కోట్లను ఈ గ్రామానికి కేటాయించిందనేది కూడా కాదనలేని నిజం.

తొలగింపులో భాగంగా రెండు రోజుల కిందట దాదాపు 25 మంది ఇళ్ల ప్రహరీలను తొలగించగా సంబంధిత యజమానులు సైతం సహకరించారు. ఇందులో వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు లచ్చి వెంకటేశ్వరరావు గౌడ్‌తో పాటు పార్టీ కార్యకర్తల ఇళ్ల ప్రహరీలూ ఉన్నాయి. కానీ, శుక్రవారం చివరి నాలుగు ఇళ్ల ప్రహరీలను తొలగిస్తుండగా జనసేన నాయకులు గొడవకు దిగారు. తాము జనసేనకు సహకరిస్తున్నందుకే ఇళ్లు కూలుస్తున్నారంటూ తప్పుడు ప్రచారానికి దిగారు. జనసేన ప్లీనరీకి స్థలం ఇచ్చిన వారి ఇళ్లను టార్గెట్ చేసి కూల్చివేస్తున్నారని అబద్ధాలను ప్రచారం చేస్తున్నారు. ఇక్కడ గమనించాల్సిందేమిటంటే...

- ఇప్పటం గ్రామంలోని ఆర్ అండ్ బీ రోడ్డు వెంబడి ఉన్న ఆక్రమణలను జనవరిలో మార్కింగ్ చేశారు. ఆ తరువాత ఏప్రిల్, మే నెలల్లో నోటీసులిచ్చారు.
- తొలగిస్తున్నవి కేవలం రోడ్డును ఆక్రమించుకుని ఉన్న ప్రహరీలే. కానీ జనసేన ప్రచారం చేస్తున్నట్లుగా ఎవ్వరి ఇళ్లనూ కూల్చేయలేదు.
- ప్రహరీలు తొలగింపునకు గురైన వారిలో వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు లచ్చి వెంకటేశ్వరరావు గౌడ్, పార్టీ కార్యకర్తలు కూడా ఉన్నారు.
- జనసేన ప్లీనరీ మార్చి నెలలో ఇప్పటం గ్రామంలో జరిగింది. ఆనాడు పవన్ కళ్యాణ్ గ్రామాభివృద్ధికి రూ.50 లక్షలిస్తానని ప్రకటించారు కానీ ఇప్పటిదాకా రూపాయి కూడా ఇవ్వలేదు.
- ప్రకటించిన డబ్బులివ్వాలని స్థానిక గ్రామ అభివృద్ధి కమిటీ అడగటంతో జనసేన నేతలు సాకులు చెబుతున్నారు. ఇప్పుడు ఆ అంశం నుంచి దృష్టి మళ్లించేందుకు పథకం పన్నారు.
- ఇప్పుడు ప్రహరీలు తొలగిస్తుంటే రాజకీయం మొదలుపెట్టిన పవన్ కళ్యాణ్... 2016లో కృష్ణా పుష్కరాల కోసమని తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం, బోట్ యార్డు, ఎన్టీఆర్ కరకట్ట, క్రిస్టియన్‌పేట తదితర ప్రాంతాల్లో 325 ఇళ్లను నాటి టీడీపీ ప్రభుత్వం తొలగించినపుడు నోరు మెదిపితే ఒట్టు.

రెక్కీ డ్రామా ఫెయిల్.. ఇక రాయి డ్రామా

- రాళ్లు విసరించుకోవటం చంద్రబాబుకు సర్వసాధారణమే
- అది మా సంస్కృతి కాదు.. ఆయనే రాయి విసిరించుకున్నారు
- శనివారం ఇప్పటంలో ఈ డ్రామా పార్ట్–3 మొదలవ్వొచ్చు
- గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ సవాల్



సాక్షి, అమరావతి: చంద్రబాబు సరికొత్త నాటకానికి తెర తీశాడని, స్వయంగా ఆయనే రాయి విసిరించుకున్నాడని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. 'ఆ రాయి పసుపు రాయి.. అందుకే బాబుకు తగలలేదు. రాయి విసిరించుకున్నాడు కాబట్టే ఆ రాయి బాబుకు తగలకుండా సీఎస్‌వోకు తగిలింది' అని స్పష్టం చేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రెక్కీ డ్రామా ముగియగానే, సరికొత్తగా రాయి డ్రామా.. అందుకున్నారని చెప్పారు. కొత్తగా రాయి డ్రామాకు తెరలేపిన తెలుగు డ్రామా పార్టీ టీడీపీ అని దుయ్యబట్టారు. చంద్రబాబుకు రాళ్లు విసిరించుకోవటం సర్వసాధారణమేనని, ఇలాంటివి బాబుకు కొత్త కాదని తెలిపారు. మంత్రి జోగి రమేష్ ఇంకా ఏమన్నారంటే..

అంతా బాబు స్క్రిప్టే

- చంద్రబాబు, పవన్ కల్యాణ్ డ్రామా స్టార్ట్ అయింది. పార్ట్ వన్ రెక్కీ.. పార్ట్ టూ రాయి.. ఇదంతా బాబు స్క్రిప్టే. రాయి ఘటన వెనుక కథ, స్క్రీన్ ప్లే, డైరెక్షన్ ఎవరిదో తేల్చాలని డీజీపీని కోరుతున్నాం. విధ్వంసం బాబు రాజకీయ డిక్షనరీలోనే ఉంది. 175 స్థానాల్లో పోటీ చేస్తానని చెప్పే దమ్ము బాబుకు ఉందా?
- రాయి సంఘటనకు సంబంధించి తక్షణమే చంద్రబాబు చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌కు క్షమాపణ చెప్పాలి. లేకుంటే ప్రజలు క్షమించరు.
- వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌ను ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం అరెస్ట్ చేసినా, మేము శాంతియుతంగా వ్యవహరించాం. ప్రజల మనసును దోచుకున్నాం. చంద్రబాబు లాగా కుట్రలు, కుతంత్రాలు, బంద్‌లు, ఆందోళనలు, రాస్తారోకోలు, దాడులు, లూటీలు చేయలేదు.
- బంద్ జరిగేటప్పుడు బస్సులు తగలబెట్టేందుకు చంద్రబాబు పెట్రోల్ క్యాన్లు ఇచ్చి పంపేవాడు. బస్సులు తగులబెట్టకుంటే అది బంద్ కాదు అనే వారని దగ్గుబాటి వెంకటేశ్వరరావు స్వయంగా చెప్పిన విషయం అందరికీ గుర్తుంది.
- రాళ్లు వేయటం, విధ్వంసం సృష్టించటం మా సంస్కృతి కాదు. 151 స్థానాల్ని 175 చేయడమే మా లక్ష్యం. ఆ దిశగా మా నాయకుడు మాకు దిశానిర్దేశం చేశారు. ఆ పనిలో భాగంగా ప్రజల మధ్య ఉంటూ ఇంటింటికి తిరుగుతున్నాం.

అది రెక్కీ కాదు.. పాడు కాదు..

- పవన్‌పై రెక్కీ విషయంలో కుట్రలు లేవని పోలీసు తేల్చారు కాదా? అది రెక్కీ కాదు.. పాడు కాదు.. ఎలాంటి రెక్కీ జరగలేదని పోలీసులు స్పష్టం చేశారు. తాగిన మైకంలో యువకులు న్యూసెన్స్ చేశారని చెప్పారు. దీనిపై నానా యాగీ చేసిన వారు ఇప్పుడు ఏం చెబుతారు? రెడ్డి కార్పొరేషన్ చైర్మన్‌పై సోషల్ మీడియాలో విస్తృతంగా ట్రోల్ చేయడం దుర్మార్గం కాదా?
- రేపు (శనివారం) పవన్ ఇప్పటం వెళ్తారు. పార్ట్ 3 డ్రామా మొదలవ్వచ్చు.. అక్కడా ఏదో ఒకటి చేస్తారు. రెచ్చిపోతారు. పార్ట్‌నర్స్ పోలీ ట్రిక్స్ ఇవి. ఎన్టీఆర్ మీద మల్లెల బాబ్జితో ఉత్తుత్తి హత్యాయత్నం చేయించిన, అమిత్ షా మీద రాళ్లేయించిన, అల్లుడు నా కంటే గొప్ప నటుడు అని ఎన్టీఆర్ చేత కితాబు అందుకున్న చంద్రబాబుకు సానుభూతి కోసం రాళ్లేయించుకోవడం పెద్ద విషయం ఏమీ కాదు.

సుపారీ కట్టుకథే.. హత్య కుట్ర కల్పితమే

- పవన్ కళ్యాణ్ నివాసంపై ఎవరూ రెక్కీ నిర్వహించ లేదు
- బెడిసికొట్టిన జనసేన, టీడీపీ కుమ్మక్కు దుష్ప్రచారం
- పవన్ నివాసం వద్ద గలాటా చేసింది టీడీపీ సానుభూతిపరులే
- వైఎస్సార్‌సీపీపై బురదజల్లేందుకు ఉదంతాన్ని వక్రీకరించిన జనసేన
- హైదరాబాద్ పోలీసుల దర్యాప్తులో వెల్లడైన అసలు నిజం
- టీడీపీ సానుభూతిపరులైన ముగ్గురు యువకుల అరెస్టు

సాక్షి, అమరావతి : జనసేన పన్నాగం బెడిసికొట్టింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై బురదజల్లేందుకు చేసిన దుష్ప్రచారం బండారం బట్టబయలైంది. జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌ను హత్య చేసేందుకు రూ.250 కోట్లతో సుపారీ కుదుర్చుకున్నారని, హైదరాబాద్‌లో గుర్తు తెలియని వ్యక్తులు పవన్ కల్యాణ్ నివాసం వద్ద రెక్కీ నిర్వహించారని రెండు రోజులుగా నానా యాగీ చేస్తున్న జనసేన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని హైదరాబాద్ పోలీసులు నిగ్గు తేల్చారు. దాంతో రాష్ట్ర ప్రభుత్వంపై దుష్ప్రచారం చేసేందుకు జనసేన, టీడీపీ కుమ్మక్కు కుట్ర బెడిసికొట్టింది. హైదరాబాద్ సిటీ పోలీసు వర్గాలు చెప్పిన వివరాల ప్రకారం అసలు విషయం వివరాలు ఇలా ఉన్నాయి.

ఉద్దేశ పూర్వకంగానే గొడవ..

హైదరాబాద్‌లోని శ్రీరామ్ నగర్ చెందిన చిట్నేని సాయికృష్ణ చౌదరి (32), చిట్నేని విజయ్ ఆదిత్య చౌదరి (27), జవహర్ నగర్ కు చెందిన వినోద్ (27).. ముగ్గురూ స్నేహితులు. వారు టీడీపీ సానుభూతిపరులు. గతంలో టీడీపీ ఎమ్మెల్యేగా గెలిచిన మాగంటి గోపీనాథ్ అనుచరులు. ఆ ముగ్గురు యువకులు సోషల్ మీడియాలో కూడా టీడీపీకి అనుకూలంగా పోస్టులు పెడుతూ ఉంటారు. వీరు గత నెల 31న రాత్రి 12.15 గంటలకు జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 35లోని తబలా రసా పబ్‌లో మద్యం సేవించారు. అనంతరం తమ టాటా సఫారీ కారు (జీజే 21ఏహెచ్ 1905)లో బయలుదేరారు. మార్గం మధ్యలో పవన్ నివాసం ముందు తమ వాహనం నిలిపి అక్కడ మాట్లాడుకోసాగారు. దాంతో పవన్ నివాసం వద్ద భద్రతా విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అక్కడ కారు ఎందుకు నిలిపారని వారిని ప్రశ్నించారు. తమ కారు తాము ఆపామని, ఆ ముగ్గురు యువకులు పరుషంగా బదులిచ్చారు. అది పవన్ నివాసమని చెబుతూ అక్కడ నుంచి వెళ్లిపోవాలని భద్రతా సిబ్బంది వెంకటేశ్, ప్రసాద్ కోరారు. దాంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన ఆ ముగ్గురు యువకులు పవన్ కళ్యాణ్‌ను తీవ్రంగా దూషించారు. అందుకు భద్రతా సిబ్బంది అభ్యంతరం వ్యక్తం చేయడంతో వారిపై ముగ్గురు యువకులు దాడికి దిగారు. ఈ ఘర్షణలో భద్రతా సిబ్బంది ప్రసాద్‌కు గాయమైంది. దాంతో మర్నాడు అంటే ఈ నెల 1న జనసేన నేతలతో కలసి ప్రసాద్ జూబ్లీ హిల్స్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తమపై దాడి చేసిన యువకులపై ఫిర్యాదు చేశారు. పవన్‌ను హత్య చేసేందుకు కుట్ర పన్నారని.. అందుకే రెక్కీ నిర్వహించారని కూడా ఫిర్యాదులో పేర్కొన్నారు. సీసీ కెమెరాల ఫుటేజీ, కారు నంబరు ఆధారంగా పోలీసులు ఆ ముగ్గురు యువకులపై ఐపీసీ సెక్షన్ 341, 323, 506 కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టగా అసలు విషయం వెల్లడైంది. ఆ ముగ్గురు యువకులు టీడీపీ సానుభూతిపరులని, మద్యం తాగి వచ్చి పవన్ ఇంటి వద్ద ఉద్దేశ పూర్వకంగానే ఘర్షణకు దిగారని స్పష్టమైంది. ఆ ముగ్గురినీ అరెస్ట్ చేశారు.

టీడీపీ, జనసేన కుమ్మక్కు కుట్ర

గత నెల 31న ఆ ముగ్గురు యువకులు పవన్ నివాసం వద్ద ఘర్షణ పడగానే.. తెల్లారేసరికల్లా తమ అనుకూల మీడియా ద్వారా టీడీపీ–జనసేనలు ఓ కట్టుకథను ప్రచారంలోకి తెచ్చాయి. తమ పార్టీ సోషల్ మీడియా విభాగాల ద్వారా ఆ కట్టుకథను వైరల్ చేశారు. పవన్ కళ్యాణ్‌ను హత్య చేసేందుకు ఏకంగా రూ.250 కోట్లకు సుపారీ కుదుర్చుకున్నారని జనసేన నేత నాదెండ్ల మనోహర్ ఆరోపించారు. ఇక గతంలో వంగవీటి రంగాను కాపాడుకోలేకపోయాం.. ఇప్పుడు పవన్‌ను కాపాడుకోవాలని జనసేన మరో నేత బొలిశెట్టి సత్యనారాయణ హడావుడిగా విలేకరుల సమావేశం పెట్టి మరీ పిలుపునిచ్చారు. పవన్ కల్యాణ్ నివాసం ముందు ఉన్న కారు ఏపీ రెడ్డి సంక్షేమ కార్పొరేషన్‌కు చెందిన నేతదని కూడా సోషల్ మీడియాలో అసత్య ప్రచారం వైరల్ చేయడం మొదలెట్టారు. గొడవ పడిన ఆ ముగ్గురు టీడీపీ సానుభూతిపరుల టాటా సఫారీ కారు (జీజే 21ఏహెచ్ 1905) నంబరు ప్లేటును మార్ఫింగ్ చేసి ఏపీ నంబరుతో ఉన్న వాహనంగా దుష్ప్రచారం చేయడం రాజకీయ కుట్రకు నిదర్శనం. హైదరాబాద్ పోలీసుల దర్యాప్తులో నిజం నిగ్గు తేలడంతో ప్రజలకు వాస్తవాలు తెలిశాయి.

వారు చంద్రబాబు మనుషులే

రెడ్డి, కమ్మ, కాపు కార్పొరేషన్ చైర్మన్లు

సాక్షి, అమరావతి : పవన్ కళ్యాణ్‌పై రెక్కీ అంటూ పచ్చ మీడియాలో తప్పుడు ప్రచారం చేసింది ఎవరో తేలిపోయిందని, పవన్ ఇంటి వద్ద గొడవ పడిన వారు చంద్రబాబు, లోకేశ్ మనుషులని స్పష్టం అయిందని కాపు, కమ్మ, రెడ్డి కార్పొరేషన్ల చైర్మన్లు అడపా శేషు, తుమ్మల చంద్రశేఖర్, చింతలచెరువు సత్యనారాయణ రెడ్డిలు మండిపడ్డారు. రాష్ట్రంలో కులాల మధ్య కుంపట్లు రాజేసి.. తద్వారా రాజకీయ లబ్ధి పొందాలని చంద్రబాబు కుట్రలు పన్నుతున్నారని ధ్వజమెత్తారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. పవన్ ఇంటి సమీపంలో సెక్యూరిటీతో గొడవ పడ్డవారితో చంద్రబాబు, లోకేశ్‌కు ఉన్న సంబంధాల గురించి ఇప్పుడు తెలిసిపోయింది. ఈ వాస్తవాలను దాచి.. రెక్కీ అంటూ తమపై దుష్ప్రచారం చేస్తుండటం దారుణం అని వారు నిప్పులు చెరిగారు.

అసలు సంబంధమే లేని తన కారు బోర్డును(రెడ్డి కార్పొరేషన్ చైర్మన్) మార్ఫింగ్ చేసి, రెడ్డి – కాపు కులాల మధ్య చిచ్చు పెట్టాలని కుట్ర పన్నారు అని సత్యనారాయణ రెడ్డి స్పష్టం చేశారు. పవన్ ఇంటి వద్ద టీడీపీ వాళ్లు తాగి గొడవ చేస్తే.. దాన్ని మాపైకి నెట్టడం దివాళాకోరుతనం. దీని వెనుక చంద్రబాబే ఉన్నారేమో అని కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు మండిపడ్డారు. మళ్లీ అధికారంలోకి రావాలని చంద్రబాబు ఇంత దిగజారుడు రాజకీయాలు చేయడం సమాజానికి మంచిది కాదని, కులాల మధ్య చిచ్చు పెట్టి బాబు గెలవలేరు అని కమ్మ కార్పొరేషన్ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్ అన్నారు.

సేంద్రియ ఆహారంతోనే ఆరోగ్యం

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



సేంద్రియ ఆహార ఉత్పత్తులను పరిశీలిస్తున్న వెంకయ్యనాయుడు

పెనమలూరు: 'ప్రకృతిని మనం ప్రేమిస్తే ప్రకృతి మనల్ని ప్రేమిస్తుందని, సేంద్రియ ఆహారంతోనే ఆరోగ్యవంతమైన జీవితం సాధ్యం' అని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. పెనమలూరులోని సహజ ఉత్పత్తుల కేంద్రం మన గ్రామాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. సేంద్రియ వ్యవసాయ పద్ధతులతో సాగు చేసి సహజ ఉత్పత్తులను ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపొచ్చన్నారు. ఎరువులు, క్రిమిసంహారక మందులను పరిమితికి మించి వాడితే సాగుభూమి సారాన్ని కోల్పోతుందని హెచ్చరించారు. పశు సంపద వృద్ధిచెందితే సేంద్రియ సాగు కూడా పెరుగుతుందని తెలిపారు. మన గ్రామంతో సేంద్రియ ఉత్పత్తులు అందిస్తున్న మొవ్వా రామకృష్ణ, మాధవీలతను ప్రశంసించారు. బీజేపీ జిల్లా నేతలు వల్లూరు శ్రీమన్నారాయణ, మొవ్వా బసవేశ్వరరావు, మరీదు రమేష్, గోపిశెట్టి దుర్గాప్రసాద్, శ్రీనివాస్ పలువురు పాల్గొన్నారు.

దేశ సంస్కృతిని మరువరాదు

విద్యార్థులు పాశ్చాత్య ఆలోచనలు మాని భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు వారసులుగా మారాలని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు సూచించారు. కానూరులోని సిద్ధార్థ ఆదర్శ రెసిడెన్షియల్ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. సిద్ధార్థ అకాడమీ అధ్యక్ష కార్యదర్శులు చదలవాడ నాగేశ్వరరావు, పాలడుగు లక్ష్మణరావు, ఉపాధ్యక్షులు ఎం.రాజయ్య, వి.నాగభూషణరావు, పాఠశాల కన్వీనర్ వీరపనేని శశికళ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా జీడీసీ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



ప్రసంగిస్తున్న డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ శ్యామ్‌ప్రసాద్

లబ్బీపేట (విజయవాడ తూర్పు): సమాజంలో దంత వైద్యులకు ప్రాధాన్యం పెరిగిందని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వ విద్యాలయం ఉపకులపతి డాక్టర్ పిగిలం శ్యామ్‌ప్రసాద్ అన్నారు. విజయవాడలోని ప్రభుత్వ దంత వైద్య కళాశాల (జీడీసీ) 2017 బ్యాచ్ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు శుక్రవారం రాత్రి ఓ ఫంక్షన్ హాలులో ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ తొలుత దంత వైద్యంలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరూ పోస్టు గ్రాడ్యుయేషన్ చేయాలని సూచించారు. వచ్చే విద్యా సంవత్సరంలో ప్రభుత్వ దంత వైద్య కళాశాలలో పీజీ సీట్లు పెరగనున్నాయని పేర్కొన్నారు. ఎక్కువ మందికి పీజీ చేసే అవకాశం దక్కుతుందన్నారు. హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ సీహెచ్.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. దంత వైద్యంలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారు ఎప్పటికప్పుడు ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకుని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. డెంటల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ మెహబూబ్ షేక్ మాట్లాడుతూ.. దంత వైద్యులుగా సమాజంలో రాణించాలంటే నైపుణ్యాలు పెంచుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని శ్రీనివాసరావు, కన్సర్వేటివ్ డెంటిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ టి.మురళీమోహన్, పలువురు విభాగాధిపతులు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారికి పట్టాలు, బెస్ట్ అవుట్ గోయింగ్ స్టూడెంట్స్, మెరిట్ విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ అందజేశారు.

వాలీబాల్ విజేతలు కృష్ణా, ప్రకాశం



బొబ్బిలి: ఏపీ వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయనగరం జిల్లా బొబ్బిలి సంస్థానం ఉన్నత పాఠశాల మైదానంలో మూడు రోజులుగా జరుగుతున్న ఏపీ ఎనిమిదో రాష్ట్రస్థాయి జూనియర్ వాలీబాల్ టోర్నమెంట్ శుక్రవారంతో ముగిసింది. పోటీల్లో బాలుర విభాగంలో ప్రకాశం జిల్లా జట్టు విజేతగా నిలవగా, పశ్చిమగోదావరి జట్టు రన్నర్‌గా నిలిచింది. బాలికల విభాగంలో కృష్ణా జిల్లా జట్టు చాంపియన్ షిప్‌ను కైవసం చేసుకుంది. గుంటూరు బాలికల జట్టు రన్నరప్‌గా నిలిచింది. రాష్ట్రవ్యాప్తంగా 26 జట్లు పోటీల్లో తలపడ్డాయి. విజేతలకు వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆర్‌వీఎస్‌కేకే రంగారావు మెడల్స్, జ్ఞాపికలు అందజేశారు.

10న యూత్ ఫెస్టివల్

విజయవాడ స్పోర్ట్స్: జిల్లా స్థాయి యూత్ ఫెస్టివల్ పోటీలు ఈ నెల పదో తేదీన జరుగుతాయని ఎన్టీఆర్ జిల్లా యువజన సర్వీసుల శాఖ ముఖ్య కార్యనిర్వహణ అధికారి యు.శ్రీనివాసరావు తెలిపారు. విజయవాడలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలో ఈ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. 2022 అక్టోబర్ ఒకటో తేదీ నాటికి 15 నుంచి 29 సంవత్సరాల మధ్య వయసున్న యువతీయువకులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. క్లాసికల్ ఓకల్ (కర్ణాటక, హిందూస్తానీ), క్లాసికల్ డాన్స్ (కూచిపూడి, భరతనాట్యం, కథక్, మణిపూరి, ఒడిస్సీ), క్లాసికల్ ఇన్‌స్ట్రుమెంట్స్ (వీణ, సితార, తబల, మృదంగం, గిటార్, ఫ్లూట్, హార్మోనియం), వన్ యాక్ట్ ప్లే, ఎలక్యూషన్, ఫోక్ సాంగ్ (గ్రూప్), ఫోక్ డాన్స్ (గ్రూప్), క్విజ్, మోడరన్ సాంగ్(సోలో), మోడరన్ డాన్స్ (సోలో), మేజిక్, మిమిక్రీ, మోనో యాక్షన్, వెంట్రిలాక్విజమ్, వయోలిన్, పెయింటింగ్, ఫ్యాన్సీ డ్రెస్, గ్రూప్ డిస్కషన్, సాహస కృత్యాలలో పోటీలు నిర్వహిస్తామన్నారు. ప్రదర్శనలకు సంబంధించిన సామగ్రిని కళాకారులే సమకూర్చుకోవాలని సూచించారు. ప్రథమ స్థానం సాధించిన కళాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న యువతీయువకులు ఈ నెల ఎనిమిదో తేదీ లోపుగా http://bit.ly/ntrdyf వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 88866 11786, 0866–38500681 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

గీత కార్మికుల తలరాతను మార్చిన ఏకైక సీఎం జగన్

- ఏపీ గౌడ కార్పొరేషన్ చైర్మన్ మాదు శివరామకృష్ణ
- సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం జగన్ చిత్రపటంతో నినాదాలు చేస్తున్న మాదు శివరామకృష్ణ, గీత కార్మికులు

భవానీపురం (విజయవాడ పశ్చిమ): దేశంలో ఎక్కడా లేని విధంగా గీత కార్మికుల తలరాతను మార్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఏపీ గౌడ కార్పొరేషన్ చైర్మన్ మాదు శివరామకృష్ణ అన్నారు. తమ అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన పాలసీపై గీత కార్మికులు హర్షం వ్యక్తం చేస్తూ గొల్లపూడిలోని బీసీ సంక్షేమ భవన్ వద్ద సీఎం జగన్ చిత్రపటాని శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాదు శివరామకృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో దశాబ్దాలుగా గీత కార్మికులు అనేక ఒడుదుడుకులు ఎదుర్కొంటూ జీవనం సాగిస్తున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో కల్లు గీసే సమయంలో ఏదైనా ప్రమాదం జరిగి కార్మికుడు వైకల్యానికి గురైనా, మృతిచెందినా వారి కుటుంబాలను పట్టించుకున్న నాథుడు లేడని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పుడు గీత కార్మికుల సంక్షేమాన్ని కాంక్షిస్తూ సీఎం జగనన్న ప్రభుత్వం కార్మికుడు ప్రమాదవశాత్తు మరణిస్తే ఇచ్చే పరిహారాన్ని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచి కార్మికుల కుటుంబాలకు భరోసా ఇచ్చిందన్నారు. కార్మికులు వైకల్యానికి గురైతే స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా అనుబంధ రంగంలో ఉపాధి కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టడం హర్షణీయమన్నారు. గీత కార్మికుల కష్టాలను తెలుసుకుని, ఎవరూ అడగకపోయినా కొత్త పాలసీ తీసుకొచ్చి అండగా నిలిచిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మనసున్న ముఖ్యమంత్రిగా నిరూపించుకున్నారని పేర్కొన్నారు. దున్నేవాడిదే భూమి అన్నట్లుగా కల్లు గీసే చెట్టు గీత కార్మికుడికే చెందేలా నూతన పాలసీలో పెట్టారని, తద్వారా కార్మికులందరూ ముఖ్యమంత్రికి రుణపడి ఉంటారని తెలిపారు. శాంతి కిషోర్, మాదు సుబ్బారావు, గూడ శ్రీనివాస్, కాసాని ఫణి, మాదు గౌతమ్‌రావు, నరసింహారావు, పలువురు కల్లు గీత కార్మికులు పాల్గొన్నారు.

'స్వాతంత్ర్య స్ఫూర్తి - తెలుగు దీప్తి' గ్రంథావిష్కరణ



విజయవాడ కల్చరల్: చిత్రకారులు నూతన పద్ధతులపై అవగాహన పెంచుకోవాలని ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు సూచించారు. ఆర్ట్స్ అసోసియేషన్ గిల్డ్ ఆధ్వర్యంలో ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా కృష్ణా జిల్లా స్వాతంత్ర్య సమరయోధుల భవన్‌లో శుక్రవారం స్వాతంత్ర్య సమరయోధుల చిత్ర కళా ప్రదర్శన, చిత్రకళా గ్రంథం ఆవిష్కరణ నిర్వహించారు. ముఖ్య అతిథి శేషగిరిరావు మాట్లాడుతూ.. ప్రభుత్వం కళాకారులు, సాహితీవేత్తలు, కవుల సంక్షేమం కోసం కృషి చేస్తోందన్నారు. చిత్రకారుడు డాక్టర్ బి.ఎ.రెడ్డి మాట్లాడుతూ.. స్వాతంత్ర్య పోరాటంలో తెలుగు వారి పాత్ర వెలకట్టలేనిదని కొనియాడారు. ఆంధ్రా ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ.. జాతికి స్ఫూర్తినిచ్చిన 70 మంది మహనీయుల చిత్రాలను చిత్రించడం ఆనందంగా ఉందన్నారు. విజయవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నిమ్మరాజు చలపతిరావు, చిత్రకారులు జింకా రామారావు, ఎం.ఉదయకుమార్, ఆర్టిస్ట్ అసోసియేషన్ నిర్వాహకులు పి.రమేష్, పి.వి.ఎస్.లక్ష్మి పాల్గొన్నారు. చిత్రకారుల కుంచెల నుంచి జాలువారిన చిత్రాలతో రూపుదిద్దుకున్న 'స్వాతంత్ర్య స్ఫూర్తి – తెలుగు దీప్తి' గ్రంథాన్ని అతిథులు ఆవిష్కరించారు. చిత్రకారుల చిత్రకళా ప్రదర్శన ఆకట్టుకుంది. చిత్రకారులకు నిర్వాహకులు ప్రశంసా పత్రాలను అందించారు.

ఆసియా చెస్ పోటీల్లో సత్తాచాటిన ప్రియాంక



గన్నవరం ఎయిర్‌పోర్టులో ప్రియాంకకు స్వాగతం పలుకుతున్న దృశ్యం

విజయవాడ స్పోర్ట్స్: ఆసియా కాంటినెంటల్ మహిళల చదరంగం పోటీల్లో ఉమన్ గ్రాండ్ మాస్టర్ నూతక్కి ప్రియాంక సత్తా చాటింది. గత నెల 25 నుంచి ఈ నెల మూడో తేదీ వరకు న్యూఢిల్లీలో జరిగిన ఈ పోటీలకు పది దేశాల క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించారు. ఈ పోటీల్లో ప్రియాంక అద్భుత ప్రతిభ కనబర్చి తొమ్మిది రౌండ్లలో 6.5 పాయింట్లు సాధించి ఫస్ట్ రన్నరప్‌ను కైవసం చేసుకుంది. పతకం సాధించి నగరానికి చేరుకున్న ప్రియాంకకు గన్నవరం ఎయిర్‌పోర్టులో ది విజయవాడ చెస్ అసోసియేషన్ కార్యదర్శి మందుల రాజీవ్, రోటరీ మిడ్ టౌన్ అధ్యక్షులు కృష్ణప్రభు, లిటిల్ బ్రెయిన్స్ స్కూలు విద్యార్థినీ విద్యార్థులు, చదరంగం అభిమానులు ఘన స్వాగతం పలికారు. ప్రతిష్టాత్మక ఆసియా పోటీల్లో నగరానికి చెందిన ప్రియాంక పతకం సాధించి రాష్ట్ర, దేశ ఖ్యాతిని ఇనుమడింపజేసిందని కొనియాడారు.

అవినీతి రహిత భారతదేశంలో భాగస్వామ్యం కావాలి



ప్రశంసాపత్రం అందజేస్తున్న అనిల్‌కుమార్

విమానాశ్రయం (గన్నవరం): అవినీతి రహిత దేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విజయవాడ ఇన్‌కం ట్యాక్స్ ప్రిన్సిపల్ కమిషనర్ ఎం.అనిల్‌కుమార్ పిలుపునిచ్చారు. గన్నవరం విమానాశ్ర యంలో జరుగుతున్న విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా 'కరప్షన్ ఫ్రీ ఇండియా – ఫర్ ఏ డెవలప్డ్ నేషన్'పై చివరి రోజు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. దేశంలో అవినీతి నిర్మూలనకు సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ కృషి చేస్తోందన్నారు. అనంతరం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి స్వచ్ఛందంగా రక్తదానం చేసిన ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ ఎం.లక్ష్మీకాంతరెడ్డి దంపతులతో పాటు పలువురు ఉద్యోగులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఎయిర్‌పోర్ట్ ఫైనాన్స్ విభాగం జాయింట్ జనరల్ మేనేజర్ సూర్యభగవానులు, ఎలక్ట్రికల్ విభాగం జాయింట్ జీఎం పి.వి.రామారావు, మానవ వనరుల విభాగం మేనేజర్ ఎ.మాధవీరాణి, ఎయిర్‌పోర్ట్ భద్రతాధికారి కె.వెంకటరత్నం పాల్గొన్నారు.


అన్నమయ్య జిల్లా మదనపల్లెలో లబ్ధిదారుకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే నవాజ్ బాషా


తిరుపతిలో లబ్ధిదారుకు సంక్షేమ బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష

ఊరూరా అదే జోరు

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంగా సాగుతోంది. గ్రామాల్లో పర్యటిస్తున్న ప్రజాప్రతినిధులకు ప్రతి ఇంటి వద్ద ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభిస్తోంది. అన్ని జిల్లాల్లో శుక్రవారం ఈ కార్యక్రమం వేడుకగా సాగింది. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు.

- సాక్షి, నెట్‌వర్క్


కోనసీమ జిల్లా రాజోలు మండలం మెరకపాలెంలో లబ్ధిదారుకు సంక్షేమ బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు


కృష్ణా జిల్లా గుడివాడలో మహిళకు బుక్‌లెట్ అందించి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కొడాలి నాని

ప్రతిపక్ష నేతకు పూర్తి స్థాయిలో బందోబస్తు కల్పించాం

- విజయవాడ సీపీ కె.ఆర్.టాటా
- ఇద్దరు ఐపీఎస్‌లు బందోబస్తును పర్యవేక్షించారు
- అన్ని రకాలుగా విచారణ చేస్తున్నాం



వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): ప్రతిపక్షనేత చంద్రబాబు నాయుడు పర్యటనకు సంబంధించి పోలీస్ శాఖ పూర్తిస్థాయిలో బందోబస్తు చేపట్టిందని విజయవాడ పోలీస్ కమిషనర్ కాంతిరాణాటాటా అన్నారు. శుక్రవారం అర్ధరాత్రి ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు పర్యటనలో రోడ్డు షో, ర్యాలీలకు సంబంధించి ప్రత్యేక బందోబస్తు చేపట్టామన్నారు. చంద్రబాబుకు జెడ్ ప్లస్ కేటగిరి సెక్యూరిటీ ఉన్న కాన్వాయ్‌కు ముందు, వెనుక తమ ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు ఉంటుందని చెప్పారు. ప్రకాశం బ్యారేజీ, కుమ్మరిపాలెం సెంటర్, గొల్లపూడి, ఇబ్రహీంపట్నం, నందిగామ, జగ్గయ్యపేట వరకూ అన్ని ప్రాంతాల్లో పోలీస్ శాఖ అవసరమైన చర్యలు చేపట్టిందన్నారు. నందిగామ, జగ్గయ్యపేటల్లో ప్రత్యేక బృందాలు వివిధ రూపాల్లో బందోబస్తులో పాల్గొన్నాయని తెలిపారు. నందిగామ, జగ్గయ్యపేటలో ఇద్దరు ఐపీఎస్ అధికారులు బందోబస్తును పర్యవేక్షించారన్నారు. నందిగామలో చంద్రబాబుపై రాయి పడినట్లు, దానివలన సీఎస్‌వోకు గాయమైనట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. దీనిపై వెంటనే తాను సీఎస్‌వోతో మాట్లాడి వివరాలను తీసుకున్నట్లు చెప్పారు. ఆయనకు వెంటనే ప్రథమ చికిత్స చేయించామన్నారు. ఈ ఘటనకు సంబంధించి మీడియా ఫుటేజ్, సీసీ కెమెరాలు, పోలీస్ శాఖ ఏర్పాటు చేసిన కెమెరాలు, సెల్‌ఫోన్లు, ప్రత్యక్ష సాక్షులు ఇలా వివిధ కోణాల్లో సంఘటనపై విచారణ చేపట్టామని తెలిపారు. ఇప్పటికే ప్రత్యేక బృందాలు విచారణలో ఉన్నాయని వివరించారు. జగ్గయ్యపేటలో ప్రశాంతంగా కార్యక్రమం ముగిసిందన్నారు. పువ్వులతో పాటుగా రాయి పడినట్లు కొంత మంది చెబుతున్నారని ఒక ప్రశ్నకు సీపీ సమాధానమిచ్చారు. ఆ కోణంలో కూడా విచారణ చేస్తున్నామన్నారు. ఈ ఘటనపై ఇప్పటి వరకూ ఎవరూ తమకు ఫిర్యాదు చేయలేదని మరో ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు.

ఆరుద్ర కేసుపై సుమోటోగా మహిళా కమిషన్ విచారణ

సాక్షి, అమరావతి: తాడేపల్లిలో మహిళ చేయి కోసుకున్న ఘటనపై రాష్ట్ర మహిళా కమిషన్ దృష్టి సారించింది. బాధితురాలు ఆరుద్ర కేసును రాష్ట్ర మహిళా కమిషన్ సుమోటోగా విచారణకు స్వీకరించింది. బాధితురాలికి న్యాయం చేసేందుకు రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ శుక్రవారం సీఎంవో అధికారులతో చర్చించారు. ప్రస్తుతం విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆరుద్ర త్వరగా కోలుకునేలా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులకు సూచించారు. ఆరుద్ర కేసుకు సంబంధించిన పూర్తి విచారణ వివరాలను కమిషన్‌కు సమర్పించాలని కాకినాడ జిల్లా ఎస్పీకి వాసిరెడ్డి పద్మ లేఖ రాశారు.

కాలర్ ఎవరో తెలియాల్సిందే..!



అన్ నోన్ కాల్స్‌కు త్వరలోనే చెక్

గుర్తుతెలియని వ్యక్తుల నుంచి ఫోన్ కాల్స్ (అన్ నోన్ నంబర్) బెడదకు త్వరలోనే ముగింపుపడనుంది. తమ మొబైల్ ఫోన్‌కు ఎవరు కాల్ చేస్తున్నారో తెలుసుకోవడం ఫోన్ వినియోగదారుల హక్కుగా మారనుంది. ట్రూ కాలర్ యాప్‌తో సంబంధం లేకుండానే తమ కాంటాక్ట్ నంబర్ల జాబితాలో లేని నంబరు నుంచి ఫోన్ కాల్ వస్తే అది ఎవరు చేశారో తెలిసిపోనుంది. తద్వారా సైబర్ నేరాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం తాజాగా విధాన నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రూపొందించిన కొత్త టెలికాం విధానం పార్లమెంటులో ఆమోదం పొందగానే అమల్లోకి రానుంది.

- సాక్షి, అమరావతి

ఫేక్ ఐడీ కార్డులతో కనెక్షన్లు... సైబర్ నేరాలకు చెక్ పెట్టేందుకు...

దేశంలో అమాంతంగా పెరుగుతున్న సైబర్ నేరాల కట్టడికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమాయత్తమవుతున్నాయి. సైబర్ నేరగాళ్లు ప్రధానంగా ఫేక్ ఐడీ కార్డులతో సిమ్ కార్డులు, ఓవర్ ద టాప్(ఓటీటీ) కనెక్షన్లు తీసుకుని దర్జాగా మోసాలకు పాల్పడుతున్నారు. దాదాపు 90శాతం సైబర్ నేరాల ముఠాలు ఇలా ఫేక్ కనెక్షన్లతోనే సామాన్యులను బురిడీ కొట్టిస్తున్నాయి. ఫేక్ ఐడీ కార్డులతో తీసుకున్న ఫోన్ కనెక్షన్లతోనే ఆడియో, వీడియో, వాట్సాప్ కాల్స్, ఇన్‌స్టాగామ్ మెసేజ్‌లు, యూపీఐ మెసేజ్‌లు చేస్తూ మోసాలకు పాల్పడుతున్నాయని జాతీయ నేర గణాంకాల (ఎన్‌సీఆర్‌బీ) నివేదిక వెల్లడించింది. వాటిపై పోలీసులు కేసులు నమోదు చేస్తున్నప్పటికీ ఆ మొబైల్ కనెక్షన్లు ఫేక్ ఐడీ కార్డులతో తీసుకున్నవి కావడంతో ఆయా చిరునామాల్లో సంబంధిత వ్యక్తులు ఉండటం లేదు. దీంతో కేసు దర్యాప్తు ముందుకు సాగడం లేదు. ఈ సమస్యకు పరిష్కారం కోసం కేంద్ర ప్రభుత్వం టెలికాం సంస్థలకు కొత్త విధివిధానాలను రూపొందించింది. ఈ మేరకు పార్లమెంటుకు ఇప్పటికే నూతన విధాన పాలసీ డ్రాఫ్ట్‌ను సమర్పించింది. రానున్న పార్లమెంటు సమావేశాల్లో దీనికి ఆమోదముద్ర పడుతుందని భావిస్తున్నారు.

ఎవరు కాల్ చేస్తున్నారో తెలిసిపోతుంది...

నూతన పాలసీ ప్రకారం తమ కాంటాక్ట్ నంబర్ల జాబితాలో లేని నంబరు నుంచి కాల్ వచ్చినా సరే ఆ ఫోన్ చేసింది ఎవరో ఇకపై తెలిసిపోతుంది. ప్రస్తుతం ట్రూ కాలర్ యాప్‌ను ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకుంటే ఆవిధంగా ఎవరు కాల్ చేస్తున్నారో తెలుస్తుంది. కానీ, దానికి కూడా కొన్ని పరిమితులు ఉన్నాయి. అయితే, ట్రూ కాలర్ యాప్‌తో నిమిత్తం లేకుండానే తమకు ఎవరు కాల్ చేస్తున్నారో తెలుసుకోవడం ప్రతి మొబైల్ ఫోన్ వినియోగదారుడికి హక్కుగా కేంద్రం నూతన పాలసీ డ్రాఫ్ట్‌ను సిద్ధం చేసింది. ఇందుకోసం మొబైల్ కంపెనీలు తమ సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేయాలని ఆదేశించనుంది.

కేవైసీ తప్పనిసరి...

టెలికాం కంపెనీలు తమ ఖాతాదారుల పూర్తి వివరాలను పరిశీలించి నిర్ధారించుకోవాలి. అందుకోసం బ్యాంకులు చేస్తున్నట్టుగా 'నో యువర్ కస్టమర్(కేవైసీ) ప్రక్రియను పాటించాలి. తమ కంపెనీ నుంచి మొబైల్ సిమ్ కార్డ్, ఓటీటీ కనెక్షన్ తీసుకున్న ప్రతి ఒక్క ఖాతాదారు సమర్పించిన గుర్తింపు కార్డులను తనిఖీ చేసిన తర్వాతే కనెక్షన్ ఇవ్వాలి. లేదా కనెక్షన్ ఇచ్చిన వారం రోజుల్లోనే ఆ గుర్తింపు కార్డులను పరిశీలించాలి. ఖాతాదారులు సమర్పించిన గుర్తింపు కార్డులు సరైనవి అని నిర్ధారణ అయితే సరే. నిర్ధారణ కాకపోతే వెంటనే ఆ కనెక్షన్లను నిలుపుదల చేయాలి. ఏ సందర్భంలో అయినా సరే పోలీసుల విచారణలో ఫేక్ గుర్తింపు కార్డులతో ఎవరైనా కనెక్షన్ తీసుకున్నారని తెలిస్తే సంబంధిత టెలికాం కంపెనీలు బాధ్యత వహించాల్సి ఉంటుంది.

ఫేక్ ఐడీతో తీసుకుంటే కఠిన చర్యలు...

ఇక ఫేక్ గుర్తింపు కార్డుతో ఎవరైనా మొబైల్ కనెక్షన్ గానీ, ఓటీటీ కనెక్షన్ గానీ తీసుకున్నారని టెలికాం కంపెనీల 'కేవైసీ'లో వెల్లడైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి. వారిపై పోలీసులు కేసు నమోదు చేస్తారు. వివిధ కేసుల దర్యాప్తులో భాగంగా ఫేక్ ఐడీ కార్డులతో మొబైల్, ఓటీటీ కనెక్షన్ తీసుకున్నారని పోలీసులు గుర్తించినా వారిపై కేసు నమోదు చేస్తారు. అలా ఫేక్ ఐడీ కార్డుతో కనెక్షన్ తీసుకున్నవారికి రూ.50వేల జరిమానా లేదా ఏడాది జైలు లేదా రెండూ విధించేలా కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది.

ఎన్నికల్లో సమాధి చేసినా... చంద్రబాబుకు బుద్ధిరాలేదు

- మతిస్థిమితం కోల్పోయే అలా మాట్లాడుతున్నారు
- కుప్పంలోనే దిక్కులేదు.. పులివెందుల గురించి మాట్లాడటం సిగ్గుచేటు: మంత్రి విడదల రజిని



యడ్లపాడు: గత ఎన్నికల్లో టీడీపీని ప్రజలు బంగాళాఖాతంలోకి తోసేశారని, స్థానిక ఎన్నికల్లో పూర్తిగా సమాధి చేసినా మాజీ సీఎం చంద్రబాబు నాయుడికి బుద్ధిరాలేదని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని విమర్శించారు. పల్నాడు జిల్లాలోని స్పైసెస్ పార్కులో ఐటీసీ నిర్మించిన ప్రాసెసింగ్ యూనిట్‌ను ఈ నెల 11వ తేదీన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించనున్న నేపథ్యంలో ఆ ఏర్పాట్లను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై ప్రజలు తిరగబడతారంటూ చంద్రబాబు వ్యాఖ్యానించడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు టీడీపీని 23 సీట్లకు పరిమితం చేశారని, రానున్న ఎన్నికల్లో ఆ పార్టీకి చావుదెబ్బ తప్పదని హెచ్చరించారు. మేనిఫెస్టోను తుంగలో తొక్కిన చంద్రబాబు.. మేనిఫెస్టోనే పవిత్రగ్రంథంలా భావించి 98 శాతం అమలు చేసిన జగనన్నతో పోల్చుకోవడం హాస్యాస్పదమన్నారు. ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లుతోందంటూ చంద్రబాబు పెద్ద మాటలు మాట్లాడుతున్నారని, సీఎం కుర్చీ హక్కులా భావిస్తున్నారని ఎద్దేవా చేశారు. సొంత కొడుకునే గెలిపించుకోలేని, కుప్పంలోనే దిక్కులేని అసమర్థుడైన చంద్రబాబు పులివెందులలో గెలువు చూద్దాం.. అంటూ జగనన్నపై సవాల్ విసరడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో ఎప్పుడు ఏ ఎన్నిక జరిగినా టీడీపీకి ఓటమే గతి అని, చంద్రబాబు చేసిన పాపాలే ఆ పార్టీకి శాపాలుగా మారాయని చెప్పారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి పారదర్శకమైన పాలన అందిస్తున్న గొప్ప నాయకుడు సీఎం వైఎస్ జగన్ అని ఆమె పేర్కొన్నారు.

నాపై 14 కేసులు పెట్టి ఏం పీకారు?

- దమ్ముంటే మీ మగతనం చూపించండి
- టీడీపీ నేత, మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు సవాల్



నర్సీపట్నం: తన మీద 14 కేసులు పెట్టి ఏం పీకారని టీడీపీ నేత చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రాష్ట్రాన్ని దోచుకుంటున్నాడని, రోడ్లపై గుంతలు పూడ్చలేని చేతకాని ప్రభుత్వమని విమర్శించారు. పరిపాలన చేతకాక, దాన్ని మభ్య పెట్టేందుకు తమ మీద కేసులు పెట్టి కాలం గడుపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫోర్జరీకి సంబంధించి నమోదైన కేసులో బెయిల్‌పై బయటకు వచ్చిన ఆయన శుక్రవారం నర్సీపట్నంలో తన వద్దకు వచ్చిన వారితో మాట్లాడారు. తనకు అండగా నిలిచిన నాయకులు, కార్యకర్తల రుణం తీర్చుకుంటానని చెప్పారు. 2024లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని తరిమి తరిమి కొట్టే పరిస్థితి వస్తుందన్నారు. అధికార పక్షం తప్పు చేస్తే.. విమర్శించడం ప్రతిపక్షంగా తమ ధర్మమన్నారు. చేసిన తప్పులను సరి చేసుకోవాలి తప్ప కేసులు పెట్టడం సరికాదన్నారు. దమ్ముంటే తనపై మగతనం చూపించాలని సవాల్ విసిరారు. తనను కొట్టడం సీఎం లైవ్‌లో చూద్దామనుకున్నారని అన్నారు. తాను తెలిసి తప్పు చేయలేదని, భవిష్యత్తులో తప్పు చేయనని స్పష్టం చేశారు.

ఆరోగ్యశ్రీ ఎక్కడా అమలవ్వడం లేదు

- తీవ్రవాదులకే భయపడలేదు.. జగన్‌రెడ్డికి భయపడతానా?
- సోషల్ మీడియాతో సీబీసీఐడీకి ఏం పని?
- నందిగామ, జగ్గయ్యపేట రోడ్‌షోలలో చంద్రబాబు


నందిగామలో ప్రసంగిస్తున్న చంద్రబాబు

నందిగామ/జగ్గయ్యపేట అర్బన్: రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ ఎక్కడా అమలు కావడం లేదని ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు అన్నారు. రాష్ట్ర అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమన్నారు. ప్రజలు ఒక్క అవకాశం ఇస్తే తన అనుభవంతో రాష్ట్రాన్ని బాగు చేస్తానన్నారు. రోడ్ షోలో భాగంగా శుక్రవారం ఆయన ఎన్టీఆర్ జిల్లా నందిగామలోని గాంధీ సెంటర్‌లో, జగ్గయ్యపేటలో మాట్లాడారు. గతంలో నందిగామకు అనేకమార్లు వచ్చానని, కార్యకర్తల్లో ఎప్పుడూ ఇంత ఉత్సాహం కనిపించలేదన్నారు. నందిగామలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ఇసుక, మట్టిని దోచేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో జగన్ బ్రాండ్ మద్యం విక్రయిస్తున్నారని, తద్వారా వచ్చిన సొమ్ము ప్రతిరోజు సాయంత్రానికి తాడేపల్లి ప్యాలెస్‌కు వెళ్తోందన్నారు. తాను ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో నిత్యావసర వస్తువుల ధరలన్నీ అందుబాటులో ఉండేవని, ఇప్పుడు బాగా పెంచేశారని చెప్పారు. 'రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా, ఆ తర్వాత జగన్ రెడ్డి ఉండేది జైల్లోనే. నేను తీవ్రవాదులకే భయపడలేదు. అలాంటిది నీకు (సీఎంకు) భయపడతానా? లక్షల కోట్ల అప్పులు ఎవరు కడతారు? నీకు సంపద సృష్టించడం తెలుసా? రాష్ట్రంలో మంత్రులందరూ బూతుల మంత్రులే. సోషల్ మీడియాతో సీబీసీఐడీకి ఏం పని?' అని నిలదీశారు.

బాబు వైపు రాయి విసిరిన దుండగులు

రోడ్ షో సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు చంద్రబాబు వైపు రాయి విసిరారు. ఆ రాయి సెక్యూరిటీ అధికారికి తగిలింది. దీంతో అతనికి స్వల్ప గాయమైంది. ఈ ఘటనపై చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

మేజిస్ట్రేట్ ఉత్తర్వులు రద్దు చేయండి

అయ్యన్నకు రిమాండ్ తిరస్కరించడంపై హైకోర్టును ఆశ్రయించిన సీఐడీ

సాక్షి, అమరావతి : విశాఖపట్నం, నర్సీపట్నంలో ఇంటి నిర్మాణానికి సంబంధించిన నిరభ్యంతర పత్రాన్ని (ఎన్‌ఓసీ) ఫోర్జరీ చేసిన వ్యవహారంలో మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత చింతకాయల అయ్యన్న పాత్రుడు, ఆయన కుమారుడు రాజేష్‌ల రిమాండ్‌ను తిరస్కరిస్తూ విశాఖపట్నం చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ సీఐడీ హైకోర్టును ఆశ్రయించింది. మేజిస్ట్రేట్ ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ సీఐడీ డీఎస్పీ శుక్రవారం లంచ్‌మోషన్ రూపంలో అత్యవసరంగా పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి విచారణ జరిపారు. సీఐడీ తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ, ప్రముఖులు నిందితులుగా ఉన్న కేసుల్లో మేజిస్ట్రేట్ల తీరు విస్మయకరంగా ఉందని హైకోర్టుకు నివేదించారు. హై ప్రొఫైల్ కేసుల్లో నిందితుల రిమాండ్‌ను తిరస్కరించడం మేజిస్ట్రేట్లకు పరిపాటిగా మారిందని వివరించారు. రిమాండ్ సమయంలోనే చిన్నపాటి ట్రయల్ నిర్వహించి, ఫలానా సెక్షన్ నిందితులకు వర్తించదని తేల్చేస్తూ రిమాండ్‌ను తిరస్కరిస్తున్నారని తెలిపారు. మాజీ మంత్రులు నారాయణ, అయ్యన్నపాత్రుడు కేసుల్లోనే కాకుండా, గతంలో కూడా పలు కేసుల్లో రిమాండ్‌ను తిరస్కరిస్తూ మేజిస్ట్రేట్లు ఉత్తర్వులిచ్చారన్నారు.



మేజిస్ట్రేట్ల తీరు దురదృష్టకరం

తెలంగాణలోనూ ఇటీవల ఓ హై ప్రొఫైల్ కేసులో మేజిస్ట్రేట్.. నిందితులకు రిమాండ్ తిరస్కరించారని, దీంతో హైకోర్టు వెంటనే జోక్యం చేసుకుని, ఆ ఆదేశాలను రద్దు చేసిందని ఏఏజీ చెప్పారు. రిమాండ్ తిరస్కరించడాన్ని మేజిస్ట్రేట్లు ఓ అలవాటుగా మార్చుకున్నారని, ఈ విషయంలో వారి ధోరణి మార్చాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మేజిస్ట్రేట్ల తీరు దురదృష్టకరమని ఏఏజీ తెలిపారు. ప్రస్తుత కేసులో కూడా అయ్యన్నపాత్రుడు, ఆయన కుమారుడిపై సీఐడీ పెట్టిన ఐపీసీ సెక్షన్ 467 వారికి వర్తించదంటూ రిమాండ్‌ను తిరస్కరిస్తూ మేజిస్ట్రేట్ ఉత్తర్వులిచ్చారన్నారు. సెక్షన్ 41ఏ అనుసరించాలని సీఐడీని ఆదేశించారన్నారు. వాస్తవానికి సెక్షన్ 467 వర్తిస్తుందని హైకోర్టు ప్రాథమికంగా అభిప్రాయపడిందని ఆయన న్యాయమూర్తి దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమయంలో న్యాయమూర్తి స్పందిస్తూ, దేని ఆధారంగా సెక్షన్ 467 వర్తించదని తేల్చారని ప్రశ్నించారు. అందుకు సంబంధించిన రికార్డులను పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. అయ్యన్న పాత్రుడు, రాజేష్‌ల వాదన సైతం వింటామన్నారు. వారికి నోటీసులు జారీ చేస్తూ ఉత్తర్వులిచ్చారు. అంతేకాక వారిద్దరికీ వ్యక్తిగత నోటీసులు జారీ చేసే వెసులుబాటును సీఐడీకి ఇచ్చారు. తదుపరి విచారణను ఈ నెల 10వ తేదీకి వాయిదా వేశారు.

సాయిలక్ష్మీచంద్ర వైద్యానికి ప్రభుత్వం భరోసా

ఎంత ఖర్చు అయినా వైద్యం చేయించాలని ఆదేశించిన సీఎం జగన్

- ఆమె తల్లికి ఉద్యోగ కల్పన
- ఆరుద్రతో మాట్లాడిన సీఎం కార్యదర్శి ధనుంజయరెడ్డి
- ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని హామీ
- సీఎంకు ఆరుద్ర కృతజ్ఞతలు


సీఎం క్యాంపు కార్యాలయంలో ఆరుద్రతో మాట్లాడుతున్న ధనుంజయరెడ్డి. పక్కన డిల్లీరావు

సాక్షి, అమరావతి: వెన్నెముక సంబంధిత సమస్యతో బాధపడుతున్న చిన్నారి సాయిలక్ష్మీచంద్రకు ప్రభుత్వం పూర్తివైద్యం చేయిస్తుందని ఆమె తల్లి ఆరుద్రకు ముఖ్యమంత్రి కార్యదర్శి ధనుంజయరెడ్డి భరోసా ఇచ్చారు. ఆయన శుక్రవారం కాకినాడకు చెందిన రాజులపూడి ఆరుద్రతో తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో మాట్లాడారు. అనారోగ్యానికి గురైన తన కుమార్తెను ఆదుకోవాలంటూ రెండురోజుల కిందట ఆరుద్ర సీఎం కార్యాలయానికి విన్నవించారు. ఈ క్రమంలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆరుద్రను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డిల్లీరావు, విజయవాడ సీపీ కాంతిరాణా టాటా, సీఎం ప్రత్యేక కార్యదర్శి హరికృష్ణ పరామర్శించి వివరాలు తెలుసుకుని సీఎంకు నివేదించారు. దీంతో మరోసారి ఆమెతో మాట్లాడి సమస్యను త్వరగా పరిష్కరించాలని సీఎం జగన్ తన కార్యదర్శి ధనుంజయరెడ్డిని ఆదేశించారు. కలెక్టర్ డిల్లీరావు స్వయంగా ఆరుద్రను సీఎం కార్యాలయానికి తీసుకొచ్చారు. సాయిలక్ష్మీచంద్ర వైద్యానికి అయ్యే ఖర్చును పూర్తిగా ప్రభుత్వం భరిస్తుందని, ఈమేరకు సీఎం ఆదేశాలు జారీచేశారని ధనుంజయరెడ్డి ఆమెకు వివరించారు. జీవనోపాధి కోసం ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చి.. ఆమె సమక్షంలోనే కాకినాడ జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీచేశారు. స్థిరాస్తిని అమ్ముకునే క్రమంలోను ఎవరైనా ఇబ్బందిపెడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. ఈ వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న కానిస్టేబుళ్లపై చర్యలు తీసుకోవాలని కాకినాడ ఎస్పీకి సూచించారు. ప్రభుత్వం అన్ని విధాలా తోడుగా ఉంటుందని, నిరాశకు గురికావద్దని ధైర్యం చెప్పారు. అనంతరం ఆరుద్ర మాట్లాడుతూ తనలాంటి నిస్సహాయులకు సీఎం అండగా నిలుస్తారనే ధైర్యం, నమ్మకంతోనే ఇక్కడికి వచ్చానన్నారు. తన కుమార్తెకు వైద్యం చేయించడంతో పాటు తనకు ఉద్యోగం ద్వారా జీవనోపాధి కల్పిస్తున్నందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. రెండురోజులుగా అధికారులు ఎప్పటికప్పుడు తన యోగక్షేమాలు కనుక్కుంటూనే ఉన్నారని ఆనందం వ్యక్తం చేశారు.

ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి శరవేగంగా భూసేకరణ

▶ మొదటి పేజీ తరువాయి

సన్నద్ధమవుతున్నారు. పెదపూడి రిజర్వాయర్‌తో పాటు ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రధాన కాలువను శ్రీకాకుళం జిల్లా వరకూ పూర్తి చేయడాన్ని ప్రభుత్వం ప్రాధాన్యతగా తీసుకుంది. ఆ తర్వాత దశల వారీగా భూదేవి, వీరనారాయణపురం, తాటిపూడి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లను నిర్మించనుంది. ఈ పథకానికి 63.2 టీఎంసీల గోదావరి నికర జలాలను కేటాయించిన ప్రభుత్వం.. వాటితో 8 లక్షల ఎకరాలకు సాగునీరు, 30 లక్షల మందికి తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు జలాలను అందించాలని నిర్ణయించింది. ఈ ప్రాజెక్టు పనుల కోసం రూ. 17,411.40 కోట్లను వ్యయం చేయనుంది.

తొలి, రెండో దశలకు శ్రీకారం..

- తొలి దశలో పనులను రూ. 954.09 కోట్ల వ్యయంతో రెండు ప్యాకేజీలుగా, రెండో దశలో పనులను రూ.5,134 కోట్లతో రెండు ప్యాకేజీలుగా కాంట్రాక్టర్లకు అధికారులు అప్పగించారు. రెండో దశలో మిగతా నాలుగు ప్యాకేజీ పనులకు టెండర్లు పిలిచేందుకు కసరత్తు చేస్తున్నారు.
- ఉత్తరాంధ్ర సుజల స్రవంతి తొలి దశలో పోలవరం ఎడమ కాలువ 162.409 కి.మీ. నుంచి గోదావరి జలాలను తరలించడానికి వీలుగా.. 18.90 కి.మీ.ల కాలువ, రెండు చోట్ల ఎత్తిపోతలు, 3.15 టీఎంసీల సామర్థ్యంతో పెదపూడి రిజర్వాయర్, ఆయకట్టుకు నీళ్లందించే డిస్ట్రిబ్యూటరీల పనులను చేపట్టనున్నారు.
- రెండో దశలో పాపయ్యపాలెం ఎత్తిపోతలతో పాటు 121.62 కి.మీ.ల పొడవున కాలువ తవ్వకం, ఆయకట్టుకు నీళ్లందించే డిస్ట్రిబ్యూటరీల పనులు చేపట్టనున్నారు.
- ఆ తర్వాత భూదేవి రిజర్వాయర్ (6.55 టీఎంసీలు), వీరనారాయణపురం రిజర్వాయర్ (6.20 టీఎంసీలు), తాటిపూడి రిజర్వాయర్ (3.80 టీఎంసీలు) వాటికి అనుబంధంగా ఎత్తిపోతలు, ప్రధాన కాలువల పనులకు టెండర్లు పిలిచి, దశలవారీగా పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

16,036.36 ఎకరాల భూసేకరణ

ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకం తొలి దశ పనులు చేపట్టడానికి 3,822 ఎకరాల భూమి అవసరం. రెండో దశ పనులు చేపట్టడానికి 12,214.36 ఎకరాలు వెరసి 16,036.36 ఎకరాల భూమిని సేకరించాలి. పెదపూడి రిజర్వాయర్‌తో పాటు ప్రధాన కాలువ పనులకు అవసరమైన భూమిని అనకాపల్లి, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో సేకరించడంలో అధికారులు నిమగ్నమయ్యారు. రెవెన్యూ అధికారులు సేకరించి జలవనరుల శాఖకు భూమిని అప్పగించిన వెంటనే పనులు ప్రారంభించేలా కాంట్రాక్టర్లను అధికారులు సన్నద్ధం చేస్తున్నారు. ప్రణాళికాయుతంగా.. శరవేగంగా ప్రాజెక్టును పూర్తి చేయడం ద్వారా ఉత్తరాంధ్రను సుభిక్షం చేసే దిశగా ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది.

అయ్యన్న పిటిషన్‌పై ముగిసిన వాదనలు

సాక్షి, అమరావతి: నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) ఫోర్జరీ వ్యవహారంలో తమపై సీఐడీ అధికారులు నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరుతూ మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఆయన కుమారుడు రాజేష్ దాఖలు చేసిన పిటిషన్‌లో వాదనలు ముగిశాయి. వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు తీర్పును రిజర్వ్ చేశారు. ఈ కేసులో మరో నిందితుడిగా ఉన్న అయ్యన్నపాత్రుడు కుమారుడు విజయ్ విషయంలో ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోకుండా ఉత్తర్వులు ఇవ్వాలన్న అయ్యన్న తరఫు న్యాయవాది అభ్యర్థన పట్ల న్యాయమూర్తి విముఖత చూపారు. 'ఇప్పుడు సీఐడీ అధికారులు చేయడానికి ఏముంది? మహా అయితే అరెస్ట్ చేసి.. మేజిస్ట్రేట్ ముందు హాజరు పరుస్తారు. మేజిస్ట్రేట్ ఇప్పటికే అయ్యన్న, రాజేష్‌ల రిమాండ్‌ను తిరస్కరించారు. ఇప్పుడు విజయ్ రిమాండ్‌ను కూడా తిరస్కరిస్తారు. అంతకు మించి ఏమీ జరగదు. విజయ్‌ని అరెస్ట్ చేసి, విశాఖపట్నం తీసుకొచ్చేందుకు సీఐడీకి ఖర్చు మినహా ప్రస్తుతం జరిగేందుకు ఏమీ లేదు' అని న్యాయమూర్తి సరదాగా వ్యాఖ్యానించారు.

ప్రాథమిక ఆధారాలతోనే..

ఈ కేసులో సీఐడీ తరఫున వాదనలు వినిపిస్తున్న అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి.. న్యాయమూర్తి గురువారం ఇచ్చిన ఆదేశాల మేరకు అయ్యన్నపాత్రుడు, ఆయన కుమారులపై సీఐడీ అధికారులు నమోదు చేసిన కేసుకు సంబంధించిన కేసు డైరీని కోర్టుకు సమర్పించారు. ప్రాథమిక ఆధారాలు సేకరించిన తర్వాతే అయ్యన్న తదితరులపై కేసు నమోదు చేశారని చెప్పారు. రాజకీయ కక్ష సాధింపు చర్యే అయితే ఫిర్యాదు చేసిన వెంటనే కేసు నమోదు చేసే వారమన్నారు. తమపై 13 కేసులు పెట్టారని, అన్నింటిలో తమకు హైకోర్టు స్టే ఇచ్చిందని అయ్యన్న తదితరులు గొప్పగా చెప్పుకుంటూ.. ఇలాంటి ఉత్తర్వులను చూసుకుని విర్రవీగుతున్నారని ఏఏజీ తెలిపారు. ముఖ్యమంత్రి సతీమణి గురించి అభ్యంతరకర, అనుచిత పోస్టులు పెట్టారని కోర్టుకు వివరించే ప్రయత్నం చేశారు. ఈ సమయంలో అయ్యన్న తరఫు న్యాయవాది జోక్యం చేసుకోగా.. ఆయన్ను న్యాయమూర్తి వారించారు. ఆ పోస్టుల గురించి తాను పత్రికల్లో చదివానని చెప్పారు. దీంతో ఏఏజీ తన వాదనలను కొనసాగించారు. ఫలానా కేసుల్లో దర్యాప్తు చేయకూడదని సీఐడీపై ఎలాంటి నిషేధం లేదన్నారు. అంతకు ముందు అయ్యన్న తరఫు న్యాయవాది వీవీ సతీష్ వాదనలు వినిపిస్తూ, ఆ ఎన్‌వోసీ వల్ల ఎలాంటి చట్టపరమైన హక్కు సంక్రమించదని, అందువల్ల సెక్షన్ 467 చెల్లదని తెలిపారు. తీవ్రమైన కేసుల్లోనే సీఐడీ విచారణ జరపాల్సి ఉంటుందని చెప్పారు. వీటన్నింటి దృష్ట్యా కేసును కొట్టేయాలని కోరారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి తీర్పును రిజర్వ్ చేశారు. బుధవారం ఉత్తర్వులు జారీ చేసేందుకు ప్రయత్నిస్తానని న్యాయమూర్తి తెలిపారు.

రాష్ట్ర వ్యాప్తంగా స్కిల్ డెవలప్‌మెంట్ సర్వే

సాక్షి, అమరావతి: నిరుద్యోగ యువతకు ఆసక్తి గల కోర్సుల్లో నైపుణ్య శిక్షణ ఇవ్వడంతో పాటు వారికి ఉపాధి అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్ సర్వే నిర్వహిస్తోంది. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో నిరుద్యోగ యువతను గుర్తించి వారి పేర్లను గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రత్యేక యాప్‌లో నమోదు చేసే ప్రక్రియను ఇప్పటికే వలంటీర్ల ద్వారా చేపట్టింది. సర్వే పురోగతిపై ప్రతి గురువారం కలెక్టర్లతో నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ డాక్టర్ సమీర్ శర్మ సమీక్ష నిర్వహిస్తున్నారు. వీలైనంత త్వరగా వలంటీర్ల ద్వారా స్కిల్ డెవలప్‌మెంట్ సర్వేను పూర్తి చేయించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 27,655 అభ్యర్థుల పేర్లను స్కిల్ హబ్ అప్లికేషన్‌లో నమోదు చేశారు. ఇప్పటికే అత్యధికంగా ప్రకాశం జిల్లాలో 13,056 మంది, ఆ తర్వాత స్థానంలో కృష్ణా జిల్లా నుంచి 2,097 పేర్లను స్కిల్ హబ్స్ అప్లికేషన్‌లో రిజిస్టర్ చేశారు.

98.69 శాతం మందికి పింఛన్లు

సాక్షి, అమరావతి: వలంటీర్లు శుక్రవారం కూడా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. ప్రస్తుత నవంబరు నెలకు సంబంధించి శుక్రవారం సాయంత్రం వరకు రాష్ట్ర వ్యాప్తంగా 61,51,799 మంది లబ్ధిదారులకు రూ.1,564.57 కోట్లు పంపిణీ చేశారని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ వెల్లడించింది.


ప్రకాశం జిల్లా ఒంగోలులో ఇశ్రాయేలుకు వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వలంటీర్ శశికుమార్


నెల్లూరు రూరల్ గొల్లకందుకూరులో లక్ష్మమ్మ వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వలంటీర్ లక్ష్మమ్మ


గుంటూరులో సుబ్బమ్మకు పింఛన్ అందజేస్తున్న వార్డు వలంటీరు అనిత


విజయవాడలో అనసూయకు వితంతు పింఛను అందజేస్తున్న సచివాలయం సెక్రటరీ జాహ్నవి

అప్పన్న భూములకు 'రక్షణ'

- గోడ నిర్మాణానికి శ్రీకారం
- భూమిపూజ చేసిన శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి
- పాల్గొన్న విజయసాయిరెడ్డి, అమర్‌నాథ్, వై.వి.సుబ్బారెడ్డి తదితరులు


సభలో మాట్లాడుతున్న స్వామీజీ స్వరూపానందేంద్ర సరస్వతి

ఆరిలోవ/మద్దిలపాలెం (విశాఖ తూర్పు)/సింహాచలం: సింహాద్రి అప్పన్న భూములు కాపాడడానికి చేసే ప్రయత్నమే రక్షణ గోడ నిర్మాణమని విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి చెప్పారు. సింహాచలం దేవస్థానం కొండపై ఆక్రమణలకు అడ్డుకట్ట వేసేందుకుగాను ప్రహరీ నిర్మాణానికి ఆయన శుక్రవారం ప్రజాప్రతినిధులతో కలిసి జాతీయరహదారి పక్కన హనుమంతవాక సమీపం కొండవాలులో భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతూ అప్పన్న భూములను పార్టీలకు అతీతంగా రక్షించుకోవాల్సిన అవసరముందని చెప్పారు. ఏ ప్రభుత్వం అప్పన్న భూముల రక్షణ కోసం ముందుకు వస్తుందో ఆ ప్రభుత్వానికి మనుగడ ఉంటుందని తెలిపారు. అప్పన్న భూములను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపైనా ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సింహాచలం దేవస్థానం భూములు ఆక్రమణకు గురికాకుండా కాపాడుతూ పంచగ్రామాల సమస్య పరిష్కరించే ప్రయత్నం చేయాలని సూచించినట్లు తెలిపారు. సింహగిరి దివ్యక్షేత్రం చుట్టూ రక్షణగోడ నిర్మాణంతో అప్పన్న కొండకు ఆక్రమణల నుంచి రక్షణ కలుగుతుందని చెప్పారు. నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేసి సింహాద్రినాథుని దివ్యరూపానికి ప్రతీకగా నిలిచిన అప్పన్నకొండను అపవిత్రం కాకుండా కాపాడుకోవాల్సి బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. ఈ గోడ నిర్మాణానికి తమ కోటా నిధుల నుంచి ఎంపీలు విజయసాయిరెడ్డి రూ.5 కోట్లు, సత్యవతి రూ.3 కోట్లు కేటాయించడం అభినందనీయమన్నారు. తరతరాలుగా సింహగిరి ఆక్రమణలకు గురవుతోందన్నారు. దీంతో దివ్యక్షేత్రం పవిత్రకు చేటువాటిల్లే ప్రమాదం పొంచి ఉన్న నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో ఎంపీ విజయసాయిరెడ్డి నేతృత్వంలో రక్షణగోడ నిర్మాణం చేపట్టడం శుభసూచకమని చెప్పారు. రెండేళ్లలో ఈ గోడ నిర్మాణం పూర్తిచేసి గిరిప్రదక్షిణ చేసే భక్తులకు కొండ చుట్టూ ఆధ్యాత్మిక శోభ తీసుకురావాలని సూచించారు. కొండచుట్టూ విష్ణుమూర్తి దశావతారాలు ఏర్పాటుచేసి గిరిప్రదక్షిణ భక్తులను పరవశింపచేయాలని సూచించారు. గతంలో అప్పటి ప్రధాని పి.వి.నరసింహారావు కూడా సింహాచలం భూముల గురించి ఆందోళన వ్యక్తం చేశారని గుర్తుచేశారు. ఎన్నో ఏళ్లగా ఉన్న పంచగ్రామల సమస్య రక్షణగోడ నిర్మాణంతో కొలిక్కి వస్తుందని భావిస్తున్నట్లు ఆయన తెలిపారు.

15 కిలోమీటర్లకుపైగా రక్షణగోడ

వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు విజయసాయిరెడ్డి మాట్లాడుతూ అప్పన్న భూముల సంరక్షణలో భాగంగా 15 కిలోమీటర్లకుపైగా రక్షణగోడ నిర్మించనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఎంపీ నిధులు రూ.8 కోట్లతో 4.2 కిలోమీటర్ల పొడవున గోడ నిర్మించనున్నట్లు తెలిపారు. తరువాత 11 కిలోమీటర్లకుపైగా గోడను రూ.16 కోట్లతో నిర్మించనున్నామన్నారు. దీనికోసం అవసరమైన నిధుల కోసం.. సీఎస్ఆర్‌లో భాగంగా కార్పొరేట్ సంస్థలు ముందుకొచ్చే విధంగా కృషిచేస్తామని తెలిపారు. ఇందులో ఇప్పటికే కొన్నిచోట్ల ఉన్న రక్షణగోడ మరమ్మతు పనులు కూడా చేపట్టినట్లు ఆయన చెప్పారు. టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ అప్పన్న భూముల సంరక్షణకు ఎంపీలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, అదీప్‌రాజ్, తిప్పల నాగిరెడ్డి, చెట్టి ఫల్గుణ, కరణం ధర్మశ్రీ, గొల్ల బాబూరావు పాల్గొన్నారు.

చంద్రబాబువి శవ రాజకీయాలు

768వ రోజు రిలే నిరాహార దీక్షలలో మండిపడ్డ బహుజన నాయకులు


రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: కులమతాలను అడ్డుపెట్టుకుని శవ రాజకీయాలకు పాల్పడుతున్న చంద్రబాబును వెంటనే అరెస్టు చేసి జైలుకు పంపాలని బహుజన పరిరక్షణ సమితి నాయకులు డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 768వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో శుక్రవారం పలువురు మాట్లాడారు. కోర్టు తీర్పుతో అమరావతి పేరిట జరుగుతున్న ఉద్యమం పూర్తిగా తెలుగుదేశం పార్టీ ఉద్యమమేనని ప్రజలకు అర్థమైందని, ఇక భవిష్యత్తులో రాజధాని రైతులెవరూ సహకరించే పరిస్థితి ఉండబోదన్నారు. రాజధానిలో భూములిచ్చిన రైతులకు ప్రభుత్వం సీఆర్డీఏ చట్టంలో పొందుపరచిన విధంగా అన్ని ప్యాకేజీలు సరైన సమయంలోనే ఇస్తుందని స్పష్టం చేశారు. పేదవాడికి రాజధానిలో సెంటు భూమి కేటాయించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే కోర్టులో తప్పుడు కేసులు వేసి సామాజిక అసమతుల్యత వస్తుందని ఇబ్బంది పెట్టిన చంద్రబాబు..అయ్యన్నపాత్రుడుపై జాలి ప్రదర్శిస్తూ కేవలం 2 సెంట్లు మాత్రమే ఆక్రమించాడని దానికే కేసులు పెడతారా అని చెప్పడం హాస్యాస్పదమన్నారు. కాగా, శుక్రవారం జరిగిన దీక్షలకు రాయలసీమ విద్యార్థి, యువజన సంఘాల కన్వీనర్ రాగిరి చంద్రప్ప, నాయకులు రామరాజు, వెంకటేష్ మద్దతు తెలిపారు. మాదిగాని గురునాథం, పెరికే వరప్రసాద్, నూతక్కి జోషి, బేతపూడి సాంబయ్య, ఈపూరి ఆదాం, పులి దాసు పలువురు దళిత నాయకులు పాల్గొన్నారు.

పీడబ్ల్యూడీ ఐకాన్స్‌కు సన్మానం

సాక్షి, అమరావతి: ఓటర్లలో చైతన్యం కలిగించే విధంగా వివిధ రాష్ట్రాలకు చెందిన దివ్యాంగులను కేంద్ర ఎన్నికల సంఘం సన్మానించింది. శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగిన కార్యక్రమంలో రాష్ట్రానికి చెందిన దివ్యాంగులు (పీడబ్ల్యూడీ) ఐకాన్స్‌తో కలిసి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేశ్ కుమార్ మీనా సచివాలయం నుంచి పాల్గొన్నారు. రాష్ట్రం నుంచి ఎంపిక చేసిన పీడబ్ల్యూడీ ఐకాన్స్ షేక్ జఫ్రీన్ (ఇండియా వినికిడి లోపం ఉన్న టెన్నిస్ టీమ్ కెప్టెన్), లావణ్య(పారా బ్యాడ్మింటన్ జాతీయ క్రీడల పతక విజేత), కె.నారాయణ (ప్రపంచ పారారోయర్), అనూప్‌రెడ్డి లక్ష్మణరావు(ఆసియన్ పారా స్విమ్మర్)ను మీనా సన్మానించారు. పీడబ్ల్యూడీ ఐకాన్ దృష్టిలోపం కలిగిన ఇండియా క్రికెట్ టీమ్ కెప్టెన్ అజయ్‌కుమార్ రెడ్డి కర్ణాటక నుంచి వర్చువల్‌గా పాల్గొన్నారు.


■ ప్రకాశం జిల్లా పెద్దదోర్నాల మండల పరిధిలోని శ్రీశైలం ఘాట్ రోడ్డులో శుక్రవారం పెద్దపులి యాత్రికులను ఒక్కసారిగా భయపెట్టింది. ఆ వీడియోను కొంత మంది సెల్‌ఫోన్ లో చిత్రీకరించారు. - పెద్దదోర్నాల

వచ్చే ఏడాది 'విజయవాడ' నుంచే హజ్ యాత్ర

ఏపీ హజ్ కమిటీ చైర్మన్ గౌసల్ ఆజామ్

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కృషితో విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచే వచ్చే ఏడాది హజ్ యాత్రను ప్రారంభిస్తామని ఆంధ్రప్రదేశ్ హజ్ కమిటీ చైర్మన్ బద్వేల్ షేక్ గౌసల్ ఆజామ్ ప్రకటించారు. వచ్చే సీజనులో ఏపీ హజ్ యాత్రికులకు సౌకర్యాలు కల్పించే ప్రయత్నాల్లో భాగంగా ఏపీ హజ్ కమిటీ ప్రత్యేక అధికారి ఎల్.అబ్దుల్ ఖాదిర్‌తో కలిసి గౌసల్ ఆజామ్ శుక్రవారం ముంబయిలోని హజ్ కమిటీ కేంద్ర కార్యాలయానికి వెళ్లారు. అక్కడి హజ్ కమిటీ ఆఫ్ ఇండియా సీఈవో యాకుబ్ శాఖాను కలిసి పలు అంశాలపై చర్చించారు. ఖాదిముల్ హజ్ వాలంటీర్ల ఎంపికలో హజ్ కమిటీలో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న తాత్కాలిక ఉద్యోగులకు కూడా అవకాశం కల్పించాలని హజ్ కమిటీ ఆఫ్ ఇండియా సీఈవోకు గౌసల్ ఆజామ్ వినతిపత్రం అందించారు. హజ్-2023 యాత్రకు ఏపీ నుంచి వెళ్లే యాత్రికులకు విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచే బయలుదేరే విధంగా ఎంబారికేషన్ పాయింట్‌ను తిరిగి ఇవ్వాలని కోరారు.

బీసీ భవన్‌కు స్థలం కేటాయించాలి

- ప్రభుత్వ సలహాదారు సజ్జలకు ఏపీ బీసీ సంఘం వినతి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 139 బీసీ కులాల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా బీసీల ఆత్మగౌరవాన్ని గౌరవిస్తూ అమరావతి వేదికగా బీసీ భవన్ నిర్మాణానికి ఐదెకరాల స్థలాన్ని కేటాయించాలని.. ప్రభుత్వమే బీసీ భవన్‌ను నిర్మించాలని ఏపీ బీసీ సంఘం కోరింది. ఈ మేరకు తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సంఘం ప్రతినిధులు శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు(ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారేష్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 139 బీసీ కులాలకు బీసీ భవన్ నిర్మించడంతో పాటు.. దానిలో అంతర్భాగంగా బీసీ కులాల చరిత్ర, సాహిత్యాన్ని తెలియజేస్తూ బీసీ మ్యూజియాన్ని కూడా ఏర్పాటు చేయాలని విన్నవించారు. బీసీల పక్షపాతి అయిన సీఎం జగన్ హయాంలోనే బీసీ భవన్ నిర్మాణం జరగాలని, బీసీలంతా కోరుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వేముల బేబీ రాణి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావెలకొల్లు వెంకట నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆ 87 గ్రామాలు పంచాయతీలా.. కాదా?

- మున్సిపల్ శాఖకు రాష్ట్ర ఎన్నికల సంఘం, పంచాయతీరాజ్ శాఖ లేఖలు
- రెండున్నరేళ్ల కిందట వాటి స్థాయిపెంపు, విలీన ప్రతిపాదనలు
- దీంతో అప్పట్లో ఆయా గ్రామాల్లో ఎన్నికల నిర్వహణ నిలిపివేత

సాక్షి, అమరావతి: పల్నాడు జిల్లా నరసరావుపేట మండలంలోని ఐదు గ్రామ పంచాయతీలను వాటిపక్కనే ఉన్న నరసరావుపేట మున్సిపాలిటీలో విలీనం చేయాలని రెండున్నరేళ్ల కిందట మున్సిపల్ శాఖ ప్రతిపాదించింది. వివిధ కారణాలతో ఇప్పటికీ ఆ ప్రక్రియ పూర్తికాలేదు. రాష్ట్ర వ్యాప్తంగా పెద్దసంఖ్యలో గ్రామ పంచాయతీలను స్థాయి పెంచాలని, లేకపోతే సమీపంలోని మున్సిపాలిటీలో విలీనం చేయాలని పురపాలకశాఖ ప్రతిపాదించింది. పలు పంచాయతీలను నగర పంచాయతీలుగా ఏర్పాటు చేయడంతోపాటు కొన్నింటిని వాటిపక్కనున్న మున్సిపాలిటీల్లో విలీనం చేశారు. 19 మండలాల్లోని 87 గ్రామ పంచాయతీల్లో వివిధ కారణాలతో ఇంకా ఈ ప్రక్రియ పూర్తి కాలేదు. మున్సిపల్ శాఖ ఈ తరహాగా ప్రతిపాదించిన గ్రామ పంచాయతీల్లో అప్పట్లో పంచాయతీరాజ్ శాఖ ఎన్నికల నిర్వహణను పక్కనపెట్టింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఖాళీగా ఉన్న స్థానికసంస్థల ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో భాగంగా రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) ఆ 87 గ్రామ పంచాయతీల తాజా పరిస్థితి గురించి ఆరా తీసింది. వాటిని నగర పంచాయతీలుగా మార్చే, సమీప పట్టణాల్లో విలీనం చేసే ప్రక్రియ ఎంతవరకు వచ్చిందని ఇటీవల మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖలకు లేఖ రాసింది. ఆ పంచాయతీలను గ్రామాలుగా కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నారా అని అడిగింది. ఈ విషయాలు తెలపాలని కోరింది. పంచాయతీరాజ్ శాఖ కూడా ఆయా పంచాయతీల తాజా పరిస్థితిని తెలియజేయాలంటూ రెండురోజుల కిందట మున్సిపల్ శాఖకు లేఖ రాసింది.

సాక్షి
ఫ్యామిలీ
విజయవాడ
శనివారం ॥ 5-11-2022

గోమాత

ఆవులపై అమ్మ ప్రేమ


కోడలుతో కలిసి ఆవులకు బెల్లం తినిపిస్తున్న బదాంబాయి


గోశాలలో ఆవులు

కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఉంటున్న ఎనభై ఏళ్ల బదాం బాయికి మూగజీవాలంటే ప్రేమ. పాతికేళ్ళ క్రితం గోశాల ఏర్పాటు చేసిన ఆమె, నేటికీ గో సంరక్షణ కోసం పాటుపడుతుంటుంది. గోవులపై ఆమెకున్న ప్రేమకు కుటుంబం కూడా మద్దతుగా ఉంటుంది. శక్తి ఉన్నన్ని రోజులు గో సేవ చేస్తానని చెబుతున్న ఆమెను అందరూ గోవుల అమ్మగా కీర్తిస్తుంటారు.

మదన్‌లాల్, బదాంబాయి దంపతులు తమ వైవాహిక జీవితం మొదలుపెట్టిన నాటి నుంచే ఆవు కనబడితే చాలు దండం పెట్టుకునే వారట. ఈ విషయం గురించి బదాంబాయిని అడిగితే ప్రతీ రోజూ ఉదయం క్రమం తప్పకుండా గో పూజ చేసేదాన్నని, ఆ భక్తి, ప్రేమ ఏళ్లు గడిచినకొద్దీ పెరిగిందే కానీ తగ్గలేదని చెబుతుంది

అన్నీ తానై..
2008లో బదాంబాయి భర్త మరణించాడు. అయినా, ఆమె గో సంరక్షణ మానుకోలేదు. 21 ఆవులతో మొదలైన వాటి సంఖ్య వందల్లోకి చేరింది. గడ్డివేయడం, గోశాల శుభ్రం చేయడం, బెల్లం, ఇతర బలవర్ధకమైన ఆహారాన్ని తినిపించడం ద్వారా ఆవులతో ఆమె అనుబంధం పెంచుకుంటూనే ఉంది. ప్రతి గోవు బాగోగులు దగ్గర ఉండి చూసుకోవడంలోనే ఆమె రోజు మొత్తం గడుపుతుంటుంది.



కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఎలక్ట్రానిక్స్ వ్యాపారంలో రాణించాడు మదన్‌లాల్. పిల్లలు పెద్దవాళ్లయ్యారు. వారూ జీవితాల్లో స్థిరపడుతున్నారు. ఆ సమయంలోనే గోశాల పెట్టాలన్న ఆలోచనను భర్తకు వివరించింది బదాంబాయి. అందుకోసం స్థలాన్వేషణ చేశారు. 1996లో 44వ నంబరు జాతీయ రహదారిపై జంగంపల్లి వద్ద స్థలాన్ని కొనుగోలు చేశాడు. 'శ్రీ కుమార్ పాల్ జీవ్ దయా ట్రస్ట్'ను ఏర్పాటు చేసి అదే సంవత్సరం 21 ఆవులతో గోశాల మొదలుపెట్టారు బదాంబాయి దంపతులు. వాటి సంరక్షణకు పనివాళ్లను నియమించారు. బదాంబాయి రోజూ ఉదయం 9 గంటలకు టిఫిన్‌బాక్స్ పట్టుకొని గోశాలకు చేరుకునేది. అక్కడే సాయంత్రం వరకు గోవులను చూసుకుని తిరిగి ఇంటికి చేరుకునేది. మదన్‌లాల్, ఆయన కొడుకులు కూడా వ్యాపారంలో బిజీగా ఉన్నా ప్రతీ ఆదివారం గోశాలకు వచ్చేవారు.

పాతికేళ్ల అనుబంధం...

ఎవరైనా ఆవులు అమ్మడానికి తీసుకువెళుతున్నారంటే చాలు వాటిని బాదంబాయి కొనుగోలు చేస్తుంటుంది. అలాగే దేవాలయాల వద్ద ఆవులను పెంచడం భారంగా భావించి ఈ గోశాలకు తీసుకు వస్తుంటారు. ఇప్పుడు గోశాలలో ఆవులు, లేగల సంఖ్య 158 కి చేరింది. ప్రతి రోజూ ఉదయమే బదాంబాయి కొడుకులు మహేందర్, మహిపాల్ లు ఆవులకు దాణా, కూరగాయలు, పండ్లు తీసుకువచ్చి వేస్తారు. ఆదివారం, సెలవు రోజుల్లో కొడుకులతోపాటు కోడళ్లు, మనవలు, మనవరాళ్లు కూడా గోశాలకు వచ్చి పనులు చేస్తుంటారు. అమావాస్య రోజున కుటుంబం అంతా గోశాలలోనే గడుపుతారు. అమ్మ వచ్చిందంటే చాలు ఆవులన్నీ ఆమెకు దగ్గరగా వెళ్లడానికి ప్రయత్నిస్తాయి. ఆమె వయసు పైబడటం, ఆరోగ్య దృష్ట్యా అమ్మకు ఇబ్బంది కలగగూడదన్న ఉద్దేశ్యంతో ఇటీవల అడ్డుగా ఇనుప జాలీలను ఏర్పాటు చేశారు. జాలీల నుంచి వాటికి బలవర్థకమైన ఆహారాన్ని అందిస్తుంటుంది. శక్తి ఉన్నన్ని రోజులూ గోవులకు సేవ చేస్తానని, పిల్లలందరూ ఇదే పనిని భక్తిగా చేస్తుంటారని వివరిస్తుంది బదాంబాయి.

పాలు పితకరు, అమ్మరు

ఈ గోశాలలో ఆవుల పాలు పితకరు. ఎన్ని ఆవులు ఈనినా సరే పాలు లేగలకు వదిలేస్తారు. ఆవులను గానీ, లేగలను గానీ అమ్మడం అనే మాట ఉండదు. వయస్సు పైబడి చనిపోయే దాకా వాటి సంరక్షణ బదాంబాయి, ఆమె కుటుంబం చూసుకుంటూ ఉంటుంది. చనిపోయిన గోవులను అక్కడే ఒక పక్కన గొయ్యి తీసి సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు నిర్వహిస్తారు. ఆవు మూత్రాన్ని మాత్రం సేకరించి బాటిళ్లలో నింపి పెడతారు. ఎవరైనా గృహ ప్రవేశాలు, యాగాల సందర్భంగా ఆవు మూత్రం కావాలని వచ్చిన వారికి ఇస్తారు. ఆవు పేడ కూడా తీసుకువెళతారు. కాగా ఆవు పేడను ఒక చోట జమ చేసి ఏడాదికోసారి అమ్ముతారు. పేడ అమ్మడం ద్వారా వచ్చిన డబ్బులను గోసేవా ట్రస్టుకే జమ చేస్తారు. ఆవులను మేపడం, గడ్డి కోసి వేయడం వంటి పనుల కోసం ఇప్పుడు నలుగురు పనివాళ్లను నియమించారు. వారికి వేతనాలతో పాటు దాణా కొనుగోలు కోసం నెలకు దాదాపు రూ.లక్షా 20 వేలు ఖర్చు చేస్తున్నామని తెలిపారు బదాంబాయి కొడుకులు.

నాలుగెకరాల్లో గడ్డి పెంపకం....

ఆవుల కోసం గోశాలలో నాలుగు ఎకరాల్లో గడ్డి పెంపకం చేపట్టారు. ఒక వైపు గడ్డి విత్తనం వేసి మొలకెత్తగానే, మరో పక్కన విత్తనం వేస్తారు. ఈ విధానం వల్ల ఎప్పుడూ గడ్డి అందుబాటులో ఉండే విధంగా చూసుకుంటారు. ఈ జాగ్రత్తతో పాటు ఎండుగడ్డినీ కొనుగోలు చేసి నిల్వ చేస్తారు. దాతలు కొందరు గడ్డిని అందిస్తారు. ఏటా ఎండు గడ్డి కోసం రూ.3.50 లక్షల వరకు ఖర్చు చేస్తామని బదాంబాయి కొడుకులు మహేందర్, మహిపాల్‌లు తెలిపారు.

– సేపూరి వేణుగోపాలచారి, సాక్షి, కామారెడ్డి


● సోమా బానిక్

ఓ భారతీయ యువతీ!
తెల్లగా ఉండడమే అందానికి కొలమానం అని ఎవరు నిర్దేశించారు?
అందంగా ఉన్న వాళ్లే విజేతలవుతారని నీకు ఎవరు చెప్పారు?
ఆత్మవిశ్వాసానికి తెల్లగా ఉండడమే గీటురాయి అనే సూత్రం ఎలా వచ్చింది?
మీ రెజ్యూమెలో మార్కులతో రాని ఆత్మవిశ్వాసం అందంతో వస్తుందా?
నీకు ఉద్యోగం తెచ్చేది నువ్వు సాధించుకున్న మార్కులే... తెల్లదనం కాదు.
తెల్లదనమే అందమనే అపోహ కాస్మెటిక్ మార్కెట్ సృష్టించిన మాయాజాలం.
ఈ మాయాజాలం ఇప్పుడు భారతీయ మహిళల ఆరోగ్యాన్ని హరిస్తోంది.
అరగంట ఎండను తాళలేకపోతే సమానత్వ పోరాటంలో మహిళ స్థానమెక్కడ?

ఆరోగ్యమే ఆత్మవిశ్వాసం

భారతీయ మహిళలు ఆరోగ్యం కోసం చేసే ఖర్చు కంటే అందంగా కనిపించడం కోసం చేసే ఖర్చే ఎక్కువగా ఉంటోంది. భవిష్యత్తులో ప్రమాదకరమైన పరిణామాలకు ఇది తొలి సంకేతం. వైటెనింగ్ క్రీమ్‌లు వాడుతున్న వాళ్లను ముంబయిలో ఓ సంస్థ ప్రశ్నించినప్పుడు 'తెల్లగా ఉంటే మరింత ఆకర్షణీయంగా ఉంటాననే ఉద్దేశంతో ఫెయిర్‌నెస్‌క్రీమ్‌ని వాడుతున్నాను' అని కొందరు బదులిచ్చారు. ఇంకా... 'మా ఇంట్లో వాళ్లు, స్నేహితులు ఫెయిర్‌నెస్ క్రీమ్ వాడమని చెప్పారు, వాడినప్పుడు బావున్నానని చెప్పారు. అందుకే కంటిన్యూ చేస్తున్నాను... అని, సినిమా వాళ్లు, యాడ్‌లో ఈ క్రీమ్‌లు వాడినందువల్లనే అందంగా కనిపిస్తున్నట్లు చెబుతున్నారు. కాబట్టి నేను కూడా అలా కనిపించడం కోసం వాడుతున్నాను'... ఇలాంటి సమాధానాలు వచ్చాయి. ఇది ఇలా ఉంటే... కోల్‌కతాకు చెందిన సోమా బానిక్ చేదు అనుభవం ఇలా ఉంది.

• • •

అది 2003, సోమా బానిక్‌కి పద్నాలుగేళ్లు. అప్పుడు సోమా బానిక్ తల్లితో ఓ పక్కింటావిడ అన్న మాటలు ఆ అమ్మాయి జీవితం మీద తీవ్రమైన దుష్ప్రభావాన్ని చూపించాయి. 'చర్మాన్ని తెల్లబరచడానికి మార్కెట్‌లో అన్ని క్రీమ్‌లున్నాయి కదా! మీ అమ్మాయికి ప్రయత్నించండి. కొత్తగా ఫలానా క్రీమ్ వచ్చింది. మంచి ఫలితం ఉంటోందట' అని వైటెనింగ్ క్రీమ్ పేరు కూడా చెప్పిందా పక్కింటావిడ.

తెల్లగా ఉంటేనే విజేతలవుతారా!

ఒక అమ్మాయి విజేతగా నిలవడానికి దగ్గర దారి తెల్లగా ఉండడమే అన్నంతగా కాస్మెటిక్ కంపెనీలు సమాజాన్ని ప్రభావితం చేస్తున్న రోజులవి. క్రీమ్‌ని వాడడం మొదలుపెట్టిన కొద్దిరోజుల్లోనే స్కూల్లో ఫ్రెండ్స్ సోమా చర్మంలో వచ్చిన మార్పును గుర్తించడం, ప్రశంసించడం మొదలైంది. రెండు నెలలు గడిచేటప్పటికి అసలు సమస్య మొదలైంది. ఎండలోకి వెళ్తే చర్మం చిరచిరలాడడం, మంట, దద్దుర్లు రావడం మొదలైంది. వైటెనింగ్ క్రీమ్ వాడేవాళ్లు ఇలాంటి మార్పును స్వచ్ఛందంగా స్వాగతిస్తారు. చర్మం తెల్లగా అయ్యే క్రమంలో ఇలాగే ఉంటుందని తమకు తాముగా సమాధానం చెప్పుకుంటారు. సోమా కూడా అందుకు మినహాయింపు కాలేకపోయింది. ఓ రోజు... క్రీమ్ రాసుకోవడం మరిచిపోయింది. స్కూలుకు వెళ్లిన కొద్ది గంటలకే ఆమె గడ్డం మీద చిన్న మచ్చలా మొదలై మొటిమలా తేలింది. ఇక క్రమం తప్పకుండా క్రీమ్ రాస్తూ ఏడాది పాటు కొనసాగించింది. చెంపల మీద మొదలైన సన్నని వెంట్రుకలు ముఖమంతా రావడాన్ని గమనించిందామె. ఇప్పుడామె వయసు 33. కోల్‌కతాలో స్టేట్‌గవర్నమెంట్ ఉద్యోగిని. ఇప్పుడామె భర్త ఎపిలేటర్ సహాయంతో ముఖం మీది వెంట్రుకలను తొలగించడంలో సహాయం చేస్తున్నాడు. ఇవన్నీ సోమా బానిక్ తన బ్లాగ్‌లో రాసుకున్న వివరాలు. ఈ లక్షణాలను విశ్లేషించిన డెర్మటాలజిస్టులందరూ ముక్తకంఠంతో చెప్పిన మాట ఒక్కటే... 'చర్మం తెల్లగా మారడానికి ఆమె వాడిన వైటెనింగ్ క్రీమ్‌లో ఉన్న స్టిరాయిడ్స్ కారణం' అని. అది కూడా దీర్ఘకాలం వాడడం వల్ల వెంట్రుకల వంటి సమస్యకు దారి తీసిందనీ.

రంగు మార్చే క్రీమ్‌లు లేవు!

చర్మం రంగును క్రీమ్‌లతో మార్చడం సాధ్యమయ్యే పని కాదన్నారు బెంగళూరుకు చెందిన డెర్మటాలజిస్ట్ ప్రియాంక రెడ్డి. "డెర్మటాలజీలో ఎంతటి అధునాతనమైన యంత్రాలు, ఔషధాలు వచ్చాయంటే... కోటి రూపాయల మెషినరీ కూడా ఉంది. కానీ చర్మాన్ని తెల్లబరిచే యంత్రం కానీ ఔషధం తయారు కాలేదు, కాదు కూడా. ఎందుకంటే చర్మం రంగు జన్యుపరంగా నిర్ణయమవుతుంది. అలా నిర్ణయమైన చర్మాన్ని ఆరోగ్యకరంగా మార్చడానికి వీలుంటుంది. గ్లామింగ్‌తోపాటు చర్మం మెరుపుతో కాంతులీనేటట్లు చేసే ట్రీట్‌మెంట్‌లున్నాయి. కానీ తెల్లబరిచే ట్రీట్‌మెంట్‌లు లేవు. అది ఆరోగ్యకరం కాదు కూడా. కొంతమంది హీరోయిన్లను ఉదాహరణగా చూపిస్తూ ఉంటారు. కానీ అది మేకప్, కెమెరా టెక్నిక్స్, ఎడిటింగ్ మీద ఆధారపడి ఉంటుంది. అలాగే వాళ్లు ఆరోగ్యకరమైన ట్రీట్‌మెంట్‌లు చేయించుకుంటారు తప్ప స్టిరాయిడ్స్, హైడ్రోక్వినోన్‌లు ఉండే వైటెనింగ్ క్రీమ్‌ల జోలికి వెళ్లరు. చర్మ సంరక్షణలో ఆరోగ్యకరమైన పద్ధతులనే అవలంబిస్తారు" అని చెప్పారామె. స్కిన్ వైటెనింగ్, లైటెనింగ్ వంటి హానికారకమైన డ్రగ్స్ మీద ఆంక్షలు విధించాలని 2017లో ఐఏడీవీఎల్ (ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ డెర్మటాలజిస్ట్స్ వెనెరియాలజిస్ట్) ఢిల్లీ హైకోర్టులో ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం వేసింది. నిషేధిత ఔషధాలు మార్కెట్‌లో యథేచ్ఛగా లభించడం మనదేశంలో జరుగుతున్న అరాచకమే. 'అప్పియరెన్స్‌లో ఏముంది' అని చెప్పడం సులువే, కానీ సమాజం అప్పియరెన్స్‌నే ప్రధానంగా చూస్తూ తోటివారిని న్యూనతకు గురిచేస్తూనే ఉంటుంది. సమాజం ఆలోచన మారి తీరాల్సిందేనన్నారు ప్రియాంక. అసలు ఈ తెల్లదనపు మాయకు ఆజ్యం పోసింది మన ప్రఖ్యాత చిత్రకారుడు రవివర్మ అంటే ఆశ్చర్యం కలగక మానదు.

రవివర్మ చిత్రలేఖనాన్ని డచ్ చిత్రకారుడి దగ్గర నేర్చుకోవడం... మన భారతీయ మహిళల మీద ఈ స్థాయిలో తీవ్రమైన దుష్ప్రభావాన్ని చూపించింది. ఆయన చిత్రించిన బొమ్మల్లో చాలా వరకు తెల్లగా యూరోపియన్ స్కిన్‌టోన్‌తో ఉంటాయి. ఆ బొమ్మల క్యాలెండర్లు దాదాపుగా అన్ని ఇళ్లకూ చేరాయి. అందంగా ఉండడం అంటే చర్మం తెల్లగా ఉండాలనే అపోహ కూడా ఇంటి గోడల నుంచి మెదడుకు దారి తీసింది. సమాజం ఈ అపోహ నుంచి బయటపడాలంటే మేధోవికసితమైన ఉద్యమం ఒకటి మౌనంగానే అయినా మొదలు కావాలి. అప్పుడు వైటెనింగ్, లైటెనింగ్ క్రీమ్‌ల మార్కెట్ మనదేశం నుంచి నిశ్శబ్దంగా నిష్క్రమిస్తుంది.

– వాకా మంజులారెడ్డి

ఆరోగ్యమే అందం



వైటెనింగ్ క్రీమ్‌లను రెండు నుంచి మూడు నెలలు వాడినప్పటి నుంచి చర్మం పలుచబడడం, ఎర్రబారడం మొదలవుతుంది. ఎంతగా అంటే.. రక్తనాళాలు కనిపించేటంతగా పలుచబడుతుంది. ఆపేయగానే మొటిమలు, పిగ్మెంటేషన్ (మంగు) మొదలవుతాయి. దీర్ఘకాలం వాడితే చర్మం మీద వెంట్రుకలు మొదలవుతాయి. చర్మ సంరక్షణకు సాధారణంగా అవసరమయ్యేవి మాయిశ్చరైజర్, సన్ స్క్రీన్, ఫేస్ వాష్‌లు మాత్రమే. అంతకు మించి ఏ అవసరం ఏర్పడినా డెర్మటాలజిస్టును సంప్రదించాల్సిందే. చర్మతత్వాన్ని స్వయంగా పరిశీలించి, సమస్యను, వయసును దృష్టిలో పెట్టుకుని క్రీమ్ లేదా లోషన్‌లను వాడాల్సి ఉంటుంది. తెల్లదనం కోసం ఖర్చు పెట్టడం వృథా ప్రయాస మాత్రమే. పొల్యూషన్ చర్మానికి హాని కలిగిస్తుంది. కాబట్టి చర్మాన్ని శుభ్రంగా ఉంచుకోవాలి. దేహం ఆరోగ్యంగా ఉంటే చర్మం కూడా కాంతులీనుతుంది. మంచి ఆహారం, తగినంత నిద్ర, నీరు తీసుకోవడం మీద మాత్రమే దృష్టి పెట్టాలి. అలాగే ఎక్సర్‌సైజ్ చేసి చెమట ద్వారా మలినాలు బయటకు పంపించడం కూడా చర్మానికి మెరుపునిస్తుంది.

– డాక్టర్ ప్రియాంక రెడ్డి,
మెడికల్ డైరెక్టర్, డీఎస్ఏ స్కిన్ క్లినిక్, బెంగళూరు


ముఖంపైన వెంట్రుకలు తొలగించడంలో సోమా బానిక్‌కు సహాయం చేస్తున్న భర్త

అంకురం

క్షేమంగా... లాభంగా

బ్రాండ్ అండ్ మార్కెటింగ్ ఎక్స్‌పర్ట్ అల్పన పరీదా రైడర్ సెంట్రిక్ స్టార్టప్‌తో కొత్త ప్రయాణం మొదలు పెట్టింది. 'యువత మనసుతో ఆలోచిస్తాను' అని చెప్పే పరీదా తన స్నేహితురాలు, వ్యాపార దిగ్గజం ఫల్గుణీ నాయర్ చెప్పిన మాటను శిరోధార్యంగా భావిస్తుంది.
'ఆసక్తి మాత్రమే కాదు. సవాళ్లను ఎదుర్కొనే సాహసం ఉండాలి'


● పరీదా

బ్రాండ్ డిజైన్, డిజైన్ థింకింగ్ ఏజెన్సీ 'డివై వర్క్స్'లో పనిచేయడానికి అల్పన పరీదా బెంగళూరు నుంచి ముంబైకి వెళుతున్నప్పుడు తన మదిలో ఎన్నో ఆలోచనలు. అందులో అనుకూలమైన వాటితోపాటు ప్రతికూలమైన ఆలోచనలు కూడా ఉన్నాయి. అయితే 'డివై వర్క్స్'లో చేరిన తరువాత తాను ఉద్యోగి మాత్రమే కాలేదు. విద్యార్థి కూడా అయింది.

'డిజైన్ అనేది కస్టమర్‌ను ఎలా ఆకట్టుకుంటుంది, ప్రాడక్ట్ వైపు వచ్చేలా ఎలా చేస్తుంది...మొదలైన విషయాలను ప్రత్యక్షంగా తెలుసుకోగలిగాను' అంటుంది పరీదా. ఫ్రానెస్కో ముట్టి అనే పాస్తా, పిజ్జా సాస్ తయారీ కంపెనీ కోసం తాను పని చేయాల్సి వచ్చింది. దీనికోసం క్షేత్రస్థాయిలో ఎంతో మందిని కలిసి వారి అభిప్రాయాలు తెలుసుకుంది.

చాలామంది కస్టమర్స్ గ్లాస్ జార్స్‌ను ఉపయోగించడాన్ని ఇష్టపడడం లేదని అర్థం చేసుకున్న ఆ కంపెనీ గ్లాస్ బాటిల్స్‌లో సాస్ అమ్మడం మొదలు పెట్టింది. ఇది సత్ఫలితాన్నిచ్చింది.

ఐఐఎం, అహ్మదాబాద్‌లో పీజీడీఎం(పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్) చేసింది.

'ఉద్యోగం చేయకుండా ఇంట్లో ఉన్నప్పుడు, ఉద్యోగం చేయలేకపోతున్నాననే బాధ మహిళల్లో ఉంటుంది. ఉద్యోగం చేస్తున్నప్పుడేమో, కుటుంబానికి న్యాయం చేయలేకపోతున్నాను అనిపిస్తుంది. అందుకే ఉద్యోగ జీవితాన్ని, కుటుంబ జీవితాన్ని సమన్వయం చేసుకుంటే ఎలాంటి సమస్యా ఉండదు' అంటుంది పరీదా.

మార్కెటింగ్ రంగంలో ఎన్నో విజయాలు సాధించిన పరీదాకు సొంతంగా కంపెనీ మొదలుపెట్టాలనే ఆలోచన వచ్చింది. ఆ సమయంలో తాను నేర్చుకున్న విషయం గుర్తొచ్చింది.

'ఎక్కడ అవసరం, ఎవరికి అవసరం, ఎందుకు అవసరం అనేవి ప్రాడక్ట్ విషయంలో ప్రధానంగా దృష్టిలో పెట్టుకోవాల్సిన విషయాలు. ఆ తరువాతే... విజువల్ ఐడెంటిటీ, బ్రాండ్ గురించి ఆలోచించాలి'

ఆ సమయంలో తన దృష్టి హెల్మెట్‌లపై పడింది. మన దేశం టూ–వీలర్స్ రైడర్స్‌కు పెట్టింది పేరు. హెల్మెట్ ధరించడం తప్పనిసరి. కానీ బైక్‌లతో పోల్చితే హెల్మెట్‌ల డిజైన్‌లో పెద్దగా మార్పు లేదు.

తన ప్రాజెక్ట్‌లో భాగంగా ఎంతో మంది రైడర్స్‌తో మాట్లాడి హెల్మెట్ ల విషయంలో వారి అభిప్రాయాలు తెలుసుకుంది.

'ప్లాస్టిక్ అనేది బకెట్స్‌కు బాగుంటుంది. మన తలను రక్షించడానికి కాదు. అందుకే ట్రాక్‌రైడర్స్ అందరూ కాంపోజిట్ ఫైబర్ హెల్మెట్‌లనే వాడతారు' అంటున్న పరీదా టూ–వీలర్స్ కోసం 'టీవ్ర'కు శ్రీకారం చుట్టింది. గ్లాస్ ఫైబర్ అండ్ కార్బన్ ఫైబర్ హెల్మెట్‌ల తయారీ కంపెనీ ఇది. తక్కువ బరువు ఉండడం ఈ హెల్మెట్‌ల ప్రత్యేకత.

సౌందర్య ఉత్పత్తుల సంస్థ 'నైకా' వ్యవస్థాపకురాలు ఫల్గుణీ నాయర్ పరీదాకు ఐఐఎం–అహ్మదాబాద్‌లో క్లాస్‌మేట్. ఒక విధంగా చెప్పాలంటే పరీదాకు స్ఫూర్తిని ఇచ్చింది నాయరే.

పరీదా సాధించిన విజయాలను బట్టి, ఆమెలో ఉత్సాహం మాత్రమే లేదని, సవాళ్లను ఎదుర్కొనే సాహసం మెండుగా ఉందని, ఆ సాహసమే తన వ్యాపారాన్ని ముందుకు నడిపించే ఇంధనమని అర్థం అవుతుంది.

శౌర్యమే శ్వాసగా...

స్త్రీ శక్తి

'సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్)లో మహిళలు ఏమిటి!' అనే ఆశ్చర్యం, అనుమానం కనిపించేవి.
సున్నితమైన ప్రాంతాలలో వారు విధులు నిర్వహించాల్సి రావడమే దీనికి కారణం.
అయితే ఆ ఆశ్చర్యాలు, అనుమానాలు కనుమరుగై పోవడానికి ఎంతోకాలం పట్టలేదు.
సీఆర్‌పీఎఫ్‌లో మహిళలు అద్భుతమైన విజయాలు సాధించారు.
స్త్రీ సాధికారతకు పెద్ద పీట వేస్తున్న సీఆర్‌పీఎఫ్‌లో తాజాగా ఇద్దరు మహిళా ఉన్నతాధికారులు ఇన్‌స్పెక్టర్ జనరల్ (ఐజీ) ర్యాంక్‌కు ప్రమోట్ అయ్యారు...

ఉద్యోగాలు రెండు రకాలుగా ఉంటాయి. కడుపులో చల్ల కదలకుండా హాయిగా చేసేవి ఒక రకం. రెండో రకం ఉద్యోగాలు మాత్రం అడుగడుగునా సవాలు విసురుతాయి. మన సామర్థ్యాన్ని పరీక్షించి చూస్తాయి.

'అమ్మాయిలకు పోలీసు ఉద్యోగాలేమిటి!' అనుకునే రోజుల్లో సాయుధ దళాల్లోకి వచ్చారు సీమ దుండియా, అనీ అబ్రహాం. వృత్తి నిబద్ధతతో ఉన్నతశిఖరాలకు చేరారు.

తాజాగా ఈ మహిళా ఉన్నతాధికారులు సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్(సీఆర్‌పీఎఫ్)లో ఇన్‌స్పెక్టర్ జనరల్(ఐజీ) ర్యాంక్‌కు ప్రమోట్ అయ్యారు. సీమా దుండియా సీఆర్‌పీఎఫ్–బిహార్ విభాగానికి, అనీ అబ్రహాం ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్(ఆర్ఎఎఫ్)కు నేతృత్వం వహించనున్నారు. ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌కు ఒక మహిళ నాయకత్వం వహించడం ఇదే మొదటిసారి.

'ఇదొక గొప్ప విజయం అనడంలో సందేహం లేదు. కేంద్ర రిజర్వు పోలీసు దళాలలో మహిళలు ఉగ్రవాదం నుంచి ఎన్నికల హింస వరకు అనేక రకాల సవాళ్లు ఎదుర్కొంటున్నారు. తమను తాము నిరూపించుకుంటున్నారు. మహిళా ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బందిలేని వాతావరణాన్ని కల్పించడం, సౌకర్యాలపై దృష్టి పెట్టడం, ఉన్నత విజయాలు సాధించేలా వారిని ప్రోత్సహించడం, ఆర్ఎఎఫ్‌ను మరింత ముందుకు తీసుకువెళ్లడం ఇప్పుడు నా ప్రధాన లక్ష్యాలు' అంటుంది ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ చీఫ్ అనీ అబ్రహాం.


● అనీ అబ్రహాం


● సీమా దుండియా

ఇక సీమా దుండియా స్పందన ఇలా ఉంది...

'నేను ఉద్యోగంలో చేరిన కొత్తలో సీఆర్‌పీఎఫ్‌లో పురుషాధిపత్య ధోరణులు కనిపించేవి. మగవాళ్లతో పోటీ పడగలమా? అనే సందేహం ఉండేది. దీంతో మమ్మల్ని మేము నిరూపించుకోవడానికి ఎక్కువ కష్టపడాల్సి వచ్చేది. అయితే ఆ కష్టం వృథా పోలేదు. మంచి విజయాలు సాధించేలా చేసింది. ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచేలా చేసింది. మొదట్లో మమ్మల్ని సందేహంగా చూసిన వారే ఆ తరువాత మనస్ఫూర్తిగా ప్రశంసించిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. నా అనుభవాలతో కొత్తవారికి మార్గదర్శనం చేయాలనుకుంటున్నాను' అంటుంది సీమా.

సీఆర్‌పీఎఫ్ మహిళా విభాగం ఫస్ట్ బ్యాచ్‌కు చెందిన సీమా, అబ్రహామ్‌లు ఐక్యరాజ్యసమితి తరఫున ఆల్–ఫిమేల్ ఫార్మ్‌డ్ పోలీస్ యూనిట్ (ఎఫ్‌పీయూ)లో కమాండర్‌లుగా పనిచేశారు.

ఇద్దరూ రాష్ట్రపతి పోలీస్ మెడల్స్ అందుకున్నారు.

'ఒకసారి యూనిఫాం వేసుకున్నాక...ప్రమాదకరమైన ప్రాంతమా, భద్రతకు ఢోకాలేని ప్రాంతమా అనే ఆలోచన రాదు. ఎలాంటి పరిస్థితులైనా ఎదుర్కోవలసిందే అనే ఆత్మబలం వచ్చి చేరుతుంది. అదే ఈ వృత్తి గొప్పదనం' అంటుంది అనీ అబ్రహాం.

మూడు దశాబ్దాల అనుభవంతో ఈ ఇద్దరు సాహసికులు ఎన్నో పాఠాలు నేర్చుకున్నారు. ఆ పాఠాలు భవిష్యత్ తరానికి విలువైన పాఠాలు కానున్నాయి.

బ్యూటిప్

ఒత్తైన కనుబొమల కోసం...

కొందరికి కనుబొమలు పలచగా ఉంటాయి. అలాంటివారు ఆముదం, కొబ్బరి నూనె, ఆలివ్ ఆయిల్..ఈ మూడింటిని సమపాళ్లలో తీసుకుని బాగా కలపాలి. తరువాత ఈ నూనెల మిశ్రమాన్ని ఒక గాజు సీసాలో పోసి భద్రపర్చుకోవాలి. రోజూ పడుకోబోయే ముందు ఈ ఆయిల్‌ను కొద్దిగా తీసుకుని రెండు కనుబొమలపై మర్దనా చేసుకోవాలి. ఇలా రోజూ చేయడం వల్ల కనుబొమలపై ఉన్న వెంట్రుకలు ఒత్తుగా పెరుగుతాయి.



లైఫ్@360



కళ్ల మీద దృష్టి పెట్టండి

కళ్లు.. మన ఆరోగ్యానికి వాకిళ్లు అని చెప్పచ్చు. విషప్రభావానికి గురైనప్పుడు కళ్లు మూతలు పడిపోతుంటాయి. అదేవిధంగా కొన్ని రకాల అనారోగ్యాలకు సూచనగా కళ్లు ఎర్రబడటం, మంటలు పుట్టడం, పుసికట్టడం జరుగుతుంటుంది. అందుకే చాలా మంది వైద్యులు మనం ఏదైనా సమస్యతో వెళ్లినప్పుడు కళ్లను కూడా పరీక్ష చేయడం చూస్తుంటాం. ఇంతకీ కళ్లు ఎలా ఉంటే ఏ సమస్య ఉందో ఎలా నిర్ధారించవచ్చో తెలుసుకుందాం.

అనారోగ్యాలను గుర్తించగలిగే పరిస్థితులు వస్తాయి. మన శరీరంలోని ఇతర అవయవాలు, భాగాలను పరీక్షించడానికి ఉపయోగించే పరికరాలు, టెక్నాలజీ, పద్ధతులకన్నా... కేవలం మన కళ్లలోకి చూసి అనేకరకాల ఆరోగ్య సమస్యలను గుర్తించటం సాధ్యమే. మన కళ్లు చూపే ప్రమాద సంకేతాల్లో కొన్ని ఇవి.

కనుపాప పరిమాణం

కనుపాప వెలుతురుకు తక్షణమే స్పందిస్తుంది. ప్రకాశవంతమైన వాతావరణంలో కనుపాప చిన్నదవుతుంది. వెలుతురు తగ్గే కొద్దీ కనుపాప పెద్దదవుతుంది. అయితే ఈ కనుపాప పరిమాణం హెచ్చుతగ్గుల ప్రతిస్పందన నెమ్మదిగా లేదా ఆలస్యంగా జరుగుతున్నట్లయితే దానిని పలు రకాల అనారోగ్యాలకు సూచనగా భావించవచ్చు. అందులో అల్జీమర్స్ వంటి వ్యాధులు, మందుల ప్రభావాలు, మాదకద్రవ్యాల వినియోగించారనే దానికి ఆధారాల వంటివి ఉంటాయి.

కొకెయిన్ వంటి మాదకద్రవ్యాలను ఉపయోగించే వారిలో కనుపాపలు ఉబ్బినట్లు కనిపిస్తే, హెరాయిన్ వాడేవారిలో కనుపాపలు చిన్నవిగా కనిపిస్తాయి.

ఎరుపు లేదా పసుపు కళ్లు

కంటిలోని తెల్లగుడ్డు రంగు మారటం మన శరీరంలో ఏదో తేడా ఉందనడానికి సంకేతం కావచ్చు.

కళ్లు రక్తంతో ఎరుపెక్కిన రంగులో కనిపిస్తే.. అది అధికమోతాదులో మద్యం లేదా, మాదక ద్రవ్యాలను తీసుకున్నదానికి సంకేతం కావచ్చు. కళ్లలో నలత లేదా ఇన్ఫెక్షన్ కారణంగా కూడా కళ్లు ఎర్రగా మారవచ్చు. అయితే ఈ సమస్య చాలావరకూ రోజుల్లోనే తగ్గిపోతుంది.

ఒకవేళ కళ్లు ఇలా రంగి మారి ఎక్కువ కాలం అలాగే ఉంటే మరింత తీవ్రమైన ఇన్ఫెక్షన్, వాపు లేదా కాంటాక్టు లెన్స్, సొల్యూషన్లకు రియాక్షన్‌కు సూచన కావచ్చు.

మరీ తీవ్రమైన కేసుల్లో ఎరుపు కళ్లు గ్లుకోమాకు సూచన కావచ్చు. ఈ జబ్బు అంధత్వానికి దారితీయగలదు. ఇక తెల్లగుడ్డు పసుపు రంగులోకి మారితే అది జాండిస్ (కామెర్లు)కు గుర్తు.



కళ్లలో ఎరుపు చార

కంటి తెల్లగుడ్డు మీద ఒక ఎర్రని, రక్తపు చార వంటి గుర్తు కనిపించిందంటే.. అది అక్కడి ఒక చిన్న రక్త నాళం చిట్లిందని అర్థం. ఈ పరిస్థితి కి చాలా సందర్భాల్లో కారణాలు తెలియవు. కొన్ని రోజుల్లోనే ఆ చార కనిపించకుండా పోతుంది. అయితే.. అధిక రక్తపోటుకు లేదా మధుమేహానికి సూచిక కావచ్చు. అంతేకాదు, రక్త సరఫరాలో గడ్డలు కట్టి అడ్డంకులు ఏర్పడి అధిక రక్తస్రావానికి దారితీయగల ప్రమాదానికి ఈ రక్త చారిక సంకేతం కావచ్చు. రక్తం పలుచబారటానికి వాడే ఆస్పిరిన్ వంటి మందులు కూడా ఈ చారకు కారణం కావచ్చు. ఈ సమస్య తరచుగా వస్తున్నట్లయితే తమకు ఇస్తున్న మందుల మోతాదును సమీక్షించాల్సిందిగా తనకు చికిత్స చేస్తున్న వైద్యుణ్ణి కోరవచ్చు.



కురుపులు, గడ్డలు

కళ్లలో మనం చూడగానే చాలా భయపెట్టే సమస్యలు ఒక్కోసారి అతి నిరపాయకరమైన, చాలా సులభంగా చికిత్స చేయగలిగే సమస్యలు కావచ్చు. కంటి తెల్లగుడ్డు మీద పుట్టుకువచ్చే పసుపు రంగులోని లావాటి గడ్డ ఉంటుంది. ఇది కొవ్వు, మాంసం ఒక చోట పేరుకుని ఏర్పడే గడ్డ. దీనిని చుక్కల మందుతో సులభంగా తగ్గించవచ్చు. లేదంటే చిన్నపాటి శస్త్రచికిత్సతో తొలగించవచ్చు. నిజానికి ఈ గడ్డను అది కార్నియాను – అంటే నల్లగుడ్డును తాకకముందే తొలగించి తీరాలి. ఒకవేళ అది పెరుగుతూ పోయేదాకా అశ్రద్ధ చేస్తే.. నల్లగుడ్డు (శుక్ల పటలం) మీద పెట్రీజియం అనే ఒక తెరవంటిది ఏర్పడుతుంది. అది చూపును మసకబారుస్తుంది.

ఉబ్బిన కళ్లు: కళ్లు బయటకు పొడుచుకు వచ్చినట్లు ఉబ్బుగా ఉండటం మామూలు ముఖాకృతిలో భాగంగా ఉండవచ్చు. కానీ, మామూలుగా ఉబ్బెత్తు కళ్లు లేని వారికి.. కళ్లు ఉబ్బుతూ బయటకు పొంగుతున్నట్లుగా రావటం మొదలైతే.. అందుకు థైరాయిడ్ గ్రంథి సమస్య కారణం కావచ్చు. దీనికి వైద్యసాయం అవసరం.

ఒకటే కన్ను బయటకు పొడుచుకు వచ్చినట్లు అయితే.. దానికి కారణం ఏదైనా గాయం కానీ, ఇన్ఫెక్షన్ కానీ కావచ్చు. అరుదైన కేసుల్లో కంటి వెనుక ట్యూమర్ (గడ్డ) ఏర్పడటం కారణం కావచ్చు.

రెప్పల మీద కురుపులు: కళ్లే కాదు, కనురెప్పలు కూడా చాలా అనారోగ్యాల గురించి సూచిస్తుంటాయి. ఇవి ప్రధానంగా కనురెప్పల గ్రంథులకు సంబంధించిన చిన్నపాటి అనారోగ్యాలకు గుర్తు. ఎక్కువగా పై కనురెప్ప మీద.. అరుదుగా కింది కనురెప్ప మీద ఒక ఎర్రటి గడ్డ ఏర్పడుతుంది. నూనె గ్రంథికి అడ్డంకులు తలెత్తటం వల్ల ఈ కురుపులు పుట్టుకొస్తాయి. ఈ కనురెప్పల కురుపులు మామూలుగా వాటికవే తగ్గిపోతాయి. లేదంటే కాపడం పెట్టటం ద్వారా తగ్గుతాయి. ఒకవేళ అలా తగ్గని పక్షంలో దీనిని చిన్నపాటి శస్త్రచికిత్సతో తొలగించాలి.

కళ్లు అదరటం

కళ్లు లేదా కనురెప్పలు అదరటం అనే ఈ పరిస్థితి చాలా వరకూ ఒత్తిడి వల్ల కానీ పోషకాహార సంతులనం లోపించటం వల్ల కానీ, అధిక మోతాదులో కెఫీన్ సేవించటం వల్ల కానీ తలెత్తే సమస్య. దీనిని అంతగా పట్టించుకోనక్కరలేదు.

చూశారుగా... ఇప్పటికైనా అప్పుడప్పుడు కళ్ల మీద దృష్టి పెడతారు కదా...

కన్నులో బూడిద రంగు వలయం

కంటిలో నల్లగుడ్డు (శుక్ల పటలం) చుట్టూ తెల్లటి లేదా బూడిద రంగు వలయం కనిపిస్తే అది అధిక కొవ్వుకు చిహ్నంగా, గుండె జబ్బు ప్రమాదం ఎక్కువ ఉన్నదని చెప్పే సంకేతంగా పరిగణిస్తారు. సాధారణంగా వయోవృద్ధుల కళ్లలో కూడా ఈ వలయాలు కనిపిస్తుంటాయి. అందుకే దీనికి వైద్య పరిభాషలో ఆర్కస్ సెనిలిస్ అని పేరు పెట్టారు.



మధుమేహులకు ఆరోగ్య ఫలం దానిమ్మ



ఒక గ్లాసు దానిమ్మ జ్యూస్ తాగడం ద్వారా రక్తంలో చక్కెర స్థాయిని 15 నిమిషాల్లో తగ్గించవచ్చని ఇటీవల ఓ అధ్యయనంలో వెల్లడైంది. ఈ అధ్యయనంలో పాల్గొన్న డయాబెటిక్ పేషెంట్లను రెండు గ్రూపులుగా విభజించి, వారిలో ఒక గ్రూప్‌కు 230 మిల్లీలీటర్ల చక్కెర నీళ్లు, మరో గ్రూప్‌కు 230 మిల్లీలీటర్ల దానిమ్మ జ్యూస్ ఇచ్చారు. దానిమ్మ జ్యూస్ తీసుకున్న వారిలో 15 నిమిషాల వ్యవధిలోనే షుగర్ లెవల్స్ తగ్గిపోగా, చక్కెర నీళ్లు తీసుకున్న వారి షుగర్ లెవల్స్‌లో ఎలాంటి మార్పు కనిపించలేదు. దానిమ్మలో అనేక రకాల యాంటీ ఆక్సిడెంట్‌లు ఉంటాయి. ఇది గ్రీన్ టీలో, రెడ్ వైన్‌లో ఉండే యాంటీ ఆక్సిడెంట్ల కంటే మూడు రెట్లు అధికం. ఈ యాంటీ ఆక్సిడెంట్లు డయాబెటిస్ లేదా ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే వ్యాధులతో పోరాడతాయి. దానిమ్మ గింజలు ఇన్సులిన్ సున్నితత్వాన్ని మెరుగుపరుస్తాయి.అందుకే ఇది మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఎంతో ప్రయోజనకరమైన ఫలంగా చెప్పవచ్చు.అంతేకాదు... దానిమ్మలో చాలా తక్కువ మొత్తంలో పిండి పదార్థాలుంటాయి. 100 గ్రాముల దానిమ్మలో పిండిపదార్థాలు (కార్బోహైడ్రేట్స్) కేవలం 19 శాతం మాత్రమే. కాబట్టి కార్బోహైడ్రేట్స్ తక్కువగా ఉండే దానిమ్మపండు మధుమేహులకు చాలా ప్రయోజనకరమైన పండు.

మీ పిల్లలు సరిగానే బ్రష్ చేస్తారా?



పంటి బాధ అనుభవించినవారికి గానీ అర్థం కాదు. చిన్నారులకు ఆ సమస్య వస్తే తట్టుకోవడం కష్టం. అందుకే అలాంటి పిల్లలూ, ఒకింత పెద్దపిల్లల్లో పంటి బాధలు రాకుండా ఉండాలంటే ఏం చేయాలో తెలుసుకుందాం.

చిన్నపిల్లల పళ్ల విషయంలో తల్లులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

పిల్లల నోటి ఆరోగ్యాన్ని అనేక అంశాలు ప్రభావితం చేస్తాయి. పళ్లు పుచ్చిపోవడం, వేలు చప్పరించడం, పళ్లకు నాలుక నిత్యం తట్టుకుంటూ ఉండటం, పిల్లలు తమ పెదవులను చప్పరిస్తూ ఉండటం, చిన్న వయసు లోనే పళ్లు ఊడిపోవడం వంటి అనేక అంశాలు వాళ్ల నోటి ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయి. ఒక్కోసారి చనుబాల వల్ల కూడా దంతక్షయం కావచ్చు. బ్రష్ చేయలేనంత చిన్న పిల్లల విషయంలో పాలు ఇచ్చాక లేదా వాళ్లు ఏమైనా తిన్న తర్వాత ఒక తడిగుడ్డతో వారి పళ్లను శుభ్రం చేయండి. దానివల్ల పళ్లపై బ్యాక్టీరియా, పాచి తొలగిపోయి పళ్లు, చిగుళ్లు ఆరోగ్యంగా ఉంటాయి.

కాస్తంత పెద్ద పిల్లల విషయంలో...

పెరిగే వయసు పిల్లల పళ్లు, చిగుళ్లు ఆరోగ్యంగా ఉండి, వాళ్ల పళ్లలో రంధ్రాలు రాకుండా ఉండాలంటే... రోజూ రెండుసార్లు బ్రష్ చేయడం నేర్పాలి. నాలుగేళ్లు దాటాక కూడా వేలు చప్పరించే పిల్లల పళ్లు వంకరటింకరగా రావడం లేదా ఒకేచోట గుంపుగా రావడం జరగవచ్చు. అందుకే ఈ అలవాటు త్వరగా మానేలా జాగ్రత్త పడాలి. పిల్లలను క్రమం తప్పకుండా డెంటిస్ట్ దగ్గరకు తీసుకెళ్లి పరీక్షలు చేయించాలి.



అపోహ వాస్తవం

అపోహ: గర్భిణులు గ్రహణ సమయంలో బయట తిరగడం వల్ల వారికి పుట్టబోయే బిడ్డలకు గ్రహణ మొర్రి వస్తుంది.

వాస్తవం: గ్రహణ మొర్రి అనేది గ్రహణ సమయంలో గర్భిణులు సరిగా ఉండకపోవడం వల్ల వస్తుందనే దానిలో ఎటువంటి శాస్త్రీయతా లేదు. గ్రహణ మొర్రి అనేది బిడ్డ పిండ దశలో ఉండగానే ఏర్పడే ఓ అవకరం. దాదాపు ప్రతి 1000 జననాల్లో ఒకరికి ఇలా గ్రహణం మొర్రి రావడం మామూలే. పిండం ఎదిగే సమయంలో దాదాపు ఆరు నుంచి పది వారాలప్పుడు బిడ్డలో తల భాగం రూపొందుతుంది. ఈ సమయంలో ఒక్కోసారి బిడ్డలోని రెండు పెదవులు, అంగిలి కలవవు. అలాంటప్పుడు బిడ్డలో ఈ మొర్రి ఏర్పడుతుంది. అయితే... శస్త్రచికిత్స ప్రక్రియలు బాగా అడ్వాన్స్ అయిన ప్రస్తుత సమయంలో ఇప్పుడిది సమస్యే కాదు. శస్త్రచికిత్స ద్వారా ఈ గ్రహణం మొర్రి సమస్యను సమర్థంగా చక్కదిద్దవచ్చు. గర్భం ధరించి ఉన్నప్పుడు గ్రహణ సంబంధిత అసలు దాని గురించి ఎలాంటి ఆందోళనా పడాల్సిన అవసరమే లేదు. అలాగని గ్రహణ సమయంలో ప్రత్యేకించి బయట తిరగమని చెప్పడం కాదు. అనుమానాలు, అపోహలు మాని మామూలుగానే ఉండవచ్చునని చెప్పడమే ముఖ్యోద్దేశం. (రెండు మూడు రోజుల్లో చంద్రగ్రహణం రానుంది)

సినిమా

షాలినీ.. అలియాస్ ఫాతిమా



● అదా శర్మ

"**ఆ**మె నర్సు కావాలని కలలు కనేది. కానీ కిడ్నాప్‌కి గురవుతుంది. ప్రస్తుతం ఆ అమ్మాయి ఆఫ్ఘనిస్తాన్‌లోని జైలులో ఉగ్రవాదిగా ఉంది'' అంటూ కన్నీటి పర్యంతమవుతూ తన కథ చెప్పింది షాలినీ ఉన్నికృష్ణన్. 'ది కేరళ స్టోరీ' చిత్రం ట్రైలర్‌లోని కథ ఇది. షాలినీ ఉన్నికృష్ణన్‌ని 'ఫాతిమా బా'గా మార్చి, ఐఎస్ఐ తీవ్రవాదిగా ఎలా తయారుచేశారని కూడా ఈ టీజర్‌లో షాలినీ పేర్కొంది. ఈ పాత్రను అదా శర్మ చేస్తుండగా, సుదీప్తో సేన్ దర్శకత్వం వహిస్తున్నారు. ''ఈ సినిమా కోసం సుదీప్తో నాలుగేళ్లు పరిశోధించారు. ఆయన చెప్పిన ఘటనలు విని, కన్నీళ్లు ఆగలేదు. అప్పుడే ఈ సినిమా నిర్మించాలని నిర్ణయించేసుకున్నాను. వాస్తవ ఘటనలను చూపించనున్నాం'' అన్నారు చిత్రనిర్మాత విపుల్ అమృత్‌లాల్ షా. కేరళలో అపహరణకు గురైన 32వేల మంది (యూనిట్ పేర్కొన్న లెక్క) మహిళల మత మార్చిడి, ఉగ్రవాదులుగా మార్చడం తదితర అంశాల నేపథ్యంలో ఈ చిత్రం ఉంటుంది. వచ్చే ఏడాది ఈ చిత్రం విడుదల కానుంది. కాగా ఈ చిత్రం టీజర్‌పై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



● సూర్య

వైజాగ్‌లో డిష్యుం డిష్యుం

వరలక్ష్మీ శరత్ కుమార్ లీడ్ రోల్‌లో నటిస్తున్న తాజా చిత్రం 'శబరి'. అనిల్ కాట్జ్ దర్శకత్వం వహిస్తున్నారు. మహర్షి కూండ్ల సమర్పణలో మహేంద్ర నాథ్ కూండ్ల నిర్మిస్తున్న ఈ సినిమా తాజా షెడ్యూల్ వైజాగ్‌లో పూర్తయింది. ఈ సందర్భంగా అనిల్ కాట్జ్ మాట్లాడుతూ– ''శబరి' భిన్నమైన చిత్రం. స్వతంత్ర భావాలున్న యువతి పాత్రలో వరలక్ష్మి కనిపిస్తారు. మూడో షెడ్యూల్‌లో భాగంగా వైజాగ్‌లోని ఆర్కే బీచ్, సిరిపురం జంక్షన్‌తో పాటు అరకు లాంటి అందమైన లొకేషన్లలో షూటింగ్ చేశాం. ప్రధాన తారాగణంపై కొన్ని యాక్షన్ సీక్వెన్స్‌లు, ఒక పాట, కీ సీన్స్ చిత్రీకరించాం. నందు, నూర్ మాస్టర్స్ పర్యవేక్షణలో రూపొందిన యాక్షన్ సీన్స్ హైలెట్‌గా నిలుస్తాయి. ఈ నెలలో హైదరాబాద్‌లో నాలుగో షెడ్యూల్ మొదలు కానుంది'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: గోపీ సుందర్, కెమెరా: రాహుల్ శ్రీవాత్సవ, నాని చమిడి శెట్టి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సీతా రామరాజు మల్లెల.



● వరలక్ష్మి

వివరాలు త్వరలో...



● అభిషేక్, సుకుమార్, వివేక్

ప్రముఖ దర్శకులు సుకుమార్, వివేక్ రంజన్ అగ్నిహోత్రి, నిర్మాత అభిషేక్ అగర్వాల్ కలయికలో ఓ క్రేజీ ప్రాజెక్ట్ రూపుదిద్దుకోనుంది. 'పుష్ప'తో పాన్ ఇండియా స్థాయిలో పేరు తెచ్చుకున్న తెలుగు దర్శకుడు సుకుమార్. 'కశ్మీరీ ఫైల్స్' సినిమాతో దేశవ్యాప్తంగా పాపులర్ అయ్యారు బాలీవుడ్ దర్శకుడు వివేక్ రంజన్ అగ్నిహోత్రి. ఇక 'కశ్మీరీ ఫైల్స్, కార్తికేయ 2' వంటి సంచలన హిట్ మూవీస్ నిర్మించారు అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ అధినేత, నిర్మాత అభిషేక్ అగర్వాల్. తాజాగా సుకుమార్–వివేక్–అభిషేక్ ఓ ప్రాజెక్ట్ గురించి చర్చించారు. అయితే ఈ సినిమాకు సంబంధించిన వివరాలను వారు వెల్లడించలేదు. ''సినిమాతో ఇండియాని ఏకం చేయాలన్నది సంకల్పం.. వివరాలు త్వరలో. ఊహించండి?'' అని ట్వీట్ చేశారు వివేక్ అగ్నిహోత్రి.

కథ వినగానే ఓకే చెప్పేశా!

- ఉన్ని ముకుందన్



''**నే**ను ఓ సినిమా ఎంచుకునే ముందు కథ ఏంటి? నా పాత్ర ఎలా ఉంది? ఆ పాత్రకి నేను ఎంత న్యాయం చేయగలను? అనేది ఆలోచిస్తా. నటుడిగా ఎప్పటికప్పుడు కొత్తదనం చూపించడం ముఖ్యం. 'యశోద' చాలా మంచి సినిమా. ప్రేక్షకుల స్పందన తెలుసుకోవడం కోసం ఎదురు చూస్తున్నాను'' అని నటుడు ఉన్ని ముకుందన్ అన్నారు. సమంత టైటిల్ రోల్‌లో హరి, హరీష్ దర్శకత్వం వహించిన చిత్రం 'యశోద'. 'జనతా గ్యారేజ్', 'భాగమతి', 'ఖిలాడీ' వంటి చిత్రాల తర్వాత ఉన్ని ముకుందన్ నటించిన తెలుగు చిత్రం 'యశోద'. శివలెంక కృష్ణప్రసాద్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 11న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఉన్ని ముకుందన్ మాట్లాడుతూ– ''హరి, హరీష్‌లు 'యశోద' కథ చెప్పినప్పుడు వెంటనే ఓకే చెప్పేశా. సమంత చాలా డెడికేటెడ్ అండ్ హార్డ్ వర్కింగ్ యాక్ట్రెస్. తనకు మయోసైటిస్ ఉందనే విషయం షూటింగ్‌లో మాకు తెలియదు.. తను కూడా చెప్పలేదు.. త్వరలోనే ఆమె కోలుకుంటారు. 'యశోద' ట్రైలర్‌కి మలయాళంలో కూడా మంచి స్పందన వచ్చింది. సరోగసీ నేపథ్యంలో రూపొందిన ఈ సినిమా అన్ని భాషల ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. ప్రస్తుతం మలయాళంలో రెండు మూడు సినిమాలు చేస్తున్నాను. 'మాలికాపురం' చిత్రాన్ని పాన్ ఇండియా కాన్సెప్ట్‌తో చేస్తున్నాం.. తెలుగులో కూడా ఆ చిత్రాన్ని విడుదల చేస్తాం'' అన్నారు.

మరో మంచి కథతో...

ఈ మధ్యకాలంలో సూర్య నటించిన చెప్పుకోదగ్గ చిత్రాల్లో 'జై భీమ్' ఒకటి. ఈ చిత్రంలో గిరిజనులకు అండగా నిలబడే లాయర్ చంద్రు పాత్రలో అద్భుతంగా నటించారు సూర్య. జ్ఞానవేల్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రానికి మంచి వసూళ్లతో పాటు ప్రశంసలు కూడా దక్కాయి. కాగా... సూర్య కోసం జ్ఞానవేల్ మరో మంచి కథ సిద్ధం చేశారట. ఇటీవల సూర్యకు వినిపించగా, ఆయన ఓకే చెప్పారని కూడా టాక్. అయితే ఇప్పటికిప్పుడు ఈ చిత్రం పట్టాలెక్కే అవకాశం లేదు. ప్రస్తుతం సూర్య రెండు మూడు చిత్రాలు చేస్తున్నారు, జ్ఞానవేల్ ఓ సినిమాకి దర్శకత్వం వహిస్తున్నారు. సో.. ఈ ఇద్దరి కాంబినేషన్ సినిమా ఆరంభం కావడానికి కాస్త సమయం పడుతుంది.

ట్రైలర్ చాలా బాగుంది

- వెంకటేష్



● జెన్నిఫర్, వెంకటేష్, ఉదయ్ శంకర్

''**న**చ్చింది గర్ల్ ఫ్రెండూ' ట్రైలర్ చాలా బాగుంది. కాన్సెప్ట్ కూడా ఆసక్తిగా ఉంది.. విజువల్స్ బాగున్నాయి. ఈ సినిమాలో ఫ్యామిలీ ఎమోషన్స్‌తో పాటు థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ కూడా ఉన్నాయని తెలిసింది. ఈ మూవీతో ఉదయ్ శంకర్‌కి, యూనిట్‌కి మంచి విజయం రావాలి'' అని హీరో వెంకటేష్ అన్నారు. ఉదయ్ శంకర్, జెన్నిఫర్ ఇమ్మాన్యుయేల్ జంటగా మధునందన్ కీలక పాత్రలో నటించిన చిత్రం 'నచ్చింది గర్ల్ ఫ్రెండూ'. గురు పవన్ దర్శకుడు. అట్లూరి ఆర్. సౌజన్య సమర్పణలో అట్లూరి నారాయణ రావు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 11న రిలీజవుతోంది. ఈ చిత్రం ట్రైలర్‌ని వెంకటేష్ రిలీజ్ చేశారు. ఉదయ్ శంకర్ మాట్లాడుతూ– ''ఒక రోజు జరిగే కథే ఈ చిత్రం. అన్ని ఎమోషన్స్ ఉన్న మా సినిమా యూత్‌కి బాగా కనెక్ట్ అవుతుంది'' అన్నారు. ''యూత్‌ఫుల్ కంటెంట్‌గా రూపొందిన ఈ సినిమాని ప్రేక్షకులు ఆదరిస్తారని నమ్ముతున్నాను'' అన్నారు అట్లూరి నారాయణరావు. ఈ చిత్రానికి కెమెరా: సిద్ధం మనోహర్, సంగీతం: గిఫ్టన్.

మీరా కథేంటి?



● కాకర్ల శ్రీనివాసు, వినాయక్, గార్గేయి

ఒకే ఒక్క పాత్రతో రూపొందిన చిత్రం 'హలో మీరా'. ప్రముఖ దర్శకులు బాపు దగ్గర సహదర్శకుడిగా చేసిన కాకర్ల శ్రీనివాసు ఈ చిత్రానికి దర్శకుడు. ఈ చిత్రం ట్రైలర్‌ను దర్శకుడు వీవీ వినాయక్ విడుదల చేసి, మాట్లాడుతూ – ''ట్రైలర్ బాగుంది. ఒకే ఒక్క క్యారెక్టర్‌తో ఆడియన్స్‌ను థ్రిల్ చేసే సినిమా తీయడం ఒక సవాల్. ఆ విషయంలో డైరెక్టర్ సక్సెస్ అయ్యారని ట్రైలర్ చూస్తే తెలుస్తోంది'' అన్నారు. పెళ్లి చేసుకోవాల్సిన మీరా రాత్రికి రాత్రి ఆ పెళ్లి కాదనుకొని కారులో హైదరాబాద్ బయల్దేరుతుంది. ఆ తర్వాత మీరా పరిస్థితి ఎలా మారింది? అనే కథాంశంతో ఈ చిత్రం ఉంటుంది. త్వరలోనే ఈ చిత్రాన్ని రిలీజ్ చేయనున్నారు. జీవన్ కాకర్ల సమర్పణలో రూపొందిన ఈ చిత్రంలో మీరాగా గార్గేయి యల్లాప్రగడ నటించారు.



● సూర్యనారాయణ, కార్తికేయ, ప్రియ వల్లభి

స్నేహితుల స్ఫూర్తితో...

సిద్ స్వరూప్, కార్తికేయ, ఇందు ప్రియ, ప్రియ వల్లభి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'దోస్తాన్'. సూర్య నారాయణ అక్కమ్మ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ఈ మూవీ టీజర్‌ని ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు బసిరెడ్డి లాంచ్ చేశారు. ''సిద్ స్వరూప్ అందించిన కథ నచ్చడంతో ఈ సినిమా చేశాను. ఇందులోని ఫైట్స్ రియలిస్టిక్‌గా ఉంటాయి'' అన్నారు సూర్యనారాయణ. ''చిన్ననాటి స్నేహితుల స్ఫూర్తితో ఈ కథ రాశా. నటుడిగా నా తొలి చిత్రమిది'' అన్నారు సిద్ స్వరూప్.

నలభై ఏళ్ల ఆకాంక్ష నెరవేరింది

- జాగర్లమూడి రాధాకృష్ణ మూర్తి



● రాధాకృష్ణ, రాజేశ్వర్

''ఏఎన్ఆర్‌గారు నటించిన 'ప్రతిబింబాలు' సినిమాను రాధాకృష్ణగారు వరల్డ్ వైడ్‌గా రిలీజ్ చేయడం చాలా గొప్ప విషయం. 40 ఏళ్ల తర్వాత రిలీజ్ అవుతున్న ఈ సినిమా ఒక రికార్డ్ సృష్టించబోతోంది'' అని ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు బసిరెడ్డి అన్నారు. అక్కినేని నాగేశ్వరరావు, జయసుధ జంటగా సింగీతం శ్రీనివాసరావు, కేయస్ ప్రకాశ్‌రావు దర్శకత్వం వహించిన చిత్రం 'ప్రతిబింబాలు'. రాజేశ్వర్ రాచర్ల సమర్పణలో జాగర్లమూడి రాధాకృష్ణ మూర్తి నిర్మించిన ఈ చిత్రం 250 థియేటర్స్‌లో నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా జాగర్లమూడి రాధాకృష్ణ మాట్లాడుతూ– ''ఈ చిత్రంలో ఏఎన్ఆర్‌గారు ద్విపాత్రాభినయం చేశారు. ఈ సినిమా రిలీజ్ కోసం 40 ఏళ్ల నుంచి నేను ఆరాటపడుతున్నాను. సినిమా రిలీజ్ చేయకుండానే చనిపోతానేమో? అనుకున్న టైమ్‌లో రాచర్ల రాజేశ్వర్ రావు రిలీజ్ చేయడానికి ముందుకు వచ్చి నా ఆకాంక్షను నెరవేర్చారు''అన్నారు. ''ప్రతిబింబాలు' సినిమా రిలీజ్ చేయడం నా అదృష్టంగా భావిస్తున్నాను'' అన్నారు రాచర్ల రాజేశ్వర్ రావు. ఈ సమావేశంలో ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ సెక్రటరీ ప్రసన్న కుమార్, నిర్మాత టి. రామ సత్యనారాయణ మాట్లాడారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	114	60,950
నిఫ్టీ ▲	64	18,117

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)

నాస్‌డాక్	10,324	▽	20
డోజోన్స్	32,018	▲	17
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,335	▲	146
డాక్స్	13,460	▲	330
షాంఘై	3,071	▲	73
నికాయ్	27,200	▽	464

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	50,522	▲	408
బంగారం (99.5 స్వచ్ఛత)	49,913	▲	407
వెండి (కిలో)	58,755	▲	1,706

భారత్‌లోనూ ట్విట్టర్ ఉద్యోగులకు ఉద్వాసన



న్యూఢిల్లీ: మైక్రోబ్లాగింగ్, సోషల్ నెట్‌వర్కింగ్ సర్వీస్ ట్విట్టర్ భారత్‌లోనూ ఉద్యోగులకు ఉద్వాసన పలుకుతోంది. తాజాగా 200ల పైచిలుకు సిబ్బందిని తొలగించినట్లు సమాచారం. వీరంతా ఇంజనీరింగ్, సేల్స్, మార్కెటింగ్, కమ్యూనికేషన్స్ విభాగాల్లో పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. మార్కెటింగ్, కమ్యూనికేషన్స్ డిపార్ట్‌మెంట్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులందరినీ తీసివేసినట్లు వార్తలు వస్తున్నాయి. విధుల నుంచి తొలగిస్తున్నట్లు ఈ-మెయిల్స్ ద్వారా కంపెనీ తన సిబ్బందికి సందేశాన్ని పంపిస్తోంది. భారత్‌లో ఉద్వాసనకు గురైన ఉద్యోగులకు చెల్లించాల్సిన విభజన ప్యాకేజీపై ఇంకా స్పష్టత లేదు. ఎలాన్ మస్క్ ట్విట్టర్ పగ్గాలు చేపట్టగానే కంపెనీ సీఈవో పరాగ్ అగర్వాల్‌తోసహా సీఎఫ్‌వో, ఇతర కీలక ఉన్నతాధికారులను ఇంటికి పంపించిన సంగతి తెలిసిందే. ట్విట్టర్‌ను ఆరోగ్యకర మార్గంలో ఉంచే ప్రయత్నంలో భాగంగా ప్రపంచవ్యాప్తంగా 3,738 మంది ఉద్యోగులకు స్వస్తి పలుకుతున్నట్టు ఇప్పటికే కంపెనీ స్పష్టం చేసింది. సంస్థ మొత్తం సిబ్బంది సంఖ్య 7,500.

తగ్గుతున్న ఆదాయం..

ట్విట్టర్ చర్యను సవాల్ చేస్తూ కొందరు ఉద్యోగులు శాన్‌ఫ్రాన్సిస్కో కోర్టును ఆశ్రయించారు. అవసరమైన నోటీసును అందించకుండా చట్టాన్ని ఉల్లంఘించిందని కోర్టుకు విన్నవించారు. మరోవైపు మస్క్ యాజమాన్యంలో కంపెనీ ఎలా పనిచేస్తుందోనన్న సందేహంతో ట్విట్టర్‌లో ప్రకటనలను జనరల్ మోటార్స్, ఆడితో సహా పెద్ద కంపెనీలు నిలిపివేశాయి. ప్రకటనదారులను శాంతింపజేయడానికి మస్క్ ప్రయత్నించినప్పటికీ.. కంటెంట్ నియంత్రణ అంత కఠినంగా ఉంటుందా, ట్విట్టర్‌లో ఉండటం బ్రాండ్‌లను దెబ్బతీస్తుందా అనే అంశంపై కంపెనీలు ఆందోళన చెందుతున్నాయి. 'కంటెంట్ నియంత్రణతో ఏమీ మారనప్పటికీ, కార్యకర్తలను శాంతింపజేయడానికి మేము చేయగలిగినదంతా చేశాం. అయినప్పటికీ కార్యకర్తల సమూహాలు ప్రకటనదారులపై ఒత్తిడి చేయడం వల్ల ట్విట్టర్ ఆదాయంలో భారీ తగ్గుదల ఉంది' అంటూ మస్క్ ట్వీట్ చేశారు.

సెలూన్ వ్యాపారంలోకి రిలయన్స్!

- నేచురల్స్‌లో 49 శాతం వాటా కొనుగోలుపై కసరత్తు
- హెచ్‌యూఎల్ వంటి సంస్థలతో పోటీ



న్యూఢిల్లీ: వివిధ రంగాల్లోకి వేగంగా విస్తరిస్తున్న పారిశ్రామిక దిగ్గజం రిలయన్స్ ఇప్పుడు సెలూన్ వ్యాపారంలోకి కూడా ప్రవేశిస్తోంది. గ్రూప్ సంస్థ, దేశీయంగా అతి పెద్ద రిటైలింగ్ కంపెనీ అయిన రిలయన్స్ రిటైల్ తాజాగా చెన్నైకి చెందిన నేచురల్స్ సెలూన్ అండ్ స్పాలో 49 శాతం వాటాలు కొనుగోలు చేయడంపై దృష్టి పెట్టింది. దీనికి సంబంధించి నేచురల్స్ ప్రమోటర్లతో చర్చలు జరుపుతోంది. అయితే, ఇందుకోసం ఎంత వెచ్చించబోతున్నది మాత్రం వెల్లడి కాలేదు. తమ కంపెనీ చరిత్రలోనే ఇది 'అతి పెద్ద మలుపు' అంటూ నేచురల్స్ సీఈవో, సహ వ్యవస్థాపకుడు సీకే కుమరవేల్ .. లింక్డ్‌ఇన్‌లో పోస్ట్ చేశారు. 'ఒక బహుళజాతి దిగ్గజం సెలూన్ పరిశ్రమలోకి ప్రవేశించబోతోంది' అని పేర్కొన్నారు. 'నేచురల్స్‌లో రిలయన్స్ రిటైల్ 49 శాతం వాటా కొనబోతోంది. దీనితో సెలూన్ల సంఖ్య మొత్తం 700 నుండి 4-5 రెట్లు వృద్ధి చెందనుంది. రాబోయే రోజుల్లో నేచురల్స్‌లో గణనీయమైన మార్పులు చూడబోతున్నాం' అని కుమరవేల్ పోస్ట్ చేశారు. నేచురల్స్ కార్యకలాపాల విస్తరణలో సహాయపడిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. మరోవైపు, నేచురల్స్‌లో వాటాల కొనుగోలు వార్తలపై స్పందించిన రిలయన్స్ ప్రతినిధి .. తాము ఎప్పటికప్పుడు వివిధ అవకాశాలను పరిశీలిస్తూ ఉంటామని పేర్కొన్నారు. ఈ డీల్ పూర్తయితే లాక్మే బ్రాండ్ పేరిట సెలూన్ సెగ్మెంట్‌లో కార్యకలాపాలు సాగిస్తున్న హిందుస్తాన్ యూనిలీవర్ వంటి దిగ్గజాలతో రిలయన్స్ రిటైల్ పోటీపడనుంది.

2000ల తొలినాళ్లలో కార్యకలాపాలు ప్రారంభించిన నేచురల్స్‌కు దేశవ్యాప్తంగా 700 సెలూన్‌లు ఉన్నాయి. 2025 నాటికి వీటి సంఖ్యను 3,000కు పెంచుకోవాలని యోచిస్తోంది. ఇక రిలయన్స్ గ్రూప్‌లో అన్ని రిటైల్ కంపెనీలకు రిలయన్స్ రిటైల్ వెంచర్స్ (ఆర్‌ఆర్‌వీఎల్) హోల్డింగ్ కంపెనీగా ఉంది. దీనికి రిలయన్స్ రిటైల్ అనుబంధ సంస్థ. గత ఆర్థిక సంవత్సరంలో ఆర్‌ఆర్‌వీఎల్ రూ. 2 లక్షల కోట్ల టర్నోవర్ (కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన) నమోదు చేసింది.

రిలయన్స్ ఇండిపెండెంట్ డైరెక్టర్‌గా కేవీ కామత్

ప్రముఖ బ్యాంకర్ కేవీ కామత్‌ను ముకేశ్ అంబానీ నేతృత్వంలోని కంపెనీ బోర్డులో స్వతంత్ర డైరెక్టర్‌గా నియమిస్తున్నట్లు రిలయన్స్ ఇండస్ట్రీస్ శుక్రవారం ప్రకటించింది. 74 సంవత్సరాల కామత్‌ను ఐదేళ్ల కాలానికి నియమించినట్లు సంస్థ స్టాక్ ఎక్స్ఛేంజ్‌కి సమర్పించిన ఫైలింగ్‌లో తెలిపింది. 1971లో ఐసీఐసీఐ బ్యాంక్‌లో తన కెరీర్‌ను ప్రారంభించిన ఐఐఎం అహ్మదాబాద్ గ్రాడ్యుయేట్, పద్మభూషణ్ కామత్‌కు బ్యాంకింగ్ రంగంలో అపార అనుభవం ఉన్న సంగతి తెలిసిందే. ఇటీవల పదవీ విరమణ చేసిన రిలయన్స్ బోర్డులోని ఇద్దరు స్వతంత్ర డైరెక్టర్లలో ఒకరి స్థానంలో కామత్ నియమితులయ్యారు.

మారుతీ సుజుకీ రూ.7,000 కోట్ల పెట్టుబడి

న్యూఢిల్లీ: వాహన తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.7,000 కోట్ల పెట్టుబడి వ్యయం చేయనుంది. హరియాణాలోని ఖర్ఖోడ వద్ద కొత్త ప్లాంటు నిర్మాణ పనులు, నూతన మోడళ్ల పరిచయం, పరిశోధన, అభివృద్ధి కోసం ఈ నిధులను వెచ్చించనున్నట్టు సంస్థ సీఎఫ్‌వో అజయ్ సేథ్ వెల్లడించారు. 'ఎలక్ట్రానిక్స్ విడిభాగాల కొరత ఇప్పటికీ ఉత్పత్తి సంఖ్యను పరిమితం చేస్తోంది. తయారీ ప్రణాళిక విషయంలో ఈ సమస్య సవాల్‌గా ఉంది. ఈ త్రైమాసికంలో కంపెనీ 35,000 వాహనాలను ఉత్పత్తి చేయలేకపోయింది. సెప్టెంబర్ చివరినాటికి పెండింగ్ ఆర్డర్లు 4.12 లక్షల యూనిట్లు. ఇందులో 1.3 లక్షల యూనిట్లు ఇటీవల విడుదలైన మోడళ్లవే ఉన్నాయి. బ్రెజా, గ్రాండ్ విటారా విజయవంతం కావడంతో ఎస్‌యూవీల విభాగంలో మరిన్ని మోడళ్లను తేవాలని లక్ష్యంగా చేసుకున్నాం' అని తెలిపారు. ఖర్ఖోడ ప్లాంటు 2025లో కార్యరూపంలోకి రానుంది. ఈ కేంద్రం వార్షిక తయారీ సామర్థ్యం తొలి దశలో 2.5 లక్షల యూనిట్లు. మారుతీకి హరియాణాలో రెండు, మాతృ సంస్థ సుజుకీ మోటార్స్‌కు గుజరాత్‌లో ఒక ప్లాంటు ఉంది.



గెయిల్‌కు రష్యా గ్యాస్ కష్టాలు..

క్యూ2లో లాభం 46 శాతం డౌన్



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో దేశీ గ్యాస్ పంపిణీ దిగ్గజం గెయిల్ (ఇండియా) నికర లాభాలు 46% తగ్గి రూ. 1,537 కోట్లకు పరిమితమయ్యాయి. గత క్యూ2లో ఇవి రూ. 2,863 కోట్లుగా నమోదయ్యాయి. సమీక్షా కాలంలో ఆదాయం 79 శాతం పెరిగి రూ. 38,391 కోట్లకు చేరింది. ఎరువుల ప్లాంట్లు, సీఎన్‌జీ రిటైలర్లు తదితర కస్టమర్లకు గెయిల్ గ్యాస్ సరఫరా చేస్తోంది. రష్యన్ ఇంధన దిగ్గజం గాజ్‌ప్రోమ్‌కి చెందిన (గతంలో) గాజ్‌ప్రోమ్ మార్కెటింగ్ అండ్ ట్రేడింగ్ సింగపూర్ (జీఎంటీఎస్) నుంచి గ్యాస్ సరఫరాలో అంతరాయం ఏర్పడటం, ఫలితాలపై ప్రతికూల ప్రభావం చూపింది. ప్రస్తుతం గాజ్‌ప్రోమ్ జర్మేనియా అనుబంధ సంస్థగా మారిన జీఎంటీఎస్.. ద్రవీకృత సహజ వాయువు (ఎల్‌ఎన్‌జీ) కార్గోల డెలివరీని నిలిపివేసినట్లు గెయిల్ డైరెక్టర్ ఆర్‌కే జైన్ ఇన్వెస్టర్ల సమావేశంలో వెల్లడించారు. జీఎంటీఎస్ ఇప్పటివరకూ 17 కార్గోల సరఫరాలో డిఫాల్ట్ అయినట్లు తెలిపారు.

సూచీలకు స్వల్ప లాభాలు

- ఆదుకున్న ఆఖరి గంట కొనుగోళ్లు
- సెన్సెక్స్ లాభం 114 పాయింట్లు
- మళ్లీ 18,100 స్థాయిపైకి నిఫ్టీ



ముంబై: ఆఖర్లో ఇంధన, ఫైనాన్స్, మెటల్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో స్టాక్ సూచీలు శుక్రవారం స్వల్ప లాభాలతో గట్టెక్కాయి. ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందాయి. విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్లు కలిసొచ్చాయి. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి అనూహ్య రికవరీతో సెంటిమెంట్ మరింత బలపడింది. సెన్సెక్స్ ఉదయం 138 పాయింట్ల లాభంతో 60,698 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించింది. ఇంట్రాడేలో 60,666-61,004 మధ్య కదలాడింది. చివరికి 114 పాయింట్లు పెరిగి 60,950 వద్ద స్థిరపడింది. నిఫ్టీ ఇంట్రాడేలో 18,017 వద్ద కనిష్టాన్ని, 18,135 వద్ద గరిష్టాన్ని తాకింది. మార్కెట్ ముగిసే సరికి నిఫ్టీ 64 పాయింట్లు పెరిగి 18,117 వద్ద నిలిచింది. ప్రైవేట్ బ్యాంక్స్, ఫార్మా, ఎఫ్‌ఎంసీజీ, ఐటీ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1436 కోట్ల షేర్లను కొన్నారు. దేశీ ఇన్వెస్టర్లు రూ.548 కోట్ల షేర్లను అమ్మేశారు. ఆసియాలో మార్కెట్లు 2% లాభపడ్డాయి. జపాన్ ఇండెక్స్ మాత్రమే నష్టపోయింది. యూరప్ సూచీలు 3-3.50% ర్యాలీ చేశాయి.

రూపాయి 52పైసలు అప్

డాలర్ మారకంలో రూపాయి విలువ శుక్రవారం 52పైసలు లాభపడి 82.35కు ఎగసింది. ఎఫ్‌ఐఐలు క్యాపిటల్ మార్కెట్లలో (రూ.1,436 కోట్లు) నికర కొనుగోళ్లు జరపడం, అక్టోబర్ 28తో ముగిసిన వారంలో విదేశీ మారకద్రవ్య నిల్వలు అంతక్రితం వారంలో పోల్చితే 6.561 బిలియన్ డాలర్లు పెరిగి 531.081 బిలియన్ డాలర్లకు చేరినట్లు వెలువడిన తాజా గణాంకాలు దీనికి నేపథ్యం.

జీఈ, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ఒప్పందం పొడిగింపు

న్యూఢిల్లీ: వాణిజ్య విమానాల ఇంజిన్ల విడిభాగాల తయారీ, సరఫరాకు సంబంధించిన 1 బిలియన్ డాలర్ల కాంట్రాక్టును జీఈ ఏరోస్పేస్, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ (టీఏఎస్‌ఎల్) పొడిగించుకున్నాయి. ఈ ఒప్పందం కింద జీఈ అంతర్జాతీయ ఇంజిన్ తయారీ ఫ్యాక్టరీల కోసం టీఏఎస్‌ఎల్ విడిభాగాల ఉత్పత్తిని దీర్ఘకాలం కొనసాగించనుంది. 2017లో తొలిసారిగా రెండు కంపెనీలు ఈ కాంట్రాక్టు కుదుర్చుకున్నాయి. ఇంజిన్ల విడిభాగాల తయారీ కోసం 2018లో టాటా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఏరో ఇంజిన్స్ (టాటా-టీసీవోఈ) ఏర్పాటైంది. ఇందులో జీఈ, సాఫ్రాన్ ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్స్ జాయింట్ వెంచర్ కంపెనీ అయిన సీఎఫ్‌ఎం ఇంటర్నేషనల్ ఎల్‌ఈఏపీ ఇంజిన్ భాగాలు తయారవుతున్నాయి. దేశీయంగా పలు ఎయిర్‌క్రాఫ్ట్‌లలో సీఎఫ్‌ఎం ఇంజిన్లనే ఉపయోగిస్తున్నారు.



టైటాన్‌కు పండుగ సీజన్ జోష్..

క్యూ2లో లాభం 30% అప్: రూ. 835 కోట్లు



న్యూఢిల్లీ: పండుగ సీజన్ అమ్మకాల ఊతంతో ఆభరణాలు, వాచీల తయారీ దిగ్గజం టైటాన్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో రూ. 835 కోట్ల నికర లాభం ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే వ్యవధిలో నమోదైన రూ. 641 కోట్లతో పోలిస్తే లాభం 30 శాతం పెరిగింది. మొత్తం ఆదాయం 22 శాతం వృద్ధి చెంది రూ. 7,548 కోట్ల నుంచి రూ. 9,224 కోట్లకు చేరింది. వ్యయాలు 21 శాతం పెరిగి రూ. 6,680 కోట్ల నుంచి రూ. 8,082 కోట్లకు చేరాయి. అన్ని వ్యాపార విభాగాల్లోనూ పటిష్టమైన పనితీరు కొనసాగుతోందని టైటాన్ ఎండీ సీకే వెంకటరామన్ తెలిపారు. జ్యుయలరీ, వాచీలు, వేరబుల్స్, ఐకేర్ వంటి పెద్ద వ్యాపార విభాగాలన్నింటా 17-19 శాతం వృద్ధి సాధించినట్లు ఆయన వివరించారు. దేశ, విదేశాల్లో విస్తరణ ప్రణాళికలు అమలు చేస్తున్నామని, రాబోయే త్రైమాసికాల్లోనూ మెరుగైన ఫలితాలే సాధించగలమని వెంకటరామన్ ధీమా వ్యక్తం చేశారు. విభాగాల వారీగా చూస్తే.. సెప్టెంబర్ త్రైమాసికంలో జ్యుయలరీ సెగ్మెంట్ ఆదాయం 22 శాతం పెరిగి రూ. 7,997 కోట్లకు చేరింది.

టీవీఎస్ మోటార్ లాభం రూ. 373 కోట్లు

న్యూఢిల్లీ: టీవీఎస్ మోటార్ కంపెనీ సెప్టెంబర్ క్వార్టర్‌కు రూ.373 కోట్ల లాభాన్ని ప్రకటించింది. ఆదాయం రూ.8,561 కోట్లుగా ఉంది. అంతక్రితం ఏడాది ఇదే కాలానికి లాభం రూ.234 కోట్లు, ఆదాయం రూ.6,483 కోట్ల చొప్పున ఉన్నాయి. అన్ని రకాల వాహనాల అమ్మకాలు 12 శాతం పెరిగి 10.27 లక్షల యూనిట్లుగా ఉన్నాయి. ప్రీమియం మోటారు సైకిళ్లలో పనితీరు జూన్ త్రైమాసికంతో పోలిస్తే మెరుగుపడినట్టు కంపెనీ తెలిపింది.



సాక్షి స్పోర్ట్స్

విజేత భారత్

కొరియాలోని చెంగ్జులో జరిగిన ఆసియా స్క్వాష్ టీమ్ చాంపియన్‌షిప్‌లో భారత పురుషుల జట్టు స్వర్ణం సాధించింది. శుక్రవారం జరిగిన ఫైనల్లో భారత్ 2-0 తేడాతో కువైట్‌పై విజయం సాధించింది. ఈ టోర్నీలో భారత్ విజేతగా నిలవడం ఇదే తొలిసారి. తొలి మ్యాచ్‌లో రమీత్ టాండన్ 11-5, 11-7, 11-4తో అలీ అరామెజిపై గెలుపొందగా, రెండో మ్యాచ్‌లో భారత స్టార్ సౌరవ్ ఘోషాల్ 11-9, 11-2, 11-3తో అమ్మార్ అల్టమిమిని చిత్తు చేశాడు. ఫలితం తేలడంతో అభయ్ సింగ్, ఫలా మొహమ్మద్ మధ్య జరగాల్సిన చివరి మ్యాచ్‌ను నిర్వహించలేదు. గతంలో ఆసియా చాంపియన్‌షిప్‌లో భారత్ రెండు సార్లు రన్నరప్‌గానే నిలిచింది. సెమీఫైనల్లో మలేసియా చేతిలో 1-2తో ఓడిన భారత మహిళల జట్టుకు కాంస్యం లభించింది.



ఆసీస్ గెలిచినా... కంగారే!

- ఖాయం కాని సెమీస్
- 4 పరుగులతో ఓడిన అఫ్గానిస్తాన్
- వణికించిన రషీద్‌ఖాన్
- ఇంగ్లండ్ ఓడితేనే ఆతిథ్య జట్టు ముందుకు
- టి20 ప్రపంచకప్



మ్యాక్స్‌వెల్

అఫ్గాన్‌తో తలపడిన 'కంగారూ'ను చూస్తే... మ్యాచ్ గెలిచినా సరే... ఇంతకి ఇది ఆస్ట్రేలియా జట్టేనా? సొంతగడ్డపై డిఫెండింగ్ చాంపియన్ ఆడాల్సిన ఆటేనా? నాణ్యమైన జట్టు ఇలా గెలవడమేంటి. ఆఖరి లీగ్ అయిపోయినా ముందుకెళ్లేందుకు అగచాట్లు పడటమేంటి అనే ప్రశ్నలు సగటు క్రికెట్ అభిమానిని పదేపదే తొలిచేస్తున్నాయి. నిజమే మరి... చివరి లీగ్‌లో... అదీ కీలకమైన దశలో... ఓ క్రికెట్ కూనతో చచ్చిచెడి గెలిచినా ఆసీస్‌కు సెమీస్ ఖాయం కాలేదు. తమ ఆటతీరుతో అఫ్గానిస్తాన్ ఆసీస్‌ను ఓడించినంత పనిచేసింది. సూపర్ '12'లో ఒక్క మ్యాచ్ కూడా గెలవని జట్టుగా అఫ్గానిస్తాన్ నిలిచింది. ఈ వైఫల్యానికి బాధ్యతగా జట్టు కెప్టెన్సీకి రాజీనామా చేస్తున్నట్లు మొహమ్మద్ నబీ ప్రకటించాడు.

అడిలైడ్: ఒంటి చేత్తో మ్యాచ్‌ల్ని గెలిపించే వార్నర్, దంచేసే స్టొయినిస్, మెరిపించే మ్యాక్స్‌వెల్, నిలకడ చూపించే స్మిత్, నిప్పులు చెరిగే సీమర్లు ఇన్ని వనరులున్న ఆస్ట్రేలియా జట్టు అఫ్గానిస్తాన్‌పై గెలిచేందుకు ఆఖరి బంతి దాకా కష్టపడింది. గ్రూప్-1లో శుక్రవారం జరిగిన 'సూపర్-12' మ్యాచ్‌లో ఆసీస్ 4 పరుగులతో అఫ్గాన్‌ను అయితే ఓడించింది కానీ సెమీస్ కంగారూ మాత్రం అలాగే వుంది. ఇంగ్లండ్, లంక పోరు ముగిసేదాకా ఆసీస్ బిక్కుబిక్కుమని నిరీక్షించక తప్పదు. మొదట ఆస్ట్రేలియా నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 168 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' గ్లెన్ మ్యాక్స్‌వెల్ (32 బంతుల్లో 54 నాటౌట్; 6 ఫోర్లు, 2 సిక్సర్లు), మిచెల్ మార్ష్ (30 బంతుల్లో 45; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. అఫ్గానిస్తాన్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 164 పరుగులు చేసి పోరాడి ఓడింది. రెగ్యులర్‌గా 'బిగ్‌బాష్ లీగ్'లో అడిలైడ్ స్ట్రైకర్స్ తరఫున ఆడే రషీద్‌ఖాన్ (23 బంతుల్లో 48 నాటౌట్; 3 ఫోర్లు, 4 సిక్సర్లు) తన సొంతగడ్డపై రెచ్చిపోయాడు.

మ్యాక్స్‌వెల్ ఫిఫ్టీ

గత ప్రపంచకప్ 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ' అవార్డీ వార్నర్ (18 బంతుల్లో 25; 5 ఫోర్లు) ఈ టోర్నీలో ఆఖరి లీగ్ మ్యాచ్‌లో తన వ్యక్తిగత టాప్ స్కోరు చేశాడు. కామెరాన్ గ్రీన్ (3), స్మిత్ (4) నిరాశపరిచారు. పవర్‌ప్లేలో 52 పరుగులైతే చేసినా జట్టు 3 వికెట్లు కోల్పోయింది. మార్ష్, స్టొయినిస్ (21 బంతుల్లో 25; 2 సిక్సర్లు) మెరిపించినంత వరకు ఆస్ట్రేలియా స్కోరు జోరు మీదుంది. 15 ఓవర్లు ముగిసేసరికి 133/4 స్కోరుతో మెరుగ్గానే ఉన్న ఆసీస్‌ను ఆఖరి ఐదు ఓవర్లలో అఫ్గాన్ బౌలర్లు కట్టడి చేశారు. ఓ వైపు మ్యాక్స్‌వెల్ ధనాధన్ ఇన్నింగ్స్ కొనసాగిస్తున్నప్పటికీ మరోవైపు మిగతా వికెట్లను పడగొట్టేశారు. 8 బంతుల వ్యవధిలో వేడ్ (6)ను ఫారుఖీ, కమిన్స్ (0), కేన్ రిచర్డ్సన్ (1)లను నవీనుల్ హక్ అవుట్ చేశాడు.

రషీద్‌ఖాన్ వీరవిహారం

ఆరంభంలోనే ఓపెనర్ ఘని (2) అవుటైనా... గుర్బాజ్ (17 బంతుల్లో 30; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఇబ్రహీం జద్రాన్ (33 బంతుల్లో 26; 2 ఫోర్లు) మెరుగ్గా ఆడారు. ఓ దశలో 13 ఓవర్లు ముగిసేసరికి 2 వికెట్లకు 99 స్కోరు చేసింది. విజయానికి 42 బంతుల్లో 70 పరుగుల సమీకరణం అఫ్గాన్ సంచలనానికి అనుకూలంగా కనిపించింది. అయితే జంపా వేసిన 14వ ఓవర్ అఫ్గాన్‌ను తలకిందులు చేసింది. 4 బంతుల వ్యవధిలో గుల్బదిన్ నైబ్ (23 బంతుల్లో 39; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) రనౌట్ కాగా, ఇబ్రహీం జద్రాన్, నజీబుల్లా జద్రాన్ (0)లను జంపా అవుట్ చేశాడు. కెప్టెన్ నబీ(1)ని హాజల్‌వుడ్ పెవిలియన్ పంపాడు. 103/6 స్కోరువద్ద కష్టాల్లో పడింది. కానీ చివర్లో వీరవిహారం చేశాడు. 4.3 ఓవర్లలో 45 పరుగులు రావడంతో ఆస్ట్రేలియా శిబిరానికి ముచ్చెమటలు పట్టాయి. ఆఖరి ఓవర్లో 22 పరుగులు చేయాల్సివుండగా... స్టొయినిస్ బౌలింగ్‌లో వైడ్‌గా వెళ్లిన తొలిబంతికి రసూలి (15) రనౌటయ్యాడు. స్ట్రయిక్ తీసుకున్న రషీద్ 0, 4, 0, 6, 2, 4లతో విరుచుకుపడి 16 పరుగులు పిండుకున్నాడు. వైడ్‌తో మొత్తం 17 పరుగులు రాగా చివరకు 4 పరుగుల తేడాతో ఆసీస్ గట్టెక్కింది. ఆస్ట్రేలియా గెలవడంతోనే శ్రీలంక టోర్నీనుంచి నిష్క్రమించింది.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: వార్నర్ (బి) నవీన్ 25; గ్రీన్ (సి) నైబ్ (బి) ఫారుఖీ 3; మార్ష్ (సి) గుర్బాజ్ (బి) ముజీబ్ 45; స్మిత్ (ఎల్బీ) (బి)నవీన్ 4; స్టొయినిస్ (సి) ఘని (బి) రషీద్ 25; మ్యాక్స్‌వెల్ (నాటౌట్) 54; వేడ్ (బి) ఫారుఖీ 6; కమిన్స్ (సి) రషీద్ (బి) నవీన్ 0; రిచర్డ్సన్ (రనౌట్) 1; జంపా (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 168. వికెట్ల పతనం:** 1-22, 2-48, 3-52, 4-86, 5-139, 6-155, 7-156, 8-159. **బౌలింగ్:** ఫారుఖీ 4-0-29-2, ముజీబ్ 4-0-42-1, నవీన్ ఉల్ హఖ్ 4-0-21-3, నైబ్ 3-0-31-0, రషీద్ 4-0-29-1, నబీ 1-0-14-0.

అఫ్గానిస్తాన్ ఇన్నింగ్స్: గుర్బాజ్ (సి) వార్నర్ (బి) రిచర్డ్సన్ 30; ఘని (సి) కమిన్స్ (బి) హాజల్‌వుడ్ 2; ఇబ్రహీం జద్రాన్ (సి) మార్ష్ (బి) జంపా 26; నైబ్ (రనౌట్) 39; నబీ (సి) వార్నర్ (బి) హాజల్‌వుడ్ 1; నజీబుల్లా జద్రాన్ (సి) మ్యాక్స్‌వెల్ (బి) జంపా 0; రసూలీ (రనౌట్) 15; రషీద్ (నాటౌట్) 48; నవీన్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 164. వికెట్ల పతనం:** 1-15, 2-40, 3-99, 4-99, 5-99, 6-103, 7-148. **బౌలింగ్:** హాజల్‌వుడ్ 4-0-33-2, కమిన్స్ 4-0-22-0, స్టొయినిస్ 2-0-26-0, రిచర్డ్సన్ 4-0-48-1, జంపా 4-0-22-2, గ్రీన్ 2-0-13-0.

టి20 ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

గ్రూప్-1

జట్టు	మ్యా	గె	ఓ	ర	పా	నె.ర.
న్యూజిలాండ్	5	3	1	1	7	2.113
ఆస్ట్రేలియా	5	3	1	1	7	-0.173
ఇంగ్లండ్	4	2	1	1	5	0.547
శ్రీలంక	4	2	2	0	4	-0.457
ఐర్లాండ్	5	1	3	1	3	-1.615
అఫ్గానిస్తాన్	5	0	3	2	2	-0.571

నోట్: మ్యా-మ్యాచ్‌లు, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ర-రద్దు, పా-పాయింట్లు, నె.ర-నెట్ రన్‌రేట్

టి20 ప్రపంచకప్‌లో నేడు

ఇంగ్లండ్ X శ్రీలంక (మ.గం. 1:30 నుంచి)

స్టార్ స్పోర్ట్స్-1లో ప్రత్యక్ష ప్రసారం

నేటి మ్యాచ్‌లో ఇంగ్లండ్ గెలిస్తే సెమీస్ చేరుతుంది. అదే లంక గెలిస్తే ఆస్ట్రేలియా ముందంజ వేస్తుంది.

సెమీఫైనల్లో న్యూజిలాండ్

- ఐర్లాండ్‌పై 35 పరుగులతో విజయం
- విలియమ్సన్ అర్ధ సెంచరీ
- లిటిల్ 'హ్యాట్రిక్' వృథా



విలియమ్సన్



లిటిల్

అడిలైడ్: ఈ ప్రపంచకప్‌లో తొలి సెమీస్ బెర్తు కివీస్‌దే! గ్రూప్-1లో శుక్రవారం జరిగిన సూపర్-12 మ్యాచ్‌లో న్యూజిలాండ్ 35 పరుగుల తేడాతో ఐర్లాండ్‌పై విజయం సాధించింది. కివీస్ సారథి, 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కేన్ విలియమ్సన్ (35 బంతుల్లో 61; 5 ఫోర్లు, 3 సిక్సర్లు) ఎట్టకేలకు కీలక ఇన్నింగ్స్ ఆడగా, ఐర్లాండ్ సీమర్ జోష్ లిటిల్ (3/22) 'హ్యాట్రిక్' సాధించాడు. ముందుగా న్యూజిలాండ్ 20 ఓవర్లలో 6 వికెట్లు నష్టపోయి 185 పరుగులు చేసింది. ఫిన్ అలెన్ (18 బంతుల్లో 32; 5 ఫోర్లు, 1 సిక్స్) ధాటిగా ఆడాడు. ఐర్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 150 పరుగులు చేసి ఓడింది. పాల్ స్టిర్లింగ్ (27 బంతుల్లో 37; 3 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్‌గా నిలిచాడు.

ఓపెనర్ల శుభారంభం

కివీస్‌కు ఓపెనర్లు అలెన్, డెవాన్ కాన్వే (33 బంతుల్లో 28; 2 ఫోర్లు) శుభారంభం అందించారు. ఆరో ఓవర్లో అలెన్ వికెట్ తీయడంతో 52 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యం ముగిసింది. కాన్వేకు జతయిన కెప్టెన్ విలియమ్సన్ భారీ స్కోరుకు బాటవేశాడు. ఫిలిప్స్ (9 బంతుల్లో 17; 2 ఫోర్లు, 1 సిక్స్) వేగంగా ఆడే ప్రయత్నంలో అవుటయ్యాడు. మెక్‌కార్తి వేసిన 18వ ఓవర్లో వరుస బంతుల్లో 6, 4, 6 బాదిన కివీస్ కెప్టెన్ 32 బంతుల్లో (4 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆ ఓవర్లో 21 పరుగులు వచ్చాయి. అయితే 19వ ఓవర్ వేసిన లిటిల్ రెండు, మూడు, నాలుగో బంతికి వరుసగా విలియమ్సన్, నీషమ్ (0), సాన్‌ట్నర్ (0)లను అవుట్ చేసి 'హ్యాట్రిక్'తో దెబ్బకొట్టాడు. టి20 ప్రపంచకప్‌లో జోష్ లిటిల్ హ్యాట్రిక్ ఆరోది. గతంలో బ్రెట్‌లీ (2007), రబడ, హసరంగ, క్యాంఫర్ (2021), కార్తీక్ మెయప్పన్ (2022) హ్యాట్రిక్‌లు సాధించారు.

కట్టడి చేసిన ఫెర్గూసన్

ఐర్లాండ్ ఓపెనర్లు స్టిర్లింగ్, బల్బిర్నీ (25 బంతుల్లో 30; 3 సిక్సర్లు) చక్కని ఆరంభాన్నిచ్చారు. దీంతో 8 ఓవర్ల పాటు వికెట్ కోల్పోని ఐర్లాండ్ 68 పరుగులు చేసింది. అయితే వరుస మూడు ఓవర్లలో సాన్‌ట్నర్, ఇష్ సోధి 3 వికెట్లను పడగొట్టడంతో ఐర్లాండ్ 73/3 స్కోరు వద్ద కష్టాల్లో పడింది. టకర్ (13), టెక్టర్ (2) నిరాశపరిచారు. అక్కడి నుంచి వరుస విరామాల్లో ఐర్లాండ్ వికెట్లను కోల్పోయి లక్ష్యానికి దూరమైంది. డెలానీ (10), డాక్రెల్ (23; 3 ఫోర్లు), హ్యాండ్ (5)లను ఫెర్గూసన్ పెవిలియన్ చేర్చాడు.

స్కోరు వివరాలు

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: అలెన్ (సి) హ్యాండ్ (బి) అడెర్ 32; కాన్వే (సి) అడెర్ (బి) డెలాని 28; విలియమ్సన్ (సి) డెలాని (బి) లిటిల్ 61; ఫిలిప్స్ (సి) డాక్రెల్ (బి) డెలాని 17; మిచెల్ నాటౌట్ 31; నీషమ్ (ఎల్బీ) (బి) లిటిల్ 0; సాన్‌ట్నర్ (ఎల్బీ) (బి) లిటిల్ 0; సౌతీ నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 185. వికెట్ల పతనం:** 1-52, 2-96, 3-114, 4-174, 5-174, 6-174. **బౌలింగ్:** లిటిల్ 4-0-22-3, అడెర్ 4-0-39-1, మెకార్తి 4-0-46-0, డెలాని 4-0-30-2, హ్యాండ్ 2-0-22-0, డాక్రెల్ 2-0-18-0.

ఐర్లాండ్ ఇన్నింగ్స్: స్టిర్లింగ్ (బి) సోధి 37; బల్బిర్నీ (బి) సాన్‌ట్నర్ 30; టకర్ (సి) అలెన్ (బి) సోధి 13; టెక్టర్ (సి) సౌతీ (బి) సాన్‌ట్నర్ 2; డెలానీ (సి) కాన్వే (బి) ఫెర్గూసన్ 10; డాక్రెల్ (సి) విలియమ్సన్ (బి) ఫెర్గూసన్ 23; కాంఫెర్ (సి) అలెన్ (బి) సౌతీ 7; హ్యాండ్ (సి) అండ్ (బి) ఫెర్గూసన్ 5; అడెర్ (సి) ఫిలిప్స్ (బి) సౌతీ 4; మెకార్తి నాటౌట్ 6; లిటిల్ నాటౌట్ 8; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 150. వికెట్ల పతనం:** 1-68, 2-70, 3-73, 4-94, 5-102, 6-120, 7-131, 8-132, 9-141. **బౌలింగ్:** బౌల్ట్ 4-0-38-0, సౌతీ 4-0-29-2, ఫెర్గూసన్ 4-0-22-3, సాన్‌ట్నర్ 4-0-26-2, సోధి 4-0-31-2.

సుశీల్‌కు మధ్యంతర బెయిల్



న్యూఢిల్లీ: భారత అగ్రశ్రేణి రెజ్లర్, రెండు ఒలింపిక్ పతకాల విజేత సుశీల్ కుమార్ దాదాపు ఏడాదిన్నర తర్వాత జైలునుంచి బయటకు రానున్నాడు. కుటుంబపరమైన సమస్యను ఎదుర్కొంటున్న కారణంగా మానవతా దృక్పథంతో ఈ నెల 12 వరకు అతనికి ఢిల్లీ కోర్టు మధ్యంతర బెయిల్ జారీ చేసింది. సుశీల్ భార్య తీవ్రమైన వెన్నునొప్పితో బాధపడుతుండటంతో శస్త్రచికిత్సకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలో ఆమె బాగోగులు చూసుకునేందుకు 3 వారాల బెయిల్ ఇవ్వాల్సిందిగా సుశీల్ న్యాయవాదులు విజ్ఞప్తి చేశారు. అయితే చివరకు కోర్టు వారం రోజుల బెయిల్ కోసం ఆదేశాలు ఇచ్చింది. యువ రెజ్లర్ సాగర్ రాణా హత్యకేసులో నిందితుడిగా ఉన్న సుశీల్ 2021 జూన్ 2నుంచి జైల్లో ఉన్నాడు.

భారత్ ఘనవిజయం



భువనేశ్వర్: ఆద్యంతం అటాకింగ్‌తో ప్రత్యర్థిపై చెలరేగిన భారత జట్టు ప్రొ హాకీ లీగ్‌లో కీలక విజయాన్ని నమోదు చేసింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 7-4 గోల్స్ తేడాతో న్యూజిలాండ్‌ను ఓడించింది. తొలి క్వార్టర్‌లో కివీస్ ఆధిక్యం ప్రదర్శించినా, ఆ తర్వాత భారత్ జోరు ముందుకు నిలవలేకపోయింది. భారత్ తరఫున కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ పెనాల్టీ కార్నర్ల ద్వారా రెండు గోల్స్ (7వ నిమిషం, 19వ ని.) సాధించగా, కార్తీ సెల్వమ్ (17వ ని., 38వ ని.) మరో రెండు గోల్స్ కొట్టాడు. రాజ్‌కుమార్ పాల్ (31వ ని.), సుఖ్‌జీత్ సింగ్ (50వ ని.), జుగ్‌రాజ్ సింగ్ (53వ ని.) భారత్‌కు మిగతా గోల్స్ అందించారు. న్యూజిలాండ్ తరఫున సైమన్ చైల్డ్ (2వ ని.), స్యామ్ లేన్ (9వ ని.), స్మిత్ జేక్ (14వ ని.), నిక్‌వుడ్స్ (54వ ని.) గోల్స్ చేశారు.

సాత్విక్-చిరాగ్ ఓటమి

సార్‌బ్రుకెన్ (జర్మనీ): హైలో ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత షట్లర్లకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. పురుషుల సింగిల్స్‌లో కిడాంబి శ్రీకాంత్, మహిళల డబుల్స్‌లో పుల్లెల గాయత్రి-ట్రిసా జాలీ సెమీ ఫైనల్లోకి దూసుకెళ్లారు. శుక్రవారం జరిగిన మహిళల డబుల్స్ క్వార్టర్‌ఫైనల్లో భారత జంట 21-17, 18-21, 21-8తో సు యా చింగ్-లిన్ వాన్ చింగ్ (చైనీస్ తైపీ) జోడీపై గెలిచింది. అయితే పురుషుల డబుల్స్‌లో భారత మేటి జంట సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టిలకు క్వార్టర్స్‌లోనే చుక్కెదురైంది. ఏడో సీడ్ సాత్విక్-చిరాగ్ ద్వయం 17-21, 14-21తో బెన్ లేన్-సీన్ వెండీ (ఇంగ్లండ్) జోడీ చేతిలో కంగుతింది. పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో కిడాంబి శ్రీకాంత్ 21-13, 21-19తో ఆరో సీడ్ జొనాథన్ క్రిస్టీ (ఇండోనేసియా)ని వరుస గేముల్లోనే కంగుతినిపించాడు.


పాపికొండలు టూరిజం బోట్ (ఫైల్)

నేటి నుంచి పాపికొండలు విహార యాత్ర

ఎనిమిది బోట్లకు పర్యాటకశాఖ అనుమతి

దేవీపట్నం(అల్లూరి సీతారామరాజు జిల్లా): మూడు నెలల విరామం తర్వాత ఎట్టకేలకు పాపికొండలు విహార యాత్ర తిరిగి ప్రారంభం కానుంది. పోశమ్మ గండి బోటు పాయింట్ వద్ద శనివారం నుంచి పాపికొండల విహారయాత్ర బోట్లకు అనుమతి ఇచ్చినట్టు ఏపీటీడీసీ కంట్రోల్ రూమ్ సూపర్‌వైజర్ నాగరాజు తెలిపారు. పోశమ్మ గండి బోట్ పాయింట్ నుంచి ఎనిమిది బోట్లు విహార యాత్రకు బయలుదేరుతాయని చెప్పారు. మిగిలిన బోట్లకు సంబంధించి అనుమతులకు పరిశీలన జరుగుతుందని వెల్లడించారు.

నయా రాయ్‌పూర్‌లో ఏపీ గిరిజన నృత్య కళల ప్రదర్శన



సాక్షి, అమరావతి: చత్తీస్‌గఢ్ రాజధాని నయా రాయ్‌పూర్‌లో ఇటీవల జరిగిన జాతీయ గిరిజన నృత్య వేడుకల్లో ఏపీకి చెందిన 50 మంది సభ్యుల బృందం ప్రదర్శనలతో ఆకట్టుకున్నట్టు సాంస్కృతిక శాఖ సీఈవో మల్లికార్జునరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ధింసా, కొమ్మకోయ విభాగాల్లో కళాకారులు ఆంధ్రా సాంస్కృతిని చాటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ భార్గవ కళాకారులను అభినందించారు.

వాతావరణ సమాచారం కోసం బెలూన్ల ఫ్లైయింగ్

టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ సైంటిస్ట్ ఇన్‌చార్జి సునీల్‌కుమార్

సాక్షి, అమరావతి : వాతావరణ సమాచారాన్ని సేకరించేందుకు బెలూన్లు ఎగుర వేయనున్నట్టు హైదరాబాద్ టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ సైంటిస్ట్ బి.సునీల్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆటామిక్ ఎనర్జీ శాఖ, ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ ఆధ్వర్యంలో ఈ నెల 21-26 తేదీల మధ్య బెలూన్లు ఎగుర వేస్తామని పేర్కొన్నారు. 800 కిలోల బరువు కలిగిన టెలిస్కోప్‌ను వాటిలో పెట్టి మొదటి బెలూన్ అంతరిక్షంలోకి పంపుతామని తెలిపారు. టి గమనం విశాఖపట్నం-హైదరాబాద్-షోలాపూర్ లైన్‌లోని ఏపీ, ఉత్తర కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల పరిధిలో ఉంటుందని పేర్కొన్నారు. ఏపీలో ఈ బెలూన్లు వదిలిన పేలోడ్ ప్రభావం శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, కర్నూలు, వైఎస్సార్, అనంతపురం జిల్లాల్లో ఉంటుందని తెలిపారు. సమాచారాన్ని పోస్టాఫీస్‌లో తెలపాలన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794.